www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 4-2-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 329

శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: తదియ రా.12:10 తదుపరి చవితి, నక్షత్రం: పుబ్బ రా.10:13 తదుపరి ఉత్తర, వర్జ్యం: శేషం ఉ.7:47, మరలా తె. 5:38 మొదలు, దుర్ముహూర్తం: మ.12:06-12:51, అమృతఘడియలు: మ.3:48-5:24, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:50, సూర్యాస్తమయం: 6:08 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రోబో కాప్ పట్టేసింది

'ఏఎస్‌సీ అర్జున్'.. ఆన్‌డ్యూటీ!

- ఇద్దరు పాత నేరస్థులను పట్టుకున్న రోబో
- విశాఖ రైల్వే స్టేషన్‌లో ముఖాన్ని డేటా బేస్‌లో గుర్తించిన అర్జున్
- వెంటనే అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు
- వారిపై రాయగడ స్టేషన్‌లో దోపిడీ కేసులు

11



రోబోకాప్ ఏఎస్‌సీ అర్జున్ గుర్తించిన పాత నేరస్థులతో ఆర్పీఎఫ్ సిబ్బంది. (ఇన్‌సెట్) ఏఐ ఆధారిత ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ఆర్ఎస్) ద్వారా పాత నేరస్థుడి గుర్తింపు



క్యాబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు లోకేశ్, కొల్లు రవీంద్ర, అనిత, మనోహర్, అచ్చెన్న, సీఎస్ విజయానంద్ తదితరులు

సూత్రధారులను వదలొద్దు!

'కల్తీ నెయ్యి'పై మంత్రుల ముక్తకంఠం



వైవీని వదిలేస్తారా!?

ఎజెండాను మార్చేసిన 'ఆంధ్రజ్యోతి'

రాష్ట్ర మంత్రి మండలి ఎజెండాను 'ఆంధ్రజ్యోతి' కథనం మార్చేసింది. నిర్దేశిత ఎజెండాపై చర్చించేందుకు రాష్ట్ర క్యాబినెట్ మంగళవారం ఉదయం 10.30కు సమావేశం కావాల్సి ఉంది. క్యాబినెట్ సమావేశానికి ముందు అమెరికా -భారత్ వాణిజ్య ఒప్పందంపై చర్చించేందుకంటూ ఎన్డీయే పక్షాలతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అయితే... 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన 'వైవీని వదిలేస్తారా?' అనే కథనంపై చర్చించేందుకే సీఎం ఆ భేటీ నిర్వహించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ కథనంలో ప్రస్తావించిన అంశాలు సంచలనం సృష్టించాయి. టీడీపీతోపాటు జనసేన, బీజేపీ శ్రేణులు మొదలుకొని బ్యూరోక్రాట్లు, అధికారులు వరకు.. అన్ని వర్గాల నుంచి ప్రభుత్వ తీరుపై చర్చ మొదలైంది. సూత్రధారులపై చర్యలు తీసుకోకుండా వదిలేస్తారా అంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు హోరెత్తాయి. తాజా పరిణామాల తీవ్రతను గుర్తించి... క్యాబినెట్ భేటీకి ముందు ఎన్డీయే పక్ష మంత్రులతో దీనిపై చర్చ జరిపారు. పరిస్థితి తీవ్రతను గుర్తించి... కోట్లాది మంది భక్తుల మనోభావాలతో కూడిన ఈ అంశంపైనే క్యాబినెట్‌లో చర్చించాలని నిర్ణయించారు. ఎజెండా అంశాలను పక్కన పెట్టేసి, కల్తీ నెయ్యి వ్యవహారంపైనే దృష్టి సారించారు.

- 'సిట్' లేఖపై క్యాబినెట్‌లో సుదీర్ఘ సమాలోచనలు
- కల్తీకి దారితీసిన పరిణామాలు 'లేఖ'లో నామమాత్రంగానే ప్రస్తావించారు
- వాటిపై దృష్టి పెడితే దోషులు తేలే అవకాశం
- వైవీ పాత్రపై స్పష్టత ఇస్తే బాగుండేది: డిప్యూటీ సీఎం
- పథకం ప్రకారమే తిరుమల లడ్డూ కల్తీ
- సెంటిమెంట్‌తో కూడిన అంశమిది: మంత్రులు
- న్యాయపరంగా ముందుకెళ్లడంపై క్యాబినెట్ దృష్టి
- అసాధారణ రీతిలో మంత్రివర్గ సమావేశానికి ఏజీ
- చార్జిషీటుపై జడ్జి నిర్ణయం తర్వాతే ముందుకు: ఏజీ సలహా

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంలో సూత్రధారులు తప్పించుకోకుండా చూడాలని క్యాబినెట్ భేటీలో మంత్రులు అభిప్రాయపడ్డారు. ఈ కేసులో సిట్ సమగ్రంగానే దర్యాప్తు జరిపినా, అసలు సూత్రధారుల సంగతి చార్జిషీటులో పొందుపరిచారా లేదా అనే అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రాసిన లేఖలో సిట్ 'కల్తీ నెయ్యి' వ్యవహారంలో కొందరు అధికారులపైనే చర్యలకు

మిగతా 13వ పేజీలో...

కల్తీ నెయ్యిపై రాజకీయం లేదు!

- అది మన ఎజెండా కూడా కాదు
- తిరుమల పవిత్రతను కాపాడటమే లక్ష్యం
- సూత్రధారులెవరో తేలడం, శిక్ష పడటమే ముఖ్యం: సీఎం

అసలు బుర్ర పెట్టలేదు!

ప్రతి దశలో అంతులేని నిర్లక్ష్యం.. 'కల్తీ నెయ్యి'కి అదే కారణం

- 2014, 2018, 2019లో కఠిన నిబంధనలు
- 2020లో మరోసారి నిపుణుల కమిటీ ఏర్పాటు
- టెండరు నిబంధనలను సడలిస్తూ సిఫారసు
- హేతుబద్ధత, వివరణ లేకుండానే నివేదిక
- దానిని గుడ్డిగా ఆమోదించిన ఉన్నతాధికారులు
- 2022లోనే నెయ్యి కల్తీపై ధర్మారెడ్డికి ఫిర్యాదులు
- మైసూరు ల్యాబ్ ధ్రువీకరించినా.. అలసత్వం
- రాష్ట్ర ప్రభుత్వానికి 'సిట్' అధిపతి నివేదిక
- ధర్మారెడ్డి, సింఘాల్, బాలాజీపై చర్యలకు సిఫారసు

13

సిట్ నివేదికపై విచారణ కమిటీ

- చార్జిషీటును కోర్టు పరిగణనలోకి తీసుకున్నాక దీనిపై తేలుస్తాం
- అవసరమైతే ప్రభుత్వం, టీటీడీ, భక్తులు కూడా కేసులో కలుస్తారు
- మంత్రివర్గం నిర్ణయం.. దోషులపై కఠిన చర్యలు తథ్యం: మంత్రులు

ప్రక్షాళన అవశ్యం!

- టీటీడీలో పాతుకుపోయిన వ్యవస్థీకృత లోపాలు
- రాష్ట్ర ప్రభుత్వానికి 'సిట్' నివేదిక

సహనానికి విజయం

- అమెరికా సుంకాల విషయంలో విమర్శలెన్ని వచ్చినా భరించాం
- వాణిజ్య చర్చల్లో సుస్థిర వైఖరితో ఉన్నాం.. ఫలితాలు చూస్తున్నారు
- అమెరికాతో వాణిజ్య ఒప్పందం, సుంకాల తగ్గింపుపై ప్రధాని మోదీకి ఎన్డీయే ఎంపీల సన్మానం



ఎన్డీఏ ఎంపీల భేటీలో మోదీకి సన్మానం. చిత్రంలో రాజ్‌నాథ్, నితిన్ నబీన్

ఎప్‌స్టీన్ ఫైల్స్ భయంతోనే.. ట్రంప్‌తో మోదీ రాజీ



తన పరువు కోసం దేశాన్ని అమ్మేశారు

- అదానీ కేసు, ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో తీవ్ర ఒత్తిడిలో ప్రధాని
- అందుకే ఆగమేఘాలపై వాణిజ్య ఒప్పందానికి అంగీకారం
- లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపణలు

2

మళ్లీ 'చైనా' రచ్చ

- 'దురాక్రమణ'పై మాట్లాడేందుకు రాహుల్ ప్రయత్నం
- ప్యానెల్ స్పీకర్ నిరాకరణ.. విపక్షాల తీవ్ర నిరసన
- ఏడుగురు కాంగ్రెస్ ఎంపీలు, ఒక సీపీఎం ఎంపీ సస్పెన్షన్
- స్పీకర్‌కు రాహుల్ 'నిరసన' లేఖ

చమురు కొనుగోళ్లు ఆపేస్తామని భారత్ చెప్పలేదు: రష్యా

అతిపెద్ద 'ప్రకృతి వ్యవసాయ' క్షేత్రంగా ఏపీ

- వచ్చే ఐదేళ్లలో 50 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం.. త్వరలో రాష్ట్రమంతా శిక్షణ తరగతులు
- ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ.. లంబసింగిలో కుంకుమ పువ్వు సాగుకు ప్రణాళికలు
- ఇకపై పంటలవారీగా ఫెస్టివల్స్.. వ్యవసాయ, అనుబంధ శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు

12

అంబటి ఆఫీసుపై దాడి.. టీడీపీ ఎమ్మెల్యే మాధవిపై కేసు

- ఆమె భర్త, మరికొందరిపైనా నమోదుచేసిన పోలీసులు.. సీఎం ఆదేశాలతో దర్యాప్తు వేగవంతం
- అంబటి కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు రికార్డు.. మొత్తం 31 మందిపై అంబటి ఫిర్యాదు

14



చీఫ్ జస్టిస్ సూర్యకాంత్

మా రాజ్యాంగాన్ని కాదంటే.. దేశం విడిచి వెళ్లిపోండి

- డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకునేందుకు అనుమతించం
- వాట్సాప్ మాతృ సంస్థ 'మెటా'కు తేల్చి చెప్పిన చీఫ్ జస్టిస్ సూర్యకాంత్
- ఆ సంస్థ కొత్త ప్రైవసీ పాలసీపై ఫైర్
- 213 కోట్ల జరిమానాకు సమర్థన
- వాట్సా‌ప్‌లో మెసేజ్‌ను బట్టి తనకూ ఫోన్‌లో యాడ్స్ వచ్చాయని వెల్లడి

11

మణిపూర్ నూతన సీఎంగా యుమ్నాం ఖేమ్‌చంద్ సింగ్

- బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నిక
- జాతి విద్వేష హింసాకాండతో ఏడాదిగా రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన

2

కాంట్రాక్టు ఉద్యోగుల వివరాలివ్వండి

అన్ని శాఖలకూ ఆర్థిక శాఖ నోట్

12



12

క్వాంటమ్ వ్యాలీ నిర్మాణంలో తొలి అడుగు

- ఈ నెల 6 లేదా 7న శంకుస్థాపన
- హాజరు కానున్న సీఎం చంద్రబాబు

లాభాల్లోకి విశాఖ ఉక్కు

- గత ఏడాది సెప్టెంబరులో 486 కోట్ల నష్టం
- ఈ జనవరిలో 54 కోట్ల లాభం
- కార్మికులు, యాజమాన్యం కలిసి పనిచేయాలని సమీక్షలో సీఎం సూచన

12

ఏది మంచిదైతే అదే చేయండి!

- చైనా ట్యాంకులు చొరబడినప్పుడు జనరల్ నరవణెకు మోదీ సందేశం
- భారత్–చైనా పాలసీ కేంద్రీకృతం
- సైన్యం సలహాలను ప్రభుత్వం వినదు
- తగిన మార్గనిర్దేశం చేయదు
- యుద్ధం అంచుల్లో మేమే నిర్ణయం తీసుకోవాలి
- ఆత్మకథలో మాజీ ఆర్మీచీఫ్ నరవణె

2

అడుగు దూరంలో చైనాతో యుద్ధం!



- ఏం చేయాలని అడిగితే.. మీకు తోచిందే చేయమని పైనుంచి ఆదేశాలు
- అప్రచురిత ఆత్మకథలో మాజీ ఆర్మీ చీఫ్ నరవణె

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: చైనాతో సరిహద్దు సమస్య విషయంలో మోదీ సర్కారు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించిందని భారత మాజీ సైన్యాధిపతి ఎంఎం నరవణె తెలిపారు. నిర్ణయాలన్నీ కేంద్రీకృతంగా ఉండేవని చెప్పారు. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లోనూ యుద్ధం వైపు మొగ్గు చూపలేదని వెల్లడించారు. సరిహద్దుల్లో తలెత్తిన ఉద్రిక్తతలను రాజకీయ ఆదేశాలు లేకుండా సైన్యమే సొంత నిర్ణయాలతో పరిష్కరించుకోవాలన్నట్లుగా ప్రభుత్వ విధానం ఉండేదన్నారు. సైన్యం కూడా చైనా దురాక్రమణలను సమర్థంగా నిలువరించిందని, అయితే, చాలా వివాదాలు పరిష్కారం కాకుండానే మిగిలిపోయాయని చెప్పారు. చైనాతో సరిహద్దు పరిణామాల మీద దేశ ప్రజలకు పూర్తి అవగాహన కలిగించకుండా ప్రభుత్వం పరిమితులు విధించిందని అభిప్రాయపడ్డారు. చైనా విషయంలో కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చినపుడు రాజకీయ నాయకత్వం సైనికపరంగా కానీ, దౌత్యపరంగా కానీ మార్గదర్శనం చేయలేదని చెప్పారు. 2020 ఆగస్టు 31న చైనా ట్యాంకులు భారత భూభాగంలోకి ప్రవేశించినపుడు కూడా ఏది మంచిదైతే అదే చేయండంటూ నిర్ణయాన్ని తమకే వదిలేశారన్నారు. మొత్తం మీద చైనాను నిలువరించామే కానీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించలేదని చెప్పారు. నిర్ణయాలు తీసుకొని అమలు చేయాల్సిన బాధ్యతతో పాటు జవాబుదారీతనాన్ని కూడా సైన్యం మీదే పెట్టారని తెలిపారు. అయితే, "మోదీ క్రమశిక్షణ కలిగిన వ్యక్తి. ఫోర్సెస్‌ను చాలా గౌరవంగా చూసేవారు. ఏం చెప్పినా శ్రద్ధగా వినేవారు" అని నరవణే పేర్కొన్నారు. 2019 డిసెంబరు 31 నుంచి 2022 ఏప్రిల్ 30 వరకు భారత సైన్యాధిపతిగా పనిచేసిన నరవణే జనరల్‌గా తన ప్రయాణాన్ని "ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ" పేరుతో పుస్తకం రాశారు. ఆ పుస్తకాన్ని ప్రచురించేందుకు భారత ప్రభుత్వం అనుమతించలేదు. ఈ నేపథ్యంలో ఆయన పుస్తకంలోని అంశాలను ప్రస్తావిస్తూ కారవాన్ మ్యాగజీన్ 40 పేజీల సుదీర్ఘ వ్యాసాన్ని ప్రచురించింది. సోమవారం లోక్‌సభలో రాహుల్‌గాంధీ ఈ అంశాన్ని లేవనెత్తారు. ఈ నేపథ్యంలో కారవాన్ మ్యాగజీన్‌లో కోట్ చేసిన నరవణె పుస్తకంలోని అంశాలను ఇక్కడ ప్రస్తావిస్తున్నాం.

కేంద్రీకృత విధానం...

చైనా విధానాన్ని రాజకీయ నాయకత్వం కేంద్రీకృతం చేసింది. ప్రధాని కార్యాలయం, భద్రతా సలహాదారు కార్యాలయం చేతుల్లో ఉంటుంది. సైన్యం పదేపదే స్పష్టత కోరాల్సిన పరిస్థితి. నిజానికి ఒకడుగు ముందుకు వేస్తే యుద్ధం అనే పరిస్థితి ఉంటుంది. కానీ, ఏం చేయాలో చెప్పరు. 2020 ఆగస్టు 31 పరిస్థితే ఇందుకు ఉదాహరణ. తూర్పు లద్దాఖ్‌లోని రెచిన్ లా వద్ద నాలుగు చైనా ట్యాంకులు భారత భూభాగంలోకి ప్రవేశించాయి. అప్పటికే అదే లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో రెండున్నర నెలల ముందు చైనా చొరబాట్లను నియంత్రించే క్రమంలో తెలంగాణకు చెందిన కర్నల్ సంతోష్‌బాబు సహా 20 మంది భారతీయ సైనికులు వీరమరణం పొందారు. అలాంటి పరిస్థితుల్లో రెచిన్‌లా వద్ద భారత ఫార్వార్డ్ పొజిషన్ల వద్దకు చైనా ట్యాంకులు వచ్చేశాయి. ఎదురుదాడి చేయాలా? నియంత్రణ పాటించాలా? 'వాట్ ఆర్ మై ఆర్డర్స్' అని రాజకీయ నాయకత్వాన్ని అడిగాం. ఏది సరైన నిర్ణయమని భావిస్తారో అదే చేయండి అంటూ ప్రధాని నుంచి కింది వారి ద్వారా ఆదేశాలు వచ్చాయి. ఎదురు దాడికి దిగితే యుద్ధంలోకి వెళ్లే అవకాశాలే ఎక్కువ. అది సైన్యం మాత్రమే తీసుకోవాల్సిన నిర్ణయం కాదు. దాంతో మళ్లీ అడిగాం. నిర్ణయం ప్రకటించేందుకు రాజకీయ నాయకత్వం సిద్ధం లేదని సందేశం వచ్చింది. యుద్ధాలను సంబంధించిన నిర్ణయాలను సైన్యానికి వదిలేయకూడదు. దౌత్యం, ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ పొత్తులను ప్రభావితం చేసే అంశాల్లో సైన్యాధిపతి నిర్ణయం తీసుకోలేడు. అయితే, నియంత్రణ పాటిస్తూ సైన్యాన్ని మోహరించాం. చివరకు చైనా సైన్యం సంప్రదింపులకు వచ్చింది.

> **చైనాతో చర్చలపై**
>
> చైనాతో చర్చల విధానంలో రాజకీయ స్థాయిలో లోపాలున్నాయి. మొదట్లో రాతపూర్వకమైన రికార్డులకు అనుమతించలేదు. కోర్ కమాండర్ స్థాయి చర్చల్లో మినిట్స్ లేవు. నిర్ణయాలను ఆమోదించడం లేదు. ప్రతీదీ రికార్డు రూపంలో ఉండాలన్న సైన్యం ప్రయత్నం అమలు చేయడం విదేశాంగ శాఖ వ్యతిరేకత వల్ల ఆలస్యమైంది. ప్రభుత్వ సౌలభ్యం కోసం వాస్తవాధీన ప్రాంతాల విషయంలో కూడా చెరో పాయింట్‌ను ప్రస్తావించేందుకు, మధ్యలో బఫర్ జోన్లు ఉంచేందుకు అంగీకరించారు. ఇది సైన్యానికి ఇబ్బందికరం. అగ్నిపథ్‌పైన కూడా త్రివిధ దళాల అధిపతులతో అర్థవంతమైన సంప్రదింపులు జరగలేదు.

గాల్వాన్ సమయంలోనూ

లద్దాఖ్‌లో 2020లో చైనా పథకం ప్రకారం ఆక్రమణలకు పాల్పడింది. గల్వాన్‌లోనే కాదు. పలుచోట్ల ఆక్రమణలు జరిగాయి. కొన్ని భారత్ ఆలస్యంగా గ్రహించింది. ఒత్తిడిలో స్పందించాల్సిన పరిస్థితి. సరిహద్దు వెంట పలుచోట్ల ఇరు సైన్యాలు తలపడాల్సి వచ్చింది. గల్వాన్ ఒక్కటే కాదు. చర్చల ద్వారా కొన్నిచోట్ల వెనక్కి తగ్గారు కొన్నిచోట్ల బఫర్ జోన్లు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల పెట్రోలింగ్ మీద నియంత్రణలు పాటించాలని నిర్ణయించారు. అయినా కొన్ని చోట్ల పరిష్కారం కాలేదు. గల్వాన్ దాడి పథకం ప్రకారం జరిగింది. చైనా సైన్యం భారత సైనికులను బంధించి కొట్టింది. భారత్ తీవ్రంగా ప్రతిఘటించి చైనాకు తీవ్ర నష్టం చేయడంతో హఠాత్తుగా స్టేటస్ కో నాటకం ఆడింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు జీవితకాలంలో మరచిపోలేని పాఠం అందించాం. అయితే, గల్వాన్ మరణాలు ఒకేసారి జరగలేదు. గాయాలతో, మంచు ప్రభావంతో చనిపోయారు. మరికొంత మందిని బంధించి హింసించి వదిలేశారు. ఈ సంఘటనకు సంబంధించి ప్రభుత్వం పార్లమెంటుకు కానీ, ప్రజలకు కానీ పూర్తి సమాచారం ఇవ్వలేదు. మన సైనికులు ఎలా చనిపోయారో, ఈ సంఘటన తర్వాత అక్కడ భూభాగం మోహరింపులో ఎలాంటి మార్పులు జరిగాయో సమాచారం అందించలేదు.

డోక్లాం కామాయే ఫుల్‌స్టాప్ కాదు

డోక్లాం అపరిష్కృత అంశమే. చైనా వ్యూహాత్మకంగా మాత్రమే డోక్లాం నుంచి 2017లో వెనక్కి తగ్గింది. అసలు సమస్యను దౌత్యపరంగా ఇంతవరకు పరిష్కరించలేదు. భారతదేశం 2017 తర్వాత అనుసరిస్తున్న చైనా విధానంలో దృఢంగా వ్యవహస్తున్నట్లు ప్రజలకు కనబడాలని, అదే సమయంలో చైనాతో పరిస్థితులు చేతులు దాటకుండా చూడాలని బావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ క్రమంలో దౌత్యపరమైన, సైనికపరమైన, ఇంటెలిజెన్స్ పరమైన అంచనాలను పట్టించుకోలేదు.

బంగారు ఆభరణాలు తెచ్చే వారికి ఊరట



- విదేశాల నుంచి మహిళలు 40, పురుషులు 20 గ్రాముల పసిడి ఆభరణాలు తేవొచ్చు
- 'విలువ' పరిమితి ఎత్తివేత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: విదేశాల నుంచి బంగారు ఆభరణాలను తీసుకురావాలనుకునే భారతీయులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటను కల్పించింది. ఈమేరకు ఈ నెల 2వ తేదీ నుంచి బ్యాగేజీ నిబంధనలు, 2026ను అమల్లోకి తెచ్చారు. కొత్త బ్యాగేజీ నిబంధనల మేరకు ఆభరణాలపై ఉన్న గరిష్ఠ పరిమితిని యథాతథంగా కొనసాగిస్తూ.. 'విలువ' పరిమితిని తొలగించింది. ఈమేరకు ఏడాదికి మించి విదేశాల్లో నివసిస్తూ తిరిగి వస్తున్న భారతీయ నివాసితులు లేదా భారత సంతతికి చెందిన పర్యాటకుల్లో మహిళలు అయితే 40 గ్రాముల వరకు, పురుషులు అయితే 20 గ్రాముల వరకు బంగారు ఆభరణాలను ఎలాంటి సుంకాలు లేకుండా తీసుకురావొచ్చు. అయితే ఆభరణాలను కచ్చితంగా వ్యక్తిగత వినియోగం కోసమే తీసుకురావాలి. అమ్మకానికి ఉద్దేశించి కాకూడదు. 15 ఏళ్లకన్నా తక్కువ వయసున్న పిల్లలు కూడా 40 గ్రాముల బంగారు ఆభరణాలను సుంకం లేకుండా తెచ్చే అవకాశం ఉంది. ఇంతకు ముందు భారతీయులు 20 గ్రాముల వరకు బంగారాన్ని (గరిష్ఠ విలువ రూ.50,000 వరకు) సుంకం లేకుండా తెచ్చేందుకు అనుమతించారు. మహిళలు, పిల్లలు 40 గ్రాముల వరకు బంగారం (రూ.లక్ష వరకు) తెచ్చేందుకు సుంకం ఉండేది కాదు. అయితే ఇప్పుడు మహిళలు 40 గ్రాములు, ఇతరులకు సంబంధించి 20 గ్రాముల గరిష్ఠ పరిమితిని యథాతథంగానే ఉంచి.. విలువకు సంబంధించిన పరిమితిని తొలగించారు. కొత్త రూల్స్ ప్రకారం.. 18 ఏళ్లు దాటిన ప్రయాణికులు కొత్త లాప్‌టాప్‌ను లేదా నోట్‌ప్యాడ్‌ను సుంకం లేకుండా తేవొచ్చు.

మణిపూర్ నూతన ముఖ్యమంత్రిగా యుమ్నాం ఖేమ్‌చంద్ సింగ్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: జాతి విద్వేషాలతో అతలాకుతలమైన మణిపూర్ రాష్ట్రంలో రాజకీయ మార్పునకు రంగం సిద్ధమయింది. నూతన ముఖ్యమంత్రిగా సీనియర్ నేత యుమ్నాం ఖేమ్‌చంద్ సింగ్ (62)ను నియమిస్తున్నట్టు మంగళవారం బీజేపీ ప్రకటించింది. అంతకుముందు ఇక్కడ జరిగిన ఆ రాష్ట్ర బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో ఆయనను నాయకునిగా ఎన్నుకున్నారు. కుకీ జాతి నాయకురాలు నెమ్చా కిప్‌గెన్‌ను ఉపముఖ్యమంత్రిగా నియమించే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రంలో మెయిటీ-కుకీ జాతుల మధ్య విద్వేషాల కారణంగా హింస నెలకొనడంతో బిరేన్ సింగ్ 2025 ఫిబ్రవరి 9న సీఎం పదవికి రాజీనామా చేశారు. అనంతరం విధించిన రాష్ట్రపతి పాలన దాదాపు ఏడాదిగా కొనసాగుతోంది. ఖేమ్‌చంద్ 2017, 2022ల్లో రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2017లో స్పీకర్‌గా నియమితులయి అయిదేళ్లపాటు పనిచేశారు. తైక్వాండోలో ఫిఫ్త్ డాన్ బ్లాక్ బెల్ట్ పొందిన ఆయన రాష్ట్రంలో ఆ క్రీడ వ్యాప్తికి కృషి చేశారు.

ఆస్ట్రేలియాలో గాంధీ కాంస్య విగ్రహాన్ని కట్టర్లతో కోసి ఎత్తుకెళ్లిన దుండగులు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరంలో ఉన్న మహాత్మా గాంధీ కాంస్య విగ్రహాన్ని దుండగులు ఎత్తుకెళ్లారు. నగరం శివారు ప్రాంతమైన రోవిల్‌లోని ఆస్ట్రేలియన్ ఇండియన్ కమ్యూనిటీ సెంటర్‌లో ఈ విగ్రహం ఉంది. దీని బరువు 426 కిలోలు. సోమవారం ముగ్గురు దుండగులు కట్టర్ల సాయంతో విగ్రహాన్ని కాళ్ల వరకు కోసి ఎత్తుకెళ్లారు. దీన్ని భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది.


ముంబైలో రెండు విమానాల రెక్కలు ఢీ

ముంబై, ఫిబ్రవరి 3: ముంబైలోని ఛత్రపతి శివాజీ ఎయిర్‌పోర్టులో మంగళవారం పెను ప్రమాదం తప్పింది. రన్‌వేపై రెండు విమానాల రెక్కలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎయిర్ ఇండియా, ఇండిగో విమానాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. డీజీసీఏ తెలిపిన వివరాల ప్రకారం.. ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ 2732 విమానం ముంబై నుంచి కోయంబత్తూరు వెళ్లేందుకు రన్‌వేపై సిద్ధంగా ఉంది. అదే సమయంలో, హైదరాబాద్ నుంచి ముంబై చేరుకున్న ఇండిగో విమానం (6ఈ 791) ల్యాండ్ అయి పార్కింగ్ వైపు వెళ్తోంది. ఈ క్రమంలో రెండు విమానాల రెక్కల చివరలు ఒకదానికొకటి తగిలాయి.

సహనానికి దక్కిన విజయం!

అమెరికా సుంకాల విషయంలో ఎన్ని విమర్శలు వచ్చినా భరించాం

- దాని ఫలితాలను మీరిప్పుడు చూస్తున్నారు
- అమెరికా సుంకాల తగ్గింపుపై ప్రధాని
- ఒప్పందానికి తుది మెరుగులు.. త్వరలోనే ప్రకటన: కేంద్ర మంత్రి గోయల్



ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న ఎన్డీయే ఎంపీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: అమెరికాతో వాణిజ్య ఒప్పందం, ట్రంప్ సుంకాల తగ్గింపు తమ సహనానికి దక్కిన విజయమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ ఒప్పందంతో అనుకూలమైన ఆర్థిక వాతావరణం ఏర్పడిందని, భారత్‌లో ప్రతి ఒక్కరూ దీనితో ప్రయోజనం పొందుతారని చెప్పారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ భేటీ సందర్భంగా మోదీ ఈ అంశంపై మాట్లాడారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం చాలా పెద్ద నిర్ణయమన్నారు. అమెరికా టారిఫ్‌లపై ప్రతిపక్షం ఎంతగా విమర్శలు చేసినా, తాము ఎంతో సహనంతో వ్యవహరించామని.. ఆ సహనంతో వచ్చిన ప్రతిఫలమేమిటో ఇప్పుడు అందరికీ కనిపిస్తోందని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి వాణిజ్య చర్చల విషయంలో ప్రభుత్వ స్థిరమైన వైఖరి దీనితో స్పష్టమవుతోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, కానీ భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందని స్పష్టం చేశారు. ప్రపంచ దేశాల క్రమం మారుతోందని, ఆ మార్పు భారత్‌వైపు మొగ్గుతోందని చెప్పారు. ఈ భేటీ సందర్భంగా కేంద్ర మంత్రులు, మిత్రపక్షాల నేతలు తొలుత ప్రధాని మోదీని గజమాలతో ఘనంగా సత్కరించారు. అమెరికా, ఈయూ, యూకే, ఒమన్ సహా 39 దేశాలతో వాణిజ్య ఒప్పందాల ఘనత మోదీకే దక్కుతుందన్నారు.

ఒప్పందం తుదిదశలో ఉంది: గోయల్

అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం ఇంకా తుదిదశలో ఉందని, ఒప్పందానికి తుదిరూపు వచ్చాక భారత్, యూఎస్ సంయుక్త ప్రకటన విడుదల చేస్తాయని కేంద్ర వాణిజ్య మంత్రి గోయల్ చెప్పారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. సుదీర్ఘ చర్చలు, ఎన్నో తర్జనభర్జనల తర్వాత అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఒక కొలిక్కి వచ్చిందని తెలిపారు. ఇతర దేశాలకన్నా కూడా మంచి ఒప్పందం కుదురుతోందని.. మన దేశ వ్యవసాయ, పాడి పరిశ్రమ ప్రయోజనాలకు ఎలాంటి నష్టం ఉండబోదని చెప్పారు. ప్రధాని మోదీ, ట్రంప్ మధ్య ఉన్న వ్యక్తిగత స్నేహం కారణంగానే అమెరికాతో మంచి ఒప్పందం జరుగుతోందని.. భారత్‌పై సుంకాలు 50శాతం నుంచి 18శాతానికి తగ్గుతున్నాయని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఈ డీల్ విషయంలో దేశ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని, రాహుల్ గాంధీది తిరోగమన మనస్తత్వమని ఆయన మండిపడ్డారు. ట్రంప్ సుంకాల తగ్గింపు నిర్ణయం భారత్‌కు ఎంతో అనుకూలమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల అన్నారు.

'సున్నా' టారిఫ్‌పై ఆందోళన

ఇక అమెరికా ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను భారత్ సున్నాకు తగ్గించడానికి అంగీకరించిందన్న ట్రంప్ ప్రకటనపైనా ఆందోళన వ్యక్తమవుతోంది. అదే జరిగితే అమెరికా చవక ఉత్పత్తులు స్థానిక మార్కెట్లను ముంచెత్తి.. స్థానిక రైతులు, వ్యాపారులకు తీవ్ర నష్టం తప్పదనే కలకలం రేగుతోంది. ఈ 'జీరో' టారిఫ్ అంశంపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ నుంచి ఎలాంటి ప్రస్తావన రాలేదు. వాణిజ్య ఒప్పందం వివరాలను ప్రకటించినప్పుడు దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది.

ఏమరుపాటుగా ఉండొద్దు!

- ఎంపీలంతా నియోజకవర్గాల్లో సంక్షేమ పనులు కొనసాగించాలి
- ఎన్డీఏ ఎంపీల భేటీలో మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: కఠోర శ్రమ, ప్రజానుకూల విధానాల వల్లే అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ వరుస విజయాలు సాధిస్తోందని.. అయినా సరే ఏమరుపాటుగా ఉండొద్దని ఎన్డీయే ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు తమ తమ నియోజకవర్గాల్లో చేస్తున్న మంచి పనులను, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు. ఈ విజయాలతో సంతృప్తి చెందడమో, అలసత్వంతో ఉండడమో చేయొద్దని.. క్షేత్రస్థాయిలో లేకపోతే గెలవలేమని స్పష్టం చేశారు.. మంగళవారం ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీ ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ఆ తర్వాత ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. నియోజకవర్గాల్లో చేయాల్సిన పనులను ప్రధాని ఎంపీలకు విస్తృత మార్గదర్శకాలిచ్చారన్నారు.

భారత్ అలాంటి సమాచారమేమీ ఇవ్వలేదు: రష్యా

రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేయడానికి భారత్ అంగీకరించిందని ట్రంప్ పేర్కొనడంపై రష్యా అధ్యక్ష కార్యాలయం అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పందించారు. భారత్‌తో రష్యా సంబంధాలు, చమురు కొనుగోళ్లపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలను పరిశీలిస్తున్నామని మంగళవారం వెల్లడించారు. చమురు కొనుగోలు ఆపేస్తామన్న దిశగా భారత్ నుంచి రష్యాకు ఎలాంటి సమాచారం రాలేదని తెలిపారు. భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలను తాము గౌరవిస్తామని.. కానీ భారత్-రష్యా వ్యూహాత్మక భాగస్వామ్యానికి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. అయితే ఇప్పటికే రష్యా సంస్థలకు ఇచ్చిన ఆర్డర్ల మేరకు చమురు కొనుగోళ్లు ఉంటాయని.. కొత్తగా ఆర్డర్లు ఉండబోవని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కొన్ని నెలల క్రితం అమెరికా ఆంక్షలు విధించిన సమయంలోనే ఐఓసీ, బీపీసీఎల్ మినహా మిగతా ప్రభుత్వ రంగ రిఫైనరీలు రష్యా చమురు దిగుమతులను నిలిపివేశాయని, రిలయన్స్ కూడా దిగుమతులను తగ్గించిందని వెల్లడించాయి. ఇప్పుడీ సంస్థలూ కొనుగోలు ఆపేస్తాయని, రష్యా చమురు సంస్థలకు వాటా ఉన్న నయారా ఎనర్జీ రిఫైనరీ మాత్రం ఆ దేశ చమురు కొనుగోలు కొనసాగించే అవకాశం ఉందని తెలిపాయి.

లోకం తీరు



జన్యువుల చేతుల్లోనే మన ఆయుష్షు

- దానికి పరిమితి నిర్ణయించేవి అవే
- జీవనశైలి బాగుంటేనే ఆ పరిమితికి
- లేకుంటే మధ్యలోనే మరణం
- తాజా పరిశోధనలో వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: మనం ఎంతకాలం జీవిస్తామనేది మన చేతుల్లో లేదు! మన జన్యువుల మీద ఆధారపడి ఉంటుంది. తాజాగా వెలువడిన అధ్యయనం ప్రకారం, ఒక వ్యక్తి జీవితకాల పరిమితిని నిర్ణయించడంలో జన్యువుల పాత్ర 55% వరకు ఉంటుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. గతంలో ఈ ప్రభావం కేవలం 10-25 శాతమే ఉంటుందని భావించేవారు. మంచి ఆహారం, వ్యాయామం, ఒత్తిడికి దూరంగా ఉండడం వంటివి ఆయుష్షు పరిమితిని పూర్తిగా చేరుకోవడానికి దోహదపడతాయి. ఒకవేళ జీవనశైలి సరిగ్గా లేకపోతే, జన్యుపరంగా ఉన్న ఆయుష్షు కంటే ముందే మరణం సంభవించే అవకాశం ఉంటుంది. అంటే, వ్యాయామం, పౌష్టికాహారం అనేవి ఉన్న ఆయుష్షును కాపాడుకోవడానికి పనికొస్తాయి తప్ప, మన జన్యువులు నిర్ణయించిన గరిష్ఠ పరిమితిని దాటి జీవించలేమని ఈ పరిశోధన స్పష్టం చేస్తోంది. ప్రముఖ జర్నల్ 'సైన్స్'లో తెలిపిన వివరాల ప్రకారం.. డెన్మార్క్, స్వీడన్ దేశాలకు చెందిన కవలల జీవితకాల డేటా ఆధారంగా ఈ ఫలితాలను వెల్లడించారు. ముఖ్యంగా ఇన్ఫెక్షన్లు, ప్రమాదాల వల్ల చనిపోయిన వారిని మినహాయించి చూసినప్పుడు జన్యువుల అసలు ప్రభావం బయటపడింది. అయితే, ఇది భారతీయుల్లో కాస్త ఆందోళన కలిగించే అంశమేనని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మనకు దీర్ఘాయువునిచ్చే జన్యువులు ఉన్నప్పటికీ, దేశంలోని కాలుష్యం, పోషకాహార లోపం లాంటి పరిస్థితులు ఆ ప్రయోజనాన్ని హరించివేసే ప్రమాదం ఉందన్నారు.

ఎప్‌స్టీన్ ఫైల్స్ భయంతోనే.. ట్రంప్‌తో ప్రధాని మోదీ రాజీ

తన పరువు కోసం దేశాన్ని అమ్మేశారు: రాహుల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో తన పేరు బయటకు రావటంతో పరువు పోతుందని భయపడి ప్రధాని మోదీ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో రాజీపడ్డారని రాహుల్‌గాంధీ ఆరోపించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం పేరుతో దేశాన్ని అమ్మేశారని విమర్శించారు. మంగళవారం పార్లమెంటు బయట ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రధానిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 'ప్రధాని మోదీ భయపడుతున్నారు. ఎందుకంటే ఏవైతే ఆయనకు గౌరవప్రతిష్ఠలు తెచ్చిపెట్టాయో.. అవే ఇప్పుడు ఆ ప్రతిష్ఠను ముక్కలు చేస్తున్నాయి. అదానీపై అమెరికాలో నమోదైన కేసు, ఇప్పుడు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మోదీ పేరు.. ఈ రెండు పరిణామాలతో ప్రధాని తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఆయన రాజీ పడ్డారు. మోదీ భయపడుతున్నారు కాబట్టే కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న అమెరికా- భారత్ వాణిజ్య ఒప్పందంపై ఆగమేఘాల మీద సంతకం చేసి, భారతీయుల కష్టార్జితాన్ని అమెరికాకు అమ్మేశారు' అని రాహుల్‌గాంధీ విమర్శించారు. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మొదటిసారి సభలో ప్రతిపక్ష నేతను మాట్లాడకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. అమెరికా అధ్యక్షుడికి ప్రధాని మోదీ పూర్తిగా లొంగిపోయారని కాంగ్రెస్ నేత జైరాంరమేశ్ విమర్శించారు. రాజ్యసభలో మంగళవారం ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈయూ)తో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల గురించి పార్లమెంటుకు ఎలాంటి సమాచారం ఇవ్వటంలేదని మండిపడ్డారు. అమెరికాతో ఒప్పందం గురించి ఆ దేశాధ్యక్షుడు చెపితేగానీ తెలుసుకోలేకపోయామని అన్నారు.

మళ్లీ 'చైనా' రచ్చ

ఎనిమిది మంది ఎంపీల సస్పెన్షన్

- 'చైనా దురాక్రమణ'పై మాట్లాడేందుకు మరోసారి ప్రయత్నించిన రాహుల్‌గాంధీ
- స్పీకర్ నిరాకరణ.. విపక్షాల తీవ్ర నిరసన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : 'చైనా' రచ్చ పార్లమెంటును వరుసగా రెండో రోజు కూడా కుదిపేసింది. మాజీ సైనికాధిపతి నరవణే పుస్తకంలోని అంశాలను ప్రస్తావించేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీ మరోసారి ప్రయత్నించడంతో లోక్‌సభలో గందరగోళం చెలరేగింది. రాహుల్ ప్రయత్నాన్ని అధికారపక్షం తీవ్రంగా అడ్డుకుంది. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. 8మంది విపక్ష సభ్యులను ప్రస్తుత పార్లమెంటు సమావేశాలు అయ్యేవరకు సస్పెండ్ చేశారు. వీరిలో ఏడుగురు కాంగ్రెస్ సభ్యులు కాగా, ఒకరు సీపీఎం ఎంపీ ఉన్నారు. కాగా, నరవణే పుస్తకంలో పేర్కొన్న అంశాలను తాను సాధికారికంగా వెల్లడించాలని నిర్ణయించుకున్నట్లు రాహుల్ గాంధీ అంతకుముందు స్పీకర్‌కు నోట్ సమర్పించారు. 'ఇందులోని ప్రతి అంశాన్నీ వ్యక్తిగతంగా ధ్రువీకరిస్తున్నాను. సంతకం కూడా చేశాను. అందువల్ల సోమవారం వ్యక్తమైన అభ్యంతరాలు తొలగిపోయినట్టే' అని తెలిపారు. స్పీకర్ స్థానంలో ఉన్న టీడీపీ ఎంపీ కృష్ణప్రసాద్ రాహుల్ సమర్పించిన నోట్‌ను పరిశీలిస్తామని తెలిపారు. అయినప్పటికీ రాహుల్ ఆ పుస్తకంలోని అంశాలను ప్రస్తావించడంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం చెలరేగింది. విపక్ష సభ్యులు స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లారు. చేతుల్లోని కాగితాలను చింపి తీవ్ర నిరసన తెలిపారు. దీంతో సభ వాయిదా పడింది. తిరిగి మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభం కాగానే, 8మంది ఎంపీల సస్పెన్షన్ కోరుతూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు తీర్మానం ప్రవేశపెట్టగా, ప్యానల్ స్పీకర్ దిలీప్ సైకియా ఆమోదించారు. సస్పెండ్ అయినవారిలో హిబి ఈడెన్, అమరీందర్ రాజా వారింగ్, మాణిక్కం ఠాకూర్, గుర్జీత్ సింగ్ ఔజ్లా, సి.కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రశాంత్ పడోల్, డీన్ కురియకోస్(కాంగ్రెస్ సభ్యులు), ఎస్ వెంకటేశన్ (సీపీఎం) ఉన్నారు. సస్పెండ్ అయిన సభ్యులంతా పార్లమెంటు ప్రాంగణంలో నిరసన తెలిపారు.

అది డోక్లాం కాదు : నిపుణులు

నరవణే ఆత్మకథ ఆధారంగా చైనా దురాక్రమణపై చేసే వాదనలో రాహుల్ తడబడుతున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. వారి వాదన ప్రకారం, "2020లో డోక్లాం వైపు చైనాకు చెందిన 4 యుద్ధ ట్యాంకులు చొచ్చుకువచ్చాయి" అని రాహుల్ అన్నారు. అయితే, అవి రెచిన్ లా ప్రాంతంలో కనిపించాయి. డోక్లాంలో 2017లో భారత్-చైనా మధ్య మనకు సైనిక ప్రతిష్టంభన ఏర్పడింది. అప్పటికి నరవణే ఆర్మీ చీఫ్ కాలేదు. గాల్వాన్ ఉద్రిక్తతలు తలెత్తిన 2020లో ఆయన ఆ బాధ్యతలు స్వీకరించారు.



చర్చకు అంగీకరిస్తే బాగుండేది

'నరవణె'పై ప్రభుత్వానిది అతి: థరూర్

నరవణె ఆత్మకథ గ్రంథంలోని అంశాలపై ప్రభుత్వం అతిగా స్పందించిందని కాంగ్రెస్ నేత శశిథరూర్ విమర్శించారు. ఆ గ్రంథంలోని అంశాలను లోక్‌సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రస్తావించినప్పుడు అడ్డుకోకుండా చర్చకు అంగీకరిస్తే బాగుండేదని అన్నారు. పార్లమెంటు బయట ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నరవణె గ్రంథంలోని అంశాలు ఇప్పటికే ప్రజలందరికీ అందుబాటులో ఉన్నాయని, దీనిపై కారవాన్ మ్యాగజైన్‌లో వచ్చిన ఆర్టికల్‌ను అందరూ చదువుతూనే ఉన్నారని తెలిపారు. ప్రభుత్వమే అతిగా స్పందించి సభలో రభస సృష్టించిందని విమర్శించారు. పార్లమెంటు ఉన్నది దేశానికి సంబంధించిన అంశాలను చర్చించటానికే కదా? అని ఆయన ప్రశ్నించారు. చైనా సైన్యం సరిహద్దులో భారత భూభాగాన్ని ఆక్రమించిందని నరవణె తన గ్రంథంలో రాశారని రాహుల్ అన్నారు.

'సూర్యలంక' అభివృద్ధి అభినందనీయం

- మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో అధికారుల కృషి భేష్
- తీరంలో పర్యటించిన సింగపూర్ బృందం
- పర్యాటక అభివృద్ధి అవకాశాలపై సంతృప్తి



-సూర్యలంక తీరంలో పర్యటిస్తున్న సింగపూర్ బృందానికి పర్యాటకంగా ఉన్న అవకాశాలను వివరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): 'సూర్యలంక తీర ప్రాంతం చాలా ఆహ్లాదంగా ఉంది. పర్యాటకంగా దీనిని మరింత అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టడం అభినందనీయం. మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో అధికారుల కృషి బాగుంది. ఈ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలతో ముందుకు వెళ్లడం సంతోషంగా ఉంది' అని సింగపూర్ అధికారిక బృందం అభిప్రాయపడింది. అమరావతి ఆర్థిక మండలి ప్రణాళికలో భాగంగా ఇక్కడ ఉన్న సానుకూలతలను అంచనా వేయడానికి సింగపూర్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం మంగళవారం బాపట్ల జిల్లా సూర్యలంక తీరంలో పర్యటిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. సింగపూర్ ఎకనామిక్ కన్సల్టెంట్ వైస్ సీఈవో చూ టైక్ హిమ్, కోఆపరేషన్ ఎంటర్‌ప్రైజ్ డిప్యూటీ చీఫ్ లియాన్‌చు, మినిస్ట్రీ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ సీనియర్ డైరెక్టర్ ఫ్రాన్సిస్‌చాంగ్, సస్టయిన్‌బిలిటీ సీనియర్ మేనేజర్ నిషా, ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ డైరెక్టర్ బి. గోపాల్ ఈ బృందంలో ఉన్నారు. ఉదయం 10 గంటలకు బాపట్లకు విచ్చేసిన బృందం వివిధ విభాగాలతో కలెక్టరేట్‌లో సమీక్ష అనంతరం సూర్యలంక బీచ్, ఆక్వా సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించింది. అమరావతి ఎకనామిక్ రీజియన్‌లో భాగంగా ఉన్న బాపట్ల జిల్లా నుంచి ఆ ప్రణాళికల్లో వేటికి చోటు ఇవ్వొచ్చనేదే ప్రధాన ఎజెండాగా బృందం పర్యటన సాగింది. టూరిజం, ఆక్వా, అగ్రికల్చర్ ఈ మూడింటిపైనా కలెక్టర్ వినోద్‌కుమార్ పీపీటీ ద్వారా బృందానికి వివరించారు. ఇక్కడ పర్యాటకం అభివృద్ధికి ఎంతగానో అవకాశాలు ఉన్నట్లు సింగపూర్ బృందం అంచనాకు వచ్చింది. ఇక్కడకు వస్తున్న పర్యాటకుల సంఖ్యతో పాటు స్వదేశీ దర్శన్ కింద జరుగుతున్న పనులను కలెక్టర్ వివరించారు.

ఆక్వా రైతుతో ముచ్చట్లు..

బయో ఫ్లాగ్ టెక్నాలజీ వంటి అధునాతన విధానంతో బాపట్ల రూరల్‌లో ఆక్వా సాగు చేస్తున్న సురేష్ అనే రైతుతో సింగపూర్ బృందం ముచ్చటించింది. సాగులో ఉన్న లాభనష్టాలను అడిగి తెలుసుకుంది. ఆక్వా పురోగమనానికి సంబంధించి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారిక బృందానికి వివరించగా వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

బీసీ హాస్టళ్ల అభివృద్ధికి రూ.20 కోట్ల సాస్కి నిధులు

- బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ హాస్టళ్ల అభివృద్ధికి రూ.20 కోట్ల సాస్కి నిధులు మంజూరయ్యాయని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. వీటితో రాష్ట్రంలోని 238 హాస్టళ్లలో మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. రెండు నెలల కిందట బీసీ గురుకులాలు, హాస్టళ్ల మరమ్మతులకు రూ.60 కోట్లు మంజూరుచేశామన్నారు. 2025-26లో రూ.105 కోట్లు వెచ్చించామని తెలిపారు. బీసీ బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, సన్నబియ్యంతో రుచికరమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఆహార, ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందిస్తున్నామన్నారు.



ఇదిగో పులి..!

రాజమహేంద్రవరం శివారులో సంచారం

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా రాజమహేంద్రవరం రూరల్ పరిసర మండలాలను వణికిస్తున్న పెద్దపులి ఆచూకీ ఎట్టకేలకు లభ్యమైంది. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో రాజమహేంద్రవరం సమీపంలోని ఆటోనగర్‌లో పులి సంచరించినట్టు అటవీ అధికారులు ధ్రువీకరించారు. ఆ ప్రాంతంలో షాపులన్నీ మూయించి వేశారు. ఈ ప్రాంతం రిజర్వు ఫారెస్టుకు చేర్చి ఉంటుంది. దీంతో లాలాచెరువు, దివాన్‌చెరువు, వెలుగుబంద, పాలచర్ల తదితర గ్రామాల ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ మేరకు రాజా నగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమీప గ్రామాల ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉరుకులు పరుగులు పెట్టించి....

పాదముద్రలు కనబడుతున్నాయి...కానీ, పెద్దపులి ఆచూకీ దొరకడం లేదు...ఎక్కడ ఉందో తెలియదు, ఎటు వెళ్తోందో తెలియదు...అధికారులను పరుగులు పెట్టిస్తోంది. ఇదీ గత మూడు రోజులుగా రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లో పరిస్థితి. రెండు రోజులుగా రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామంలో ఉందనుకున్న పెద్దపులి మంగళవారం ఉదయం కొంతమూరు, కోలమూరు గ్రామాల సరిహద్దు కోరుకొండ మండలం గాడాల ప్రాంతాలకు చేరింది. తొర్రేడు మీదుగా పొలాల వెంబడి కొంతమూరులోని లేఅవుట్లకు చేరువగా ఉన్న చెరువు వద్ద పులి పాదముద్రలు గుర్తించినట్టు అటవీశాఖ అధికారులు తెలిపారు. అక్కడి నుంచి గాడాల ప్రాంతంలోని పామాయిల్ తోటలో కూడా పులి పాదముద్రలు గుర్తించారు. పులి సంచారం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ గ్రామాల్లో దండోరా వేయించారు. ముందు జాగ్రత్తగా పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

విద్యార్థి నేతలపై దాడి.. కిడ్నాప్!

మరో వివాదంలో మోహన్‌బాబు యూనివర్సిటీ

- అధిక ఫీజులపై ధర్నాకు వెళ్తున్న వారిపై ఎంబీయూ బౌన్సర్ల దాడి.. ఇద్దరి కిడ్నాప్
- గంటలోనే ఛేదించిన తిరుపతి జిల్లా పోలీసులు
- అదుపులో కిడ్నాపర్లు.. విద్యార్థి నేతలు సురక్షితం
- మోహన్‌బాబు, విష్ణు సహా 23 మందిపై కేసు



కిడ్నాప్‌నకు గురైన ఎస్ఎఫ్ఐ నేతలు అక్బర్, వినోద్



తప్పించుకున్న రెడ్డికుమార్

తిరుపతి/చంద్రగిరి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మోహన్‌బాబు యూనివర్సిటీ మరో వివాదంలో చిక్కుకుంది. అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేసేందుకు వెళ్తున్న విద్యార్థి సంఘాల నేతలపై వర్సిటీ బౌన్సర్లు దాడికి పాల్పడి, ఇద్దరిని కిడ్నాప్ చేయడం మంగళవారం తిరుపతిలో సంచలనం సృష్టించింది. రంగంలోకి దిగిన పోలీసులు.. విద్యార్థి నేతలను కాపాడారు. నలుగురు కిడ్నాపర్లను అదుపులోకి తీసుకుని, మూడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో సూత్రధారులుగా భావిస్తున్న వర్సిటీ యజమానులైన మోహన్‌బాబు, ఆయన కుమారుడు విష్ణు, ఎంబీయూ పీఆర్వో సతీశ్‌కుమార్ సహా 23 మందిపై తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంబీయూలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారంటూ రెండ్రోజుల కిందట విద్యార్థి సంఘాల నేతలు గవర్నర్‌కు, విద్యా మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం తిరుపతి ఎన్టీఆర్ కూడలిలో ఎంబీయూ దిష్టిబొమ్మ దహనానికి ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ సంఘాల నాయకులు ప్రయత్నించారు. పోలీస్ 30 యాక్ట్ అమల్లో ఉన్నందున వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారంతా బైక్‌లపై కలెక్టరేట్ బయల్దేరారు. మధ్యలో 20 మంది బౌన్సర్లు మూడు ఇన్నోవా వాహనాల్లో వచ్చి అడ్డుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్, ఎస్వీయూ క్యాంపస్ ఇన్‌చార్జి వినోద్‌లపై దాడి చేశారు. బలవంతంగా కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారు. మరో ఎస్ఎఫ్ఐ నాయకుడు రెడ్డికుమార్ తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీపీఐ, సీపీఎం, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేయడంతో పాటు తిరుచానూరు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. దాడి, కిడ్నాప్ ఘటనలను తీవ్రంగా పరిగణించిన జిల్లా పోలీసు యంత్రాంగం.. ఏఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ ప్రసాద్‌లను రంగంలోకి దించింది. గంటా పదిహేను నిమిషాల్లోనే కిడ్నాపర్లకు చెక్ పెట్టారు. బి.కొంగరవారిపల్లె వద్ద వెళ్తుండగా పోలీసులు చేజ్ చేసి అడ్డుకుని, నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థి నేతలను సురక్షితంగా ఎస్పీ కార్యాలయానికి తరలించారు. అయితే తిరుపతి జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి అక్బర్, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి ప్రవీణ్‌లపై ఎంబీయూ పీఆర్వో సతీశ్ చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వర్సిటీ గురించి మాట్లాడకుండా ఉండేందుకు రూ.15 లక్షలు డిమాండ్ చేశారని, అది చెల్లించకపోవడంతో.. కలెక్టరేట వద్ద ధర్నా చేస్తామంటూ హెచ్చరించారని పేర్కొన్నారు.

బ్లాక్ లిస్టులో పెట్టాలి: ఎస్ఎఫ్ఐ

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మోహన్‌బాబు వర్సిటీని బ్లాక్ లిస్టులో పెట్టాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది.

చర్యలు తీసుకోవాలి: సీపీఐ

మోహన్‌బాబు యూనివర్సిటీపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఏసీబీ కోర్టు ఉత్తర్వులపై హైకోర్టులో విచారణ

- కౌంటర్ దాఖలుకు సమయం కోరిన సీఐడీ

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో అప్పటి విపక్ష నేత చంద్రబాబు తదితరులపై నమోదైన కేసులకు సంబంధించిన రికార్డులు ఇచ్చేందుకు నిరాకరిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన క్రిమినల్ రివిజన్ పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. సీఐడీ తరఫు న్యాయవాది ఉన్నం అఖిల్ చౌదరి కౌంటర్ వేసేందుకు సమయం కోరడంతో విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. "ఫైబర్ గ్రిడ్, మద్యం పాలసీలకు సంబంధించి వైసీపీ ప్రభుత్వంలో చంద్రబాబు తదితరులపై నమోదు చేసిన కేసులను విజయవాడ ఏసీబీ కోర్టు మూసివేసింది. ఈ తీర్పు ప్రతులతో పాటు రికార్డులన్నింటినీ ఇవ్వాలని కోరగా కోర్టు నిరాకరించింది." అని పేర్కొంటూ రిటైర్డ్ రైల్వే ఉద్యోగి యేము కొండలరావు హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం విచారణకు రాగా మూడో పక్షం తీర్పు ప్రతులు పొందడానికి సహజంగా అనుమతించబోమని, ఏసీబీ కోర్టు తీర్పు ప్రతులతో మీరు పొందే ప్రయోజనం ఏమిటని హైకోర్టు ప్రశ్నించింది.

రోడ్డెక్కిన అంగన్‌వాడీలు



బాపట్ల ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు, సీఐటీయూ నాయకులు, సభ్యులు

- బడ్జెట్‌లో వేతనాల పెంపు ప్రస్తావన లేకపోవడంపై ఆగ్రహం
- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంగన్‌వాడీ వేతనాల పెంపుదల గురించి లేకపోవడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం ఆందోళన చేపట్టారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ జిల్లాల్లోని సీడీపీవో కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. కేంద్రం బడ్జెట్‌లో అన్యాయం చేసిందంటూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయవాడలో ఆందోళన నిర్వహించారు. కానూరులోని ఐసీడీఎస్ అర్బన్, రూరల్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించి, కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. రూరల్ సీడీపీవో భానుమతి, అర్బన్ సీడీపీవో జ్యోత్స్నకు వినతిపత్రాలు అందజేశారు. ఏలూరు జిల్లాలోని పది సీడీపీవో కార్యాలయాల ఆందోళనలు చేపట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలు.. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లాలో బాపట్ల, రేపల్లె, వేటపాలెం, నగరం ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యు లు ఆందోళనకు దిగారు. కేంద్ర బడ్జెట్‌లో తమకు కేటాయింపులు పెంచాలని డిమాం డ్ చేస్తూ విశాఖలో అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నాలో భారీగా పాల్గొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించలేదని శ్రీసత్యసాయి జిల్లాలో చేపట్టిన ఆందోళనలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు మండలాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేసి, బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాల పరిధిలోని మండల కేంద్రాల్లోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద నిరసన చేపట్టారు. కడప అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. అంగన్వాడీ కార్మికులకు వేతనాలు పెంచకపోవడం, 2022లో సుప్రీంకోర్టు ఇచ్చిన గ్రాట్యుటీ అమలు ఉత్తర్వులను పట్టించుకోకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.

హాస్టళ్లలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

- అన్ని హాస్టళ్లలో సీసీ కెమెరాలు: మంత్రి డోలా

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అన్ని హాస్టళ్లలో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. సచివాలయం నుంచి మంత్రి సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్లతో వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. పదోతరగతి, ఇంటర్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసి నూరుశాతం ఫలితాల కోసం కార్యాచరణ రూపొందించాలన్నారు. ఏ సబ్జెక్టులో వెనుకడి ఉన్నారో గుర్తించి ట్యూటర్ల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థులకు వార్డెన్‌లు కెరీర్ గైడెన్స్ ఇవ్వాలని, రైజింగ్ స్టార్, షైనింగ్ స్టార్ పుస్తకాలు చదివించాలని సూచించారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులకు వేసవి సెలవుల్లోనూ ప్రతి జిల్లాలో ఒక చోట భోజన, వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెనూ, వార్డెన్‌ల పనితీరు, పారిశుధ్య నిర్వహణపై ఐవీఆర్ఎస్ ద్వారా విద్యార్థుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నామన్నారు. విద్యార్థుల సంతృప్తి పెంచే లక్ష్యంగా వార్డెన్ల పనితీరు, పారిశుధ్య నిర్వహణ ఉండాలని సూచించారు. అన్ని హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

● ఆ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

దీర్ఘకాలంగా బడికి గైర్హాజరవుతున్న, చదువులో వెనుకబడిన పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు మంగళవారం డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలను ఆదేశించారు. అలాంటి విద్యార్థుల కోసం తాత్కాలిక ప్రాతిపదికన స్థానికంగా నివాస కేంద్రాలు ఏర్పాటుచేయాలన్నారు. అబ్బాయిలు, అమ్మాయిలకు వేర్వేరుగా నివాస కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని స్పష్టంచేశారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ ఏర్పాట్లుచేసి ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు.

గిరిజన పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలను కొనసాగించాలి

విజయవాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లను కొనసాగించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్(ఏపీఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

మనస్తాపంతోనే విద్యార్థి మృతి

- కొట్టి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన తోటి విద్యార్థులు
- సాక్ష్యాలు తారుమారు చేసేందుకు ప్రైవేట్ కళాశాల సిబ్బంది ప్రయత్నం
- వివరాలు వెల్లడించిన గన్నవరం డీఎస్పీ.. ఆరుగురు జువైనల్ హోమ్‌కు, సిబ్బంది రిమాండుకు తరలింపు

పెనమలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సమీపంలోని పోరంకిలో ఉన్న ఒక ప్రైవేటు కళాశాలలో ఇటీవల విద్యార్థి మృతి చెందడానికి తోటి విద్యార్థులే కారణమని తేలింది. గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు మంగళవారం పెనమలూరు పోలీసు స్టేషన్లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. అనకాపల్లికి చెందిన పవన్‌కుమార్(17) పోరంకిలోని ఒక ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సహ విద్యార్థి హేమంత్‌తో గతేడాది డిసెంబరులో గొడవ జరగ్గా.. అతను మంచివాడుకాదని, మాట్లాడవద్దని తోటి విద్యార్థులతో చెప్పాడు. ఇది తెలిసి హేమంత్ తన స్నేహితులతో కలిసి డిసెంబరు ఐదవ తేదీన పవన్ కుమార్‌ను తన గదికి పిలిపించుకొని కొట్టి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. గత నెల 30న కూడా వారు మరోసారి కొట్టడంతో మనస్తాపానికి గురైన పవన్ కుమార్ హాస్టలు గదిలో ఉరివేసుకొని మృతి చెందాడు. స్టడీ అవర్స్ అనంతరం గదికి చేరుకొన్న తోటి విద్యార్థులు గమనించి కళాశాల ప్రిన్సిపాల్‌కు, సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు వచ్చి చూసేసరికే అతను మృతి చెందాడు. తన చావుకు కారణమైన వారి పేర్లను పవన్‌కుమార్ తన చేతిపై రాశాడు. వాటిని ప్రిన్సిపాల్ పిచ్చయ్య, సిబ్బంది చెరిపివేసి సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారు. పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో విద్యార్థులు ఈ విషయాలను వెల్లడించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులైన ఆరుగురు విద్యార్థులను జువైనల్ హోమ్‌కు, ప్రిన్సిపాల్, ఇతర సిబ్బందిని రిమాండుకు తరలించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మమత 'సర్' పోరు

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేడు సుప్రీంకోర్టులో ప్రత్యక్షమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను సవాల్ చేస్తూ, తన రాష్ట్రంలో దానిని తక్షణం ఆపివేయాలంటూ ఆమె న్యాయపోరాటం చేస్తున్నారు. సర్ అమలు న్యాయబద్ధం కాదంటూ ఆమెపార్టీ ఇటీవల కోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. విచారణ నేడు జరుగుతున్న నేపథ్యంలో, జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న ఆమెకు కోర్టుకూడా వ్యక్తిగత హాజరుకు అనుమతించడంతో ఢిల్లీలోనే ఉన్న మమత వచ్చి సర్ మీద తన అభ్యంతరాలను స్వయంగా విన్నవించుకుంటారని మీడియా అంటోంది.

మమతా బెనర్జీ తన 'సర్' వ్యతిరేకపోరాటాన్ని దేశరాజధానికి మార్చి రాజకీయంగా మంచి ఎత్తు వేశారని విశ్లేషకుల అంచనా. సోమవారం సీఈసీతో భేటీకోసం ఆమె ఆదివారం ఢిల్లీలో ఒక పెద్ద బృందంతో కాలూనారు. పార్టీ నాయకులు, కార్యకర్తల నినాదాలు, నిరసనల హడావుడి ఎలాగూ ఉండగా, సర్‌తో నష్టపోయిన వారంటూ కొందరిని ఆమె తనతోపాటు ఢిల్లీ తీసుకువచ్చారు. నిరసన ఘాటుగా ఉండాలంటే నల్లబాడ్జీలు సరిపోవని అనుకున్నారేమో, సదరు సర్ బాధితులతో పాటు తాను కూడా నల్లశాలువా కప్పుకొని ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ఎంత అమానుషమైనదో వివరించారు. సీఈసీతో జరిపిన గంటన్నర భేటీలోనూ ఏమి జరిగిందన్నది మనకు స్పష్టంగా తెలియదు కానీ, ఉభయపక్షాలు పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకున్నాయి. ఎన్నికల సంఘం మీద ఆమె తీవ్ర ఆరోపణలు చేశారని, తాము జవాబు చెబుతున్నప్పుడు మాత్రం తృణమూల్ నాయకులు ఉద్దేశపూర్వకంగా పదేపదే అడ్డు తగిలారని అధికారుల విమర్శ. గట్టిగా మాట్లాడుతూ మమత పలుమార్లు టేబుల్‌ను బలంగా చరిచారనీ, సమాధానం పూర్తిగా వినకుండానే ఆగ్రహంగా వెళ్ళిపోయారని వారంటున్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ అహంకారనీ, జమీందారులాగా ప్రవర్తిస్తూ తృణమూల్ బృందాన్ని అవమానించారని మమత ఆరోపణ.

ఎప్పటిలాగానే ఆయనను బీజేపీ బ్రోకర్ అని ఆడిపోసుకున్నారామె. జగ్‌దీప్ ధన్‌కర్‌కు పట్టిన గతే జ్ఞానేశ్‌కూ పడుతుందని ఆమె జోస్యం చెప్పారు. ఢిల్లీలోని బంగభవన్‌కు రక్షణగా స్వరాష్ట్రం నుంచి పెద్దసంఖ్యలో పోలీసులను తెచ్చుకున్న ఆమె, ఢిల్లీ పోలీసులను కూడా అక్కడ మోహరించినందుకు మండిపడుతున్నారు.

బెంగాలీల పేర్లు, ఇంటిపేర్ల స్పెల్లింగులో స్వల్ప తేడాలు సర్వసాధారణమనీ, అయినా వాటిని బూచిగా చూపి లక్షలాది పేర్లు తొలగిస్తున్నారని మమత ఆరోపణ. పాత జాబితాలను డిజిటలైజ్ చేసే క్రమంలో కృత్రిమమేధ వినియోగం లక్షలాది ఓటర్లకు అన్యాయం చేసిందని, మైక్రో అబ్జర్వర్ల పేరిట ఎనిమిదివేలమందిని రంగంలోకి దించడం కూడా ఈసీ–బీజేపీ సంయుక్త కుట్రని ఆమె అంటున్నారు. ఓటరు జాబితాలో ఉన్న వృద్ధులను సైతం ఆస్పత్రిలో పురుడుపోసుకున్న ఆధారాన్ని ఈసీ అడుగుతోందని, నరేంద్రమోదీకి సైతం ఇది సాధ్యమేనా అని ఆమె ప్రశ్న.

బిహార్‌లో సర్ సందర్భంగా, ఆధార్‌ను సైతం కాదన్న ఎన్నికల సంఘం చివరకు సుప్రీంకోర్టు ఒత్తిడికి లొంగి సరేనన్నప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగి లక్షలాదిపేర్లు గల్లంతైనాయి. పశ్చిమబెంగాల్‌లో సర్ ప్రక్రియను ఉద్దేశించి పక్షంరోజులక్రితం కూడా సుప్రీంకోర్టు కొన్ని ఆదేశాలు ఇచ్చింది. రెండు దశాబ్దాలనాటి జాబితాలతో కుస్తీపడుతున్న అధికారులు అనుభవిస్తున్న ఒత్తిడిని, పౌరులు ఓట్లు కోల్పోయే ప్రమాదాన్ని గమనించి కోర్టు కొన్ని ఆదేశాలు ఇచ్చింది. ముఖ్యంగా, పిల్లలూ వారి తల్లిదండ్రుల పేర్లు ఇంటిపేర్లలో స్వల్పతేడాలు, వేర్వేరు స్పెల్లింగులు, నమ్మశక్యం కానంత వయసు అంతరాలు వంటివి పరిష్కరించడానికి వీలుగా కోటీపాతికలక్షలమంది పేర్లను ఆయా గ్రామపంచాయతీలు, బ్లాక్, వార్డు కార్యాలయాల్లో ప్రదర్శించాలనీ, జవాబు చెప్పుకోవడానికి తగినంత సమయం ఇవ్వాలని, విచారణ సమయంలో తగినంత సిబ్బందిని నియమించి, ప్రతీదశలోనూ రసీదులు ఇవ్వాలనీ, తుది నిర్ణయానికి కారణాలు తెలియచేయాలని కోర్టు మార్గనిర్దేశనం చేసింది. పాత జాబితాలను ప్రక్షాళించే బృహత్ కర్తవ్యాన్ని ఎన్నికల సంఘం నెత్తినెత్తుకోవడాన్ని ఎవరూ ఆక్షేపించడం లేదు. కానీ, ఎన్నికలు ముంచుకొస్తున్న రాష్ట్రాల్లో దానిని హడావుడిగా అమలు చేయడమే విమర్శలకు కారణమవుతున్నది. తీవ్రమైన ఒత్తిళ్ళు, గడువుల మధ్య బీఎల్‌వోలు పలురకాల తప్పులు చేయడంతో పాటు, అనేకమంది తీవ్ర అనారోగ్యం పాలైనారు. సర్ మంచిచెడులను మొదట్లోనే నిర్ధారించి, నిలువరించాల్సిన న్యాయస్థానాలు ఆ పని చేయని కారణంగా ఇప్పుడు ఎప్పటికప్పుడు ప్రక్రియను గాడినపెట్టవలసి వస్తున్నది.

వాణిజ్య బంధాలూ సమర వివాదాలూ



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

రాష్ట్రపతి ప్రసంగం ముగిసిన తర్వాత కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన రెండో రోజే పార్లమెంటులో తీవ్ర గందరగోళం నెలకొన్నది. దీన్నిబట్టి చూస్తే అసలు పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరగాలన్న ఉద్దేశం అటు ప్రతిపక్షాలకు కానీ, ఇటు ప్రభుత్వానికి కానీ ఉన్నదా అన్న అనుమానం వస్తోంది. సాధారణంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగడం ఆనవాయితీ. ఆ తర్వాతే బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చలు మొదలవుతాయి. పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి వెలువరించే ప్రసంగం ఒక రకంగా ప్రభుత్వ విధాన డాక్యుమెంట్. నిజానికి మోదీ ప్రభుత్వం అమలుపరుస్తోన్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇస్తోన్న ప్రాధాన్యం గురించి రాష్ట్రపతి ప్రసంగం వివరించింది.. రాజకీయ విభేదాలు విస్మరించి వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా జాతీయ ప్రజాప్రతినిధులు అందరూ దేశ ప్రయోజనాలకోసం కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. విచిత్రమేమంటే బడ్జెట్ ప్రవేశపెట్టిన మరుసటి రోజే పాలక, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాదోపవాదాలతో సభా సమావేశాలు కొనసాగలేని పరిస్థితి ఏర్పడింది. ఇందుకు ఎవరు కారణం? రాష్ట్రపతి ప్రసంగంపై సోమవారం నాడు ప్రారంభమైన చర్చలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య కాంగ్రెస్‌పై వాడి వేడి బాణాలు సంధించారు. భారతీయ నాగరికత, సంస్కృతి, జాతీయవాదం, దేశభక్తి అనే వాటికి కాంగ్రెస్ పార్టీ తీవ్ర వ్యతిరేకమని ఆయన మాట్లాడిన మాటలు కాంగ్రెస్‌ను రెచ్చగొట్టాయి.

ఇప్పటికే అనేక గాయాలతో రెచ్చిపోతున్న కాంగ్రెస్ ఊరుకుంటుందా? ఆ వెంటనే కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ రంగంలోకి దిగి తమ దేశ భక్తిని, జాతీయవాదాన్ని శంకించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'మా దేశ భక్తి గురించి, భారతీయ సంస్కృతి గురించి బీజేపీ యువ ఎంపీ వ్యాఖ్యలు చేసినందుకే నేను కొన్ని వాక్యాలను చదివి వినిపించ దలుచుకున్నాను' అని రాహుల్ మొదలుపెట్టారు. 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పేరిట 2020లో చైనాతో జరిగిన సరిహద్దు ఘర్షణపై మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రచించిన పుస్తకంలో ఉన్న అంశాలపై 'కారవాన్' అనే పత్రిక వెలువడిన ఆ పుస్తక భాగాలను చదవ సాగారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురించి నరవణే రాసిన వాక్యాలను చదవడం మొదలుపెట్టగానే బీజేపీ ఎంపీలు తీవ్ర గందరగోళం సృష్టించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇంకా ప్రచురణ కాని ఆ పుస్తకంలోని వాక్యాలను ఎలా చదువుతారని మంత్రులు ప్రశ్నించారు. స్పీకర్ ఓం బిర్లా కూడా 342 నిబంధన క్రింద అలా చదవడం కుదరదని స్పష్టం చేశారు. అధికార ప్రతిపక్ష సభ్యుల మధ్యే కాక, స్పీకర్‌కూ, ప్రతిపక్ష సభ్యుల మధ్య కూడా వాగ్వివాదం జరిగింది. మంగళవారం కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. తాను నరవణే పుస్తకంలో ఉన్న అంశాలు సరైనవేనని సాధికారికంగా చెబుతున్నానంటూ రాహుల్ స్పీకర్‌కు నోట్ సమర్పించి మరీ మళ్లీ ప్రసంగం ప్రారంభించారు. అయితే అధికార పక్షం వారు యథా ప్రకారం రాహుల్ మాట్లాడకుండా అడ్డుకున్నారు. ప్రధాన మంత్రి అన్న పదం ఉచ్చరించినప్పుడల్లా స్పీకర్ అడ్డుకున్నారు. రాహుల్‌ను అడ్డుకుంటున్నారని గందరగోళం సృష్టించినందుకు ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేశారు. చివరకు అనేక వాయిదాల తర్వాత సభ మళ్లీ బుధవారానికి వాయిదా పడింది.

అసలీ పరిస్థితి ఎందుకు వచ్చింది? తేజస్వి సూర్య విమర్శనాస్త్రాలే కాంగ్రెస్‌ను రెచ్చగొట్టాయా? జనరల్ నరవణే పుస్తకంలోని అంశాలను రాహుల్ ప్రస్తావించకుండా బీజేపీ ఎందుకు అడ్డుకుంటోంది? నిజానికి నరవణే పుస్తకం వెలుగులోకి రాకుండా గత రెండేళ్లుగా కేంద్రం అడ్డుకుంటోంది. ఆ పుస్తకం ప్రచురించడానికి రక్షణమంత్రిత్వ శాఖ, విదేశాంగమంత్రిత్వ శాఖ ఇంత వరకూ పబ్లిషర్‌కు అనుమతినీయలేదు. 'నేను రాయాల్సింది రాశాను. ఇక ఆ పుస్తకాన్ని ఎలా విడుదల చేయాలో పబ్లిషరే తేల్చుకోవాలి' అని నరవణే అన్నారు. ఆ పుస్తకంలో తాను రాసిన అంశాలపై వస్తున్న వివాదం విషయమై కూడా ఆయన ఏ మాత్రం స్పందించలేదు. 'కారవాన్'లో వచ్చిన పుస్తక భాగాలపై కూడా ఆయన వ్యాఖ్యానించలేదు. అంటే తాను రాసిన వాటికి ఆయన కట్టుబడి ఉన్నట్లే కదా.

భారత్ చైనాల మధ్య సరిహద్దు ఘర్షణలు కొత్త కాదు. ఆ పొరుగు దేశంతో విభేదాలు యుద్ధానికి దారితీయడంలో నెహ్రూ ప్రభుత్వ తప్పిదాల గురించి అనేక పుస్తకాలు వచ్చాయి. చైనాతో యుద్ధం జరుగుతున్నప్పుడు అసోంను కోల్పోతామేమోనన్న ఆవేదనను నెహ్రూ వ్యక్తపరిచారు. 'నా హృదయం అసోం ప్రజల కోసం తపిస్తోంది..' అన్న ఆయన ఆవేదనాపూరిత వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. కాంగ్రెస్ హయాంలో జరిగిన అనేక తప్పిదాలు, సంభవించిన పరాజయాలు, వాటిల్లిన వైఫల్యాలను కప్పిపుచ్చడానికి ఎవరూ ప్రయత్నించలేదు. ఇవాళ కాంగ్రెస్ పార్టీ దేశ రక్షణ, భద్రత నుంచి అనేక విషయాల్లో ఆత్మరక్షణలో పడేందుకు, ఎన్నికల పరాభవాల నుంచి కోలుకోలేక పోతున్నందుకు అవే కారణం. మరి మోదీ హయాంలో ఇలాంటి విషయాలపై చర్చ జరిగేందుకు కూడా ఆస్కారం లేకుండా పోతోంది. ఏ చిన్న విజయం లభించినా ఉప్పొంగిపోయి, అమితోత్సాహం ప్రదర్శించి ప్రచారార్భాటాలు చేసేవారు జాతీయ ప్రాధాన్యమున్న వివాదాలపై చర్చించడానికి నిరాకరించడం దేనికి? జనరల్ నరవణే పుస్తకం బయటకు వచ్చి ఉంటే దానిపై కొద్ది రోజులు చర్చ జరిగి సమసిపోయివుండేది. గల్వాన్ లోయలో చైనా చొచ్చుకువస్తున్నప్పుడు 'మీకేది సముచితమో అదే చేయండి' అని ప్రధాన మంత్రి తనకు చెప్పారని రక్షణమంత్రి వెల్లడించినట్లు నరవణే రాశారు. ఆ సమయంలో జరిగిన ఘటన లేమిటో, ఎంతమందితో ఎన్ని చర్చల తర్వాత, ఎన్ని తర్జనభర్జనల తర్వాత ప్రధానమంత్రి సమస్యను ఆర్మీకే వదిలేయాలని అనుకున్నారో పార్లమెంటు సాక్షిగా వివరించడం సాధ్యం కాదు. అదే సమయంలో వివాదాన్ని పూర్తిగా తొక్కిపెట్టి పార్లమెంటులో ఎవరినీ గొంతెత్తనీయకుండా చేయడం కూడా రకరకాల అనుమానాలకు దారి తీస్తుంది.

నిజానికి బడ్జెట్ సమావేశాల్లో బడ్జెట్‌పై చర్చ జరగాలి. బడ్జెట్‌కు కొద్ది రోజులముందే యూరోపియన్ యూనియన్‌తో కుదిరిన 'సమస్త ఒప్పందాలకూ తల్లి' లాంటి ఒప్పందం కుదరడంపై సానుకూల చర్చ జరిగేందుకు వాతావరణం కల్పించాలి. అయితే నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై చర్చ రెండో రోజే నీరుకారిపోయింది. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన మూడో బడ్జెట్ ఇది. ఆదాయం రూ.36.5 లక్షల కోట్లు, ఖర్చులు రూ. 53.5 లక్షల కోట్లు కనుక దాదాపు రూ.12 లక్షల కోట్లు అప్పు చేయాలని, మిగతా మొత్తాన్ని ప్రజల నుంచి, పెట్టుబడుల ఉపసంహరణ నుంచి సేకరించాలని నిర్ణయించారు. మూలధన వ్యయం క్రింద రూ. 12.20 లక్షల కోట్లు కేటాయించడం, అందులో దాదాపు సగం రహదారి, రైల్ నెట్‌వర్క్‌కు మళ్లించడం, ఉత్పాదక రంగానికి చేయూత నివ్వడం, పారిశ్రామిక కారిడార్లను ప్రకటించడం, ఆహార ద్రవ్యోల్బణాన్ని తగ్గించే ప్రయత్నం చేయడం, గ్లోబల్ మార్కెట్‌లకు ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లకు అనువుగా దేశాన్ని సంసిద్ధం చేయాలనుకోవడం... ఇత్యాదులన్నీ మెరుపుల్లా కనిపించవచ్చు. అయితే ఇవేవీ ఒక్కసారి భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఉవ్వెత్తున పుంజుకునేలా చేయకపోవచ్చు. ఆర్థిక సర్వే సూచించిన నిర్మాణాత్మక సంస్కరణలపై విధాన నిర్ణయాలు తీసుకోలేకపోవచ్చు కాని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కొన్ని ప్రకటనలు చేసి తప్పించుకున్నట్లుగా కనపడుతోంది.

మార్కెట్ అనేది ప్రవాహం లాంటిది. దానికి ఎక్కడ అవరోధం కలిగినా మరో చోటికి ప్రవహిస్తుంది. తన దారిని తాను వెతుక్కుంటుంది. ట్రంప్ టారిఫ్‌లకు ప్రపంచం ఏమీ భయపడలేదు. అమెరికాను ఏకాకి చేసి దాని భాగస్వామ్య దేశాలు సైతం తమ వర్తక ఒప్పందాలను తాము కుదుర్చుకున్నాయి. భారత్‌తో యూరోపియన్ యూనియన్ కుదుర్చుకున్న ఒప్పందం అనేక వస్తువులపై జీరో టారిఫ్‌లు నిర్ణయించింది. చైనా, కెనడాలు కూడా తమ ఒప్పందాలు తాము కుదుర్చుకున్నాయి. దీనితో ట్రంప్ కూడా తన వైఖరి మార్చుకుని తన భాగస్వాములతో పోటీపడేందుకు భారత్‌పై విధించిన టారిఫ్‌లను 18శాతానికి తగ్గించక తప్పలేదు. అయితే రష్యా నుంచి చమురు కొనడాన్ని భారత్ మాని వేస్తుందని, 500 బిలియన్ డాలర్ల మేరకు వ్యవసాయం, ఇంధనం, టెక్నాలజీ, బొగ్గు ఇతర అనేక ఉత్పత్తులను తమ దేశం నుంచి కొనుగోలు చేస్తుందని ట్రంప్ ప్రకటించడంలో ఈ ఒప్పందం ప్రయోజనాలపై చర్చలు ప్రారంభమయ్యాయి. అమెరికాతో మోదీ రాజీపడ్డారని, ఈ ఒప్పందం వల్ల మన రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయని రాహుల్ అంటే ఈ చారిత్రక ఒప్పందం భారత ప్రజలకు బృహత్తర అవకాశాలు కల్పిస్తుందని వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఇరు దేశాల సంయుక్త వ్యాపార ఒప్పంద వివరాలు అధికారికంగా బయటకు వెల్లడి కానంత వరకూ సానుకూల, ప్రతికూల వాదనలు శ్రేయస్కరం కాదు. ఏమైనా 2026 సంవత్సరం ప్రారంభంలోనే మోదీ ప్రభుత్వం రెండు కీలక అంతర్జాతీయ ఒప్పందాలను కుదుర్చుకున్నది. ఇదొక పరిణామం, సందేహం లేదు. అయితే నరవణే పుస్తకం, ఎప్‌స్టీన్ ఫైల్స్ వంటి వివాదాల్లో చిక్కుకోవడమూ జరిగింది. ఈ పరిణామాల పర్యవసానాలు ఎలా ఉంటాయో ముందుముందు తెలుతుంది.

> **కాంగ్రెస్ హయాంలో జరిగిన తప్పిదాలు, సంభవించిన పరాజయాలు, వాటిల్లిన వైఫల్యాలను కప్పిపుచ్చడానికి ఎవరూ ప్రయత్నించలేదు. ఇవాళ ఆ పార్టీ అనేక విషయాల్లో ఆత్మరక్షణలో పడేందుకు, ఎన్నికల పరాభవాల నుంచి కోలుకోలేకపోవడానికి అవే కారణం. మరి మోదీ హయాంలో అలాంటి విషయాలపై చర్చ జరిగేందుకు ఆస్కారమే లేకుండా పోతోంది. ఏ చిన్న విజయం లభించినా ప్రచారార్భాటాలు చేసేవారు జాతీయ ప్రాధాన్యమున్న వివాదాలపై చర్చించడానికి నిరాకరించడం దేనికి?**



(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

క్యాన్సర్: అవగాహనే కాదు కార్యాచరణా అవసరమే

భారతదేశంలో క్యాన్సర్ నానాటికీ విస్తరిస్తోంది. ప్రతి ఏడాది 15 లక్షలకు పైగా కొత్త కేసులు నిర్ధారణ అవుతుండగా, దాదాపు 9 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. 2040 నాటికి ప్రతి ఏడాది కొత్త క్యాన్సర్ కేసుల సంఖ్య 20 లక్షలు దాటుతుందని, మరణాలు కూడా 12 నుంచి 15 లక్షల వరకు పెరుగుతాయని అంచనా. ప్రస్తుతం ప్రతి 9 మంది భారతీయుల్లో ఒకరికి జీవితకాలంలో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. సమస్యను మరింత తీవ్రం చేస్తున్న అంశం– 60 శాతం కంటే ఎక్కువ రోగులు క్యాన్సర్ పురోగతి దశల్లో చికిత్సకు వస్తున్నారు. ఈ దశలో చికిత్స అవకాశాలు పరిమితంగా ఉంటాయి. జీవనావధి ఫలితాలు కూడా ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. ప్రతి అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం రోజున, మనం అవగాహన గురించి మాట్లాడతాం. కానీ రోగులు వ్యాధి పట్ల భయంతో, నిర్లక్ష్యంతో చికిత్సకు ఆలస్యంగా వస్తున్నారు. అవగాహన మాత్రమే సరిపోవడం లేదు. ఇప్పుడు భారత్‌కు కావలసింది నిర్ణయాత్మకంగా పాటించే చర్యలు.

ఈ సంవత్సరం అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవ థీమ్ 'యునైటెడ్ బై యూనిక్'. ప్రామాణికమైన, ఫలితమిచ్చే చర్యల వైపు అడుగులు వేయమని ఇది దేశాలకు సూచిస్తోంది. ఈ థీమ్ ప్రతి క్యాన్సర్ ప్రయాణం ప్రత్యేకమని గుర్తించి, రోగుల అనుభవాలు, విధానాలను నిర్ణయించడంలో మార్గదర్శకంగా ఉండాలని కోరుతోంది. మాటల నుంచి నిజమైన అమలుకు మార్పుగా, ప్రకటనల నుంచి బాధ్యతాయుత చర్యలకు మారవలసిన అవసరాన్ని ఈ థీమ్ సూచిస్తోంది.



> **క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం లక్ష్యంగా పెట్టుకోవాలి. జిల్లా స్థాయిలో నిర్ధారణ, రిఫరల్ సేవలు అందుబాటులో ఉండాలి. అవగాహన నుంచి కార్యాచరణ వైపు దృఢంగా ముందుకు సాగాలి. భారతదేశం స్పష్టమైన లక్ష్యాలు, కాలపరిమితులను నిర్ధారించుకోవాలి.**

మన దేశంలో క్యాన్సర్ చికిత్సకు ఇప్పటికే శక్తిమంతమైన సౌకర్యాలు ఉన్నాయి. ఆయుష్మాన్ భారత్ పథకం లక్షల మందికి అధిక వైద్య ఖర్చులు తగ్గించడంలో కీలకంగా నిలిచింది. నిధులు అందించడం మాత్రమే కాదు; క్యాన్సర్‌ను ముందస్తు నివారణ, ప్రారంభ దశలోనే గుర్తించాల్సి ఉంది. ఆయుష్మాన్ భారత్ కింద ఉన్న హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్స్ క్రమ పద్ధతిలో క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించాలి. రాష్ట్రాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ సమగ్రంగా అమలు కావడం లేదు. శిక్షణ లోపాలు, బలహీనమైన రిఫరల్ వ్యవస్థలు, పర్యవేక్షణ లోపం ఉంటోంది.

క్యాన్సర్, డయాబెటిస్, హృదయ సంబంధ వ్యాధులు, స్ట్రోక్‌ల నివారణ– నియంత్రణ కోసం జాతీయ కార్యక్రమం(ఎన్‌పీసీడీసీఎస్) ఒక బలమైన రూపురేఖను అందిస్తున్నది. అయితే, అమలు సరిగా జరగని కారణంగా దాని ప్రభావం తగ్గింది. ఎన్‌పీసీడీసీఎస్‌ను ఆయుష్మాన్ భారత్‌తో అనుసంధానం చేయాలి. దీంతో ప్రాథమిక వైద్యం నుంచి జిల్లా ఆసుపత్రులు, తృతీయ స్థాయి కేంద్రాలకు నిరవధిక రిఫరల్ వ్యవస్థ అందుబాటులో ఉంటుంది. స్క్రీనింగ్ చేయించుకున్న ప్రతి వ్యక్తికీ అనుమానం నుంచి నిర్ధారణ వరకు, అక్కడి నుంచి చికిత్స వరకు– స్పష్టంగా అనుసరించగల మార్గం ఉండాలి.

పెద్ద నగరాల్లోని ఆసుపత్రుల మీద మాత్రమే భారత్ ఆధారపడకూడదు. జిల్లా ఆసుపత్రులు నిజమైన క్యాన్సర్ కేంద్రాలుగా పనిచేయాలి. ఇందుకు– అంకాలజీ ప్రాథమిక విషయాల్లో శిక్షణ పొందిన డాక్టర్లు కావాలి; పాథాలజీ, ఇమేజింగ్ సేవలు పనిచేయాలి; జిల్లా ఆసుపత్రులు, పెద్ద ఆసుపత్రులతో టెలికాన్సర్ బోర్డ్స్ ద్వారా శిక్షణ కావాలి; రిఫరల్ ఎలా చేయాలో స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలి. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించి, సరైన కేంద్రానికి రిఫర్ చేయగల సామర్థ్యం ఉండాలి. ఇలా చేయడం ప్రాణనష్టాన్ని తగ్గిస్తుంది.

'యునైటెడ్ బై యూనిక్' అనే భావన క్యాన్సర్ సంరక్షణ కేవలం వైద్యపరమైనదే కాదు, అది లోతైన మానవీయత అంశమని మనకు గుర్తుచేస్తుంది. భయం, అపఖ్యాతి (స్టిగ్మా), అయోమయం, ఆర్థిక ఆందోళనలు వంటివి, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు రాకుండా రోగులను వెనక్కు తగ్గేలా చేస్తాయి. ప్రజాకేంద్రీకృత సంరక్షణ అంటే– నిజాయితీతో కూడిన, కరుణాత్మక సంభాషణ; విభిన్న వైద్య నిపుణుల సమూహ చర్చ ద్వారా నిర్ణయాలు; చికిత్సతో పాటు మానసిక, సామాజిక మద్దతు అందించడం; సమాచారంతో కూడిన నిర్ణయ స్వేచ్ఛకు గౌరవం ఇవ్వడం... వీటితో ఫలితాలు మెరుగుపడతాయి.

క్యాన్సర్ ఫలితాలను మెరుగుపరచడంలో బలమైన క్యాన్సర్ రిజిస్ట్రీలు కీలకం. రోగుల సమాచారం, క్యాన్సర్ సంభవించే భౌగోళిక ధోరణులు, క్యాన్సర్ రకాలపై తులనాత్మక విశ్లేషణ ద్వారా ప్రమాద కారకాలను అంచనా వేయడం, వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నవారిని గుర్తించడంతో పాటు క్యాన్సర్ నివారణ, స్క్రీనింగ్ కార్యక్రమాలను ప్రణాళిక చేయడం సాధ్యమవుతుంది. ప్రస్తుతం దేశంలో కేవలం 38 జనాభా ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీలు (PBCRs) మాత్రమే ఉన్నాయి. ఇవి దేశ జనాభాలో కేవలం 10శాతం మందిని మాత్రమే కవర్ చేస్తున్నాయి. విచారకరమైన విషయం ఏమిటంటే, వీటిలో ఎక్కువ భాగం పట్టణ ప్రాంతాల్లోనే ఉండగా, గ్రామీణ ప్రాంతాలకు అంకితమైనవి కేవలం రెండు మాత్రమే. సేకరించే డేటా నాణ్యతను నిర్ధారించడంలో ఈ రిజిస్ట్రీలు నిధుల కొరత కారణంగా పరిమితులు ఎదుర్కొంటున్నాయి. ఆంధ్రప్రదేశ్, హర్యానా, ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్, ఒడిశా, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికీ జనాభా ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీ ఒక్కటి కూడా లేదు. ఆసుపత్రుల్లో నమోదయ్యే క్యాన్సర్ రోగుల వివరాలకే పరిమితమైన 268 ఆసుపత్రి ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీలు ఉన్నా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని PBCRలను ఏర్పాటు చేసి, సమర్థవంతంగా పనిచేయించాలి.

ఆరోగ్యం, కుటుంబ సంక్షేమంపై పార్లమెంటరీ స్థాయి కమిటీ 2022 సెప్టెంబర్‌లో క్యాన్సర్‌ను 'నోటిఫైయబుల్ వ్యాధి'గా వర్గీకరించాలని సిఫార్సు చేసింది. అయితే, ఇది ఇప్పటివరకు వాస్తవరూపం దాల్చలేదు. క్యాన్సర్‌ను 'గుర్తించదగిన వ్యాధి'గా ప్రకటించడం వల్ల క్యాన్సర్ మరణాలపై బలమైన, సమగ్ర డేటాబేస్‌ను ఏర్పాటు కావడమే కాకుండా, దేశంలో ఈ వ్యాధి సంభవించే స్థాయి, వ్యాప్తిని కచ్చితంగా నిర్ధారించడంలో సహాయపడుతుంది. భారతదేశం స్పష్టమైన లక్ష్యాలు, కాలపరిమితులను నిర్ధారించుకోవాలి. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం లక్ష్యంగా పెట్టుకోవాలి. జిల్లా స్థాయిలో నిర్ధారణ, రిఫరల్ సేవలు అందుబాటులో ఉండాలి. క్యాన్సర్ చికిత్స కారణంగా కుటుంబాలు ఎదుర్కొనే తీవ్రమైన ఆర్థిక భారాన్ని నివారించాలి.

క్యాన్సర్‌పై అవగాహన ప్రజల్లోకి ఇప్పుడిప్పుడే వెళ్తోంది. ఇకపై మన ప్రతిస్పందనను నిర్వచించాల్సింది కార్యాచరణే. ప్రతి క్యాన్సర్ ప్రయాణం ప్రత్యేకమైనదని మనం విశ్వసిస్తే, ప్రారంభ దశలో గుర్తించి కాపాడిన ప్రతి జీవితం మన విజయానికి కొలమానం కావాలి. భారతదేశం అవగాహన నుంచి కార్యాచరణ వైపు దృఢంగా ముందుకు సాగాలి.



● డా. పి.రఘురామ్
వ్యవస్థాపక డైరెక్టర్
కిమ్స్–ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్
(నేడు అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం)

ఆంధ్రకు మేలు చేసిన కేంద్ర బడ్జెట్

సంవత్సర కాలంగా పట్టిపీడిస్తున్న భౌగోళిక రాజకీయ, ఆర్థిక అనిశ్చితుల నుంచి భారతదేశాన్ని రక్షించుకోవడానికి చేసిన ప్రయత్నంగా నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూడాలి. గందరగోళంలో పడ్డ ఐటీ రంగం; ట్రంప్ హెచ్1బి సమస్యలు; ఉత్పాదక రంగంలో తగ్గిన వృద్ధి, తగ్గిన పన్ను ఆదాయం; అమెరికా, చైనా ఆంక్షలు, ట్రంప్ టారిఫ్‌లు వంటి సమస్యలతో, గత 20 ఏళ్లుగా భారతదేశం అంతగా అలవాటుపడని పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలు వెతికిన కేంద్ర బడ్జెట్ ఇది. అమెరికా దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాల్సిన తక్షణ అవసరాన్ని గుర్తించిన బడ్జెట్ ఇది.

దేశ ఆదాయం తగ్గింది. ఫలితంగా ప్రధాన రంగాల మీద పెట్టిన వ్యయం కూడా తగ్గింది. అంచనా వేసిన 14.38 లక్షల కోట్ల రూపాయల నుంచి ఆదాయపు పన్ను వసూళ్లు 1.26 లక్షల కోట్లు తక్కువ. జీఎస్టీ శ్లాబుల తగ్గింపుతో, 1.31 లక్షల కోట్ల రూపాయల లోటు ఏర్పడింది. కేవలం కార్పొరేట్ పన్నుల ద్వారా అదనంగా వచ్చిన రూ.27,000 కోట్లు, ఎక్సైజ్ పన్నుల ద్వారా అదనంగా వచ్చిన రూ.19,500 కోట్లు, కస్టమ్స్ సుంకాల ద్వారా అదనంగా వచ్చిన రూ.18,250 కోట్లు మాత్రమే ప్రభుత్వానికి ఊరటనిచ్చాయి. ఫలితంగా, 2025–26 బడ్జెట్‌లో అంచనా వేసిన మొత్తం వ్యయం రూ.1,00,503 కోట్లు తక్కువగా ఉంది. మూలధన వ్యయం కూడా రూ.25,335 కోట్లు తక్కువగా ఉంది. విద్య, వ్యవసాయం వంటి రంగాలలో రూ.6,300 కోట్లు తక్కువ ఖర్చు చేశారు. గ్రామీణాభివృద్ధి వ్యయం రూ.53,067 కోట్లు, పట్టణాభివృద్ధి వ్యయం రూ.39,573 కోట్లు తక్కువగా ఉన్నాయి. ఆరోగ్యంపై వ్యయం కూడా రూ.3,686 కోట్లు తక్కువగా ఉంది.

భారతదేశానికి ఇరవయ్యేళ్ళుగా సురక్షితమైన రంగంగా ఉన్న ఐటీ– అకస్మాత్తుగా గందరగోళంలో పడింది. ట్రంప్ విధించిన హెచ్1బి ఆంక్షల వల్ల భారత ఐటీ నిపుణులు నిజంగానే కొంత ప్రాభవాన్ని కోల్పోయారు. జీఎస్టీ శ్లాబులను తగ్గించినా ఉత్పాదక రంగంలో ఎలాంటి వేగవంత వృద్ధీ కనిపించలేదు. దీంతో ప్రభుత్వానికి పన్ను ఆదాయం తగ్గింది.

ఆర్థిక మంత్రి దేశీయ బలహీనతలను పరిష్కరించడానికి ప్రయత్నించారు. ఇప్పటివరకు దృష్టి పెట్టని కొత్త రంగాలపై దృష్టి సారించారు. ఖాదీ, చేనేతతో సహా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను (MSME) లక్ష్యంగా చేసుకుని సమన్వయం చేసే ప్రయత్నం చేశారు. వస్త్రాలు, బయో ఫార్మా, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, రసాయనాలు, క్యాపిటల్ గూడ్స్, కంటైనర్లు మొదలైన ఏడు రంగాలకు మద్దతు ఇవ్వడం, ఇటీవలి సంవత్సరాలలో అంతగా విజయవంతం కాని 'ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల'ను దాటి ముందుకు వెళ్లడానికి చేసిన ఒక మంచి ప్రయత్నం. బడ్జెట్‌లో వస్త్ర, తోలు, సముద్ర ఉత్పత్తుల రంగాలకు మద్దతు ఇచ్చే చర్యలు, యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలు నేపథ్యంలో చేసిన ప్రయత్నంగా చూడాలి.

సెమీకండక్టర్ మిషన్ 2.0కు మద్దతు ఇవ్వడం ప్రపంచ వాల్యూ చెయిన్లపై, ముఖ్యంగా చైనా, అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించడానికి చేసిన ప్రయత్నం. ఎలక్ట్రానిక్స్ విడిభాగాలు, అసెంబ్లింగ్ పరిశ్రమలకు మద్దతు ఇవ్వడం స్పష్టంగా చైనాపై ఆధారపడటాన్ని తగ్గించడానికి ఉద్దేశించినది. అరుదైన ఖనిజాల విషయంలో కూడా ఇదే పరిస్థితి. దీనికోసం మంత్రి ఖనిజ సంపన్న రాష్ట్రాలైన ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ గుండా వెళ్లే ఒక ప్రత్యేక "అరుదైన ఖనిజాల భూముల కారిడార్" పథకాన్ని తెచ్చారు. ఇది అరుదైన ఖనిజాల తవ్వకం, ప్రాసెసింగ్, తయారీని ప్రోత్సహిస్తుంది. బ్యాటరీ నిల్వ కోసం లిథియం అయాన్ సెల్స్‌పై పన్ను మినహాయింపులు కూడా చైనాపై ఆధారపడటాన్ని తగ్గించడానికి ప్రతిపాదించినవే.

2026–27 కేంద్ర బడ్జెట్‌లో, ఉత్పత్తి రంగ పునరుజ్జీవనం కోసం కొత్త రంగాలపై దృష్టి సారించినా, ఆంధ్రప్రదేశ్‌కు సరైన వాటా లభించినట్లే కనిపిస్తోంది. అరుదైన ఖనిజ భూముల కారిడార్ వెళ్లే రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా ఉండటం మన అదృష్టం. అయితే, దానికి బడ్జెట్‌లో ప్రాధాన్యం లభించడం... కీలక ఖనిజాల తవ్వకం–ప్రాసెసింగ్–పరిశోధనలో శ్రమశక్తి ఆధారిత ఉద్యోగాలను సృష్టిస్తుంది. ఈ పథకం కోసం కేటాయించిన రూ.7,280 కోట్లలో ఆంధ్రప్రదేశ్‌కు గణనీయమైన వాటా లభించనుంది. అధిక వేగవంతమైన రైలు అనుసంధానం... దక్షిణాది ఎంతగా అభివృద్ధి చెందిందో, మరింత వేగవంతమైన అనుసంధానం ఎంత అవసరమో తెలియజేస్తుంది. కొత్తగా ప్రకటించిన ఏడు హై–స్పీడ్ రైలు కారిడార్లలో హైదరాబాద్–బెంగళూరు, చెన్నై–బెంగళూరు కారిడార్ల ద్వారా రాష్ట్రం బహుళ ప్రయోజనం పొందుతూ ఆంధ్రప్రదేశ్‌లోని కీలక ప్రాంతాలైన రాయలసీమ, కోస్తాంధ్రల గుండా వెళ్తూ రాష్ట్రాన్ని మిగతా దేశంతో అనుసంధానించడాన్ని మెరుగుపరుస్తాయి.

నవంబర్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రకటించిన సెమీ కండక్టర్ పరిశ్రమకు ఇప్పుడు క్రమబద్ధమైన నిధులు లభించాయి. ప్రకటించిన రూ.40,000 కోట్లలో ఆంధ్రప్రదేశ్‌కు మంచి వాటా లభిస్తుంది. ఇప్పుడు నిధులు ఖరారు కావడంతో, అమరావతిలోని క్వాంటం వ్యాలీ, విశాఖపట్నంలో రాబోతున్న అనేక కోడింగ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని సెమీ కండక్టర్ పరిశ్రమ కూడా, రాష్ట్రంలో గొప్ప సాంకేతిక ఎకో సిస్టం అభివృద్ధి చేయడంలో తోడ్పడుతుంది. డేటా సెంటర్లకు 2047 వరకు పన్ను మినహాయింపు... విశాఖపట్నానికి ఒక పెద్ద వరం. విశాఖ ఇప్పటికే డేటా సెంటర్ల రాజధానిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ఈ పన్ను మినహాయింపు వల్ల మరిన్ని కంపెనీలు ఈ రంగంలో చేరడంతో, ఒక బృహత్ ఎకో సిస్టం ఆవిష్కృతమవుతుంది.

బడ్జెట్‌లో వస్త్ర పరిశ్రమపై దృష్టి పెట్టి, పదివేల కోట్లు కేటాయించడం వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని భారీ వస్త్ర క్లస్టర్‌లకు ప్రయోజనం చేకూరుతుంది. 200 ఎంఎస్‌ఎంఈ క్లస్టర్లను ప్రారంభించే పథకం ఆంధ్రప్రదేశ్‌కు దాని వాటా పారిశ్రామిక క్లస్టర్లతో సహాయపడుతుంది. పర్యాటక రంగానికి సంబంధించి, తూర్పు కనుమలలోని అరకు లోయను ట్రెక్కింగ్, హైకింగ్ కోసం ప్రపంచ స్థాయి, పర్యావరణ అనుకూల పర్వత మార్గాలలో భాగంగా గుర్తించారు. ఆంధ్రప్రదేశ్–తమిళనాడు సరిహద్దులోని పులికాట్ సరస్సు వెంట మూడు పక్షుల వీక్షణ మార్గాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయరంగ మద్దతు విషయానికొస్తే, ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతంగా పండించే జీడిపప్పు, కోకో, కొబ్బరి కోసం ఉత్పత్తి, విలువ గొలుసులను పెంచడానికి నిధులు కేటాయించారు. అంతర్గత జలమార్గ కేంద్రాల రవాణా పథకంతో 974 కిలోమీటర్ల తీరప్రాంతం ఉన్నందున ఆంధ్రప్రదేశ్ స్పష్టంగా ప్రయోజనం పొందుతుంది. పోలవరం వంటి ఇప్పటికే ఉన్న పథకాలకు రూ.3200 కోట్ల కేటాయింపు లభించింది. రాజధాని అమరావతికి ఏడీబీ, మొదలైన వాటి నుంచి సుమారు రూ.1500 కోట్లు లభించాయి.

ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్ దేశానికి, ఆర్థిక మంత్రికి ఒక సవాలుగా మారింది. ప్రపంచంలో మన దేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడానికి కావాల్సిన అన్ని లక్షణాలను పెంపొందించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. కేంద్ర ప్రభుత్వం ఆ నిజాన్ని గుర్తించింది. నిర్మలా సీతారామన్ ఆ దిశగా ఒక అడుగు వేశారు.

> **ఆర్థిక మంత్రి కేంద్ర బడ్జెట్‌లో దేశీయ బలహీనతలను పరిష్కరించడానికి ప్రయత్నించారు. ఇప్పటివరకు దృష్టి పెట్టని కొత్త రంగాలపై దృష్టి సారించారు. ఖాదీ, చేనేతతో సహా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను లక్ష్యంగా చేసుకుని సమన్వయం చేసే ప్రయత్నం చేశారు.**



■ నీలాయపాలెం విజయ్‌కుమార్
తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

బుధవారం 4 ఫిబ్రవరి 2026



కొండవీడుపై లుక్కు..

కోటయ్యకేదీ దిక్కు



- ఉత్సవాలపై శ్రద్ధ.. తిరునాళ్లపై అశ్రద్ధ
- రాష్ట్ర ప్రభుత్వ వివక్షపై భక్తుల ఆగ్రహం
- ఏళ్లుగా తిరునాళ్ల బకాయిలు రూ.4.20 కోట్లు
- రాష్ట్ర పండుగ హోదాకే కోటయ్య తిరునాళ్లు పరిమితం
- నేడు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమీక్ష

కోటయ్య తిరునాళ్లలో విద్యుదీకరణ కీలకం. ఇందుకు సంబంధించి రూ.44 లక్షలతో అంచనాలను అర్‌అండ్‌బీ, ట్రాన్స్‌కో అధికారులు రూపొందించగా ఇంతవరకు ఆమోదించలేదు. మూడేళ్లుగా విద్యుదీకరణ బకాయిలు రూ.1.10 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఈ ఏడాది విద్యుత్ దీపాల ఏర్పాటుకు కాంట్రాక్టరు ముందుకు రావడంలేదని సమాచారం.

కోటప్పకొండకు ఉన్న దాదాపు 15 రోడ్లకు మరమ్మతులకు రూ.40 లక్షలు వ్యయం అవుతుందని పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు అంచనా వేసి జిల్లా పరిషత్‌కు నివేదించారు. నిధులపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. రెండేళ్లుగా రూ.80 లక్షల బకాయిలు పేరుకు పోయి ఉన్నాయి. నిధుల కొరతతో రోడ్ల మరమ్మతులను సదరు శాఖ నేటికి ప్రారంభించలేదు.

కొండవీడుకు రూ. కోటి .. కోటప్పకొండకు శూన్యం

కోరితే చాలు.. కోర్కెలు తీర్చే కోటయ్య స్వామి కి నిధులు కష్టాలు వెంటాడుతున్నాయి. దేశ ప్రసిద్ధి చెందిన కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా ఉంది. అయితే పేరుకు హోదా ప్రకటించారే కాని నిధులు విడుదల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఇదే సందర్భంలో కోటప్ప కొండ సమీపంలో కొండవీడులో జరిగే ఉత్సవాలకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూ.కోటి విడుదల చేసింది. జాతీయ స్థాయి ప్రసిద్ధి చెందిన తిరునాళ్లకు నిధులను విస్మరించిన ప్రభుత్వం స్థానికంగా జరిగే ఉత్సవాలపై ప్రత్యేక శ్రద్ధ చూపడం పై అటు అధికారులు, ఇటు భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా కోటయ్య క్షేత్రానికి లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లకు నిధులు లేక అధికారులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నా పాలకులు పట్టించు కోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. తిరు నాళ్లకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రూ.4.20 కోట్లకు చేరాయి. అధి కారంలో ఎవరున్నా నిధులు అంశాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా తిరునాళ్లకు నిధుల కేటాయింపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని భక్తులు ఆశిస్తున్నారు. బుధవారం కోటప్ప కొండలో తిరునాళ్ల ఏర్పాట్లపై జరిగే సమీక్షలో అయినా నిధులు విడుదల సమస్యకు పరిష్కారం చూపాలని భక్తులు కోరుతున్నారు.



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

చిలకలూరిపేట.. నరసరావుపేట.. గుంటూరు మధ్యలో కొండవీడు ఉత్సవాలకు సిద్ధమవుతోంది. ఆ సమీపంలోని కోటప్పకొండలో త్రికోటేశ్వరస్వామి తిరునాళ్లకు గడువు సమీపిస్తోంది. అయితే కొండవీడు ఉత్సవాలకు ఇస్తున్న ప్రాధాన్యం కోటప్పకొండ తిరునాళ్లకు ప్రభుత్వం ఇవ్వడంలేదన్న విమర్శలున్నాయి. ఈ నెల 7, 8 తేదీల్లో జరిగే కొండవీడు ఉత్సవాలకు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసింది. అయితే ఈ నెల 15న కోటయ్య క్షేత్రంలో జరిగే తిరునాళ్లకు మాత్రం రూపాయి కూడా విడుదల చేయలేదు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా 6 నుంచి 7 లక్షల వరకు భక్తులు కోటప్పకొండ తిరునాళ్లకు తరలి వస్తుంటారు. అయితే ఇంతవరకు వారికోసం కోటప్పకొండలో చేయాల్సిన ఏర్పాట్లకు నిధులు మంజూరు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొండవీడులో జరిగే ఉత్సవాలకు రెండు రోజుల్లో 20 వేలకు మించి పర్యాటకులు వచ్చే పరిస్థితి లేదు. అయినా నిధులు విడుదలలో ఇదేమి వివక్ష అంటూ (మిగతా 8వ పేజీలో)

మిర్చియార్డు పాలకవర్గ నియామకం

- చైర్మన్‌గా అప్పారావు, వైస్ చైర్మన్‌గా మల్లిక
- ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయంతో సభ్యుల ఎంపిక
- ముఖ్యమంత్రి ఆమోదంతో మార్కెటింగ్ శాఖకు ఆదేశాలు
- 6వ తేదీ సాయంత్రం లోపు జీవో విడుదల చేయాలని సూచన



8

వైద్య విజ్ఞానం.. ప్రదర్శన

- నేటి నుంచి గుంటూరులో మెడ్‌ఫ్యూజన్-26
- వైద్య కళాశాలలో ఏర్పాటు.. ప్రారంభించనున్న మంత్రి సత్యకుమార్

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గతంలో వైద్య విద్యార్థులకు మాత్రమే పరిమితమైన వైద్య విజ్ఞానం అందరి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. గుంటూరు వైద్య కళాశాలలో బుధవారం నుంచి మెడ్‌ఫ్యూజన్-26 పేరుతో ఈ సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం కానుంది. జీఎంసీలో మూడు దశాబ్దాల తర్వాత ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. మారిన కాలానికి అనుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఆకర్షణీయంగా, వినోదాత్మకంగా, విజ్ఞానదాయకంగా మెడ్‌ఫ్యూజన్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ ప్రదర్శనను ప్రారంభించనున్నారు. ప్రదర్శన ప్రతి రోజూ ఉదయం 9 నుంచి రాత్రి 7 వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనను తిలకించే వారు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలన్నారు. ఈ బుకింగ్ ప్రక్రియను ప్రారంభించారు. విజ్ఞాన ప్రదర్శన కోసం ఇప్పటికే 35 వైద్య విభాగాలలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి నేతృత్వంలో ఇప్పటికే దాదాపు విజ్ఞాన ప్రదర్శన పనులు పూర్తయ్యాయి. ప్రదర్శన తిలకించేందుకు వచ్చే సందర్శకుల కోసం పలు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కాలేజీ ఆవరణలో షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేశారు. అల్పాహార స్టాల్స్‌తో పాటు వైద్య సేవల కోసం ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సందర్శకుల రద్దీని నియంత్రించేందుకు, లోపల వివిధ స్టాల్స్ గురించి వివరించేందుకు పెద్ద సంఖ్యలో మెడికోలను వలంటీర్లుగా నియమించారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు విజ్ఞాన ప్రదర్శన కొనసాగనున్నది.



ప్రదర్శనకు సిద్ధమైన బయోకెమిస్ట్రీ విభాగం

ఆ ఐదు షాపులకు వేలం

- అధికారులను ఆదేశించిన కమిషనర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కొల్లి శారద హోల్ సేల్ కూరగాయల మార్కెట్‌లోని ఐదు షాపులకు తక్షణం వేలం నిర్వహించాలని జీఎంసీ కమిషనర్ కే మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆంధ్రజ్యోతి జిల్లా సంచికలో 'సమాంతర మార్కెట్‌కు తెరపడేనా' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై కమిషనర్ స్పందించారు. ఐదు షాపులకు ఎందుకు వేలం నిర్వహించలేదని అధికారులను ప్రశ్నించగా వారిచ్చిన సమాధానంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. గత కమిషనర్ నిర్ణయం మేరకు ఆ షాపులను పక్కన పెట్టామని అధికారులు సమాధానం ఇచ్చారు. మార్కెట్లో ఐదు షాపులకు కూడా ఆక్షన్ పెడుతున్నట్లు టెండర్లు పిలవాలని అధికారులను ఆయన ఆదేశించారు. మరోమారు ఇటువంటి తప్పులు చేయొద్దని కమిషనర్ హెచ్చరించారు. ఇటువంటివి పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

దూరవిద్యలో.. చూసిరాత

- ఏఎన్‌యూ పరీక్షల్లో యథేచ్ఛగా కాపీయింగ్
- పలు కళాశాలల్లో వెలుగుచూస్తోన్న అక్రమాలు



గుంటూరు(విద్య) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పరీక్షలను అపహాస్యం చేస్తూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) దూరవిద్య పరీక్షల్లో యథేచ్ఛగా కాపీయింగ్ జరుగుతోంది. సెల్‌ఫోన్‌లో చూస్తూ కొందరు పరీక్షలు రాస్తుండగా.. అసలు విద్యార్థులు కాకుండా ఇతరులతో పరీక్షలు రాయిస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. తనిఖీల్లో పలు అక్రమాలను వర్సిటీ బృందాలు గుర్తించాయి. అయినా యథేచ్ఛగా అక్రమాలు కొనసాగుతున్నాయి. గత నెల 31 నుంచి రెండో విడత యూజీ, పీజీ, డిప్లొమా సర్టిఫికెట్ కోర్సులకు సంబంధించి సెమిస్టర్ పరీక్షలు వర్సిటీ పరిధిలోని పలు కేంద్రాలు జరుగుతున్నాయి. కొన్ని కళాశాలల్లో కాపీయింగ్ చేస్తూ విద్యార్థులు స్క్వాడ్ తనిఖీల్లో పట్టుబడ్డారు. మరికొన్ని కేంద్రాల్లో పరిశీలకులు లేకుండానే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. స్క్వాడ్ సభ్యులు అక్రమ వసూళ్లకు పాల్పడుతూ అక్రమాలపై చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గుంటూరు నగరంలో ఓ ఆచార్యురాలు భాగస్వామిగా ఉన్న కళాశాల కేంద్రంలో విద్యార్థులు సెల్‌ఫోన్ల సహాయంతో పరీక్షలు రాస్తున్నట్లు తనిఖీల బృందాలు గుర్తించినట్లు సమాచారం. సెల్‌ఫోన్‌లో పరీక్షలు చూసిరాస్తున్న విద్యార్థుల వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. పల్నాడు జిల్లాలో ఓ ఉన్నతాధికారి బినామీగా ఉన్న ప్రిన్సిపాల్‌కు చెందిన కళాశాలలో కూడా యథేచ్ఛగా అక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం. వర్సిటీ పరీక్షా భవనంలో మోనార్క్‌గా ఉన్న ఓ వ్యక్తికి సంబంధించిన కళాశాలలో కాపీయింగ్ పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.5 వేలు వరకు వసూలు చేశారని సమాచారం. కొందరు విద్యార్థుల స్థానంలో ఇతరులతో పరీక్షలు రాయిస్తున్న ఘటనలు కూడా వెలుగు చూసినట్లు తెలుస్తోంది. వర్సిటీ అధికారుల బినామీగా ప్రచారంలో ఉన్న కళాశాలలో విద్యార్థులు లేకుండానే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వర్సిటీకి కొంత దూరంలోని కొన్ని కేంద్రాల్లో కూడా కాపీయింగ్ జరుగుతున్నట్లు సమాచారం. ఈ అక్రమాలపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.





సెల్‌ఫోన్‌లో చూసి కాపీయింగ్‌కు పాల్పడుతున్న విద్యార్థినులు

క్వారీ తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు

సమీక్షలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల ఆదేశాలు

చేబ్రోలు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని వడ్లమూడి బాలకోటేశ్వరస్వామి(క్వారీ) తిరునాళ్లకు విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. క్వారీలోని ఆలయం వద్ద మంగళవారం వివిధ శాఖల అధికారులతో తిరునాళ్ల ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పునరుద్ధరణకు రూ.4 నుంచి ఐదు కోట్లు మంజూరు చేసేందుకు మంత్రి హామీ ఇచ్చారన్నారు. దాదాపు లక్షన్నర మందికి పైగా భక్తులు తిరునాళ్లకు వచ్చే అవకాశం ఉందనే అంచనాతో అధికారులు ఏర్పాట్లు, జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శన ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రసాదాలుల వితరణ చేసే దాతలు ముందుగానే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. 500మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎస్పీ జనార్ధన్‌రావు తెలిపారు. 24 గంటలు ఆలయం వద్ద నిఘా, రక్షణ వ్యవస్థ అందుబాటులో ఉంటుందన్నారు. 13న ఆలయం వద్ద పొంగళ్లు, పశువుల ప్రదక్షిణకు, 14న వాహన పూజలకు అనుమతి ఇస్తామని ఈవో నరసింహ తెలిపారు. అనంతరం తిరునాళ్ల పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.



క్వారీ తిరునాళ్ల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెలే నరేంద్ర, అధికారులు



పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

తప్పులు లేకుండా జారీ చేయాలి

- పాసుపుస్తకాల పంపిణీ తనిఖీలో కలెక్టర్ అన్సారియా

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పాసు పుస్తకాలలో తప్పుగా నమోదైతే రైతులకు ఫారం అందించి వివరాలు తీసుకుని మళ్లీ తప్పులు లేకుండా జారీ చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. మండలంలోని గుడివాడలో పాసు పుస్తకాల పంపిణీని మంగళవారం కలెక్టర్ తనిఖీ చేశారు. గ్రామ సచివాలయంలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందజేశారు. సర్వేలో కొద్ది సెంట్ల తేడాతో భూములు నమోదు అవుతున్నాయని, ఆమె దృష్టికి రైతులు తెచ్చారు. ఎంత భూమి అయితే ఉందో అంత విస్తీర్ణం నమోదయ్యేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను కలెక్టర్ ఆదేశించారు. సర్పంచ్ యడ్లపాటి రాకేశ్, సొసైటీ అధ్యక్షుడు కావూరి చంద్రమోహన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



తెనాలి మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న మంత్రులు సత్యకుమార్, మనోహర్, ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్ గౌర్

8

కంటి ఇబ్బందితో చదువు ఆగకూడదు

- 95 వేల మంది చిన్నారులకు ఉచితంగా కళ్లజోళ్లు
- మంత్రులు సత్యకుమార్, మనోహర్
- తెనాలిలో రాష్ట్రవ్యాప్త ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభం

2027 నాటికి రైతులందరికీ

ప్లాట్లు..!



- పెండింగులో ఉన్న ప్లాట్ల పంపిణీకి కసరత్తు
- రిజిస్ట్రేషన్ కోసం ఏపీ సీఆర్డీఏ యాక్షన్ ప్లాన్ సిద్ధం
- హద్దురాళ్లు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళిక

8

6 నుంచి అంతర్జాతీయ నాటక మహోత్సవం

ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, నాటక పరిషత్ సభ్యులు

● నాటక వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు శ్రీ వేంకటేశ్వర విజ్ఞానమందిరంలో ఈ నెల 6 నుంచి 10వ తేది వరకు భారత్‌రంగ్ అంతర్జాతీయ నాటక మహోత్సవం నిర్వహిస్తున్నట్టు నాటక వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు తెలిపారు. తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన సంఘం వేదిక (యడ్లపాడు), నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా-ఢిల్లీ వేదిక (ఎన్‌ఎస్‌ఈ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన చెప్పారు. గుంటూరు అరండల్ పేటలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. నాటి సంప్రదాయాల్ని నేటి సాంకేతిక పరిజ్ఞానంతో మేళవించి నూతన సాంస్కృతిక విధానాలతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తొలిసారి మణిపూరి, కన్నడ, ఇంగ్లీష్‌తో పాటు పోలాండ్, రష్యన్ భాషలలో నాటక ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు కోలాటాలు, జానపద నృత్యాలు, డెక్క భజనలు, డప్పుల కళా ప్రదర్శనలు, సభలు జరుగుతాయన్నారు. అనంతరం రాత్రి 7 గంటల నుంచి నాటక ప్రదర్శనలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ ఉత్సవానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై నాటక కళకు మద్దతు ఇవ్వాలని కోరారు. విలేకరుల సమావేశంలో పరిషత్ వేదిక సభ్యులు నాగభూషణం, మోహనరావు, పాండురంగారావు, నాగేశ్వరరావు, పద్మారావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు

గుంటూరు విద్య ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు టెక్నికల్ సర్టిఫికెట్ (టీసీసీ) కోర్సు పరీక్షలు నిర్వహిస్తున్నట్టు డీఈఓ షేక్ సలీం బాషా ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ హైయర్ గ్రేడ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హాల్ టికెట్లు ఇప్పటికే బీఎస్‌ఈఏపీ డాట్ ఓఆర్జిఅనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్షలు గుంటూరులోని నగరంపాలెం స్టాల్ గర్ల్స్ ఉన్నత పాఠశాల, మార్కెట్ సెంటర్‌లోని హిందూ కాలేజీ హైస్కూల్ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పరీక్షలు ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు గంట కంటే ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ధ్రువపత్రాన్ని తీసుకురావాలని సూచించారు.

శిల్పారామం అభివృద్ధికి 1.47 ఎకరాల కేటాయింపు

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఇన్నర్ రింగ్‌రోడ్డులో ఉన్న శిల్పారామం కల్చరల్ సెంటర్ ఎంటర్‌టైన్‌మెంట్ జోన్‌ను అభివృద్ధి చేసేందుకు 1.47 ఎకరాలు కేటాయించేందుకు పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆమోదం తెలిపింది. ఆ మేరకు మంగళవారం జీవో జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ కల్చరల్ సొసైటీ (ఏపీఎస్‌ఏసీసీఎస్) విజయవాడ కార్యాలయం ఈ ప్రతిపాదనలు పంపింది. దీనిపై ఈ నెల 28న జరిగిన కేబినెట్ సమావేశం ఆమోదముద్ర వేసింది. ఈ నేపథ్యంలో భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. గుంటూరుకు చెందినఎంఎస్ రఘురామ్ హోమ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు లెటర్ ఆఫ్ ఇండెంట్ ఇచ్చేందుకు శిల్పారామం సీఈవోకు ఆదేశాలు జారీ చేసింది. ఇందులో రూ.25 కోట్ల పెట్టుబడితో 1000 మంది పట్టే హాలు, పిల్లల ఆటస్థలం వంటివి నిర్మిస్తారు.

ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్.,
HO : విశాఖపట్నం, BO : గుంటూరు
డోర్ నెం.133-161, ఆర్ఆర్ఆర్ ప్లాజా, కనకదుర్గ గుడి ఎదురుగా, ఎమ్.జి. ఇన్నర్ రింగ్ రోడ్డు, గుంటూరు. ఫోన్ : 0863-2255646.

అనుబంధం [IV] **స్వాధీనత ప్రకటన**
(రూల్ 8(1) క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (54 ఆఫ్ 2002) క్రింద **ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్., గుంటూరు బ్రాంచ్, గుంటూరు, గుంటూరు జిల్లా** యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లో రూల్ 3 తో కలిపి చదువవలసిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొనబడిన **తేది.30.09.2025 నాటికి రూ.19,72,293/- (అక్షరాల పంతొమ్మిది లక్షల డెబ్బై రెండు వేల రెండు వందల తొంభై మూడు రూపాయలు మాత్రమే) + తేది.01.10.2025** నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు (తదుపరి చెల్లింపులు ఏమైనా ఉన్నచో తీసివేయబడి) తిరిగి చెల్లించవలసినదిగా ఋణగ్రహీతలు/హామీదారులు : 1) M/s శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కాటన్ వర్క్స్, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు ప్రొప్రయిటర్ : **శ్రీ తెల్లబాటి రమేష్ బాబు,** డి.నెం.12-1-1, తెల్లబాటి బిల్డింగ్, కొత్తపేట, గుంటూరు-522001. 2) **శ్రీ తెల్లబాటి రమేష్ బాబు, తండ్రి : శివ రామ ప్రసాద్,** డోర్ నెం.12-1-1, కొత్తపేట, గుంటూరు-522001. **హామీదారులు : 3) శ్రీమతి తెల్లబాటి సుగుణ, భర్త : రమేష్ బాబు,** డి.నెం.12-1-1, కొత్తపేట, గుంటూరు-522001. 4) **శ్రీ తెల్లబాటి ధరణీధర్ తండ్రి : రమేష్ బాబు,** డి నెం. 12-1-1, కొత్తపేట, గుంటూరు-522001. 5) **శ్రీ తెల్లబాటి షణ్ముఖ సాయి కిషోర్, తండ్రి : శివ నాగేశ్వరరావు,** డి నెం.25-140, పురుషోత్తపట్నం, గుంటూరు-522001 వార్లను కోరుతూ **తేది.10.10.2025 న డిమాండ్ నోటీసును** జారీ చేసినారు.

ఋణగ్రహీతలు సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలు/హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా సదరు రూల్సు యొక్క 8వ రూల్‌తో కలిపి చదువుకోవలసిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు **తేది.29.01.2026** న దిగువ వివరించిన ఆస్తిపై స్వాధీనత తీసుకొన్నారు.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీతలు/హామీదారులకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైన **తేది.30.09.2025 నాటికి రూ.19,72,293/- (అక్షరాల పంతొమ్మిది లక్షల డెబ్బై రెండు వేల రెండు వందల తొంభై మూడు రూపాయలు మాత్రమే) + తేది.01.10.2025** నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు (తదుపరి చెల్లింపులు ఏమైనా ఉన్నచో తీసివేయబడి) **ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్., గుంటూరు బ్రాంచ్, గుంటూరు, గుంటూరు జిల్లా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

(ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 (8) లోని నిబంధనలు గమనించవలెను)

స్థిరాస్తి వివరములు

(ఒరిజినల్ రిజిష్టర్డ్ గిఫ్ట్ డీడ్ నెం.68107/2024, తేది.03.07.2024 ప్రకారం - (ఐటమ్ నెం.1)) గుంటూరు జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, రెవెన్యూ వార్డు నెం.21, కొత్తపేట, శనక్కాయల ఫ్యాక్టరీ రోడ్, అసెస్‌మెంట్ నెం.1021055942, డోర్ నెం.9-10-66/5, టి.ఎస్. నెం.15 నందు విస్తీర్ణం 75 చ॥గ॥లు లేదా 62.70 చ॥మీ॥లులోని ఖాళీ స్థలం. **హద్దులు: (టైటిల్ డీడ్ ప్రకారం): తూర్పు:** తెల్లబాటి రామారావు గారి ఆస్తి మరియు ఈ షెడ్యూల్‌కు మధ్య ఉమ్మడి సరాకత్ గోడ హద్దు - 25-0 అ॥లు, **దక్షిణం:** యరమశెట్టి కనకదుర్గాంబ గారి ఇంటి గోడ హద్దు - 25-0 అ॥లు, **పడమర:** పిన్నబోయిన శ్రీనివాసరావు గారి ఇంటి హద్దు - 32-0 అ॥లు, **ఉత్తరం:** మున్సిపల్ రోడ్డు హద్దు - 22-6 అ॥లు.

తేది : 29.01.2026
స్థలం : గుంటూరు
సం/- అధీకృత అధికారి
ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లి., గుంటూరు బ్రాంచ్, గుంటూరు జిల్లా

చింతలపూడిలో పట్టపగలు రెచ్చిపోయిన దొంగలు

● ఇంటి తాళాలు బద్దలు కొట్టి నగలు, నగదు చోరీ

దుగ్గిరాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామం చింతలపూడిలో పట్ట పగలే దొంగలు రెచ్చిపోయారు. మంగళవారం గ్రామంలోని ఓ ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలోని నగలు, నగదు దొంగిలించారు. పోలీసుల వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన అప్పారావు పనిపై ఊరెళ్లారు. ఆయన భార్య మణికుమారి ఇంటికి సమీపంలోని శ్రీరుద్రమ్మ గుడిలో ఉత్సవాలు జరుగుతుండటంతో మధ్యాహ్న సమయంలో ఇంటికి తాళం వేసి అక్కడకు వెళ్లారు. ఆమె ఇంటికి తిరిగి వచ్చేసరికి తలుపు తాళం బద్దలుగొట్టి ఉంది. అనుమానంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా లాకరులోని రూ.3లక్షల నగదు, 3.5 సవర్ల బంగారం మాయమైనట్లు గుర్తించారు. ఊరెళ్లిన తన భర్త అప్పారావుకు ఫోన్‌చేసి ఆయన సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట రవి తెలిపారు. క్లూస్‌టీమ్ రప్పించి చోరీపై ఆధారాలు సేకరించున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పర్యాటకులకు ఏ లోటు లేకుండా చూడాలి

● కొండవీడు ఉత్సవాలపై ప్రత్తిపాటి సమీక్ష

చిలకలూరిపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కొండవీడు ఉత్సవాలకు వచ్చే పర్యాటకులకు ఏ లోటు లేకుండా చూడాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అధికారులను ఆదేశించారు. ఈ నెల 7, 8వ తేదీలలో నిర్వహించనున్న కొండవీడు ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై మంగళవారం నరసరావుపేట ఆర్డీవో మధులత, వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. ఉత్సవాలకు వచ్చే సామాన్య ప్రజలతోపాటు అతిథులుగా వచ్చే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రధాన నాయకులకు ఎక్కడ ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఆర్డీవో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. పర్యాటకులకు అవసరమైన తాగునీరు, ఆహారం, ఇతరత్రా ఏర్పాట్లు చూడాలన్నారు. కొండవీడు ఉత్సవాలపై జాతీయస్థాయిలో చర్చ జరగాలని ప్రత్తిపాటి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అధికారులు, కూటమి నాయకులతో కలిసి ఆయన కొండవీడు ఫెస్ట్-2026 గోడ పత్రికలు, ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 5న చిలకలూరిపేటలో ఉత్సవాల కర్టెన్ రైజర్‌గా ప్రత్యేక 2కె రన్‌ను నిర్వహించాలని ప్రత్తిపాటి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ శ్రీ, మహ్మద్ హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరి బాబు, పర్యాటకశాఖ అధికారి నాయుడమ్మ, ఆర్సీ ఆరేపం అశత్ కుమారి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ స్పెషల్ ట్రేలో నరపరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	147, 156, 167
చికెన్ విత్ స్కిన్(కిలో)	284.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	294.00

మిర్చియార్డు సమాచారం

(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	97,204
అమ్మకాలు	93,014
నిల్వ	20,402

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	23000
నెంబరు. 5	13500	23000
273	----	----
341	14000	25000
4884	----	----
సూపర్ 10	----	----

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	20000
ఫార్మ్-1	----	----
బ్యాడిగి	14000	25000
దేవనూరు డీలక్స్	15000	26500
ఆర్మూరు	12000	17500

ఏసీ కామన్ వెరైటీ		
334	13500	21500
నెంబరు. 5	13000	21500
273	----	----
341	13000	23000
4884	----	----
సూపర్ 10	13500	22500

ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	19000
బ్యాడిగి 355	14000	24000
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయ	7200	12000

బ్యాంక్ ఆఫ్ బరోడా (बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda)
పెదనందిపాడు బ్రాంచ్, శ్రీనిలయం, బాపట్ల రోడ్, పెదనందిపాడు, గుంటూరు. ఎ.పి-522235. ఫోన్: 8977513952
Email : Pedana@bankofbaroda.com, www.bankofbaroda.com

స్వాధీనతా ప్రకటన
(స్థిరాస్తి కొరకు మాత్రమే)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8(1) కింద)

బ్యాంక్ ఆఫ్ బరోడా, పెదనందిపాడు శాఖ అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 కింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **రుణగ్రహీత: శ్రీ చలవ లక్ష్మారెడ్డి తండ్రి శ్రీ వెంకటరెడ్డి,** డి.నం.25-16-304/ఎ, 6వ లైన్, ఆదర్శనగర్, గుంటూరు కలెక్టరేట్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522004 వారికి **01.11.2025** తేదీగల డిమాండ్ నోటీసు జారీ చేశారు మరియు సదరు ప్రకటనలో తెలిపిన బకాయి **12.07.2025** నాటికి మొత్తం **రూ.32,87,388.68 (ముప్పై రెండు లక్షల ఎనభైఏడు వేల మూడు వందల ఎనభైఎనిమిది రూపాయల అరవైఎనిమిది పైసలు మాత్రమే)** + 13.07.2025 నుండి వర్తింపజేయని వడ్డీ + రాబట్టుకునే తేదీ వరకు ఏవైనా ఇతర చార్జీలను సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించాలని కోరారు. సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో రుణగ్రహీత, హామీదారు మరియు తనఖాదారు విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే చట్టంలోని సెక్షన్ 13లోని సబ్‌సెక్షన్ (4) కింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇందులో వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు **31 జనవరి 2026**న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు, హామీదారుకు మరియు తనఖాదారుకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తి/ ఆస్తులతో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని ముఖ్యంగా రుణగ్రహీతను, హామీదారును, తనఖాదారును మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తి/ ఆస్తులతో జరిపే ఏ వ్యవహారాలైనా మొత్తం **12.07.2025 నాటికి మొత్తం రూ.32,87,388.68 (ముప్పై రెండు లక్షల ఎనభైఏడు వేల మూడు వందల ఎనభైఎనిమిది రూపాయల అరవైఎనిమిది పైసలు మాత్రమే)** + 13.07.2025 నుండి వర్తింపజేయని వడ్డీ + రాబట్టుకునే తేదీ వరకు ఏవైనా ఇతర చార్జీలు **బ్యాంక్ ఆఫ్ బరోడా,** పెదనందిపాడు శాఖ చార్జ్‌కు లోబడి ఉంటాయి. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవడానికి లభించే సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని ప్రొవిజన్లను గమనించవలసిందిగా రుణగ్రహీత/లను, హామీదారు/లను మరియు తనఖాదారు/లను కోరడమైనది.

తనఖాపెట్టబడిన ఆస్తితో పాటు మొత్తం విస్తీర్ణం మరియు సరిహద్దుల వివరాలు దిగువ ఇవ్వబడినవి:
ఎ-షెడ్యూలు : గుంటూరు జిల్లా, నల్లపాడు ఉపజిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, నల్లపాడు గ్రామం, డి.నం.403/సిలోని ఎ.2-64 సెంట్ల విస్తీర్ణ భూమి మొత్తంలో ఎ.1-27 సెంట్ల విస్తీర్ణ భూమి ప్లాట్ నంబర్లు 10ఎ, 11, 12, 13, 14గా విభజించబడినవి. అందులో 1200 చ.గజాల విస్తీర్ణ సైట్ ఉత్తరం వైపు భాగం. అందులో 730 చ.గజాలు, చ.మీటర్ల విస్తీర్ణ సైట్‌లో **"స్నేహ ఎన్‌క్లేవ్"** అపార్ట్‌మెంట్ అనే పేరు మరియు శైలితో నిర్మించబడిన అపార్ట్‌మెంట్ మరియు **సరిహద్దులు:** తూర్పు: 30 అడుగుల వెడల్పు రోడ్డు - 100'-0", దక్షిణం: ఆలేటి బాలకృష్ణకు చెందిన సైట్ - 65'-6", పశ్చిమం: ముక్కల గురువారెడ్డికి చెందిన సైట్ - 100'-0", ఉత్తరం: 33 అడుగుల వెడల్పు రోడ్డు - 66'0". పైన తెలిపిన సరిహద్దులలో మొత్తం 730 చ.గజాలు లేదా 610-35 చ.మీటర్ల విస్తీర్ణ సైట్‌లో **"స్నేహ ఎన్‌క్లేవ్"** అపార్ట్‌మెంట్ అనే పేరు మరియు శైలితో నిర్మించబడిన అపార్ట్‌మెంట్. **బి-షెడ్యూలు** : పైన తెలిపిన ఎ-షెడ్యూలు ఆస్తిలో మొత్తం 730 చ.గజాల సైట్ మొత్తంలో 49-0 చ.గజాల విస్తీర్ణ అవిభాజ్య, అనిర్దిష్ట మరియు విభజించబడని వాటా సైట్‌లో నిర్మించబడిన **"స్నేహ ఎన్‌క్లేవ్"** అపార్ట్‌మెంట్ అనే పేరు మరియు శైలితో నిర్మించబడిన అపార్ట్‌మెంట్‌లోని నాలుగవ అంతస్తులోని 1161 చ.అ. ప్లింత్‌ఏరియా (కామన్ ఏరియా & కారు పార్కింగ్ ఏరియా సహా)తో **సి-బ్లాక్‌లోని ఫ్లాట్ నం.501** కలిగిన ఒక ఫ్లాట్ మరియు **సరిహద్దులు:** తూర్పు: సొంత కారిడార్, దక్షిణం: ఖాళీ, పశ్చిమం: ఖాళీ, ఉత్తరం: ఖాళీ మరియు మెట్లు. పైన తెలిపిన ఎ-షెడ్యూలు ఆస్తిలో మొత్తం 730 చ.గజాల సైట్ మొత్తంలో 49-0 చ.గజాల విస్తీర్ణ అవిభాజ్య, అనిర్దిష్ట మరియు విభజించబడని వాటా సైట్‌లో నిర్మించబడిన **"స్నేహ ఎన్‌క్లేవ్"** అపార్ట్‌మెంట్ అనే పేరు మరియు శైలితో నిర్మించబడిన అపార్ట్‌మెంట్‌లోని నాలుగవ అంతస్తులోని 1161 చ.అ. ప్లింత్ ఏరియా (కామన్ ఏరియా & కారు పార్కింగ్ ఏరియా సహా)తో **సి-బ్లాక్‌లోని ఫ్లాట్ నం.501** కలిగిన ఒక ఫ్లాట్ మరియు పైన తెలిపిన సరిహద్దులలో **"స్నేహ ఎన్‌క్లేవ్"** అపార్ట్‌మెంట్‌లోని నాలుగవ అంతస్తులోని **సి-బ్లాక్‌లోని ఫ్లాట్ నం.501** కలిగిన 1161 చ.అ. విస్తీర్ణం (కామన్ ఏరియా & కారు పార్కింగ్ ఏరియా సహా) గల ఒక ఫ్లాట్‌తో పాటు శ్రీ చలవ లక్ష్మారెడ్డి పేరున గల సదరు ఫ్లాట్‌లో అన్ని సదుపాయాలతో పాటు సాధారణ మరియు ఉమ్మడి హక్కులు, సాధారణ మరియు ఉమ్మడి సౌకర్యాలు, కామన్ ఏరియా సహా స్టిల్ట్ ఫ్లోర్ పార్కింగ్ ఏరియాలో ఒక కారు పార్కింగ్‌తో పాటు అందులో అనుభోగ హక్కులు మరియు పార్కింగ్ మరియు అనుబంధములు.

తేది: 31.01.2026
ప్రదేశం: పెదనందిపాడు
వెంకటేశ్వర రావు వంగవీటి
చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ (CUB TRUST AND EXCELLENCE SINCE 1904)
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001.
ఇ-మెయిల్ ఐడి: crmd@cityunionbank.in,
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు:నం.1) శ్రీ పి.వెంకట రమణ భాస్కర్ తండ్రి పి.వి.ఎస్.ఆర్.మూర్తి, 7-231-11/3, రెవెన్యూ కాలనీ, 2వ లేన్, ఎస్ఎస్ఎన్ కాలేజ్ సమీపాన, శివాజీ నగర్, మంగమూరు డొంక, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001. నం.2) శ్రీమతి పాటిబండ లక్ష్మి శ్యామల, భర్త పి.వెంకట రమణ భాస్కర్, 7-231-11/3, రెవెన్యూ కాలనీ, 2వ లేన్, ఎస్ఎస్ఎన్ కాలేజ్ సమీపాన, శివాజీ నగర్, మంగమూరు డొంక, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001. వారి నుండి **17.12.2025** నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, ఏవేని ఇతర బకాయితో కలిపి **16.12.2025** నాటికి **రూ.3,06,46,406/- (రూపాయలు మూడు కోట్ల ఆరు లక్షల నలభై ఆరు వేల నాలుగు వందల ఆరు మాత్రమే)** లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద **సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్**కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి/ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే రీ-టెండరు- సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంకుకు తనఖా పెట్టబడిన స్థిరాస్తులు
షెడ్యూల్ -ఎ: (శ్రీ పి.వెంకటరమణ భాస్కర్, తండ్రి పివిఎస్ఆర్ మూర్తికి చెందిన ఆస్తి)

(ఐటమ్ నం.1): గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, పాత నరసరావుపేట జిల్లా రిజిస్ట్రేషన్, బాపట్ల సబ్-రిజిస్ట్రేషన్, బాపట్ల మున్సిపాలిటీ, పశ్చిమ బ్లాక్ నం.4, ఇమ్మడిశెట్టివారి పాలెం, డి.నం.4-22 సమీపాన, మారుప్రోలువారి గ్రామం, డి.నం.104 వద్ద గల ఖాళీ స్థలం. ప్లాట్ నం.1 షెడ్యూలు ఆస్తి **సరిహద్దులు:** తూర్పు: ఇమ్మడిశెట్టి హనుమాయమ్మ - 60 అడుగులు, దక్షిణం: ఇమ్మడిశెట్టి పోతురాజు - 36 అడుగులు, పశ్చిమం: ప్లాట్ నం.2-60 అడుగులు, ఉత్తరం: 25 అడుగుల వెడల్పు రోడ్డు-36 అడుగులు. ఈ సరిహద్దులలో స్థలం విస్తీర్ణం 240 చ.గ.లు లేదా 201.6 చ.మీ.లు.

(ఐటమ్ నం.2): గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, పాత నరసరావుపేట జిల్లా రిజిస్ట్రేషన్, బాపట్ల సబ్-రిజిస్ట్రేషన్, బాపట్ల మున్సిపాలిటీ, పశ్చిమ బ్లాక్ నం.4, ఇమ్మడిశెట్టివారి పాలెం, డి.నం.4-22 సమీపాన, మారుప్రోలువారి గ్రామం, డి.నం.104 వద్ద గల ఖాళీ స్థలం. ప్లాట్ నం.2 షెడ్యూలు ఆస్తి **సరిహద్దులు:** తూర్పు: ప్లాట్ నం.1-60 అడుగులు, దక్షిణం: ఇమ్మడిశెట్టి పోతురాజు - 36 అడుగులు, పశ్చిమం: ప్లాట్ నం.3 - 60 అడుగులు, ఉత్తరం: 25 అడుగుల వెడల్పు రోడ్డు - 36 అడుగులు. ఈ సరిహద్దులలో స్థలం విస్తీర్ణం 240 చ.గ.లు లేదా 201.6 చ.మీ.లు.

(ఐటమ్ నం.3): గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, పాత నరసరావుపేట జిల్లా రిజిస్ట్రేషన్, బాపట్ల సబ్-రిజిస్ట్రేషన్, బాపట్ల మున్సిపాలిటీ, పశ్చిమ బ్లాక్ నం.4, ఇమ్మడిశెట్టివారి పాలెం, డి.నం.4-22 సమీపాన, మారుప్రోలువారి గ్రామం, డి.నం.104 వద్ద గల ఖాళీ స్థలం. ప్లాట్ నం.3 షెడ్యూలు ఆస్తి **సరిహద్దులు:** తూర్పు: ప్లాట్ నం.1- 60 అడుగులు, దక్షిణం: ఇమ్మడిశెట్టి పోతురాజు - 33 అడుగులు, పశ్చిమం: మున్నంవారిపాలెం రోడ్డు - 62.9 అడుగులు, ఉత్తరం: 25 అడుగుల వెడల్పు రోడ్డు - 51.4 అడుగులు. ఈ సరిహద్దులలో స్థలం విస్తీర్ణం 287.5 చ.గ.లు లేదా 241.5 చ.మీ.లు.

(ఐటమ్ నం.4): గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, పాత నరసరావుపేట జిల్లా రిజిస్ట్రేషన్, బాపట్ల సబ్-రిజిస్ట్రేషన్, బాపట్ల మున్సిపాలిటీ, పశ్చిమ బ్లాక్ నం.4, ఇమ్మడిశెట్టివారి పాలెం, డి.నం.4-22 సమీపాన, మారుప్రోలువారి గ్రామం, డి.నం.104 వద్ద గల ఖాళీ స్థలం. ప్లాట్ నం.8 షెడ్యూలు ఆస్తి **సరిహద్దులు:** తూర్పు: ఇమ్మడిశెట్టి హనుమాయమ్మ - 60 అడుగులు, దక్షిణం: ప్లాట్ నం.4 - 36 అడుగులు, పశ్చిమం: ప్లాట్ నం.9 - 60 అడుగులు, ఉత్తరం: 25 అడుగుల వెడల్పు రోడ్డు - 36 అడుగులు. ఈ సరిహద్దులలో స్థలం విస్తీర్ణం 240 చ.గ.లు లేదా 201.6 చ.మీ.లు.

(ఐటమ్ నం.5): గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, పాత నరసరావుపేట జిల్లా రిజిస్ట్రేషన్, బాపట్ల సబ్-రిజిస్ట్రేషన్, బాపట్ల మున్సిపాలిటీ, పశ్చిమ బ్లాక్ నం.4, ఇమ్మడిశెట్టివారి పాలెం, డి.నం.4-22 సమీపాన, మారుప్రోలువారి గ్రామం, డి.నం.104 వద్ద గల ఖాళీ స్థలం. ప్లాట్ నం.9 షెడ్యూలు ఆస్తి **సరిహద్దులు:** తూర్పు: ప్లాట్ నం.8 - 60 అడుగులు, దక్షిణం: ప్లాట్ నం.5 - 36 అడుగులు, పశ్చిమం: ప్లాట్‌నం.10 - 60 అడుగులు, ఉత్తరం: 25 అడుగుల వెడల్పు రోడ్డు - 36 అడుగులు. ఈ సరిహద్దులలో స్థలం విస్తీర్ణం 240 చ.గ.లు లేదా 201.6 చ.మీ.లు.

(ఐటమ్ నం.6): గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, పాత నరసరావుపేట జిల్లా రిజిస్ట్రేషన్, బాపట్ల సబ్-రిజిస్ట్రేషన్, బాపట్ల మున్సిపాలిటీ, పశ్చిమ బ్లాక్ నం.4, ఇమ్మడిశెట్టివారి పాలెం, డి.నం.4-22 సమీపాన, మారుప్రోలువారి గ్రామం, డి.నం.104 వద్ద గల ఖాళీ స్థలం. ప్లాట్ నం.10 షెడ్యూలు ఆస్తి **సరిహద్దులు:** తూర్పు: ప్లాట్ నం.9 - 60 అడుగులు, దక్షిణం: ప్లాట్ నం.6 - 36 అడుగులు, పశ్చిమం: కోలా సుమతి వదలిన భూమి - 60 అడుగులు, ఉత్తరం: 25 అడుగుల వెడల్పు రోడ్డు - 36 అడుగులు. ఈ సరిహద్దులలో స్థలం విస్తీర్ణం 240 చ.గ.లు లేదా 201.6 చ.మీ.లు. ఐటమ్‌లు 1 నుండి 6 వరకు పై సరిహద్దులలో స్థలం విస్తీర్ణం 1487.5 చ.గ.లు లేదా 1249.5 చ.మీ.లు.

రిజర్వు ధర: రూ. 28,00,000/-
(రూపాయలు ఇరవై ఎనిమిది లక్షలు మాత్రమే)

షెడ్యూల్ -బి: (శ్రీమతి పాటిబండ లక్ష్మిశ్యామల, భర్త: పి.వెంకటరమణ భాస్కర్‌కు చెందిన ఆస్తి)
గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, నరసరావుపేట సబ్-జిల్లా రిజిస్ట్రేషన్, బాపట్ల సబ్‌రిజిస్ట్రేషన్, బాపట్ల మున్సిపల్ ఏరియా, పశ్చిమ బ్లాక్ నం.4, ఇమ్మడిశెట్టివారి పాలెం సమీపాన డి.నం.డబ్ల్యుబి 4-22 మరియు డి.నం.103/1బి సమీపాన ఎ.2-22 సెంట్ల విస్తీర్ణం, ఎ.1-84 సెంట్లు మరియు ఇందులో డి.నం.105/1, ఎ.4-80 సెంట్లలో ఎ.0-78 సెంట్ల విస్తీర్ణం గల ఖాళీ స్థలంలో గల రెండు విస్తీర్ణాలు ఒక ఐటమ్‌గా మొత్తం విస్తీర్ణం ఎ.2-62 సెంట్లలో షెడ్యూల్ ఆస్తి **సరిహద్దులు:** తూర్పు: వేమూరి కమలమ్మకు విక్రయించిన ఆస్తి, దక్షిణం: ప్రభుత్వ డొంక, పశ్చిమం: వేమూరి జ్యోతిలక్ష్మి ఆస్తి, ఉత్తరం: ఆకుతోట నాగేశ్వరరావు & ముదుగు బిక్షాలు రెడ్డి స్థలాలు. ఈ సరిహద్దులలో స్థలం విస్తీర్ణం ఎ.0-33 సెంట్లు లేదా 1597.2 చ.గ.లు లేదా 1341.64 చ.మీ.లు.

రిజర్వు ధర: రూ. 30,00,000/-
(రూపాయలు ముప్పై లక్షలు మాత్రమే)

రీ-వేలం వివరాలు

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం తేది	ప్రదేశం
25-02-2026	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు - అరండల్‌పేట శాఖ, కల్పతరు హౌస్, 6-9-24, 9/1, అరండల్ పేట్, గుంటూరు - 522002 టెలిఫోన్ నం.0863-2219091, సెల్ నం.9347099363, 8925876329

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు **ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు - అరండల్‌పేట శాఖ, కల్పతరు హౌస్, 6-9-24, 9/1, అరండల్ పేట్, గుంటూరు - 522002** వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్లను **"సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్"** పేరున తీసిన రిజర్వు ధరలో **10 శాతం** బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన **మ.12.00 గం.కు లేదా ఆలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్** వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లలో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు **టెలిఫోన్ నం.0863-2219091, సెల్ నం.9347099363, 8925876329**లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన **మ.01.00 గం.**కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన **వెంటనే** అమ్మకం మొత్తంలో **25% (చెల్లించిన బయానా కలిపి)** చెల్లించాలి మరియు మిగిలిన **75%** మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి **15 రోజులలోగా** చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన **25%** మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 02.02.2026
అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287, టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SHRIRAM Finance)
నమోదిత కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లేన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు-522034.

డిమాండ్ నోటీసు
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002, సెక్షన్ 13(2) అనుసరించి డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" గా పిలువబడేది, **ఎన్‌సిఎల్‌టి బ్రాంచ్-II చెన్నై, తేది 9-11-2022** యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు **(శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్**గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేదీనాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డు కంపెనీ అయి ఉన్నాము మరియు నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. **శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032** వద్ద మరియు **మా జోనల్ కార్యాలయం చిరునామా, శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లేన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు-522034** మరియు **బ్రాంచ్ ఆఫీస్ : గుంటూరు 1** వద్ద కలిగి ఉన్న మేము ఈ దిగువ నోటీసును జారీచేయడమైనది. **(ఇక పై కంపెనీ/ఋణదాతగా పిలువబడుతుంది).**

దిగువ తెలిపిన రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు/గ్యారంటార్లు/శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్న సదరు రుణగ్రహీతలు/గ్యారంటర్లు గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువకోవల్సిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా చెల్లింపు తేదీ వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటు వంతున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు వగైరాను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీతలు/గ్యారంటర్లు తనఖారుణగ్రస్తులను కోరుతూ SARFAESI చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీ చేశారు.

వారి చివరిగా తెలిసిన చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన ద్వారా వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్- సెక్షన్ (8) లోని నిబంధనలను చూడవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

ఋణగ్రహీత(లు)/సహ-ఋణగ్రహీత(లు)/హామీదారు(ల) పేరు	ఎన్‌పిఏ తేది 30-11-2016	డిమాండ్ నోటీసు తేది 23-01-2026
ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ ఋణ ఖాతా నెం. GUNBRTF1603300022, తేది.30-03-2016 1) ఖాసిం సాహెబ్ షేక్, తండ్రి: మల్లా సాహెబ్, డి నెం. 16-15-222/A, సాయిబాబా దేవాలయం దగ్గర, 2/6 యాదవుల బజార్, పాత గుంటూరు, గుంటూరు జిల్లా-522001. 2) షేక్ రంజాన్ బీ, భర్త : ఖాసిం సాహెబ్ షేక్, డి నెం. 16-15-222/A, సాయిబాబా దేవాలయం దగ్గర, 2/6 యాదవుల బజార్, పాత గుంటూరు, గుంటూరు జిల్లా-522001. 3) సనక్కాయల కిరణ్ కుమార్, తండ్రి: అంకమ్మ నాయుడు, డి నెం. 12-7-13, కొత్తపేట, గుంటూరు జిల్లా-522001.	రుణం మొత్తం రూ. 15,00,000/- (పదిహేను లక్షల రూపాయలు మాత్రమే)	మొత్తం బకాయి: రూ. 26,71,725/- (ఇరవై ఆరు లక్షల డెబ్బై ఒక్క వేల ఏడు వందల ఇరవై ఐదు రూపాయలు మాత్రమే) తేది 23-01-2026 నాటికి

షేక్ ఖాసిం @ షేక్ ఖాసిం సాహెబ్ గారికి చెందిన షెడ్యూల్ స్థిరాస్తి వివరములు:
గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ జిల్లా, ఇంతకుముందు రెడ్డిపాలెం గ్రామ పంచాయతీ పరిధి, ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరు గ్రామం, డి.నెం.387/బి నందు విస్తీర్ణం ఎ. 10.85 సెంట్లు మరియు రీ-సర్వే ప్రకారం గుంటూరు గ్రామం, డి.నెం.387/బి1 నందు విస్తీర్ణం 1983 చ॥మీ॥లు, ఇందులో ప్లాట్ నెం.13 నందు విస్తీర్ణం 235 చ॥గ॥లు లేదా 196.46 చ॥మీ॥లు ఖాళీ ఇంటి స్థలం. **హద్దులు: తూర్పు:** శఖమూరి వేదవతి గారి ప్లాట్ నెం.14లోని స్థలం - 46 అ॥లు, **దక్షిణం:** ప్లాట్ నెం.24 మరియు 25లోని స్థలం - 46 అ॥లు, **పడమర:** ఈ సంబరులోని గాదే సీతారామయ్య గారి స్థలం - 46 అ॥లు, **ఉత్తరం:** 20 అడుగుల వెడల్పు గల ఉమ్మడి రహదారి - 46 అ॥లు.
పైన చెప్పబడిన విస్తీర్ణం 235 చ॥గ॥లు లేదా 196.46 చ॥మీ॥లు ఖాళీ ఇంటి స్థలం ప్లాట్ నెం.13 తో కలదు. **(ఈ ఆస్తి గుంటూరు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం యొక్క డాక్యుమెంట్ నెం. 6990/2015కు సంబంధించినది).**

పైన తెలిపిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ-ఋణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారులకు (వర్తింపును బట్టి) ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద రుణగ్రహీతలు మరియు తనఖా రుణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీనత చేపట్టడంతో సహ సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేదీ నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన తమ సెక్యూర్డ్ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని ఇతర విధంగా ఏ ఋణగ్రహీతా బదిలీ చేయరాదని గమనించగలరు.

తేది: 23-01-2026, ప్రదేశం : గుంటూరు
సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

బ్యాంక్ ఆఫ్ బరోడా (बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda)
పెదనందిపాడు బ్రాంచ్, శ్రీనిలయం, బాపట్ల రోడ్, పెదనందిపాడు, గుంటూరు. ఎ.పి-522235. ఫోన్: 8977513952
Email : Pedana@bankofbaroda.com, www.bankofbaroda.com

స్వాధీనతా ప్రకటన
(స్థిరాస్తి కొరకు మాత్రమే)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8(1) కింద)

బ్యాంక్ ఆఫ్ బరోడా, పెదనందిపాడు శాఖ అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 కింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **మెసర్స్ సకల వీర భద్రయ్య & కంపెనీ, ప్రాతినిధ్యంవహించు దీని భాగస్వాములు** 1) సకల వీరభద్రయ్య, తండ్రి చిన్న వెంకటస్వామి, 2) శ్రీ సకల సత్యనారాయణ, తండ్రి చిన్న వెంకటస్వామి, 3) శ్రీ సకల లీలా కృష్ణ మూర్తి, తండ్రి సకల వెంకటేశ్వర్లు, 4) సకల రమేష్ బాబు, తండ్రి సకల వెంకటేశ్వర్లు, నమోదిత కార్యాలయ చిరునామా: డి.నం.4/138, బాపట్ల రోడ్, నాగులపాడు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522235, **శ్రీ సకల వీరభద్రయ్య, తండ్రి చిన్న వెంకటస్వామి, మెస్సర్స్ సకల వీరభద్రయ్య & కంపెనీ భాగస్వామి,** నివాసం: డి.నం.4-138/ఇ, నాగులపాడు గ్రామం, పెద్దనందిపాడు మండలం, గుంటూరు జిల్లా, ఆం.ప్ర-522235, **శ్రీ సకల సత్యనారాయణ, తండ్రి చిన్న వెంకటస్వామి, మెస్సర్స్ సకల వీరభద్రయ్య & కంపెనీ భాగస్వామి,** నివాసం: డి.నం.4-138/డి, మేడమీద, నాగులపాడు గ్రామం, పెద్దనందిపాడు మండలం, గుంటూరు జిల్లా, ఆం.ప్ర-522235, **శ్రీ సకల లీలా కృష్ణ మూర్తి, తండ్రి సకల వెంకటేశ్వర్లు, మెస్సర్స్ సకల వీరభద్రయ్య & కంపెనీ భాగస్వామి,** నివాసం: డి.నం.4-138/సి, నాగులపాడు గ్రామం, పెద్దనందిపాడు మండలం, గుంటూరు జిల్లా, ఆం.ప్ర-522235, **శ్రీ సకల రమేశ్ బాబు, తండ్రి సకల వెంకటేశ్వర్లు, మెస్సర్స్ సకల వీరభద్రయ్య & కంపెనీ భాగస్వామి,** నివాసం: డి.నం.4-138/సి, నాగులపాడు గ్రామం, పెద్దనందిపాడు మండలం, గుంటూరు జిల్లా, ఆం.ప్ర-522235. **హామీదారులు: శ్రీ సకల వీరభద్రయ్య, తండ్రి చిన్న వెంకటస్వామి, మెస్సర్స్ సకల వీరభద్రయ్య & కంపెనీ భాగస్వామి,** నివాసం: డి.నం.4-138/ఇ, నాగులపాడు గ్రామం, పెద్దనందిపాడు మండలం, గుంటూరు జిల్లా, ఆం.ప్ర-522235, **శ్రీ సకల సత్యనారాయణ, తండ్రి చిన్న వెంకటస్వామి, మెస్సర్స్ సకల వీరభద్రయ్య & కంపెనీ భాగస్వామి,** నివాసం: డి.నం.4-138/డి, మేడమీద, నాగులపాడు గ్రామం, పెద్దనందిపాడు మండలం, గుంటూరు జిల్లా, ఆం.ప్ర-522235, **శ్రీ సకల లీలా కృష్ణ మూర్తి, తండ్రి సకల వెంకటేశ్వర్లు, మెస్సర్స్ సకల వీరభద్రయ్య & కంపెనీ భాగస్వామి,** నివాసం: డి.నం.4-138/సి, నాగులపాడు గ్రామం, పెద్దనందిపాడు మండలం, గుంటూరు జిల్లా, ఆం.ప్ర-522235, **శ్రీ సకల రమేశ్ బాబు, తండ్రి సకల వెంకటేశ్వర్లు, మెస్సర్స్ సకల వీరభద్రయ్య & కంపెనీ భాగస్వామి,** నివాసం: డి.నం.4-138/సి, నాగులపాడు గ్రామం, పెద్దనందిపాడు మండలం, గుంటూరు జిల్లా, ఆం.ప్ర-522235 వారికి **01.11.2025** తేదీగల డిమాండ్ నోటీసు జారీ చేశారు మరియు సదరు ప్రకటనలో తెలిపిన బకాయి మొత్తం **రూ.94,76,262.58/- (రూపాయలు తొంభై నాలుగు లక్షల డెబ్బై ఆరు వేల రెండు వందల అరవై రెండు మరియు యాభై ఎనిమిది పైసలు మాత్రమే)** ప్లస్ వర్తించని వడ్డీ + రాబట్టుకునే తేదీ వరకు ఏవైనా ఇతర చార్జీలను సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించాలని కోరారు.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో రుణగ్రహీత, హామీదారు మరియు తనఖాదారు విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువబడే చట్టంలోని సెక్షన్ 13లోని సబ్‌సెక్షన్ (4) కింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇందులో వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు **30 జనవరి 2026**న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు, హామీదారుకు మరియు తనఖాదారుకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. సదరు ఆస్తి/ ఆస్తులతో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని ముఖ్యంగా రుణగ్రహీతను, హామీదారును, తనఖాదారును మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తి/ ఆస్తులతో జరిపే ఏ వ్యవహారాలైనా మొత్తం **12.07.2025 నాటికి మొత్తం రూ.94,76,262.58/- (రూపాయలు తొంభై నాలుగు లక్షల డెబ్బై ఆరు వేల రెండు వందల అరవై రెండు మరియు యాభై ఎనిమిది పైసలు మాత్రమే)** వర్తించని వడ్డీ + రాబట్టుకునే తేదీ వరకు ఏవైనా ఇతర చార్జీలు **బ్యాంక్ ఆఫ్ బరోడా, పెదనందిపాడు శాఖ** చార్జ్‌కు లోబడి ఉంటాయి.
సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవడానికి లభించే సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని ప్రొవిజన్లను గమనించవలసిందిగా రుణగ్రహీత/లను, హామీదారు/లను మరియు తనఖాదారు/లను కోరడమైనది.

స్థిరాస్తి వివరణ

ఐటం నం.1: నమోదిత సేల్ డీడ్ (నం.1675/1973) క్రింద గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలం, కట్రపాడు యొక్క నాగులు పాడు శివారు వద్ద గల సంబంధిత సర్వే నం.404/3 మరియు 404/6లో ఎ.0-49 సెంట్లు మరియు ఎ.0-36 సెంట్ల విస్తీర్ణ వాణిజ్య / పారిశ్రామిక స్థలం యావత్తు. **సరిహద్దులు:** తూర్పు: నిజాంపట్నం శరబయ్య భూమి, పశ్చిమం: లవు మస్తాన్‌రావు భూమి, ఉత్తరం: బాపట్ల రోడ్, దక్షిణం: దశ్రీ నాగరత్నం భూమి.

ఐటం నం.2: నమోదిత సేల్ డీడ్ (నం.1164/1954) క్రింద గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలం, కట్రపాడు యొక్క నాగులు పాడు శివారు వద్ద గల సర్వే నం.404/6లో ఎ.0-43 సెంట్ల విస్తీర్ణ వాణిజ్య / పారిశ్రామిక స్థలం యావత్తు. **సరిహద్దులు:** తూర్పు: పట్‌బండ్ల సుబ్బయ్య భూమి, పశ్చిమం: పునిశెట్టి వెంకటసుబ్బారావు మరియు ఇతరులు, ఉత్తరం: బాపట్ల రోడ్, దక్షిణం: పాపోలు నాగేశ్వరరావు భూమి.

ఐటం నం.3: నమోదిత సేల్ డీడ్ (నం.1002/1976) క్రింద గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలం, కట్రపాడు యొక్క నాగులు పాడు శివారు వద్ద గల సర్వే నం.404/6లో ఎ.0-16 సెంట్ల విస్తీర్ణ వాణిజ్య / పారిశ్రామిక స్థలం యావత్తు. **సరిహద్దులు:** తూర్పు: పట్‌బండ్ల తులసయ్య మరియు ఇతరుల భూమి, దక్షిణం: గుర్రం శారదాకు మరి భూమి, పశ్చిమం: పైన పేర్కొన్నదే, దక్షిణం: పాబోలు నాగేశ్వరరావు భూమి.

ఐటం నం.4: నమోదిత సేల్ డీడ్ (నం.1003/1976) క్రింద గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలం, కట్రపాడు యొక్క నాగులు పాడు శివారు వద్ద గల సర్వే నం.410/1 మరియు 410/2లో ఎ.0-93 సెంట్లు మరియు ఎ.0-27 సెంట్ల విస్తీర్ణ వాణిజ్య / పారిశ్రామిక స్థలం యావత్తు. **సరిహద్దులు:** తూర్పు: పాటిబండ్ల ధర్మారావు భూమి, పశ్చిమం: పాటిబండిన రామయ్య భూమి, ఉత్తరం: బాపట్ల రోడ్డు, దక్షిణం: సకల వెంకటేశ్వర్ల భూమి.

ఐటం నం.5: నమోదిత సేల్ డీడ్ (నం.335/1980) క్రింద గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలం, కట్రపాడు యొక్క నాగులు పాడు శివారు వద్ద గల సర్వే నం.410/3లో ఎ.0-12 సెంట్ల విస్తీర్ణ వాణిజ్య / పారిశ్రామిక స్థలం యావత్తు. **సరిహద్దులు:** తూర్పు: పాటిబండ్ల శేషారావుభూమి, పశ్చిమం: పాటిబండ్ల ధర్మారావు భూమి, ఉత్తరం: పాటిబండ్ల శేషారావు భూమి, దక్షిణం: సకల వెంకటేశ్వర్లు మరియు ఇతరుల భూమి.

ఐటం నం.6: నమోదిత సేల్ డీడ్ (నం.448/1980) క్రింద గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలం, కట్రపాడు యొక్క నాగులు పాడు శివారు వద్ద గల సర్వే నం.410/3లో ఎ.0-49% సెంట్ల విస్తీర్ణ వాణిజ్య / పారిశ్రామిక స్థలం యావత్తు. **సరిహద్దులు:** తూర్పు: పాటిబండ్ల శేషారావుభూమి, పశ్చిమం: పాటిబండ్ల శేషారావు భూమి, ఉత్తరం: బాపట్ల రోడ్డు, దక్షిణం: సకల వెంకటేశ్వర్లు మరియు ఇతరుల భూమి.

ఐటం నం.7: నమోదిత సేల్ డీడ్ (నం.649/1980) క్రింద గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలం, కట్రపాడు యొక్క నాగులు పాడు శివారు వద్ద గల సర్వే నం.410/3లో ఎ.0-32 సెంట్ల విస్తీర్ణ వాణిజ్య / పారిశ్రామిక స్థలం యావత్తు. **సరిహద్దులు:** తూర్పు: నాగులపాడు పంచాయతీ రోడ్డు, దక్షిణం: గోర మస్తాన్ భూమి, పశ్చిమం: పాటిబండ్ల శేషారావు భూమి, ఉత్తరం: కనుపర్తి వెంకట నారాయణ భూమి.

ఐటం నం.8: నమోదిత సేల్ డీడ్ (నం.1420/1981) క్రింద గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలం, కట్రపాడు యొక్క నాగులు పాడు శివారు వద్ద గల సర్వే నం.411/1లో ఎ.0-40 సెంట్ల విస్తీర్ణ వాణిజ్య / పారిశ్రామిక స్థలం యావత్తు. **సరిహద్దులు:** తూర్పు: నాగులపాడు పంచాయతీ రోడ్డు, దక్షిణం: సకల వెంకటేశ్వర్లు మరియు ఇతరుల భూమి, పశ్చిమం: పైన పేర్కొన్నదే, ఉత్తరం: కె. వెంకట నారాయణరావు యొక్క వృత్తి భూమి.

మెస్సర్స్ సకల వీరభద్రయ్య & కంపెనీ, పేరు మరియు శైలీ క్రింద ఎస్ఎస్ఐ సర్టిఫికెట్ స్థానంలో ఎమ్ఎస్ ఎమ్ఇడి చట్టం 2006కి ఎదురుగా ఇఎమ్ భాగం - 2 గల ఇఎమ్ నం.28017/12/00248 గా నమోదైన కాటన్ గిన్నింగ్, ప్రెస్సింగ్ & ఆయిల్ మిల్‌తో పాటు డోర్ నం.4-138 గలది.

గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలం, నాగులపాడు గ్రామం యొక్క డి.నం.లు: 403/3, 404/6, 410/3, 411/1, 410/1, 410/2, డోర్ నం.4-138 సమీపాన ఈ ఆస్తి ఉన్నది.

తేది:30.01.2026
ప్రదేశం:పెదనందిపాడు
పేరు: వెంకటేశ్వరరావు వంగవీటి,
చీఫ్ మేనేజర్ / అధీకృత అధికారి

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ప్రసంగిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ మయూర్ అశోక్

పన్ను వసూళ్లకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ఉండాలి

● నగర మేయర్ రవీంద్ర, కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థకు బకాయి ఉన్న పన్ను వసూళ్లకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ఉండాలని, డిప్యూటీ కమిషనర్లు పన్ను వసూళ్లపై రోజువారీ నివేదిక ఇవ్వాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం రెవెన్యూ విభాగ సమీక్షా సమావేశం జరిగింది. మేయర్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి పన్ను వసూళ్లు కీలకమని, నగర ప్రజలు కూడా సకాలంలో పన్ను చెల్లించాలని కోరారు. కమిషనర్ తొలుత వార్డు సచివాలయాల వారీగా ఉన్న అసెస్‌మెంట్లు, బకాయిలు, రోజువారీ వసూళ్లు చేయాల్సిన లక్ష్యంపై సమీక్షించి, పన్ను వసూళ్లలో పురోగతి లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజువారీ నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా చేయాల్సిన పన్ను వసూళ్లలో పురోగతి లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. తమ క్షేత్ర స్థాయి పర్యటనల్లో డిమాండ్ నోటీసులు, పన్ను బకాయిలపై స్లిప్స్ అందలేదని ప్రజలు చెబుతున్నారని, ఇక నుంచి అడ్మిన్ ప్రతి ఇంటికి డిమాండ్ నోటీసు, స్లిప్ ఇచ్చి పేరు, ఫోన్ నంబర్‌తో అకనాలెడ్జ్‌మెంట్ తీసుకొని రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. బకాయిదారులకు పన్ను చెల్లింపుపై నోటీసులు ఇవ్వడం, స్పందించకుంటే ట్యాప్, డ్రైనేజి కనెక్షన్‌లు డిస్ కనెక్షన్ చేయడం, రెడ్ నోటీసులు ఇచ్చి తదుపరి రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలు వంటి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పబ్లిక్ టాయ్‌లెట్స్ నుండి కూడా సక్రమంగా వసూళ్లు కావడం లేదన్నారు. జీఎంసి షాపింగ్ కాంప్లెక్స్ ల అద్దెలు వసూళ్లతో పాటుగా, ఖాళీగా ఉన్న వాటికి వేలం నిర్వహించాలని, కాంప్లెక్స్‌ల వారీగా డిప్యూటీ కమిషనర్లు సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకటకృష్ణయ్య, రెవెన్యూ అధికారులు రవికిరణ్ రెడ్డి, మదన్ గోపాల్, రెహ్మాన్, సాదిక్‌పాష, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీఎంసీ అధికారుల పని తీరుపై కమిషనర్ ఆగ్రహం

● కాన్ఫరెన్స్‌లోకి రాని డీసీకి మెమో ఇవ్వాలని నిర్ణయం

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ అధికారులు, విభాగాధిపతుల పని తీరుపై కమిషనర్ కే.మయూర్ అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంపై నేరుగా ఉన్నతాధికారులు రంగంలోకి దిగాలని ఆదేశించారు. కమిషనర్ మయూర్ అశోక్ నగరపాలక సంస్థ చెందిన డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు, అధికారులు, సిబ్బందితో మంగళవారం ఉదయం సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ నేరుగా డిప్యూటీ కమిషనర్లు టి వెంకట కృష్ణయ్య, బి.శ్రీనివాసరావులను లైన్‌లోకి తీసుకొని మాట్లాడారు. ఆ క్రమంలో మరో డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ అందుబాటులోకి రాలేదు. దీంతో ఆయనపై తీవ్ర ఆగ్రహం చేశారు. అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. సెల్ కాన్ఫరెన్స్‌లో ఇద్దరు డీసీలు పాల్గొనగా, మరో డీసీ అయినా సిహెచ్ శ్రీనివాసులు పాల్గొనక పోవడంపై కమిషనర్ ఒకింత మండిపడ్డారు. తక్షణమే వివరణ కోరుతూ మెమో ఇవ్వాలని ఆదేశించినట్టు తెలిసింది. నగరంలో ప్రధాన రహదారులపై ఎక్కడ చెత్తాచెదారం కనిపించకూడదని, ప్రతిరోజు మురుగు కాలువలు శుభ్రం చేయాలని, ఇంటింట చెత్త సేకరణ పక్కాగా జరగాలని సూచించారు. రెవెన్యూ అధికారులు ట్యాక్స్ వసూళ్లు వేగవంతం చేయాలని తెలిపారు.

జీటీఎస్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

● కమిషనర్ కే మయూర్ అశోక్


గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ (జీటీఎస్)ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. ఏటుకూరు రోడ్డులోని జీటీఎస్ నిర్మాణ ప్రాంతం, ఎంఆర్ఎఫ్ సెంటర్, పొన్నూరు రోడ్డులోని వీధి కుక్కల కుటుంబ నియంత్రణ కేంద్రం, బుడంపాడు చెరువులను అధికారులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఏటుకూరు రోడ్డులోని యార్డులో ఇళ్ల నుంచి వచ్చే హానికర వ్యర్థాలను డిస్పోజ్ చేసే మెషిన్‌కి షెడ్ ఏర్పాటు చేయాలని, వుడ్ చిపింగ్ మెషిన్‌ని రన్నింగ్‌లోకి తీసుకురావాలన్నారు. మెటీరియల్ రికవరీ ఫెసిలిటి సెంటర్‌కి ప్రత్యేకంగా షెడ్ ఏర్పాటు చేయాలని ఈఈని ఆదేశించారు. పొన్నూరు రోడ్డులో ఏర్పాటు చేస్తున్న ఏబీసీ సెంటర్‌ని పరిశీలించి పనులను వేగవంతం చేయాలని, త్వరలో సెంటర్ ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం బుడంపాడు చెరువు వాకింగ్ ట్రాక్‌ని పరిశీలించి గతంలో చేపట్టిన పనుల వివరాలను అందించాలని ఈఈని ఆదేశించారు. పర్యటనలో సీపీ రాంబాబు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, సీఎంఒహెచ్ డాక్టర్ శాంతికళ, కార్పొరేటర్ దాసరి లక్ష్మీ దుర్గ, డీసీపీ సూరజ్, ఈఈలు సుందర్రామిరెడ్డి, విష్ణు, వేణు, ప్రజారోగ్య, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలలో జేసీ విస్తృత తనిఖీలు

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో రేషన్ దుకాణాలను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ విస్తృతంగా తనిఖీ చేశారు. ఆయన మంగళవారం జిల్లా పౌర సరఫరాల అధికారి పీ.కోమలి పద్మ, ఏఎస్‌వోలు, సీఎస్‌డీటీలతో కలిసి తనిఖీలు నిర్వహించారు. నగరంలోని రేషన్ షాప్ నంబర్లు.0781095, 0781106, 0781141లో తనిఖీలను నిర్వహించగా ఆ దుకాణాల్లో బియ్యం తక్కువగా ఉండటాన్ని జేసీ గుర్తించారు. రేషన్ షాపుల నంబర్లు 0781003, 0781018, 0781015లో తనిఖీలు చేయగా వాటిలో బియ్యం ఎక్కువగా ఉండటాన్ని గుర్తించారు. తాడేపల్లి మండల పరిధిలో రేషన్ షాప్ నంబర్ 0793014లో తనిఖీ చేయగా అక్కడ కూడా బియ్యం తక్కువగా ఉండటాన్ని గుర్తించి డీలర్లపై కేసులను నమోదుకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ పలు చౌక ధరల దుకాణాలలో పౌర సరఫరాల సిబ్బంది ఆకస్మికంగా తనిఖీలను నిర్వహించి వాటిలో వ్యత్యాసాలు గుర్తించిన రేషన్ దుకాణాల డీలర్లపై 6ఎ, క్రిమినల్ కేసులను నమోదు చేస్తున్నారని వివరించారు.

వంద రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలి

● డీఈవో డాక్టర్ ఎస్‌కే సలీం బాషా



రోజువారి పరీక్షలను పరిశీలిస్తున్న డీఈవో డాక్టర్ ఎస్ కే సలీం బాషా

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు లక్ష్యంగా అమలు చేస్తున్న వందరోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని డీఈవో డాక్టర్ ఎస్‌కే సలీం బాషా సూచించారు. కొత్తపేటలోని జలగం రామారావు మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, వారి సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు రోజు వారి నిర్వహిస్తున్న పరీక్షలకు సంబంధించిన మార్కులను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, హాజరు శాతం తక్కువైతే తల్లికి వందనం ఇబ్బంది అవుతుంది కావున విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు ఈ విషయంను తెలియజేయాలని అన్నారు. 10వ తరగతి విద్యార్థుల కొరకు అనుభవం గల ఉపాధ్యాయులతో తయారు చేసి జిల్లా పరిషత్ యాజమాన్యం వారు అందించిన విద్యా జ్యోతి పుస్తకాన్ని విద్యార్థులను గ్రేడులుగా విభజించి వారిపై ప్రత్యేక శ్రద్ధతో చదివిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అభినందించారు.

ఘన, ద్రవ వ్యర్థాలను పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ అన్సారియా



జిల్లా ఎన్‌జీటీ కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, కమిషనర్

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో జాతీయ హరిత ట్రైబ్యునల్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఘన, ద్రవ వ్యర్థాలను పకడ్బందీగా నిర్వహణ చేసేలా మున్సిపల్ అధికా రులు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారి యా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా ఎన్‌జీటీ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో వ్యర్థాలను ఇంటి నుంచే సేకరించడంతో పాటు పర్యావరణానికి హాని లేకుండా వంద శాతం సక్రమంగా నిర్వహించాలన్నారు. తడి వ్యర్థాలతో ఎరువుల తయారీని నివా స ప్రాంతాల్లోని తయారు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రీసైకిలింగ్ వ్యర్థాలతో సంపద సృష్టించే ప్రాజెక్టులను మరింతగా విస్తరించాలన్నారు. పట్టణాల్లో సీవరేజ్ నీటిని శుద్ధి చేయడానికి అనుగుణంగా ఎస్టీపీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ - వేస్టును సైతం ప్రభుత్వంతో ఎంఓయూ చేసుకున్న ఏజెన్సీకి అందించాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ నగర పరిధిలో ఇంటింటి నుంచి తడి, పొడి చెత్త వేరు చేసి సేకరించటం జరుగుతుందన్నారు. తడి వ్యర్థాలతో వివిధ ప్రాంతాల్లో 100 టన్నుల సామర్థ్యం కలిగిన ఎరువుల తయారీ కేంద్రాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి డివిజన్‌లో వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీ కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నా మన్నారు. ప్రతి రోజు 300 టన్నుల వరకు వ్యర్థాలను జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్‌కు పంపిస్తున్నామని తెలిపారు. మెటీరియల్ రీసైక్లింగ్‌కు 10 టన్నులు వరకు తరలిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఎంటీఎంసీ మున్సిపల్ కమిషనర్ అలీం బాషా, తెనాలి మున్సిపల్ కమిషనర్ జెఆర్ అప్పలనాయుడు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ నజీమ బేగం, సీఎంహెచ్ఓ శాంతి కళ, ఈఈ సుందర రామిరెడ్డి, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఇంజనీర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

9లోగా ఈ-కేవైసీ పూర్తి చేయాలి

● స్పెషల్ సీఎస్ సాయిప్రసాదు

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీకి ముందుగా రైతులకు ఈ నెల 9వ తేదీలోగా ఈ-కేవైసీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జీ సాయిప్రసాద్, రాష్ట్ర భూ పరిపాలనా శాఖ ముఖ్య కమిషనర్ జీ.జయలక్ష్మి ఆదేశించారు. రీ సర్వే, పట్టాదార్ పాస్ పుస్తకాల రెండవ విడత పంపిణీ తదితర అంశాలపై ఇద్దరు అధికారులు మంగళవారం సంయుక్తంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్పెషల్ సీఎస్ సాయిప్రసాదు మాట్లాడుతూ పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు.

రైతులకు ఎక్కడా ఏ సమస్య రాకుండా పాస్ పుస్తకాల పంపిణీని పూర్తి చేయాలన్నారు. ప్రతి నెల 10వ తేదీ లోగా ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని, 15వ తేదీ వరకు అన్ని పరిశీలనలు పూర్తి చేసి పంపిణీకి ఏర్పాటు చేయాలని సూచించారు. రెవెన్యూ క్లినిక్‌లలో వచ్చే అంశాలను స్పష్టంగా పరిశీలించి వేగంగా పరిష్కారం చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, డొక్కా మాణిక్యవరప్రసాద్, డాక్టర్ శేషయ్య తదితరులు

ముగిసిన గుంటూరు టీ10 క్రికెట్ లీగ్ పోటీలు

● ఛాంపియన్స్‌గా నిలిచిన నవాబ్ 11 జట్టు

● ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్ పోరు

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్ర పవనిజం అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జేకేసీ గ్రౌండ్‌లో టి10 క్రికెట్ లీగ్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ముగిసాయి. ఫైనల్ పోరు రసవత్తరంగా, ఉత్కంఠ భరితంగా సాగింది. ఛాంపియన్స్‌గా నవాబ్ 11 జట్టు విజయం సాధించింది. రన్నర్స్‌గా గుంటూరు మిర్చి జట్టు గెలుపొందింది. విజేతలకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, డాక్టర్ నిమ్మల శేషయ్య బహుమతులు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు దాతల ద్వారా ప్రత్యేక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలని కోరారు. డాక్టర్ రాయపాటి మాట్లాడుతూ క్రీడలతోనే సమాజంలో ప్రత్యేక గుర్తింపు వస్తుందని, ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాలని కోరారు. డాక్టర్ శేషయ్య మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేందుకే క్రీడా పోటీలను నిర్వహించేందుకు పవనిజం అసోసియేషన్ చేస్తున్న కృషిని అభినందించారు. పోటీలకు సహకరించిన దాతలను అధ్యక్షుడు కొణిదె గోపీకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, కిషోర్, వినోద్, అంజి, భరత్, యశ్వంత్ తదితరులు పోటీలను పర్యవేక్షించారు.

రాష్ట్రంలో శాంతి, భద్రతల పరిరక్షణకు కృషి జరగాలి

● మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాదు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పాలక, ప్రతిపక్ష పార్టీలు సమన్వయంతో పని చేసి రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన నివాసంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బూతులు, దాడులతో రాష్ట్ర ప్రతిష్ట దిగజారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జోగి రమేష్, అంబటి రాంబాబు లాంటి నాయకులు నీచ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలు, ఇతర పరిస్థితులు లేనప్పటికి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకర మన్నారు. అదేసమయంతో ప్రతిపక్ష నాయకుల నివాసాలపై కూటమి కార్యకర్తలు దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. పాలక, ప్రతిపక్ష నాయకులు పరస్పరంగా సహకరిస్తూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై త్వరలోనే మేధావులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లింగంశెట్టి ఈశ్వరయ్య, డీఎబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, అంగిరేకుల వరప్రసాదు యాదవ్ పాల్గొన్నారు.

ట్రంప్ విధానాలతో ప్రపంచ శాంతికి ముప్పు : ముప్పాళ్ల

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధానాలతో ప్రపంచ శాంతి ప్రమాదంలోకి నెడుతున్నాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. గుంటూరు, సీపీఐ కార్యాలయంలో 'ట్రంప్ యుద్ధోన్మాదం-ప్రపంచ శాంతి' అనే అంశంపై జరిగిన చర్చా వేదికలో ఆయన ప్రసంగించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనను వ్యతిరేఖించే దేశాలపై దిగుమతి సుంకాలను విచక్షణ లేకుండా పెంచారని అన్నారు. అంతేగాక భారతీయులతో సహా ఇతర దేశాల వలసదారులను అమెరికా నుంచి బలవంతంగా పంపించడం అన్యాయమని మండిపడ్డారు. ప్రధాన వక్తగా ఆల్ ఇండియా ప్రోగ్రెస్ ఫోరం జాతీయ కార్యదర్శి సంగిరెడ్డి హనుమంత రెడ్డి మాట్లాడుతూ వెనుజువెలాపై జరిగిన దాడి అత్యంత దారుణమన్నారు. ఈ చర్చావేదికకు సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షత వహించగా, సమావేశంలో మేడా హనుమంతరావు, చిన్ని తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి

● సహకార సంఘాల ఉద్యోగుల ఐక్యవేదిక అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్‌ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు కోరారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ ఉద్యోగులు చేపట్టిన దశల వారీ ఆందోళనలలో భాగంగా స్థానిక శ్యామలనగర్‌లోని సహకార కార్యాలయం ఎదుట చేపట్టిన ఉద్యోగుల నిరసనలు మంగళవారం నాటికి ఆరవ రోజుకు చేరుకున్నాయి. వంట-వార్పు చేపట్టి తమ నిరసనను తెలిపారు. ఆయన మాట్లాడుతూ సహకార ఉద్యోగులు అడిగే న్యాయమైన డిమాండ్లతో ప్రభుత్వ ఖజానాపై ఎటువంటి భారం పడదన్నారు. సమస్యలు పరిష్కరించని నేపథ్యంలో 13న కార్యాలయాల ముట్టడి, 16 నుంచి సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. నిరసనల్లో కృష్ణా జిల్లా సంఘ నాయకులు రామాంజనేయులు, కృష్ణారావు, గుడివాడ హనుమంతురావు, రాజా, రవికుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గోరంట్ల, అమరావతి రోడ్డు, విజయదుర్గ నగర్, హోసన్న మందిర్, శ్రీలక్ష్మీ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్.గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

అథ్లెటిక్స్‌లో రజత పతకం సాధించిన హోంగార్డు కృష్ణ కిషోర్

● అభినందించిన ఎస్పీ వకుల్ జిందాల్



ఎస్పీ చేతుల మీదుగా పతకం అందుకుంటున్న హోంగార్డు

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కేరళ రాష్ట్రం తిరువనంతపురం నగరంలోని చంద్రశేఖర్ నాయర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ లో జిల్లా హోంగార్డు జి.కృష్ణ కిషోర్ ప్రతిభ కనబరిచారు. రేస్ వాక్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆయన రెండవ స్థానం సాధించి రజత పతకాన్ని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్‌ని హోంగార్డు జి. కృష్ణ కిషోర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్తులో జరగబోయే పోటీలలో మరిన్ని పతకాలు సాధించి గుంటూరు జిల్లా పేరు ప్రతిష్టలను మరింత ఉన్నతంగా నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఏఆర్ ఏ హనుమంతు, హోమ్ గార్డు ఆర్ఐ రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక దృఢత్వం

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : యోగాతో శారీరక దృఢత్వం, మానసిక స్థిరత్వం, ఆలోచనా సామర్థ్యం పెరుగుతాయని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ విభాగం సిబ్బందికి మూడు రోజులుగా నిర్వహిస్తున్న మొబిలైజేషన్ (శిక్షణ) కార్యక్రమంలో భాగంగా, మంగళవారం పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్) ఏ.హనుమంతు ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బందికి యోగా అభ్యాస కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ సిబ్బందితో వివిధ యోగాసనాలు, శ్వాసాభ్యాసాలు చేయించడమేకాక, యోగా వలన కలిగే శారీరక, మానసిక ప్రయోజనాలను వివరించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ యోగా, ధ్యానం మనిషి శారీరక, మానసిక స్థితిగతులను సానుకూలంగా మార్చగల శక్తిని కలిగి ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సంకురయ్య, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, సురేష్, శివరామకృష్ణ, శ్రీనివాసరావు, రామకృష్ణారెడ్డి, పోలీస్ అధికారులు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

జీడీసీసీ బ్యాంక్ కుంభకోణం కేసులో మరో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్ డీఎస్పీ మధుసూదన్‌రావు వెనుక నిందితుడు వెంకటేశ్వరరావు

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జీడీసీసీ బ్యాంకులో జరిగిన కోట్లాది రూపాయల కుంభకోణం కేసులో మరో నిందితుడిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు మంగళవారం సీసీఎస్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డీవీ మధుసూదనరావు నిందితుడిని మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. ఈ కేసులో ఎనిమిదవ నిందితుడైన బాపట్ల పటేల్ నగర్ కు చెందిన పీట వెంకటేశ్వరరావు ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, సీసీఎస్ డీఎస్పీ బి.వి. మధుసూదనరావు ఆధ్వర్యంలో నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన నిధుల దుర్వినియోగం కేసులో ఎనిమిదవ నిందితుడు వెంకటేశ్వరరావును అరెస్టు చేశారు. నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో గత నవంబరున జీడీసీసీ బ్యాంకులో కుంభకోణంపై కేసు నమోదు అయిందన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి న్యాయస్థాన కస్టడీకి ఆదేశించినట్లు తెలిపారు. ఈ కేసులో ఇంకా కొంతమంది నిందితులు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని డీఎస్పీ బీవీ మధుసూదనరావు పేర్కొన్నారు.

ఖజానా జ్యువెలరీ దుకాణంలో చోరీ

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాడీపేట నాలుగో లైన్ లో గల ఖజానా జ్యువెలరీ దుకాణంలో బంగారం చోరీ జరిగింది. బంగారం కొనుగోలు చేసేందుకు వచ్చినట్లుగా నటించిన ఇరువురు మహిళలు లక్ష ఖరీదైన బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అరండల్‌పేట 10వ లైనుకు చెందిన శేఖర్ నగిన అనే మహిళ నాలుగేళ్లుగా ఖజానా జ్యువెలరీ దుకాణంలో సేల్స్ గర్ల్‌గా పని చేస్తుంది. గత నెల 31న ఆమె విధుల్లో ఉన్న సమయంలో ఇరువురు మహిళలు దుకాణానికి వచ్చారు. అనేక రకాల ఆభరణాలు చూస్తున్నట్లు నటించారు. ఆ తర్వాత వారు ఏమి కొనకుండా వెళ్లిపోయారు. ఆ తరువాత దుకాణంలో పరిశీలించగా 2 చంప సవరాలు కనిపించలేదు. వాటి ఖరీదు లక్ష ఉంటుందని నగిన తెలిపారు. దీంతో దుకాణంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా బంగారు ఆభరణాలు కొనడానికి వచ్చినట్లుగా నటించిన ఇరువురు మహిళలు ఆయా ఆభరణాలు తీసుకెళ్లినట్లు ఆయా దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీలో రికార్డ్ అయ్యాయి. దీంతో నగినా ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబటి కుటుంబ సభ్యులకు అనీల్‌కుమార్ యాదవ్ పరామర్శ

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి అనీల్‌కుమార్ యాదవ్ మంగళవారం పరామర్శించారు. గుంటూరులోని సిద్ధార్థనగర్‌లోని అంబటి నివాసానికి ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌తో కలిసి అనీల్‌కుమార్ యాదవ్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అంబటి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మాజీ మంత్రులు మేకతోటి సుచరిత, మురుగుడు హనుమంతరావు, అన్నాబత్తుని శివకుమార్, అంబటి మురళీ కృష్ణ, బలసాని కిరణ్‌కుమార్, దొంతిరెడ్డి వేమారెడ్డి, వనమా బాలవజ్ర బాబు, గులాం రసూల్ పలువురు నేతలు అంబటి నివాసానికి చేరుకున్నారు. వైసీపీ అధినేత జగన్ గుంటూరు పర్యటన ఖరారైన నేపథ్యంలో అంబటి కుటుంబ సభ్యులకు వివరాలను తెలియజేశారు. కాగా మాజీ మంత్రి అనీల్‌కుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడకుండానే వెళ్ళిపోయారు.

జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్

● అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు నిర్వహిస్తే కఠిన చర్యలు

● ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలను, శాంతిని, ప్రశాంతతను కాపాడటానికి, ప్రజల రాకపోకలను నియంత్రించడానికి, ఆంధ్రప్రదేశ్ పోలీస్ చట్టం, 1861లోని సెక్షన్ 30 జిల్లా పరిధిలో అమలులో ఉందన్నారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఆంక్షలు, నియంత్రణ చర్యలు అమలులో ఉంటాయన్నారు. పోలీస్ అధికారి నుంచి ముందస్తు రాతపూర్వక అనుమతి లేకుండా ఏదైనా రాజకీయ ర్యాలీ, ఊరేగింపు, సమావేశం, ప్రదర్శనను నిర్వహించడం, వాటిలో పాల్గొనడం కచ్చితంగా నిషేధించబడిందన్నారు. పోలీస్ సెక్షన్ 30 కింద జారీ చేయబడిన ఆదేశాలను ఉల్లంఘించినా లేదా ధిక్కరించినా చట్ట నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

పార్టీ ముసుగులో టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తున్న జగన్

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైసీపీ పార్టీ ముసుగులో టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తున్నాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో శాంతిని, ప్రజాస్వామ్యాన్ని, అభివృద్ధిని ధ్వంసం చేయాలని జగన్ కంకణం కట్టుకున్నాడన్నారు. కొన్ని వర్గాలను ఎంచుకొని స్లీపింగ్ సెల్స్‌గా తయారు చేస్తున్నాడని, అంబటి, జోగి, పేర్ని జగన్ సైకో తత్వానికి బలైపోతున్నారన్నారు. నాయకుల స్థాయి నుంచి దిగజారి వారి కుటుంబాల్లో కూడా ఛీత్కారానికి గురవుతున్నారన్నారు. అంబటి, జోగి బలవంతంగా వారి కుటుంబాల్లోని ఆడవారి చేత సెంటిమెంటును రగిలించాలని చూస్తున్నారన్నారు. జగన్ కులాలను అడ్డుపెట్టుకొని రాష్ట్రంలో సృష్టించాలనుకుంటున్న అరాచకాలకు, విధ్వంసకాలకు పన్నే కుట్రల్లో ఎవరూ ట్రాప్‌లో పడొద్దని హితవుపలికారు. అంబటి, జోగిలాంటి వారు జగన్ ఎత్తుగడలకు బలైపోవడమే కాకుండా రాష్ట్రంలో విచ్ఛిన్నకారులుగా మిగిలిపోతున్నారు. అది వారు గుర్తెరగాలని సూచించారు.

శ్రవణానందంగా సాగిన భక్తి గీతాలాపన

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శ్రీ సాయి సంగీత కళా నిలయ సంస్థ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. సుమారు 52 మంది చిన్నారుల అన్నమయ్య కీర్తనలను గానం చేసి ప్రేక్షకులను శ్రవణానందం చేశారు. అనంతరం సీనియర్స్, కీబోర్డ్ కళాకారులు భక్తిగీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వివా ది స్కూల్ డైరెక్టర్ కోయ శ్రీనివాసరావు, హెల్త్ ఆస్పత్రి డాక్టర్ దుంప రవీంద్రరెడ్డి, టూబాకో బోర్డ్ మెంబర్, కొప్పరావూరి అగ్రో ప్రొడక్ట్ ఫౌండర్ కె. రమేష్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఏ.ఐ.ఆర్. బి హైగ్రేడ్, టీటీడీ ఆర్టిస్ట్ బి భువనేశ్వరికి సంగీత సుధామయి బిరుదు ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా నృత్య కళాభారతి అధ్యక్షుడు నాట్యాచార్యులు ఎన్.బాలు వ్యవహరించగా, వ్యవస్థాపక అధ్యక్షుడు తిన్నలూరి హరిబాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సమ్మెకు సహకరించండి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను హరించే విధంగా తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న తలపెట్టిన సమ్మెకు సహకరించాలని సీఐటీయూ నగర కన్వీనర్ బి.ముత్యాలరావు కోరారు. నగరంలో పలు అర్బన్ హెల్త్ సెంటర్ అధికారులకు ఆశావర్కర్లతో కలిసి ఆయన సమ్మె నోటీసులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సమ్మె సందర్భంగా 12వ తేదీన స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి వేలాది మందితో జరిగే కార్మిక ప్రదర్శనలో ఆశా వర్కర్స్ అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నళినీకాంత్, ఎల్.అరుణ, షేక్ ఖాశీం షహీద్, టి శ్రీనివాసరావు, షేక్ ఖాశీం వలి, ఎస్ కార్తీక్, ఆది నికల్సన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు శివ, పార్వతుల కల్యాణం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్, ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం సాయంత్రం 6 గంటలకు శ్రీ భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యుడు బోడేపూడి వెంకట సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు కల్యాణాన్ని తిలకించాలని కోరారు.



2027 నాటికి రైతులందరికీ ప్లాట్లు

- పెండింగులో ఉన్న ప్లాట్ల పంపిణీకి కసరత్తు
- రిజిస్ట్రేషన్ కోసం ఏపీ సీఆర్డీఏ యాక్షన్ ప్లాన్ సిద్ధం
- హద్దురాళ్లు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళిక
- పలు కారణాలతో పెండింగులో ఉన్న మొత్తం ప్లాట్లు 7,273
- లంక భూములకు సంబంధించినవి మరో 356

● ఈ ఏడాది చివరినాటికి 35 శాతం మందికి ప్లాట్లు

రాజధాని రైతులకు ప్రభుత్వం తిరిగి ఇవ్వాల్సిన ప్లాట్లు ఇప్పటికీ అందకపోవడంతో రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఏపీ సీఆర్డీఏ రైతులకు ప్లాట్లను అభివృద్ధి చేసి ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ఏడాది డిసెంబరు చివరి నాటికి 35 శాతం మందికి, 2027 జూన్ నాటికి 70 శాతం మందికి, 2027 డిసెంబరు 31 నాటికి నూరు శాతం మందికి అన్ని హద్దురాళ్లను ఏర్పాటు చేసి, వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించి అందజేసేందుకు సీఆర్డీఏ ప్రతిపాదించింది. ఈ ఏడాది చివరికల్లా 220కేవీ, 400కేవీ విద్యుత్ లైన్ల ఏర్పాటును పూర్తి చేసేందుకు ప్లాన్ సిద్ధం చేసింది. అన్ని పత్రాలు సమర్పిస్తే 15 రోజుల్లోనే ప్లాట్లను రిజిస్టర్ చేసేలా చర్యలు తీసుకుంది. 2026 చివరికల్లా రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేయాలని భావిస్తోంది.

మంగళగిరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాజధాని కోసం భూములిచ్చిన రైతులందరికీ 2027 డిసెంబరు నాటికి సమస్యలన్నీ పరిష్కరించి రిటర్నబుల్ ప్లాట్లు అందజేసేందుకు ఏపీ సీఆర్డీఏ ప్రణాళికలు సిద్ధం చేసింది. సామాజిక తనిఖీలో భాగంగా రైతులకు ఇవ్వాల్సిన రిటర్నబుల్ ప్లాట్ల పంపకానికి సంబంధించి రెండేళ్ల యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన రిటర్నబుల్ ప్లాట్లకు సంబంధించి రైతుల నుంచి పలు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఆ కారణంగా రైతులు చాలా మంది ప్లాట్లను తీసుకోవడానికి నిరాకరించారు. దీంతో వాటి పంపకం ఆగిపోయింది. ఇప్పుడు ఆ సమస్యలన్నింటినీ పరిష్కరించి రైతులకు ప్లాట్లు అందించేందుకు సీఆర్డీఏ ప్రణాళికను రూపొందించింది.

పెండింగులో ఉన్న ప్లాట్ల వివరాలు

రైతులు	ప్లాట్లు	కారణం
70	312	కోర్టు వివాదం
254	1,170	భూసేకరణ ప్రాంతంలోవి
450	1,891	వివాదంలో ఉన్న ప్రాంతం
81	215	కేటగిరీ- 4 (పీఓటీ) కేసుల్లో ఉన్నవి
32	69	ఈనామ్, దేవాదాయ వివాదాల్లోనివి
305	635	చనిపోయిన, ఎఫ్‌ఎంసీ సమర్పించనివి
199	428	ఎన్‌ఆర్‌ఐలకు సంబంధించినవి
282	1,039	ప్లాట్ల యజమానులు స్పందించనివి
241	1,514	ఇంకా రిజిస్టర్ చేయాల్సినవి
1,914	7,273	
లంక భూములు..		
రైతులు	ప్లాట్లు	
44	98	రిజిస్ట్రేషన్ అయిననవి
131	258	రిజిస్ట్రేషన్ కావాల్సినవి
175	356	

● 1,914 మంది రైతులకు 7,273 ప్లాట్లు పెండింగ్

రాజధాని అమరావతి నిర్మాణం కోసం 29 గ్రామాలకు చెందిన 29,664 మంది రైతులు 34,962 ఎకరాల భూమిని భూ సమీకరణ కింద ప్రభుత్వానికి అందజేశారు. అందుకుగాను ప్రభుత్వం వీరికి నివాస, వాణిజ్య యోగ్యమైన రిటర్నబుల్ ప్లాట్లను అందిస్తోంది. మొత్తం 29,664 మంది రైతులకుగాను 72,137 ప్లాట్లను రిజిస్టర్ చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 63,584 ప్లాట్ల రిజిస్ట్రేషన్ మాత్రమే పూర్తయింది. వివిధ కారణాలతో ఇంకా 1,914 మంది రైతులకు సంబంధించి 7,273 ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తి కాలేదని ఏపీ సీఆర్డీఏ సోషల్ ఆడిట్ ప్రణాళికలో స్పష్టం చేసింది.

● భూసమీకరణకు ముందుకు రాని వారితో చర్చలు

ఈ ఏడాది చివరికల్లా తప్పులు లేని రిజిస్ట్రేషన్ పత్రాలు అందించాలని స్పష్టం చేసింది. భూసమీకరణకు ముందుకురాని వారిని ఒప్పించేందుకు వారితో చర్చించే కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ మార్చి నెలాఖరుకల్లా జరీబు భూముల సమస్య, మే 31 నాటికి గ్రామకంఠ భూముల సమస్య, జూన్ 30 నాటికి లంక భూముల సమస్య పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగా, రైతులకు ఇచ్చిన ప్లాట్లపై రుణ సదుపాయం కల్పించేందుకు స్థానిక సీఆర్డీఏ కార్యాలయాలు బ్యాంకర్లతో చర్చించి వారిని ఒప్పించాలని సూచించింది. ప్రజలకు జీవన అవకాశాలు పెంపొందించేందుకు వారిలో నైపుణ్యాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించింది. అందుకోసం ఈ మార్చి 31 నాటికి డిజిటల్ ట్రాకింగ్ విధానాన్ని అందుబాటులోకి తేనుంది. స్థానిక నైపుణ్యాలను, ఉపాధి కల్పన, ఉద్యోగ అవకాశాల పెంపు వంటి అంశాలపై కూడా ప్లాన్ సిద్ధం చేసింది.



- భక్తులతో కిటకిటలాడిన పెదవడ్లపూడి
- బాబాను దర్శించుకున్న ప్రముఖులు

మంత్రి నిమ్మల రామానాయుడుకు జ్ఞాపికను అందజేస్తున్న పాతూరి నాగభూషణం

వేడుకగా బాబా మందిర వార్షికోత్సవం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో వేంచేసియున్న భగవాన్ శ్రీ సత్య షిరిడీ సాయిబాబా మందిరం 20వ వార్షికోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు, పలువురు ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పెదవడ్లపూడి గ్రామంలో తిరునాళ్ల వాతావరణం నెలకొంది. రామినేని ఫౌండేషన్ ఛైర్మన్ ధర్మ ప్రచారక్ ఆధ్వర్యంలో స్వామికి క్షీరాభిషేకం, అన్నాభిషేకం చేశారు. బాబాను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు, పారిశ్రామికవేత్తలు సాయిబాబాను దర్శించుకోగా, ఆలయ కమిటీ ఛైర్మన్ పాతూరి నాగభూషణం, కమిటీ ప్రతినిధులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికి బాబా జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, ఇరవై సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, చేనేత జౌళిశాఖ ప్రధాన కార్యదర్శి సిసోడియా, మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ శ్రీహరిరావు, మాజీ ఎంపీ గరికపాటి మోహనరావు, నార్త్ అమెరికా ఏపీ ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరామ్, విశ్రాంత డీజీపీ మాలకొండయ్య, నాదెళ్ల గంగాధర్, బీజేపీ ఎస్సీ సెల్ రాష్ట్ర మోర్చా అధ్యక్షుడు పంతల సురేష్, ఎన్నారైలు యలమంచిలి జగదీశ్‌బాబు, కావూరి ప్రసాద్ తదితరులు బాబాను దర్శించుకున్నారు. సాయి మందిర వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత విభావరి, హాస్యవల్లరి, డూప్ స్టార్స్ మిమిక్రీ, సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

కొండవీడుపై లుక్కు.. కోటయ్యకేదీ దిక్కు

(5వ పేజీ తరువాయి)

పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మహా శివరాత్రి సందర్భంగా కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి సన్నిధిలో జరిగే తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదాలో జరిగే తిరునాళ్ల ఏర్పాట్లకు అధికారులు ఏటా నిధుల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పైగా ఏళ్ల తరబడి కోటయ్య తిరునాళ్ల ఏర్పాట్ల బకాయిలు రూ.4.20 కోట్లు పేరుకుపోయి ఉన్నా వాటి గురించి పరిశీలన కూడా చేయడంలేదు. ఈ పరిస్థితుల్లో మహాశివరాత్రి సమీపిస్తున్నా అధికారులు ఇంకా ఏర్పాట్లు చేపట్టకపోవడం గమనార్హం. తిరునాళ్ల ఏర్పాట్లపై కలెక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన కోటప్పకొండలో బుధవారం జరిగే సమావేశానికి దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరు కానున్నారు. ఈ సమావేశంలో అయినా నిధుల సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని అధికారులతో పాటు భక్తులు కోరుతున్నారు.

వీఐపీ పాసులకు చెల్లుచీటీ

తిరునాళ్లకు సంబంధించి వీఐపీ పాసులకు ఈ ఏడాది చెల్లుచీటి ఇచ్చినట్లే. ఆదాయం, భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీఐపీ పాసులను రద్దు చేయాలని దేవదాయశాఖ నిర్ణయం తీసుకుంది. వీఐపీ దర్శన టిక్కెట్లను ఆన్‌లైన్ విధానంలో కూడా విక్రయించాలని అధికారులు నిర్ణయించారు.

కోటప్పకొండ తిరునాళ్లకు తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకు రూ.17 లక్షలతో అధికారులు అంచనా రూపొందించి జడ్పీకి పంపారు. నిధులు మంజూరు కాకపోవడంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంకా పనులు చేపట్టలేదు. రెండేళ్లకు సంబంధించి రూ.20 లక్షలు బకాయిలు విడుదల చేయాల్సి ఉంది.

ఆలయంపైనా అలక్ష్యం

కోటప్పకొండలోని ఆలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లకు గతంలో ప్రభుత్వం రూ.30 లక్షలు విడుదల చేసేది. కొన్నేళ్లుగా ఈ నిధులు కూడా నిలిచిపోయాయి. ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు సుమారు రూ.2.10 కోట్లు విడుదల కావాల్సి ఉంది. ఈ ఏడాదికి కూడా రూ.30 లక్షలు విడుదల చేయాలని ఈవో చంద్రశేఖర రావు లేఖ రాశారు. అయితే దీనిపై దేవదాయశాఖ ఇంకా స్పందించలేదు.

పర్యాటక హబ్‌గా బాపట్ల

- సూర్యలంకను సందర్శించిన సింగపూర్ బృందం
- వారికి మాస్టర్‌ప్లాన్‌ను వివరించిన కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లల్లో బాపట్ల పర్యాటక హబ్‌గా మరనుందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ సింగపూర్ ప్రభుత్వాధికారుల బృందానికి వివరించారు. అమరావతి ఆర్థిక మండలిలలో భాగంగా జిల్లాలో అభివృద్ధి చేస్తున్న పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు సింగపూర్ ప్రభుత్వాధికారుల బృందం మంగళవారం జిల్లాకు చేరుకుంది. కలెక్టరేట్‌కు వచ్చిన సింగపూర్ ప్రభుత్వాధికారుల బృందానికి అధికారులు పూలమొక్కలతో ఘనంగా స్వాగతం పలికారు. బాపట్ల జిల్లా భౌగోళిక స్వరూప, వ్యవసాయ, ఆక్వాసాగుపై ఆధారపడిన పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులు, పర్యాటకరంగం అభివృద్ధికి సంబంధించి రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్ ప్రభుత్వాధికారుల బృందానికి కలెక్టర్ వివరించారు. స్వదేశీ దర్శన్ 2.0 ప్రాజెక్ట్ పేరుతో రూ.97.52 కోట్లతో సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. హౌస్‌బోటింగ్, మడ అడవుల అభివృద్ధికి, హైదరాబాద్ నుంచి బాపట్ల వరకు కారవాన్‌ను ఏర్పాటు చేశామన్నారు. సూర్యలంక బీచ్ వద్ద 2 కిలోమీటర్ల విస్తీర్ణంలో పర్యాటక ప్రాంతంగా మరింత అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.

● తీరంలో పర్యటించిన సింగపూర్ బృందం

సూర్యలంక, పాండురంగాపురం బీచ్‌లలో సింగపూర్ ప్రభుత్వాధికారుల బృందం కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. సూర్యలంకబీచ్‌లో జరుగుతున్న స్వదేశీ దర్శన్ పర్యాటక అభివృద్ధి ప్రాంతాలను పరిశీలించారు. సూర్యలంక బీచ్ గుంతలు లేకుండా సజావుగా సురక్షితమైన ప్రాంతమని కలెక్టర్ వివరించారు. సున్నితమైన సన్నఇసుక, పరిశుభ్రత ఈ బీచ్ ప్రత్యేకత అని తెలిపారు.

● బయోఫ్లాగ్ రొయ్యల సాగు పరిశీలన

తదనంతరం అడవి గ్రామపంచాయతీలో సురేష్ అనే ఆక్వారైతు 5 ఎకరాలలో ప్రారంభించిన రొయ్యల సాగు పరిశ్రమను బృందం పరిశీలించింది. పర్యావరణానికి ఎలాంటి హానిలేని బయోఫ్లాగ్ టెక్నాలజీతో 120 మిలియన్ రొయ్యపిల్లల ఉత్పత్తి ఒకేసారి చేపట్టడం అభినందనీయమని దక్షిణాసియా మిడ్డిల్ ఈస్ట్ అండ్ ఆఫ్రికా, సింగపూర్ మినిస్ట్రీస్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ చాంగ్ అన్నారు. పర్యటనలో సింగపూర్ ఎకనామిక్ కన్సల్టెంట్ ప్రైస్ సీఈవో చూతోకహిమ్, సింగపూర్ కోఆపరేషన్ ఎంటర్ ప్రైజ్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ త్యాలైన్ చీవో, సింగపూర్ సస్టైనబిలిటి స్టాటజిక్ ప్రాజెక్ట్ సీనియర్ మేనేజర్ నిషశర్ద, రాష్ట్ర ఆర్థిక గణాంకశాఖ డైరెక్టర్ బి.గోపాల్, ఆర్డీవో పి.గ్లోరియా, మత్స్యశాఖజెడి శ్రీనివాస్‌నాయక్, డీడీ గాలిదేముడు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



రొయ్యలసాగు యూనిట్‌ను సింగపూర్ అధికారుల బృందానికి వివరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

● గోవా బీచ్‌లా సూర్యలంక

ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ సీనియర్ డైరెక్టర్ ఫ్రాన్సిస్

దేశంలో గోవా బీచ్ మాదిరిగా సూర్యలంక బీచ్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయటం అభినందనీయమని దక్షిణాసియా మిడ్డిల్ ఈస్ట్ అండ్ ఆఫ్రికా, సింగపూర్ మినిస్ట్రీ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ ఛాంగ్ అన్నారు. అమరావతి ఆర్థికమండలి అభివృద్ధిలో భాగంగా మాస్టర్‌ప్లాన్‌లో రూపకల్పనలో అధికారుల భాగస్వామ్యం అమోదయోగ్యమన్నారు. పర్యాటక ప్రాంతంలో తాగునీరు సమృద్ధిగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. పీపీటీ ద్వారా అభివృద్ధిపై రూపొందించిన ప్రణాళిక చాలా బాగుందన్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి జలనరులను తెచ్చేందుకు సిద్ధం చేసిన ప్రణాళిక అద్భుతంగా ఉందని, ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాపట్ల నుంచి అమెరికాకు డ్రాక్రా, ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి చేయడం అభినందనీయమన్నారు.

మిర్చియార్డు పాలకవర్గ నియామకం

- చైర్మన్‌గా అప్పారావు, వైస్ చైర్మన్‌గా మల్లిక
- ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయంతో సభ్యుల ఎంపిక
- ముఖ్యమంత్రి ఆమోదంతో మార్కెటింగ్ శాఖకు ఆదేశాలు
- 6వ తేదీ సాయంత్రం లోపు జీవో విడుదల చేయాలని సూచన

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు (గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ) పాలక వర్గం నియామకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదముద్ర వేశారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మంగళవారం సాయంత్రం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ కమిషనరేట్‌కు ఆదేశాలు జారీ అయ్యాయి. ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ సహా మొత్తం 15 మంది పేర్లను మార్కెటింగ్ శాఖకు సీఎంవో పంపించింది. ఈ నెల 6వ సాయంత్రం లోపు జీవో విడుదల చేయాలని సూచించింది. దీంతో నెలకు పైగా కొనసాగుతోన్న పాలకవర్గం కూర్పు ఉత్కంఠకు తెరపడింది. కూటమి అధికారంలోకి వచ్చాక ఏడాదిన్నర తర్వాత అన్ని అవాంతరాలు తొలగించి కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 40 రోజుల క్రితమే ఛైర్మన్‌గా కుర్రా అప్పారావు పేరుని ఖరారు చేసింది. అయితే వైస్‌ఛైర్మన్, సభ్యుల పేర్ల ఎంపికలో కూటమిలో ధామాషా పాటించాల్సి ఉండటంతో కొంత ఆలస్యమైంది. ఎట్టకేలకు ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం కుదిర్చి మిగతా సభ్యుల పేర్లను సీఎంవో ఎంపిక చేసింది. వైస్‌ఛైర్మన్‌గా జనసేనకు చెందిన బిట్రగుంట మల్లికను నియమించింది. సభ్యులుగా కొనకళ్ల వెంకట సత్యన్నారాయణ, ముడావత్ మంగాబాయి, కాటంశెట్టి విజయలక్ష్మి, మొహమ్మద్ హఫీజ్, మేళం సైదయ్య, షేక్ ఖాదర్‌బీ, జాన్‌సైదా బత్తుల, విజయమ్మ దర్శనపు, చంద్రగిరి బాబు, ఇమ్మడి వెంకటలక్ష్మి, డాకుమళ్ల భాగ్యారావు, నక్కల వంశీకృష్ణ, కే శ్రావణకుమారిని నియమించాల్సిందిగా సీఎంవో ఆదేశాలు జారీ చేసింది.

కంటి ఇబ్బందితో చదువు ఆగకూడదు

- మంత్రులు సత్యకుమార్, మనోహర్
- తెనాలిలో రాష్ట్రవ్యాప్త ఉచిత కళ్లజోళ్ల పంపిణీ ప్రారంభం

తెనాలి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే చిన్నారులు ఎక్కువ శాతం పేదవారే ఉండటంవల్ల వారి కంటికి ఇబ్బంది వస్తే చదువు ఆగిపోకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తోందని రాష్ట్ర ఆరోగ్య మంత్రి సత్యకుమార్ చెప్పారు. గుంటూరు జిల్లా తెనాలిలో మంగళవారం రాష్ట్రవ్యాప్త ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని పౌరసరఫరాలమంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలసి ఆయన ప్రారంభించారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా తెనాలి కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని చిన్నారులకు కళ్లజోళ్లు అందించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, పేద విద్యార్థులు కంటి పరీక్షలు చేసుకోవటమే కష్టమవడంతో వారు అంధత్వానికి గురవుతున్నారని, ఫలితంగా విద్య మధ్యలోనే ఆగిపోతోందన్నారు. కొందరు చదవలేక ఉత్తీర్ణత సాధించలేకపోతున్నారన్నారు. దీనిని నివారించి విద్యావికాసంతోపాటు, వారి జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 6 నుంచి 18 సంవత్సరాలలోపు చిన్నారులకు ప్రభుత్వం ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కంటిచూపు సమస్య ఉన్న 94,689 మంది చిన్నారులను గుర్తించామని, వారందరికీ కళ్లజోళ్లు అందిస్తున్నామని తెలిపారు. దీనికోసం రూ. 2.52 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్యశాలల్లో స్పెషలిస్టుల కొరత ఎక్కువగా ఉందని, దీనిని అధికమించేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. కన్వీనర్ కోటాలో పీజీ పూర్తిచేసిన విద్యార్థులు ఇకపై 6 నెలల పాటు సెకండరీ హెల్త్ విభాగ వైద్యశాలల్లో పనిచేస్తారన్నారు. ఫలితంగా ఈ జనవరి నుంచి 392 మంది స్పెషలిస్ట్ డాక్టర్‌లు రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చారన్నారు. కేంద్రం నుంచి ఆయుష్ వైద్యశాలల నిర్మాణానికి రూ.250 కోట్ల నిధులు రాష్ట్రానికి సమకూరాయని తెలిపారు. వీటితో ఐదు 50 నుంచి 100 పడకల వైద్యశాలలు నిర్మించనున్నట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్యశాలల్లో ఇకపై గర్భిణీలకోసం టిఫా స్కానర్‌లు, పీపీపీ విధానంలో సీటీ స్కానర్‌లను ఏర్పాటు చేయనున్నట్టు మంత్రులు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్ గౌర్, కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సౌరభ్ గౌర్ తెనాలి ఆసుపత్రి మొత్తం తనిఖీ చేశారు. టాయిలెట్స్, ఆసుపత్రిలో పారిశుధ్యం, ల్యాబ్ సదుపాయాలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయనతోపాటు వైద్యవిధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ రంగారావు, సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి తదితరులున్నారు.



తెనాలి మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న మంత్రులు సత్యకుమార్, నాదెండ్ల మనోహర్, ప్రిన్సిపల్ సెక్రటరి సౌరభ్ గౌర్

కులం గుర్తొచ్చిందా..!

- పవన్‌పై మీ నాన్న చేసిన విమర్శలు గుర్తులేవా?
- అంబటి కుమార్తెపై జనసేన నాయకుల ధ్వజం

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అంబటి రాంబాబు ఇంటిపై జరిగిన దాడి సంఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించాలని, ఆయనే దీనికి బాధ్యత వహించాలని రాంబాబు కుమార్తె మౌనిక చేసిన వ్యాఖ్యలపై జనసేన నాయకులు స్పందించారు. మీ కుటుంబానికి నొప్పి తగిలితేనే మీకు కాపు కులం గుర్తుకొచ్చిందా అంటూ ఆమెను ప్రశ్నించారు. గతంలో అంబటి రాంబాబు పవన్ కల్యాణ్‌పై, ఆయన వ్యక్తిగత జీవితంపై చేసిన నీచమైన విమర్శలు మీకు గుర్తు లేవా అంటూ నిలదీశారు. పవన్ కల్యాణ్ కూడా కాపు కులస్తుడే, ఆయనపై విమర్శలు చేయవద్దని ఆ రోజు మీరు ప్రెస్‌మీట్ పెట్టి ఆయనకు బుద్ధి చెప్పలేదు కదా అంటూ హితవు పలికారు. అంబటి రాంబాబు ఒళ్లు బలిసి మాట్లాడితే దానికి టీడీపీ స్పందించిందని, ఇందులో జనసేనకు, ఉప ముఖ్యమంత్రికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏ సమస్య తలెత్తినా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను విమర్శించడం వైసీపీ నాయకులకు రివాజుగా మారిందని అన్నారు. మంగళవారం గుంటూరులోని జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు నాయబ్ కమాల్, వడ్రాణం మార్కండేయ బాబు తదితరులు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకులు అవకాశవాద రాజకీయాలు చేయడం మానుకుంటే మంచిదన్నారు. పవిత్రమైన తిరుపతి లడ్డూ కల్తీ విషయంపై రాష్ట్ర ప్రజల దృష్టిని మరల్చేందుకు వైసీపీ నాయకులు అంబటి రాంబాబు గొడవతో కొత్త నాటకానికి తెర తీశారని మండిపడ్డారు. తిరుపతి లడ్డూ కల్తీ జరిగిన విషయాన్ని సిట్‌తో పాటు ఇతర సంస్థలు నిర్ధారించినా వైసీపీ నేతలు మాత్రం కల్తీ జరగలేదని బుకాయిస్తున్నారని విమర్శించారు. గుంటూరులో జరిగిన సంఘటనలో పోలీసు అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించలేదని బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. నల్లపాడు, పట్టాభిపురం సీఐలు ఉదాసీనంగా వ్యవహరించడమే ఈ సంఘటనలకు ప్రధాన కారణమన్నారు. వీరిపై డీజీపీని కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని బోనబోయిన శ్రీనివాస్ వెల్లడించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బోనబోయిన, చిత్రంలో గాదె, కమాల్ తదితరులు

నేతన్నల బ్రాండ్ అంబాసిడర్



బడ్జెట్ అనగానే సామాన్యుడికి అంకెల లెక్కలు గుర్తొస్తాయి. కానీ, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ విషయంలో అంకెలకు మించి ఆమె వేషధారణలో ఒక ప్రత్యేక శైలి కనిపిస్తుంది. వరుసగా తొమ్మిదో ఏడాది బడ్జెట్ ప్రవేశపెడుతున్న వేళ పార్లమెంటు మెట్లు ఎక్కుతున్న నిర్మలమ్మను చూస్తే అదొక బడ్జెట్ ప్రసంగంలా మాత్రమే కాదు, భారతీయ చేనేత కళా ప్రదర్శనలా అనిపిస్తుంది.

కాంజీవరం కలనేత..

ఈ ఏడాది బడ్జెట్ కోసం నిర్మల తన సొంత రాష్ట్రమైన తమిళనాడుకు చెందిన చారిత్రక కాంజీవరం సిల్క్ చీరను ఎంచుకున్నారు. మెజెంటా రంగులో మెరిసిపోతున్న ఈ చీరపై బంగారు రంగు 'కట్టం' (గళ్లు), కాఫీ బ్రౌన్ బోర్డర్‌పై చేసిన సున్నితమైన పనితనం భారతీయ చేనేత కళా వైభవాన్ని చాటిచెప్పింది. అయితే, ఇందులో ఒక విశేషం ఉంది. ఇది జెర్రీతో చేసింది కాదు. పూర్తిగా దారంతో చేనేత చేసిన అరుదైన కళాఖండం.

తొమ్మిదేళ్ల ప్రస్థానం

నిర్మలమ్మ బడ్జెట్ ప్రయాణంలో గడిచిన తొమ్మిదేళ్లు ఒక అద్భుతమైన ఫ్యాషన్ ప్రస్థానం. 2019లో తన తొలి బడ్జెట్ కోసం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మంగళగిరి పట్టుచీరతో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన నిర్మల.. 2021లో తెలంగాణకు గర్వకారణమైన పోచంపల్లి ఇక్కత్ చీరను ధరించి తెలుగు నేతన్నల నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటారు. గతేడాది బీహార్‌కు చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత దులారీదేవి బహూకరించిన 'మధుబని' ఆర్ట్ చీరను ధరించారు. 2024 మధ్యంతర బడ్జెట్ వేళ పశ్చిమ బెంగాల్‌కు చెందిన నీలంరంగు టస్సర్ సిల్క్ 'కాంతా' వర్క్ చీరలో మెరిశారు. కర్ణాటకకు చెందిన 'కసూతి' ఎంబ్రాయిడరీ, ఒడిశాకు చెందిన 'బొంకై' హ్యాండ్లూమ్ చీరలు కూడా ఆమె గత బడ్జెట్ ప్రసంగాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఇందులో ముందుగా చీర బాడీని ఒక రంగులో నేస్తారు. బోర్డర్‌ను వేరే రంగులో వేరే దారంతో ప్రత్యేకంగా నేస్తారు. తర్వాత రెండు భాగాలను ఇంటర్‌లాక్ (పల్లు పద్ధతి) ద్వారా బలంగా కలుపుతారు. ఈ విధానాన్ని కొర్వై టెక్నిక్ అంటారు. ఈ చీరపై ఉన్న సంప్రదాయబద్ధమైన రుద్రాక్ష మోటిఫ్ దానికి మరింత పవిత్రతను తీసుకొచ్చింది. ఈ రుద్రాక్ష మోటిఫ్ మన ప్రాచీన ఆలయ వాస్తు శిల్పకళ నుంచి స్ఫూర్తి పొంది రూపొందించినది కావడంతో ఆ చీరకు ఒక దివ్యమైన కళా స్వరూపం చేకూరింది.

చలిని తట్టుకునేలా..

కేవలం సంప్రదాయానికే పరిమితం కాకుండా ఢిల్లీలోని కఠినమైన చలి వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని ఒక వినూత్న ప్రయోగం చేశారు. సాధారణంగా చీరలకు వేసుకునే బ్లౌజుకు బదులుగా చలిని తట్టుకునేలా టీషర్ట్ మెటీరియల్‌తో చేసిన ఫుల్ స్లీవ్స్, హైనెక్ క్రాఫ్ టాప్‌ను ధరించారు. ఢిల్లీ ప్రజలు చలి కోసం సాధారణంగా శాలువాలు కప్పుకుంటారు. కానీ శాలువా కప్పుకునే పని లేకుండా ఈ టీషర్ట్ బ్లౌజ్ నిర్మలకు ఎంతో సౌలభ్యాన్ని, పవర్‌ఫుల్ లుక్‌ను అందించింది.



బ్రీఫ్‌కేస్ నుంచి బహీ ఖాతా వరకు

కేవలం చీరలే కాదు, పరిపాలన సంప్రదాయాల్లోనూ నిర్మల విప్లవాత్మక మార్పులు తెచ్చారు. గతంలో బ్రిటిష్ కాలం నాటి బ్రీఫ్‌కేస్ సంప్రదాయాన్ని పక్కన పెట్టి భారతీయ శైలిలో ఎరుపు రంగు పట్టు వస్త్రంలో చుట్టిన 'బహీఖాతా'ను ప్రవేశపెట్టారు. ఇప్పుడు డిజిటల్ బడ్జెట్ కాలంలోనూ ట్యాబ్‌ను కూడా అదే సంప్రదాయ ఎరుపురంగు బ్యాగ్‌లో తీసుకెళ్తూ పాత సంప్రదాయాన్ని, కొత్త సాంకేతికతను సమన్వయం చేశారు. ఇలా ప్రతి బడ్జెట్ వేళ నిర్మలమ్మ తన వస్త్రధారణ ద్వారా దేశంలోని ఏదో ఒక మూల ఉన్న చేనేత కళాకారుడికి గౌరవాన్ని, గుర్తింపును అందిస్తూనే ఉన్నారు.



• భార్గవి కూనం
డిజైనర్, హైదరాబాద్

పాత వస్తువులకు కొత్త కళ

మీ ఇంట్లో వాడని పాత వస్తువులు ఉన్నాయా? వాటిని పారేయకండి. ఇలా చేస్తే అవి కొత్త వాటిలా కళకళలాడిపోతాయి.



గాజుసీసాలు: ఖాళీగా ఉన్న జామ్ లేదా సాస్ గాజు సీసాలను శుభ్రం చేసి వాటికి రంగురంగుల దారాలు చుట్టండి. లేదంటే, అక్రిలిక్ పెయింట్స్ వేయండి. ఇవి అద్భుతమైన ఫ్లవర్‌వాజులుగా మారిపోతాయి.

పాత కప్పులు: హ్యాండిల్ విరిగిపోయిన, లేదా వాడకుండా పక్కనపెట్టిన సెరామిక్ కప్పుల్లో చిన్నచిన్న సక్యులెంట్ మొక్కలను నాటండి. వీటిని మీ వర్క్ టేబుల్ లేదా కిటికీ దగ్గర పెడితే ఆ ప్రదేశమే మారిపోతుంది.

చిన్న గదిని విశాలంగా మార్చేయండిలా

ఇల్లు చిన్నదైనా చూసేవారికి పెద్దగా కనిపించాలంటే ఈ ట్రిక్స్ ఫాలో అవండి.

లేత రంగుల మాయాజాలం: గది గోడలకు వైట్, క్రీమ్ లేదా లైట్‌బ్లూ వంటి లేత రంగులు వాడండి. ఇవి వెలుతురును ఎక్కువగా ప్రతిబింబించి గది పెద్దదిగా కనిపించేలా చేస్తాయి.



కర్టెన్ల అమరిక: కిటికీ సైజు ఎంత ఉన్నా కర్టెన్ రాడ్‌ను మాత్రం పైకప్పుకు దగ్గరగా అమర్చండి. కరెన్లు కింద నేల వరకు వేలాడుతుంటే గది ఎత్తు ఎక్కువగా కనిపిస్తుంది.

మల్టీపర్పస్ ఫర్నిచర్: కింద స్టోరేజ్ ఉన్న బెడ్స్ లేదా సోఫా కమ్ బెడ్స్ వాడటం వల్ల వీలుగా ఉండటమే కాకుండా గదిలో ఖాళీ స్థలం ఎక్కువగా మిగులుతుంది.

డాక్టర్, ఎంబీయే, లా.. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల గ్రూప్-1 టాపర్. అలుపెరగని అన్వేషణ, పట్టువదలని ప్రయత్నం.. ఇవన్నీ కలగలిస్తే ఆమే లక్ష్మీదీపికా కొమ్మిరెడ్డి. నేటి యువతకు ఆమె నిలువెత్తు స్ఫూర్తి.

విజయ లక్ష్మి

విజయానికి అడ్రస్ ఎక్కడ అని వెతికితే లక్ష్మీ దీపికా కొమ్మిరెడ్డి ప్రయాణమే ఒక నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తుంది. ఒక మనిషి తన జీవితకాలంలో ఒక్క రంగంలో నిష్ణాతులు కావడమే గొప్ప విషయం అనుకుంటే.. ఆమె మాత్రం అడుగుపెట్టిన ప్రతిచోటా తన ముద్ర వేస్తున్నారు. వైద్య విద్య నుంచి మేనేజ్‌మెంట్ వరకు.. న్యాయశాస్త్రం నుంచి పరిపాలనా సేవల వరకు ఆమె ప్రస్థానం అప్రతిహతంగా సాగుతోంది. సామాజిక బాధ్యతతో కూడిన వ్యాపారావేత్తగా కూడా రాణిస్తూ నేటి తరం మహిళలకు ఐకాన్‌గా నిలుస్తున్నారు. తాజాగా తెలుగు రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాల్లో అగ్రస్థానంలో నిలిచి అందరినీ ఆశ్చర్యపరిచారు.

వైద్యం నుంచి ప్రజాసేవ వైపు

హైదరాబాద్ ఏఎస్‌రావునగర్‌లో స్థిరపడిన లక్ష్మీదీపిక చిన్నప్పటి నుంచి చదువులో మేటి. సఫిల్‌గూడ డీఏవీ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్ నారాయణగూడలో పూర్తి చేసిన ఆమె 2013లో మెడిసిన్ ఎంట్రన్స్‌లో 119వ ర్యాంకు సాధించి ఉస్మానియా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. సాధారణంగా మెడిసిన్ పూర్తయ్యాక డాక్టర్లు విదేశాలకు వెళ్లాలని కలలు కంటారు. కానీ ఉస్మానియా ఆసుపత్రిలో హౌస్ సర్జన్‌గా పనిచేస్తున్నప్పుడు ఆమె చూసిన నిరుపేద రోగుల కష్టాలు ఆలోచింపజేశాయి. మందులతో జబ్బును నయం చేయడం కంటే ప్రభుత్వ వ్యవస్థలో ఉండి విధాన నిర్ణయాలు తీసుకుంటే మరింత ఎక్కువమందికి సేవ చేయవచ్చన్న సంకల్పం ఆమెను సివిల్ సర్వీసెస్ వైపు నడిపించింది.



అరుదైన రికార్డు

దీపిక ప్రస్థానంలో ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ మొదటి మలుపు. తొలుత ఎంపీడీవో పోస్టు వచ్చినప్పటికీ తన లక్ష్యం పెద్దదని నమ్మి ఆ ఉద్యోగంలో చేరలేదు. తన పట్టుదలపై ఉన్న నమ్మకంతో తెలంగాణ గ్రూప్-1 పరీక్షలు రాసి 550 మార్కులతో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పొందుతుండగానే ఏపీ గ్రూప్-1 ఫలితాలు వెలువడ్డాయి. అందులోనూ ఆమె తన సత్తా చాటుతూ రాష్ట్రస్థాయిలో మళ్లీ మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఇలా రెండు రాష్ట్రాల్లోనూ ఏకకాలంలో టాపర్‌గా నిలవడం అరుదైన రికార్డు. ఈ పోటీ పరీక్షల ఒత్తిడిలోనూ ఉస్మానియాలో లా చదువుతూనే, ఎంబీయే కూడా పూర్తిచేయడం ఆమె బహుముఖ ప్రజ్ఞకు నిదర్శనం.

అంకితభావానికి నిదర్శనం

లక్ష్మీదీపికకు వృత్తిపట్ల ఉండే నిబద్ధతను చాటిచెప్పే ఒక సంఘటన గురించి సీనియర్ అధికారులు గర్వంగా చెప్పుకుంటారు. నవంబర్ 2న ఆమెకు వివాహం జరగ్గా కేవలం ఐదు రోజులే సెలవు తీసుకున్నారు. వివాహం ముగిసిన మరుసటి రోజే తిరిగి సంగారెడ్డిలో విధులకు హాజరై అంకిత భావం చాటుకున్నారు. అమలాపురం, పశ్చిమ గోదావరి మూలాలున్న ఆమె కుటుంబ 50 ఏళ్ల క్రితమే హైదరాబాద్‌లో స్థిరపడింది. తన ప్రయాణం ఇంకా ముగియలేదని, మిగిలి ఉన్న సివిల్స్ అవకాశాలను వినియోగించుకుని ఐఏఎస్ లేదా ఐపీఎస్ సాధించి దేశ సేవలో భాగం కావడమే తన అంతిమ లక్ష్యమని చెప్పుకొచ్చారు. పట్టుదల ఉంటే ఏ కల అయినా సాధ్యమేనని నిరూపిస్తున్న లక్ష్మీదీపిక నిజంగానే విజయాల లక్ష్మి.

యువతకు దిక్సూచి

నేటి యువత స్మార్ట్‌ఫోన్లకు బానిసలై సమయాన్ని వృథా చేసుకుంటున్నారని దీపిక ఆవేదన వ్యక్తంచేశారు. "నేను కూడా సోషల్ మీడియా వాడతాను. కానీ, దేనికి ఎంత సమయం ఇవ్వాలో నాకు తెలుసు. లక్ష్యం పట్ల స్పష్టత ఉన్నప్పుడు ఇవేవీ మనల్ని పక్కదారి పట్టించలేవు" అంటారు. కేవలం చదువుతోనే ఆగిపోకుండా, ఆర్గానిక్ ఫార్మింగ్ చేసే రైతులకు ముడిసరుకు అందించే స్టార్టప్‌తోపాటు, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇచ్చే ఆన్‌లైన్ వేదికను తన మిత్రులతో కలిసి నడుపుతున్నారు. పుస్తకపఠనం, పర్యటనలు అంటే అమితంగా ఇష్టపడే దీపిక నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవడమే తన విజయ రహస్యమని అంటారు.

• తిరుపతయ్య నాదెళ్ల

మధుమేహులకు వరం బార్లీ

డయాబెటిస్‌తో సతమతమవుతున్నారా? ఆహారంలో చిన్నపాటి మార్పులతో మీ షుగర్ లెవల్స్‌ను కంట్రోల్ చేసుకోవచ్చు. ప్రాచీన కాలం నుంచి మన దేశంలో వాడుకలో ఉన్న బార్లీ మధుమేహ నివారణకు ఒక శక్తివంతమైన ఆయుధమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

బార్లీలో పీచు పదార్థం (ఫైబర్), బీటా గ్లూకాన్స్, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా దీని గ్లైసమిక్ ఇండెక్స్(28-30) చాలా తక్కువగా ఉంటుంది. అంటే ఇది తిన్న తర్వాత రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా నెమ్మదిగా విడుదలయ్యేలా చేస్తుంది.



- **భోజనం తర్వాత షుగర్ కంట్రోల్:** సాధారణంగా భోజనం చేసిన తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. బార్లీలోని బయోయాక్టివ్ సమ్మేళనాలు ఈ వేగాన్ని నియంత్రించి రోజంతా శక్తిని స్థిరంగా ఉంచుతాయి.
- **ఇన్సులిన్ పనితీరు మెరుగుదల:** మన శరీర కణాలు ఇన్సులిన్‌కు సరిగ్గా స్పందించనప్పుడు షుగర్ పెరుగుతుంది. బార్లీని క్రమంగా తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడి కణాలు చక్కెరను సమర్థవంతంగా వినియోగించుకుంటాయి.
- **బరువు తగ్గేందుకు:** బార్లీలో ఉండే అధిక ఫైబర్ వల్ల కడుపు నిండుగా ఉన్న అనుభూతి కలుగుతుంది. దీనివల్ల అతిగా తినడం తగ్గుతుంది. స్థూలకాయం, మధుమేహం ఉన్న వారికి ఇది సరైన ఎంపిక.
- **గుండె ఆరోగ్యం:** మధుమేహం ఉన్నవారికి గుండెజబ్బుల ముప్పు ఎక్కువ. బార్లీలోని పీచుపదార్థం గుండెను రక్షించడమే కాకుండా, కొలెస్ట్రాల్‌ను కూడా నియంత్రిస్తుంది.

జాగ్రత్తలు కూడా అవసరం

జీర్ణ సమస్యలు: బార్లీని అధికంగా తీసుకుంటే గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు రావొచ్చు.

గ్లూటెన్ అలర్జీ: సిలియాక్ వ్యాధి లేదా గ్లూటెన్ పడని వారు బార్లీకి దూరంగా ఉండాలి.

థైరాయిడ్ సమస్యలు: థైరాయిడ్ సమస్య ఉన్నవారు వైద్యుల సలహా మేరకు దీనిని తీసుకోవాలి.

గోడకు ప్రాణం పోద్దాం!

నగరాల్లో ఇళ్లు చిన్నవైపోతున్నాయి. అయినప్పటికీ మొక్కలు పెంచాలనే కోరిక మాత్రం తగ్గడం లేదు. స్థలం లేదని బాధపడేవారికి 'వర్టికల్ గార్డెనింగ్' అద్భుతమైన వరం. మీ ఇంటి గోడలనే పచ్చని తోటలుగా మార్చే ఈ ట్రెండ్ ఇప్పుడు హాట్ టాపిక్.

ఫ్లోర్ స్పేస్ సేవింగ్: నేల ఖాళీగా ఉండటం వల్ల గది పెద్దదిగా కనిపిస్తుంది.

విజువల్ మ్యాజిక్: గోడ పైదాకా పాకే మొక్కలు గది ఎత్తును పెంచినట్టు చూపిస్తాయి.

లైవ్ వాల్‌పేపర్: ప్లాస్టిక్ వాల్‌పేపర్ల కంటే ప్రాణం ఉన్న మొక్కలు ఇంటికి రిచ్ లుక్‌ను ఇస్తాయి.

ఏ మొక్కలు బెస్ట్?

తక్కువ మట్టి, తక్కువ ఎండలో పెరిగే మొక్కలే దీనికి ప్రాణం.

మనీప్లాంట్: వేగంగా పాకుతూ గదికి పచ్చదనాన్ని ఇస్తుంది.

స్నేక్‌ప్లాంట్: నిలువుగా పెరుగుతూ రాత్రిపూట కూడా ఆక్సిజన్ అందిస్తుంది.

స్పైడర్ ప్లాంట్: అందమైన ఆకులతో గాలిని శుద్ధి చేస్తుంది.

లాభాలు అనేకం

నేచురల్ ఏసీ: గోడకు మొక్కలు ఉండటం వల్ల బయటి వేడి లోపలికి రాదు, ఇల్లు చల్లగా ఉంటుంది.

స్ట్రెస్ బస్టర్: పచ్చని గోడవైపు చూడటం వల్ల కంటికి, మనసుకు



రిలాక్సేషన్ లభిస్తుంది.

తక్కువ ఖర్చు: పాత ప్లాస్టిక్ బాటిల్స్ లేదా చెక్క ఫ్రేములను వాడి తక్కువ ఖర్చుతో మనమే దీనిని డిజైన్ చేసుకోవచ్చు.

నీరు: గోడ తడవకుండా డ్రిప్ సిస్టమ్ లేదా స్ప్రేబాటిల్ వాడండి.

వెలుతురు: కిటికీ దగ్గరగా ఉండే గోడను ఎంచుకుంటే మొక్కలు ఏపుగా పెరుగుతాయి.

శుభ్రత: వారానికోసారి ఆకులపై దుమ్ము తుడిస్తే మెరుపు తగ్గదు

మీకు తెలుసా!

నల్లని ఎండు ద్రాక్ష నీళ్లు కూడా ఔషధంలా పని చేస్తాయని మీకు తెలుసా! ఈ నీటిలో ఐరన్, విటమిన్ బి పుష్కలం. ఇవి రక్తహీనతను దూరం పెడతాయి. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు, పొటాషియం రక్తపోటును నియంత్రిస్తాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. ఫలితంగా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఫైబర్ అజీర్తి సమస్యలను తగ్గిస్తుంది. ఈ నీళ్లలోని విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించి చర్మ సమస్యలను దరి చేరనీయవు. పది నుంచి పదిహేను నల్ల ఎండు ద్రాక్షలను గ్లాసుడు నీళ్లలో వేసి రాత్రంతా నానబెట్టాలి. పరగడుపున ఆ నీటిని తాగాలి.



అభిరుచి



నాన్న కల... తన కూతుర్ని కూర్చోబెట్టుకుని బైక్‌పై భారత యాత్ర చేయాలని. కానీ అది నెరవేరకుండా ఆయన కాలం చేశారు. పదిహేడేళ్లకు ఆ కలను నిజం చేశారు నలభై ఏడేళ్ల జోస్ఫిన్ జోస్. ఒంటరిగా డ్రైవ్ చేసుకొంటూ... డెబ్బై అయిదు రోజుల్లో... పద్దెనిమిది రాష్ట్రాలు... నాలుగు కేంద్రపాలిత ప్రాంతాలను చుట్టివచ్చారు. ఈ ప్రయాణంలో ఎన్నో ఇబ్బందులు, సవాళ్లు, సమస్యలు. ధైర్యం, నేర్పరితనంతో అన్నిటినీ అధిగమించి యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు.

ఒంటరిగా... దేశం చుట్టేశారు

"నా బాల్యంలో అత్యంత మధురమైన జ్ఞాపకం ఏంటో తెలుసా..! మా నాన్న జోస్ కవలక్కత్ టూ స్ట్రోక్ బజాజ్ సూపర్‌పై రైడింగ్ చేయడం. తను 'మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్'లో పని చేశారు. తరచూ నాన్నతో కలిసి స్కూటర్ మీద చిన్న చిన్న దూరాలు వెళుతుండేదాన్ని. ఎప్పుడూ చెబుతుండేవారు... 'మనిద్దరం టూవీలర్‌పై దేశమంతా చుట్టి రావాలి' అని. అయితే విధి మరోలా తలచింది. ఆ కల నెరవేరకుండానే నాన్న చనిపోయారు. ఎంతో బాధ పడ్డాను. ఒక కూతురుగా ఆయన ఆకాంక్షను ఎప్పటికైనా నెరవేర్చాలనుకున్నాను. కానీ జీవిత పోరాటంలో ఆశలు, ఆకాంక్షలు తెరమరుగయ్యాయి.

అమ్మ కోసం...

కేరళ రాష్ట్రం త్రిసూర్ మా స్వస్థలం. డిగ్రీ తరువాత సైకాలజీ చదివాను. ఆ సబ్జెక్టుపై ఉన్న మక్కువతో మరింత లోతుగా అధ్యయనం చేశాను. అదేసమయంలో ముంబయిలోని ఓ షేర్ మార్కెటింగ్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. కొన్నేళ్లలో కంపెనీ కస్టమర్ సర్వీస్ ఇండియా హెడ్ అయ్యాను. ఉన్నత హోదా... అందుకు తగిన జీతం. ఆనందంగా సాగిపోతున్నాయి రోజులు. ఇంతలో అమ్మ ఆరోగ్యం దెబ్బతిన్నది. ఆమెను చూసుకోవడానికి ఇంటి దగ్గర ఎవరూ లేరు. దాంతో 19 నా ఏళ్ల ఉద్యోగ జీవితాన్ని వదిలేసి కేరళ వచ్చేశాను.

ఒంటరిగా పయనం...

అప్పటికప్పుడు అనుకున్నా... కారులో ఒంటరిగా డ్రైవ్ చేసుకొంటూ దేశమంతా తిరిగేద్దామని. వెంటనే అత్యవసరమైనవన్నీ ప్యాక్ చేసుకున్నా. భద్రత కోసం మా కజిన్స్, స్నేహితులకు తెలిపాను. మా అమ్మ, అక్కలకు మాత్రం పీహెచ్‌డీలో భాగంగా డేటా సేకరించే పనిలో వెళుతున్నానని చెప్పాను. నిజం తెలిస్తే కచ్చితంగా వాళ్లు ఆపేస్తారు. ఒకసారి నిర్ణయం తీసుకున్నాక... వాయిదా పడితే నా మనసు మనసులో ఉండదు. గత ఏడాది అక్టోబరు నెల... రెండో తేదీ... నా కొత్త కారు గ్రాండ్ విటారాలో బయలుదేరాను... ఒక్కదాన్నే. ఆ క్షణం నా మనసు ఉప్పొంగింది. ఆనందంతో పరవళ్లు తొక్కింది. కారణం... మా నాన్న కల నెరవేరుస్తున్నందుకు. ఆయన చనిపోయిన పదిహేడేళ్ల తరువాత నాకు అవకాశం లభించింది. పక్కన లేరనే బాధే కానీ... పై నుంచి నాన్న నన్ను నడిపిస్తూనే ఉంటారని నమ్ముతాను. ఆ నమ్మకంతోనే ఒంటరిగా ఇంతటి సాహసానికి పూనుకున్నాను.

బ్రేక్‌తో కొత్త ఆలోచన...

ఇంటికి వచ్చాక పీహెచ్‌డీ మొదలుపెట్టాను. పరిశోధనలో భాగంగా వైవా ఇవ్వాలి. దాని కోసం తీవ్ర స్థాయిలో సన్నద్ధమవుతున్నా. కానీ ఆఖరి నిమిషంలో వైవా వాయిదా పడింది. ఏం చేయాలి? ప్రతి సంవత్సరం నాకంటూ ఒక కొత్త అనుభవం ఉండాలని కోరుకొంటా. 'కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రోడ్ ట్రిప్ వేయాలని చాలాసార్లు అనుకున్నా. రకరకాల కారణావల్ల అది కుదరలేదు. అదీకాకుండా హఠాత్తుగా అంత పెద్ద యాత్ర తలపెట్టడం సాహసమే అవుతుంది'... ఇలా నాలో నేనే మాట్లాడుకొంటున్నా. ఒక రోజు ఉదయం నిద్ర లేవగానే... అలా గుమ్మం బయటకు వెళ్లా. కళ్ల ముందు నా కారు కనిపించింది. అంతే... నా ఆలోచన మారిపోయింది.



అయితే ఇన్ని రోజుల్లోనే పూర్తి చేయాలని పరిమితి పెట్టుకోలేదు.

75 రోజులు... 18 రాష్ట్రాలు...

నా ఈ ప్రయాణాన్ని చిరకాలం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకంగా మార్చుకోవాలని అనుకున్నా. అందుకే దానికి 'లాడ్లీ' (ప్రియతమా) అని పేరు పెట్టుకున్నా. ఇంటి దగ్గర మొదలైన నా యాత్ర పద్దెనిమిది రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాల మీదుగా 75 రోజులపాటు సాగింది. మొత్తం 14,277 కిలోమీటర్లు ప్రయాణించాను. విచిత్రం ఏంటంటే... ముందుగా రూట్ మ్యాప్ లాంటిదేమీ సిద్ధం చేసుకోలేదు. ఏ రోజుకారోజు నిర్ణయించుకొని వెళ్లిపోయేదాన్ని. లద్దాక్‌లోని 19 వేలకు పైగా అడుగుల ఎత్తులో ఉన్న ఉమ్లింగ్ లా మార్గంలో కూడా ప్రయాణించాను. ప్రపంచంలోనే ఎత్తయిన వాహనం వెళ్లగలిగే రోడ్డుగా దీన్ని చెబుతారు. యాత్ర పూర్తి చేసుకొని ఇంటికి వచ్చాక గాలిలో తేలిపోతున్న అనుభూతి. నాన్న కల నెరవేర్చిన సంతృప్తి. అమ్మ అయితే విషయం తెలిసి నమ్మలేకపోయింది. తరువాత 'మీ నాన్న ఉండుంటే నిన్ను చూసి గర్వపడేవారు' అంటూ అభినందించింది.

సవాళ్లు ఎన్నో...

నా ప్రయాణం దేశంలోని మహానగరాలే కాదు... పల్లె ప్రాంతాలు, విసిరేసినట్టు ఉండే మారుమూల గ్రామాలు, కొండ అంచుల గుండా సాగింది. హోటళ్లు, హోమ్ స్టేలలో విశ్రాంతి తీసుకున్నాను. బయలుదేరేముందు ఒక్కటే నిర్ణయించుకున్నా... ఉదయం ఐదుకు ప్రారంభించాలి. సాయంత్రం ఐదు గంటలకల్లా ఆపేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ చీకటి పడ్డాక డ్రైవ్ చేయకూడదనుకున్నా. అయినా కొన్ని చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ఒడిశాలో కొందరు దుండగులు బైక్‌లపై నన్ను వెంబడించారు. రోడ్డుపై యాక్సిడెంట్ జరిగినట్టు సృష్టించి, నా కారును ఆపే ప్రయత్నం చేశారు. ఎలాగో తప్పించుకొని దగ్గర్లోని ఓ గ్రామ కూడలికి వెళ్లాను. స్థానికుల సహాయంతో ఆ గండం నుంచి బయటపడ్డాను. గుజరాత్‌లో జరిగిన మరో సంఘటనలో ఓ ఆవును ఢీకొట్టబోయాను. త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాను. హిమాలయాల్లోని రహదారుల్లో ట్రక్కు డ్రైవర్లు దురుసుగా ప్రవర్తించారు. ఏంటని అడిగితే గొడవకు దిగారు. సమయస్ఫూర్తితో వాటన్నిటినీ దాటుకొని పర్యటన పూర్తి చేయగలిగినందుకు ఎంతో గర్వంగా ఉంది.

టారిఫ్ కిక్

కదం తొక్కిన బుల్

ట్రేడ్ డీల్‌తో ఈక్విటీ, కరెన్సీ మార్కెట్లలో ర్యాలీ

ఇంట్రాడేలో సెన్సెక్స్ 4,205 పాయింట్లు అప్

- చివరకు 2,073 పాయింట్ల లాభంతో 83,739 పాయింట్ల వద్ద క్లోజింగ్
- అదేబాటలో నిఫ్టీ.. 25,700 ఎగువన ముగింపు
- దూసుకుపోయిన ఎగుమతి ఆధారిత రంగాల షేర్లు



ముంబై/న్యూఢిల్లీ: భారత, అమెరికా వాణిజ్య ఒప్పందం స్టాక్ మార్కెట్లలో ఉత్సాహాన్ని ఉరకలెత్తించింది. గత కొన్ని నెలలుగా ఎలాంటి ఉత్సాహం లేకుండా స్తబ్దంగా పడి ఉన్న బుల్ ఒక్కసారిగా రంకెలేసింది. ఫలితంగా మంగళవారం ఈక్విటీ, కరెన్సీ మార్కెట్లు కనివిని ఎరుగని రీతిలో లాభపడ్డాయి. ఎంతో కాలంగా మార్కెట్లు ఈ శుభ వార్త కోసమే ఎదురు చూస్తుండడం ఇందుకు కారణం. కొద్ది రోజుల వ్యవధి లోనే రెండు ప్రధాన డీల్స్‌ను భారత్ ఖరారు చేసుకోవడం బుల్ ఆపరేటర్లకు ఎనలేని ఉత్సాహాన్ని అందించింది. వారి నుంచి అందిన కొనుగోళ్ల మద్దతుతో సెన్సెక్స్ 2,072.67 పాయింట్లు లాభపడి 83,739.13 వద్ద ముగిసింది. ఒక దశలో సెన్సెక్స్ 4,205.27 పాయింట్లు లాభపడి ఇంట్రాడే గరిష్ఠ స్థాయి 85,871.73 పాయింట్లను తాకింది. నిఫ్టీ కూడా అదే జోరు కొనసాగిస్తూ ఇంట్రాడేలో 1,252.8 పాయింట్ల లాభంతో 26,341.20 స్థాయిని తాకింది. చివరికి 639.15 పాయింట్ల లాభంతో 25,727.55 వద్ద ముగిసింది. బీఎస్ఈలో 3,304 షేర్లు లాభాలతో ముగియగా 981 షేర్లు మాత్రం నష్టపోయాయి. 137 షేర్లు ఎలాంటి మార్పు లేకుండా స్థిరంగా నిలిచాయి.

మదుపరుల సంపద రూ.12 లక్షల కోట్లు అప్

ఈక్విటీ మార్కెట్ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపద రూ.12,10,877.45 కోట్ల మేరకు లాభపడి రూ.4,67,14,754.77 కోట్లకు చేరింది. ఈ డీల్ ద్వారా ఏర్పడిన ఉత్తేజంతో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) నికర కొనుగోలుదారులుగా మారారు. మంగళవారం రూ.5,236.28 కోట్ల విలువ గల షేర్లు కొనుగోలు చేశారు.

ఎగుమతి ఆధారిత రంగాలకు ఉత్తేజం

ట్రేడ్ డీల్ ఎగుమతి ఆధారిత రంగాలకు ఉత్తేజం కల్పించింది. టెక్స్‌టైల్, లెదర్, వజ్రాభరణాలు, సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు, స్పెషాలిటీ కెమికల్స్, ఆటో విడిభాగాలు, ఫార్మా, ఐటీ రంగాల షేర్లు ర్యాలీలో పాల్గొన్నాయి. అలాగే ఫైనాన్షియల్స్, రియల్టీ రంగాలు, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు కూడా లాభపడ్డాయి. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల రంగంలోని అవంతీ ఫీడ్స్, అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ షేర్లయితే 20 శాతం లాభపడ్డాయి. అవంతీ ఫుడ్స్ షేరు రూ.960.60 వద్ద ముగిసింది. కొన్ని నెలల పాటు ఎగుమతుల్లో క్షీణత అనంతరం ఈ డీల్‌తో అనుకూల వాతావరణం ఏర్పడిందని భారత సీఫుడ్ ఎగుమతిదారుల సంఘం వ్యాఖ్యానించింది.

- వజ్రాభరణాల విభాగంలో గోల్డియం ఇంటర్నేషనల్ షేరు 20% లాభపడింది. ఈ విభాగంలోని కల్యాణ్ జువెలర్స్ (4.91%), శృంగార్ హౌస్ (4.51%), టైటన్ (2.80%), పీఎన్ గాడ్గిల్ (1.52%) లాభపడ్డాయి.
- స్పెషాలిటీ కెమికల్స్ విభాగంలోని షేర్లలో ముక్కా ప్రోటీన్స్ (5.01%), కోస్టల్ కార్పొరేషన్ (5%), ఆర్తి ఇండస్ట్రీస్ (15.10%),గుజరాత్ ఫ్లోరో కెమికల్స్ (6.82%) లాభపడిన వాటిలో ఉన్నాయి.
- టెక్స్‌టైల్స్ అండ్ లెదర్ విభాగానికి చెందిన షేర్లలో గోకల్‌దాస్ ఎక్స్‌పోర్ట్స్ (20%), అరవింద్ (10.23%), రేమండ్ లైఫ్‌స్టైల్ (3.39%) లాభపడ్డాయి.

ఏడేళ్లలో రూపాయికి అతిపెద్ద లాభం

ఫారెక్స్ మార్కెట్లో రూపాయి సైతం ఇటీవల కాలంలో కనివిని ఎరుగనంత ర్యాలీని నమోదు చేసింది. అమెరికా డాలర్ మారకంలో రూపాయి ఒక్క రోజులోనే 117 పైసలు లాభపడి 90.32 వద్ద స్థిరపడింది. భారత, అమెరికా వాణిజ్య ఒప్పందంతో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) తిరిగి భారత మార్కెట్లో పెట్టుబడులు పెడతారన్న ఆశలు చిగురించడం రూపాయికి ఉత్తేజం ఇచ్చింది. ఏడేళ్లలో రూపాయి ఒక్క రోజులో నమోదు చేసిన అతి భారీ లాభం ఇదే. క్రూడాయిల్ ధరల క్షీణత, ఎఫ్‌పీఐ పెట్టుబడులపై ఆశావహ వైఖరి ఇన్వెస్టర్ సెంటిమెంట్ బలపడేందుకు సహాయకారి అయిందని ఫారెక్స్ విశ్లేషకులంటున్నారు. భారత-అమెరికా వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో మంగళవారం ఉదయం డాలర్ మారకంలో 90.30 వద్ద ప్రారంభమైన రూపాయి ఇంట్రాడే గరిష్ఠ స్థాయి 90.05ని తాకింది. రెండు సెషన్లలో రూపాయి 161 పైసలు లాభపడింది.

బులియన్ జోరు

మూడు రోజుల భారీ పతనాలకు బులియన్ మార్కెట్ తెర దించింది. వెండి, బంగారం మంచి లాభాలు నమోదు చేశాయి. ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి ధర రూ.24,000 పెరిగి రూ.2.84 లక్షలు పలికింది. అంతకుముందు వరుసగా మూడు సెషన్లలో వెండి గత నెల 29న నమోదైన జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.4,04,500 నుంచి రూ.1,44,500 నష్టపోయి రూ.2.60 లక్షలకు పడిపోయింది. మేలిమి బంగారం 10 గ్రాములు రూ.5,000 మేరకు లాభపడి రూ.1,57,700 పలికింది. పసిడి సైతం మూడు వరుస సెషన్లలో జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,83,000 నుంచి రూ.30,300 నష్టపోయింది. అంతర్జాతీయ విపణిలో సైతం వెండి ధర ఔన్సు (31.10 గ్రాములు) 9.55 డాలర్ల లాభంతో 88.77 డాలర్లకు చేరింది. ఔన్సు బంగారం ధర 275.39 డాలర్లు పెరిగి 4,935.49 డాలర్లు పలికింది.

ఎగుమతులకు మహా బూస్ట్

- అమెరికా ట్రేడ్ డీల్‌తో ఊపిరి పీల్చుకున్న ఇండియా ఇంక్
- తొలగనున్న వాణిజ్య అడ్డంకులు
- అమెరికా నుంచి పెరగనున్న ఆర్డర్లు
- స్వాగతించిన పారిశ్రామిక పెద్దలు



న్యూఢిల్లీ: భారత-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాని (బీటీఏ)కి ఎట్టకేలకు మార్గం సుగమమైంది. దీంతో ట్రంప్ సుంకాలతో బెంబేలెత్తి పోయిన వాణిజ్య, పారిశ్రామిక రంగాలు హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నాయి. ఇక అమెరికా నుంచి ఇబ్బడి ముబ్బడిగా ఆర్డర్లు వచ్చిపడతాయని ఆశిస్తున్నాయి. ఈ శుభవార్త వెలువడిన మరుసటి రోజే సెన్సెక్స్, నిఫ్టీ రేసుగుర్రాల్లా పరిగెత్తాయి. అమెరికా మార్కెట్‌పై అధికంగా ఆధారపడిన టెక్స్‌టైల్స్, జుయెలరీ, ఫార్మా, ఐటీ, ఆటోమొబైల్ విడి భాగాలు, ప్రత్యేక రసాయనాలు, ఫార్మా కంపెనీల షేర్లను మదుపరులు ఎగబడి కొన్నారు. దేశ పారిశ్రామిక దిగ్గజాలు కూడా ఈ ఒప్పందాన్ని స్వాగతించాయి. భారత ఎగుమతులపై ప్రస్తుతం ఉన్న 50 శాతం సుంకాలను 18 శాతానికి తగ్గించడంతో అమెరికా మార్కెట్లో మన ఎగుమతులు మరింత సమర్థవంతంగా పోటీపడతాయని నిపుణులు సైతం అంచనా వేస్తున్నారు. అమెరికాతో కుదిరిన తాజా బీటీఏ ప్రభావం ఈ రంగాలపై ప్రధానంగా కనిపించనుంది.

ఐటీ, ఐటీ సేవలు: భారత ఐటీ, ఐటీ సేవల కంపెనీలకు అమెరికానే అతిపెద్ద మార్కెట్. నిజానికి ట్రంప్ సుంకాల ప్రభావం ఈ రంగంపై లేదు. అయితే ముందు ముందు వీటిపైనా సుంకాల పోటు తప్పదని ట్రంప్ గతంలోనే స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఇప్పుడు ఈ ఒప్పందంతో ఆ భయాలు పోయాయి అయితే హెచ్-1బీ వీసాలపై అమెరికా వెళ్లి అక్కడ పని చేస్తున్న భారత ఐటీ నిపుణులపై మాత్రం ఇంకా కత్తి వేలాడుతూనే ఉంది.

ఫార్మా, స్పెషాలిటీ కెమికల్స్: భారత ఫార్మా ఎగుమతులపైనా ట్రంప్ సుంకాల ప్రభావం లేదు. అయితే అమెరికాలో ఉత్పత్తి యూనిట్లు పెట్టి ఉత్పత్తి చేయకపోతే, వచ్చే రెండేళ్లలో వాటిపైనా సుంకాల పోటు తప్పదని ఇప్పటికే హెచ్చరించారు. ఇప్పుడు ఈ ఒప్పందంతో భారత ఫార్మా రంగం కూడా ఊపిరి పీల్చుకుంది. రెండేళ్ల తర్వాత ట్రంప్ సుంకాలు విధించినా అవి 18 శాతమే ఉంటాయి. కాబట్టి పెద్ద ప్రమాదమేమీ లేదని భావిస్తోంది. ఒకవేళ అమెరికా ఫార్మా కంపెనీలు దేశీయంగా ఉత్పత్తి ప్రారంభించినా కనీసం 30 శాతం అధికంగా ఖర్చవుతుంది. కాబట్టి అమెరికా జెనరిక్ ఔషధాల మార్కెట్లో మనకి వచ్చే పెద్ద ముప్పేమీ లేదని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. స్పెషాలిటీ కెమికల్స్‌దీ ఇదే పరిస్థితి. మనకు ప్రధాన పోటీదారైన చైనా ఉత్పత్తులపై అమెరికాలో 34 శాతం సుంకాలు అమల్లో ఉన్నాయి. వారితో పోలిస్తే మన ఎగుమతులపై ఉండే సుంకాలు 18 శాతమే. దీంతో చైనా కంపెనీలు ఎన్ని గిమ్మిక్కులు చేసినా భారత స్పెషాలిటీ కెమికల్స్, కంపెనీలతో పోటీపడడం కష్టమని భావిస్తున్నారు.

టెక్స్‌టైల్స్ పరిశ్రమ: భారత-అమెరికా వాణిజ్య ఒప్పందంతో ఎక్కువగా లాభపడే రంగాల్లో వస్త్ర (టెక్స్‌టైల్స్) పరిశ్రమ ఒకటి. ట్రంప్ సుంకాల పోటుతో తమిళనాడులోని తిరుపూర్‌తో సహా అనేక చోట్ల వస్త్ర పరిశ్రమ కుప్పకూలింది. వేల మంది రోడ్డున పడ్డారు. కొన్ని కంపెనీలు మూతపడితే, ఉన్న కంపెనీలూ పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యాన్ని ఉపయోగించుకోలేక పోతున్నాయి. ఈ ఒప్పందంతో వస్త్ర పరిశ్రమ మళ్లీ పుంజుకోనుంది.

జుయెలరీ: ట్రంప్ సుంకాల పోటుతో ఆభరణాల పరిశ్రమ బాగా దెబ్బతింది. అమెరికాకు ఎగుమతులు దాదాపు 40 శాతం పడిపోయాయి. ఈ ప్రభావం గుజరాత్‌లోని డైమండ్ కట్టింగ్, పాలిషింగ్ పరిశ్రమపైనా పడింది. చాలా యూనిట్లు మూతపడడంతో దాదాపు లక్షన్నర మంది రోడ్డునపడ్డారు. సుంకాలపై ట్రంప్ దిగి రావడంతో ఇప్పుడు ఈ పరిశ్రమ మళ్లీ గత వైభవానికి దగ్గర కానుంది.

ఆటోమొబైల్ పరిశ్రమ: మన దేశం నుంచి అమెరికాకు కార్ల ఎగుమతులు దాదాపుగా లేవు. ఆటోమొబైల్ విడిభాగాల ఎగుమతులు మాత్రం పెద్దమొత్తంలో ఉన్నాయి. ఇప్పుడు ఈ వాణిజ్య ఒప్పందంతో ఎగుమతులు మళ్లీ గాడిలో పడనున్నాయి.

మత్స్య ఎగుమతులు: ట్రంప్ సుంకాల పోటుతో మన దేశం నుంచి ఆ దేశానికి మత్స్య ఎగుమతులు ముఖ్యంగా రొయ్యల ఎగుమతులు బాగా దెబ్బతిన్నాయి. ఇప్పుడు సుంకాల పోటు 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గనుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,53,930 ▲	1,41,100 ▲	2,80,000 ▼
విజయవాడ	1,59,500 ▲	1,47,000 ▲	2,88,650 ▲
విశాఖపట్నం	1,58,053 ▲	1,41,100 ▼	3,00,000 ▼
రాజమండ్రి	1,53,930 ▲	1,41,100 ▲	2,59,000 ▼
ప్రొద్దుటూరు	1,58,500 ▲	1,45,820 ▲	2,78,000 ▲
ముంబై	1,51,529 ▲	1,38,801 ▲	2,63,965 ▲

తగ్గిన ఎన్ఎండీసీ లాభం

ఎన్ఎండీసీ లిమిటెడ్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,747.01 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.1,896.66 కోట్లుగా ఉంది. సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం మాత్రం రూ.6,942.92 కోట్ల నుంచి రూ.7,983.38 కోట్లకు పెరిగింది. కాగా కంపెనీ రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.2.50 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది.

హైదరాబాద్‌లో జీఐ ఔట్‌సోర్సింగ్ జీసీసీ

అకౌంటింగ్ ఔట్‌సోర్సింగ్, నాలెడ్జ్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ సేవలకు అంతర్జాతీయంగా పేరొందిన జీఐ ఔట్‌సోర్సింగ్ హైదరాబాద్‌లో జీసీసీని ఏర్పాటు చేసింది. ఇంటర్నేషనల్ టెక్ పార్కులో ఏర్పాటు చేసిన ఈ జీసీసీలో ప్రస్తుతం 50 మంది పని చేస్తున్నారు. వచ్చే 12 నెలల్లో 100 మందిని, 2028 నాటికి మరో 100 మందిని నియమించుకోనుంది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కోవాసంట్ అనుబంధ సంస్థ ఎనేబ్లర్ భాగస్వామ్యంతో జీఐ ఔట్‌సోర్సింగ్ ఈ జీసీసీని ప్రారంభించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

4వ తేదీ			
హైదరాబాద్	485	విజయవాడ	500
వరంగల్	487	గోదావరి	475
చిత్తూరు	563	విశాఖపట్నం	490
		డజను గుడ్లు రూ.	75

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	130	విజయవాడ	133
వరంగల్	130	గుంటూరు	133
కరీంనగర్	130	ఒంగోలు	133
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	119
కర్నూలు	130	నెల్లూరు	124
విశాఖపట్నం	125	అనంతపురం	124
గోదావరి	133		

వచ్చే త్రైమాసికంలో బ్లేడ్ బ్యాటరీ టెక్నాలజీతో బస్సుల ఉత్పత్తి

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత ఎలక్ట్రిక్ బస్ విభాగం లో తొలిసారిగా బ్లేడ్ బ్యాటరీ టెక్నాలజీతో కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ప్రకటించింది. వచ్చే త్రైమాసికం నుంచి ఈ బస్సుల ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు తెలిపింది. దేశీయ ఎలక్ట్రిక్ బస్ విభాగంలో ఈ తరహా బ్యాటరీ ఇదే మొదటిసారని, దీని ద్వారా నిర్వహణపరంగా సామర్థ్యాలను పెంచుకునే అవకాశం లభిస్తుందని ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఎండీ మహేశ్ బాబు తెలిపారు. క్యూ3లో కంపెనీ ఆదాయం 29% వృద్ధితో రూ.663.60 కోట్లకు చేరుకోగా నికర లాభం మాత్రం 0.13% పెరుగుదలతో రూ.46.68 కోట్లుగా నమోదైంది.

స్పోర్ట్స్

పీసీబీపై చర్యలు



ఐసీసీ హెచ్చరిక

కరాచీ/న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో ఈనెల 15న భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేసినందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)పై ప్రసారకర్త జియో స్టార్ కోర్టుకెళ్లే అవకాశం కనిపిస్తోంది. ఈమేరకు న్యాయపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలంటూ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఇప్పటికే పీసీబీని హెచ్చరించింది. పాక్ నిర్ణయంతో జియో స్టార్ ఆదాయంపై భారీ ప్రభావం పడనుంది. అటు ఐసీసీ కూడా పాక్‌కు అందించే వార్షిక ఆదాయం రూ.315 కోట్లను పూర్తిగా నిలిపివేసే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. ఇక ఒప్పంద ఉల్లంఘన కింద పీసీబీ, ఐసీసీపై కోర్టుకు వెళ్లే హక్కు స్టార్ గ్రూప్‌నకు ఉంటుంది. 'పాక్ జట్టు భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే జరిమానాలతో పాటు బ్రాడ్‌కాస్టర్ నుంచి కేసును ఎదుర్కోవాల్సి ఉంటుంది. అలాగే ఐసీసీ వివాద పరిష్కార కమిటీ (డీఆర్‌సీ)కి వెళ్లేందుకు చేసే ప్రయత్నాలు కూడా విఫలమవుతాయి. ఇదిలావుండగా ఐసీసీ భారత్‌కు వంత పాడుతున్న నేపథ్యంలో, మరో గ్లోబల్ క్రికెట్ పాలక మండలి రావాల్సిన అవసరం ఉందని పాక్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ పేర్కొన్నాడు.

అండర్-19 వరల్డ్‌కప్ సెమీఫైనల్ నేడు



భారత్ X అఫ్ఘానిస్థాన్

(మ. 1 గం. నుంచి)



ఆసీస్‌పై గెలుపు.. ఇంగ్లండ్ ఫైనల్‌కు

బులవాయో: కెప్టెన్ థామస్ ర్యూ (110) శతకంతోపాటు బౌలర్లు సమష్టిగా రాణించడంతో.. ఇంగ్లండ్ అండర్-19 వరల్డ్‌కప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన తొలి సెమీస్‌లో తొలుత ఇంగ్లండ్ 50 ఓవర్లలో 277/7 స్కోరు చేసింది. ఛేదనలో ఆస్ట్రేలియా 47.3 ఓవర్లలో 250 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఆలివర్ పీక్ (100) పోరాటం వృథా అయింది.

బ్యాట్ పట్టుకోవడం రాని వారికి క్రికెట్ సంఘాల్లో సభ్యత్వమా?

- నిలదీసిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: ఆటల గురించి ఏమాత్రం తెలియని వారు క్రీడా సంఘాలను పాలించడంపై సుప్రీం కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. బ్యాట్ ఎలా పట్టుకోవాలో కూడా తెలియని వారి కంటే.. మాజీ క్రికెటర్లే ఆయా సంఘాలను నిర్వహించాలని పేర్కొంది. మహారాష్ట్ర క్రికెట్ సంఘం (ఎంసీఏ) ఎన్నికలపై బాంబే హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్‌ను ఎత్తివేయాలంటూ దాఖలపై పిటిషన్‌పై మంగళవారం విచారణ సందర్భంగా అత్యున్నత ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. హైకోర్టు స్టేను ఎత్తివేసేందుకు నిరాకరించింది. అనంతరం పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతించిన న్యాయస్థానం.. అభ్యంతరాలేమైనా ఉంటే బాంబే హైకోర్టులో చెప్పుకోవాలని సూచించింది.

జగన్‌మోహన్ రావుపై వేటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడిగా జగన్‌మోహన్ రావును తొలగిస్తూ అంబుడ్స్‌మన్ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. జగన్‌మోహన్ రావుపై సీఐడీ మోపిన తీవ్రమైన అభియోగాల కారణంగా అతడికి అధ్యక్షుడిగా కొనసాగే అర్హత లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎన్నికల్లో జగన్‌మోహన్‌రావు తర్వాత అత్యధిక ఓట్లు సాధించిన అమర్‌నాథ్ హెచ్‌సీఏ చీఫ్‌గా ఇప్పటికే బాధ్యతలు స్వీకరించారు. జగన్‌మోహన్ రావుపై గతంలో విధించిన సస్పెన్షన్ మరో రెండ్రోజుల్లో ముగియనుంది.

ఢిల్లీ..వచ్చింది మళ్లీ

- వరుసగా నాలుగోసారి డబ్ల్యూపీఎల్ ఫైనల్‌కు
- చెలరేగిన లీ, జెమీమా
- ఎలిమినేటర్‌లో గుజరాత్ ఓటమి

బెంగళూరుతో అమీతుమీ రేపు



జెమీమా (41)



లిజెల్లే లీ (43)

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అదరగొట్టింది. బౌలర్లకు తోడు టాపార్డర్ చెలరేగడంతో వరుసగా నాలుగోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 7 వికెట్లతో ఘనవిజయం సాధించింది. ఇక గురువారం జరిగే ఫైనల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో ఢిల్లీ అమీతుమీ తేల్చుకోనుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 168 పరుగులు చేసింది. బెత్ మూనీ (51 బంతుల్లో 6 ఫోర్లతో 62 నాటౌట్), వేర్‌హమ్ (25 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 35) రాణించారు. హెన్రీకి 3, నందనకు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 15.4 ఓవర్లలోనే 169/3 స్కోరు చేసి గెలిచింది. లిజెల్లే లీ (24 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 43), కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్ (23 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 41), లారా వోల్వార్ట్ (24 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 32 నాటౌట్), షఫాలీ (21 బంతుల్లో 7 ఫోర్లతో 31) వేగంగా ఆడారు. వేర్‌హమ్‌కు 2 వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా జెమీమా నిలిచింది.

ఎదురుదాడితో ఆరంభం: ఛేదనలో ఢిల్లీ ఓపెనర్లు లిజెల్లే లీ, షఫాలీ ఆరంభం నుంచే కదం తొక్కారు. బంతి పడడమే ఆలస్యం భారీ షాట్లతో విరుచుకుపడ్డారు. మూడు, నాలుగో ఓవర్లలో షఫాలీ మూడేసి ఫోర్లు బాదగా.. అటు లీ ఐదో ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో చెలరేగింది. షఫాలీ సైతం రెండు ఫోర్లు సాధించగా, పేసర్ రేణుక 21 పరుగులిచ్చుకుంది. ఆరో ఓవర్‌లో లీ 6,4తో ఢిల్లీ పవర్‌ప్లేలో 75 పరుగులతో నిలిచింది. కానీ ఎనిమిదో ఓవర్‌లో ఓపెనర్లను పేసర్ వేర్‌హమ్ పెవిలియన్ చేర్చడంతో తొలి వికెట్‌కు 42 బంతుల్లో 89 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత కాస్త ఆచితూచి ఆడిన జెమీమా, వోల్వార్ట్ బ్యాట్లకు పనిజెప్పడంతో తిరిగి స్కోరు దూసుకెళ్లింది. మూడో వికెట్‌కు ఈ జోడీ 68 రన్స్ జోడించగా.. మరో 26 బంతులుండగానే మారిజానె కాప్ (4 నాటౌట్) ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించింది.

ఆదుకున్న మూనీ: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ బెత్ మూనీ కీలక ఆటతీరును ప్రదర్శించింది. ఢిల్లీ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో గుజరాత్ 38 పరుగులకే డివైన్ (6), అనుష్క (16), గార్డ్‌నర్ (0)ల వికెట్లను కోల్పోయింది. ఈ దశలో మూనీకి వేర్‌హమ్ జత కలవడంతో కాసేపు వికెట్ల పతనం ఆగింది. ఇద్దరూ సమన్వయంతో ఆడి పరిస్థితిని చక్కదిద్దారు. అయితే ఐదో వికెట్‌కు 61 పరుగులు జత చేరాక 17వ ఓవర్‌లో వేర్‌హమ్‌తో పాటు భారతి (0) వికెట్లను హెన్రీ పడగొట్టింది. ఆ తర్వాత కష్వీ (18)తో కలిసి మూనీ వేగం కనబర్చడంతో చివరి రెండు ఓవర్లలో 31 పరుగులు రావడంతో స్కోరు కూడా 160 దాటింది. అటు మూనీ 47 బంతుల్లో అజేయంగా ఫిఫ్టీ పూర్తి చేసింది.

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 168/7. (బెత్ మూనీ 62 నాటౌట్, వేర్‌హమ్ 35; హెన్రీ 3/35, నందని 2/44).

ఢిల్లీ: 15.4 ఓవర్లలో 169/3 (లిజెల్లె లీ 43, జెమీమా 41, వోల్వార్ట్ 32 నాటౌట్, షఫాలీ 31, వేర్‌హమ్ 2/28).

టీ20 ప్రపంచ కప్ 3 రోజుల్లో



భారత క్రికెట్ క్రేజ్ ఖండాలు దాటింది. చదువు, ఉద్యోగం, ఉపాధి కోసం మనోళ్లు బయటిదేశాలకు వెళ్లినా తమ క్రికెట్ మూలాలను మాత్రం మరవడం లేదు. ఈ క్రమంలో అనేక దేశాల జట్లలో మన సంతతి ఆటగాళ్లు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. ఈ టీ20 వరల్డ్ కప్‌లో.. భారత సంతతికి చెందిన దాదాపు మూడు డజన్ల మంది క్రికెటర్లు ఆయా జట్ల తరపున బరిలోకి దిగనుండడం ఓ భావోద్వేగం.

విదేశీ జట్లు.. దేశీ మూలాలు

అమెరికా, కెనడా లాంటి జట్లలో పూర్తిగా భారతీయుల ఆధిపత్యమే నడుస్తోంది. ఇప్పుడు వారంతా భారత్‌లో ఈ నెల 7 నుంచి జరగబోయే పొట్టి కప్‌లో బరిలోకి దిగనున్నారు. అమెరికా పేసర్ సౌరభ్ నేత్రావల్కర్ వాంఖడేలో టీమిండియాకు ప్రత్యర్థిగా ఆడనుండడం చిరకాల జ్ఞాపకంగా మిగలనుంది. అలాగే ఇటలీ పేసర్ జస్‌ప్రీత్ సింగ్, నెదర్లాండ్స్ ఆఫ్ స్పిన్నర్ ఆర్యన్ దత్ కూడా ఇదే తరహా అనుభవాన్ని చవిచూడనున్నారు. మొత్తం టోర్నీలో పాల్గొంటున్న 20 జట్లలో.. కెనడాలో 11 మంది, అమెరికాలో 9 మంది, ఒమన్‌లో ఏడుగురు, యూఏఈలో ఏడుగురు భారత సంతతి క్రికెటర్లు ఉన్నారు. ఈ జాబితాలోని కొందరు ఆటగాళ్లపై ఓ లుక్కేద్దాం..

దిల్‌ప్రీత్ బజ్వా



కెనడా జట్టు కెప్టెన్ అయిన దిల్‌ప్రీత్ బజ్వా పంజాబ్‌లోని గురుదాస్ పూర్‌లో జన్మించాడు. బ్యాటింగ్ ఆల్‌రౌండర్ అయిన 23 ఏళ్ల బజ్వా.. 2020లో కెనడా వెళ్లాడు. పంజాబ్ తరపున ఏజ్ గ్రూప్ క్రికెట్‌లో పరుగుల వరద పారించినా, తగినన్ని అవకాశాలు రాకపోవడంతో కెనడా పౌరసత్వం తీసుకొన్నాడు.

మోనాంక్ పటేల్



యూఎస్ జట్టు సారథి అయిన మోనాంక్ పటేల్‌ది గుజరాత్. గతంలో ఇక్కడ సీనియర్ పేసర్ బుమ్రాతో కలసి యూత్ క్రికెట్ ఆడాడు. ప్రస్తుతం అమెరికా జట్టులో ఓపెనర్‌గా సత్తా చాటుతున్నాడు. గత టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై అర్ధ శతకం కూడా చేశాడు.

సౌరభ్ నేత్రావల్కర్



అమెరికా జట్టులో లెఫ్టామ్ పేసర్ సౌరభ్ నేత్రావల్కర్. ముంబైకి చెందిన 34 ఏళ్ల సౌరభ్.. భారత్ తరపున అండర్-19 క్రికెట్ ఆడాడు. 2024 టోర్నీలో పాక్‌పై అమెరికా సంచలన విజయంలో కీలకపాత్ర పోషించాడు. మరోసారి ఇలాంటి అద్భుతాలే చేయాలను కొంటున్నాడు. ఎక్కడైతే క్రికెట్ ఆడడం ఆరంభించానో.. మళ్లీ అక్కడే మెగా టోర్నీలో పాల్గొనడం గొప్పగా ఉందని సౌరభ్ చెప్పుకొచ్చాడు.

జస్‌ప్రీత్ సింగ్




యూరోపియన్ క్వాలిఫయర్స్‌లో అదరగొట్టిన ఇటలీ జట్టు తొలి సారి ప్రపంచకప్‌నకు అర్హత సాధించింది. ఈ జట్టులోని 32 ఏళ్ల పేసర్ జస్‌ప్రీత్ సింగ్‌ది పంజాబ్‌లోని పగ్వారా. 2006లో కుటుంబంతో సహా ఇటలీలోని మిలాన్‌కు వలస వెళ్లాడు. 2019లో అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రవేశించాడు. డ్రైవర్‌గా పని చేస్తూనే క్రికెట్ ఆడుతున్న జస్‌ప్రీత్‌కు ఐసీసీ టోర్నీలో ప్రాతినిథ్యం దక్కడం నిజంగా సువర్ణావకాశం.

జతీందర్ సింగ్



పంజాబ్‌లోని లూధియానాకు చెందిన 36 ఏళ్ల జతీందర్ సింగ్.. ఒమన్‌కు సారథ్యం వహిస్తున్నాడు. బ్యాటర్ అయిన సింగ్.. భారత తరఫున అవకాశం దక్కుతుందేమోనని చాలా కాలం ఎదురుచూసినా నిరాశే ఎదురైంది. దీంతో ఒమన్‌కు వలస వెళ్లాడు. అయితే, ఈ వరల్డ్‌కప్‌లో ఒమన్ మ్యాచ్‌లన్నీ లంకలోనే జరగనున్నాయి.

ఆర్యన్ దత్



డచ్ జట్టులో ఏకైక భారత సంతతి ఆటగాడు ఆర్యన్ దత్ (22). ఇతనికి 2023 వన్డే వరల్డ్‌కప్ ఇక్కడ ఆడిన అనుభవం ఉంది. ఆఫ్ స్పిన్నర్ అయిన ఆర్యన్ ఈసారి మ్యాజిక్ చేయాలనే పట్టుదలతో ఉన్నాడు. 80ల్లోనే అతడి కుటుంబం నెదర్లాండ్స్‌కు వెళ్లింది. ఆర్యన్ అక్కడే జన్మించాడు. కానీ, భారత్‌లో తమ బంధువులు ఎంతో మంది ఉన్నారని చెబుతున్నాడు.

విపత్తులు పసిగట్టేందుకు
డేటా సెంటర్

» 6 పెటా బైట్స్ సామర్థ్యంతో

అమరావతిలో ఏర్పాటుకు నిర్ణయం

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విపత్తులను ముందే పసిగట్టి రాష్ట్ర ప్రజలను అప్రమత్తం చేసేలా రాజధాని అమరావతిలో డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) శాఖ నిర్ణయించింది. దాదాపు రూ.180 కోట్ల వ్యయంతో, 6 పెటా బైట్ (పీబీ)ల సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న ఈ డేటా సెంటర్ నిర్మాణాన్ని 'బిల్ట్ ఓన్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బూట్) విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని ఐటీ శాఖ భావిస్తోంది. ప్రస్తుతం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) రాష్ట్రంలో విపత్తులపై ఎప్పటికప్పుడు మొబైల్ ఫోన్లకు సమాచారం అందిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తోంది. అయితే భవిష్యత్తులో ఈ సేవలను మరింత విస్తృత పరచే ఉద్దేశంతో 6 పీబీ (6000 టెరాబైట్లు) సామర్థ్యంతో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రైవేటు సంస్థలు దీన్ని బూట్ విధానంలో నిర్మించేందుకు త్వరలోనే టెండర్లు పిలిచేందుకు వీలుగా మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశం ముందుకు ప్రతిపాదనలు పంపారు. అయితే.. క్యాబినెట్‌లో అజెండా అంశాలన్నీ పక్కన పెట్టేసి.. కేవలం తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదంపై సుప్రీం కోర్టు ఆదేశాలమేరకు ఏర్పాటైన సీబీఐ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ఇచ్చిన నివేదికపైనే చర్చ జరిగింది. దీంతో డేటా సెంటర్‌పై నిర్ణయం తీసుకునే వీలు లేకుండా పోయింది. అయితే ఈ ప్రతిపాదనపై వచ్చే క్యాబినెట్‌లో చర్చించే వీలుందని అధికారవర్గాలు తెలిపాయి.

పొగమంచుతో బహుపరాక్!

» పలు జిల్లాలకు వాతావరణ కేంద్రం హెచ్చరిక

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మధ్య భారతంలో కొనసాగుతున్న అధికపీడనం ప్రభావంతో చత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణతో పాటు కోస్తాలోని పలు జిల్లాల్లో మంగళవారం ఉదయం దట్టంగా పొగమంచు కురిసింది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, తూర్పుగోదావరి, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పొగమంచు ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. బుధవారం తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపింది. ముఖ్యంగా తెల్లవారుజామున వాహనాలు నడిపేవారంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. కాగా, పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఒకటి, రెండు డిగ్రీలు అటూఇటుగా నమోదవుతాయని పేర్కొంది.



తనకు పద్మశ్రీ పురస్కారం ప్రకటించిన సందర్భంగా సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన సినీ నటుడు, మాజీ ఎంపీ, వ్యాపారవేత్త మురళీమోహన్

రోబో కాప్
'ఏఎస్‌సీ అర్జున్'.. ఆన్‌డ్యూటీ!

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వే స్టేషన్‌లో రోబో పోలీస్ 'ఏఎస్‌సీ అర్జున్'కు ఇద్దరు పాత నేరస్థులు చిక్కారు. ఇటీవల స్టేషన్‌లో ఈ రోబోను ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులో పాత నేరస్థుల ఫొటోలతో కూడిన డేటాను లోడ్ చేశారు. ఈ నేపథ్యంలో ఏఐ ఆధారిత ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ఆర్ఎస్) ద్వారా పాత నేరస్థులను గుర్తించడంలో రోబో విజయవంతమైంది. సోమవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో స్టేషన్‌లో రోబో కాప్ పెట్రోలింగ్ చేస్తుండగా ఒకరి ముఖం డేటా బేస్‌లోని పాత నేరస్థుడితో సరిపోవడంతో ఆర్పీఎఫ్ సీసీ టీవీ కంట్రోల్ రూమ్‌ను సిగ్నల్‌తో అప్రమత్తం చేసింది. విధుల్లో ఉన్న ఆర్పీఎఫ్ ఎస్ఐ కీర్తిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ బీఎస్ నారాయణ తమ సిబ్బందితో హుటాహుటిన అక్కడకు చేరుకుని రోబో గుర్తించిన హడప శివ (39)ను, అతని సహచరుడు జి.బాంగారు (ఇద్దరూ ఒడిశా వాసులు)ను అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరి వద్ద టికెట్ లేకపోవడంతో ఆర్పీఎఫ్ కార్యాలయానికి తీసుకువెళ్లి జీఆర్పీ సిబ్బందితో కలిసి విచారించడంతోపాటు యుద్ధప్రాతిపదికన వివిధ స్టేషన్లలో ఆరా తీశారు. వారిద్దరిపై రాయగడ పోలీస్ స్టేషన్‌లో దోపిడీ తదితర అనేక నేరాలకు సంబంధించి కేసులు ఉన్నట్టు తేలింది. దీంతో రాయగడ పోలీసులకు సమాచారమిచ్చారు. కాగా, ప్రస్తుతం టికెట్ లేకుండా ప్రయాణిస్తున్నట్టు గుర్తించిన నేపథ్యంలో వారిపై రైల్వే చట్టం ప్రకారం కూడా చర్యలు తీసుకున్నారు. దీనిపై డీఆర్ఎం లలిత్ బొహ్రా స్పందిస్తూ భద్రతను పెంచడం, నేరాలను ముందస్తుగా నిరోధించడంలో ఏఐ ఆధారిత నిఘా, ముఖ గుర్తింపు సాంకేతికత విజయవంతమైందని సంతోషం వ్యక్తం చేశారు.

చట్టాలు పాటించకపోతే
దేశం విడిచి వెళ్లిపోండి!

వాట్సాప్ మాతృ సంస్థ 'మెటా'కు తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు సీజే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: గోప్యతా చట్టం విషయంలో రాజీ పడేదే లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వాట్సాప్ మాతృ సంస్థ, టెక్ దిగ్గజం.. 'మెటా'పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. భారత దేశ చట్టాలను పాటించలేకపోతే.. దేశం విడిచి వెళ్లిపోవచ్చని తేల్చిచెప్పింది. గోప్యతా చట్టంతో ఆడుకోలేరని.. డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకునేందుకు అనుమతించేదిలేదని కుండబద్దలు కొట్టింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం అమెరికా సంస్థ మెటాకు స్పష్టం చేసింది. "ప్రజల గోప్యతతో మీరు ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెనూ మీతో పంచుకునేందుకు అనుమతించం" అని సీజేఐ తేల్చిచెప్పారు. దేశ ప్రజల డేటాను దోపిడీ చేస్తామంటే సమర్థించలేమని స్పష్టం చేశారు. 2021నాటి వాట్సాప్ కొత్త ప్రైవసీ పాలసీని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం మంగళవారం విచారించింది. ఈ సందర్భంగా గతంలో కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) విధించిన రూ.213 కోట్ల జరిమానాను సమర్థించింది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ.. వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగదారుల డేటాను పంచుకునేందుకు వాట్సాప్ దోపిడీవిధానాన్ని అనుసరిస్తోందని తెలిపారు. సీజేఐ స్పందిస్తూ.. "మీరు (మెటా) మా రాజ్యాంగాన్ని అనుసరించలేకపోతే దేశం విడి చి వెళ్లిపోవచ్చు. పౌరుల సమాచారాన్ని పంచుకునే విషయంలో మేం రాజీ పడబోం"అని స్పష్టం చేశారు. "మీ విధానాలను దేశంలోని లక్షలాది మంది పేదలు, వీధి వ్యాపారులు.. కేవలం ఒక భాష మాత్రమే మాట్లాడగలిగిన వారు ఎలా అర్థం చేసుకుంటారు? కొన్ని సందర్భాల్లో మీ విధానాలు అర్థం చేసుకోవడం మాకే ఇబ్బంది ఉంటోంది" అని సీజేఐ ఆగ్రహం వ్యక్తంచేశారు. "ఎవరికీ అర్థంకాని విధానాలను అనుసరించడం ప్రైవేటు సమాచారాన్ని దొంగిలించేందుకు ఒక మార్గం" అన్నారు. ఈ సందర్భంగా సీజేఐ.. తన స్వీయ అనుభవాన్ని వివరించారు. "వాట్సాప్‌లో ఓ డాక్టర్‌కు సందేశం పంపితే.. ఆయన ప్రిస్క్రిప్షన్‌లో కొన్ని మందులు సూచించారు. ఆ మరుక్షణం వాటికి సంబంధించి న ప్రకటనలే ఫోన్‌లో కనిపించాయి"అని తెలిపారు. వాట్సాప్, మెటా తరఫున కోర్టుకు హాజరైన సీనియర్ అడ్వొకేట్లు ముకుల్ రోహత్గీ, అఖిల్ సిబాల్‌లు స్పందిస్తూ.. వాట్సాప్ సందేశాలకు ఎండ్-టు-ఎండ్ గోప్యత ఉంటుందని..ఆయా కంపెనీలు కంటెంట్‌ను చూడలేవన్నారు. సీసీఐ విధించిన రూ.213 కోట్ల జరిమానాను డిపాజిట్ చేసినట్టు చెప్పారు.

ఏంటీ కేసు?

2021 జనవరిలో వాట్సాప్ కొత్త ప్రైవసీ విధానాన్ని తీసుకువచ్చింది. తమ కొత్త పాలసీని అంగీకరించని వారి ఖాతాలను రద్దు చేస్తామని నిరంకుశ ధోరణిని ప్రదర్శించింది. దీంతో అప్పట్లోనే కేంద్రం సదరు పాలసీని నిలిపివేయాలని ఆదేశించింది. ఈ వ్యవహారంపై సీసీఐ విచారణ జరిపింది. ఈ క్రమంలోనే 2024లో రూ.213 కోట్ల జరిమానా విధించింది. ఈ జరిమానాను కంపెనీ లా ట్రైబ్యునల్ కూడా సమర్థించింది. ఈ తీర్పులను మెటా గత ఏడాది జనవరిలో సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.



తీర్పుల్లో జాప్యం ఓ రుగ్మత

» వాదనలు పూర్తయ్యాక వాయిదాలా?

» సుప్రీంకోర్టు అసంతృప్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: హైకోర్టుల్లో వాదనలన్నీ విన్న తరువాత జడ్జీలు తీర్పులను నెలల తరబడి వాయిదా వేస్తుండడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. దీన్ని 'గుర్తించదగ్గ రుగ్మత'గా అభివర్ణించింది. ఝార్ఖండ్ హైకోర్టు డిసెంబరు నాలుగో తేదీన ఓ రిట్ పిటిషన్‌ను డిస్మిస్ చేసినా అందుకు సంబంధించిన తీర్పును మాత్రం ఇంతవరకు వెలువరించలేదు. దీనిపై దాఖలైన వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. సీజేఐ స్పందిస్తూ 'జడ్జీల్లో కొందరు తీవ్రంగా శ్రమించి 10-15 కేసులపై విచారణ జరుపుతారు. తీర్పులను వాయిదా వేస్తారు. ఇంకొందరు విచారణ జరిపినా తీర్పులు మాత్రం ఇవ్వరు. మరికొందరు ఉంటారు...వాదనలు పూర్తి చేసినా తదుపరి విచారణ ఉందంటూ కేసును వాయిదా వేస్తారు. ఇది గుర్తించదగ్గ రుగ్మత. న్యాయ వ్యవస్థకు సవాలులాంటిది. దీన్ని అరికట్టాల్సి ఉంది. ఈ సమస్యపై త్వరలో జరగనున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల సమావేశంలో చర్చిస్తాం' అని పేర్కొన్నారు. ప్రస్తుత కేసులో వచ్చే వారం చివరిలోగా తీర్పును వెల్లడించాలని ఆదేశించారు.

యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌వైపు ఇరాన్ డ్రోన్

» మధ్యలోనే కూల్చేసిన అమెరికా నౌకాదళం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఉద్రిక్తతలు తగ్గించుకొనేందుకు అమెరికా, ఇరాన్ దేశాల ప్రతినిధులు చర్చలకు సిద్ధమైన వేళ.. అరేబియా సముద్రంలో అసాధారణ ఘటన జరిగింది. ఇరాన్‌కు దాదాపు 500 కిలోమీటర్ల దూరంలో అరేబియా సముద్రంలో మోహరించి ఉన్న అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌వైపు ఇరాన్ డ్రోన్ దూసుకొచ్చిందని అమెరికా నేవీ ప్రతినిధి కెప్టెన్ హాకిన్స్ మంగళవారం తెలిపారు. వేగంగా దూసుకొచ్చిన ఆ డ్రోన్‌ను ఎఫ్-35సీ ఫైటర్ జెట్ విమానం ద్వారా మధ్యలోనే కూల్చివేశామని వెల్లడించారు. ఈ ఘటనలో అమెరికా ఆస్తులకుగానీ, సిబ్బందికిగానీ ఎలాంటి నష్టం జరగలేదని తెలిపారు. ఈ ఘటన జరిగిన రెండు గంటలకే హార్ముజ్ జలసంధిలో అమెరికా పతాకంతో ప్రయాణిస్తున్న ఎం/వీ స్టెనా ఇంపరేటివ్ అనే కెమికల్ ట్యాంకర్‌ను ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్‌కు చెందిన రెండు గన్‌బోట్లు అడ్డగించాయి. గన్‌బోట్లు మూడుసార్లు వేగంగా ట్యాంకర్ చుట్టూ చక్కర్లు కొట్టి, దానిని సీజ్ చేస్తామని హెచ్చరిక జారీ చేశాయని కెప్టెన్ హాకిన్స్ ఆరోపించారు. ట్యాంకర్‌లోని సిబ్బంది తమకు సమాచారం ఇవ్వటంతో.. దానికి దగ్గరలో ఉన్న యూఎస్ఎస్ మెక్‌ఫోల్ యుద్ధనౌక ఆ ట్యాంకర్‌కు సహాయంగా వెళ్లిందని చెప్పారు. దానిని సురక్షితంగా హార్ముజ్ జలసంధిని దాటించిందని వివరించారు. ఇరాన్ వక్రబుద్ధికి ఈ రెండు ఘటనలు ఉదాహరణ అని ఆరోపించారు. ఈ ఘటనలపై ఇరాన్ స్పందించలేదు. ఈ రెండు దేశాల ప్రతినిధులు వచ్చే శుక్రవారం సమావేశం కానున్న విషయం తెలిసిందే.

సీజే రాయ్ కేరాఫ్ లగ్జరీ కార్లు!

» ఆయన అంతిమయాత్రలో


విలువైన కార్ల వినియోగం



బెంగళూరు, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు పాల్పడిన కాన్ఫిడెంట్ గ్రూప్ ఛైర్మన్ సీజే రాయ్ వద్ద పెద్ద సంఖ్యలో లగ్జరీ వాహనాలు ఉన్నాయి. ఆయన పాతికేళ్ల వయసులోనే తొలి వాహనం కొన్నారు. కేరళకు చెందిన ఆయన బెంగళూరులో స్థిరపడ్డారు. జనవరి 30న ఐటీ అధికారుల దాడులు చేసిన సమయంలో తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాయ్ అంతిమయాత్రలో రోల్స్‌రాయ్స్ వంటి లగ్జరీ కార్లను వినియోగించడంతో ఆయన కార్ల గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. 2025నవంబరులో రూ.12 కోట్ల విలువైన రోల్స్‌రాయ్స్ ఫాంటమ్-8ను రాయ్ కొన్నారు. గత ఏడాది జూలైలో సోషల్ మీడియాలో రోల్స్‌రాయ్స్ మోడల్స్, లాంబోర్గిని, బుగాటి వెయరాన్‌వంటి లగ్జరీ కార్ల గురించి ప్రస్తావించారు. 1994లో తన తొలికారు మారుతి800ను రూ.1.10 లక్షలకు కొన్నారు. కొన్నాళ్లకు దాన్ని అమ్మేశారు. ఆర్థికంగా బాగా ఎదిగాక తన మొదటి కారు ఉండాలని భావించారు. 27 ఏళ్లకు ఆ కారు తిరిగి తెచ్చిచ్చిన వ్యక్తికి ఆయన రూ.10 లక్షలు ఇచ్చారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

రేసుకు సిద్ధం



సంక్రాంతికి 'నారి నారి నడుమ మురారి' చిత్రంతో ఘన విజయాన్ని అందుకున్న శర్వానంద్ ఇప్పుడు ట్రాక్ మార్చి రేసర్‌గా అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'బైకర్'. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో యువీ క్రియేషన్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఇందులో మాళవికా నాయర్ కథానాయిక. మంగళవారం మేకర్స్ విడుదల తేదీని ప్రకటించారు. ఏప్రిల్ 3న 'బైకర్'ను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. బైక్ రేసింగ్‌తో పాటు బలమైన భావోద్వేగాలున్న కథ ఇదని మేకర్స్ తెలిపారు. వంశీ-ప్రమోద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్.

సంగీత దర్శకుడు ఎస్పీ వెంకటేశ్ కన్నుమూత



ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్పీ వెంకటేశ్(70) ఇకలేరు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం విషమించడంతో మంగళవారం తుదిశ్వాస విడిచారు. నేడు చెన్నైలో ఆయన అంత్యక్రియలను నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకటేశ్ 1971లో గిటారిస్టుగా చిత్రపరిశ్రమలో అడుగుపెట్టారు. ప్రముఖ సంగీత దర్శకుల వద్ద సహాయకుడిగా పనిచేశారు. అనుభవం సంపాదించిన తర్వాత స్వతంత్ర సంగీత దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. మలయాళం, తమిళం, హిందీ, బెంగాలీ తదితర భాషల్లో 250కి పైగా చిత్రాలకు స్వరాలు సమకూర్చారు. ముఖ్యంగా మలయాళ చిత్ర పరిశ్రమలో ఆయన తనదైన ముద్ర వేశారు.

పారిశుధ్య కార్మికురాలికి
విలువైన కానుక



సూపర్‌స్టార్ రజనీకాంత్ పారిశుధ్య కార్మికురాలికి ఓ విలువైన బహుమతిని ఇచ్చారు. ఇటీవలే రోడ్డుపై తనకు దొరికిన 45 తులాల బంగారాన్ని పోలీసులకు అప్పగించారు పారిశుధ్య కార్మికురాలు పద్మ. ఆమె నిజాయితీకి మెచ్చిన రజనీకాంత్, ఆ కార్మికురాలిని ఇంటికి పిలిచి ఘనంగా సన్మానించారు. అంతేకాకుండా ఓ బంగారు గొలుసును ఆమెకు కానుకగా ఇచ్చి ప్రశంసించారు. అలాగే పద్మకు భారతీయ తపాలా శాఖ అరుదైన గౌరవం కల్పించింది. ఆమె పేరుతో ఓ ప్రత్యేక పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. రూ.15 లక్షల ప్రమాద బీమా పాలసీని కూడా అందించింది. భారత ప్రభుత్వం కూడా ఆమెకు రూ.లక్ష నగదు బహుమతిగా ప్రకటించింది.

మైఖేల్ ప్రస్థానం





మూడు దశాబ్దాలపాటు తన ఆట, పాటలతో ప్రపంచాన్ని అలరించిన కింగ్ ఆఫ్ పాప్ మైఖేల్ జాక్సన్. ఆయన మరణించి 15 సంవత్సరాలు దాటినా.. ఆయన మ్యూజిక్‌ను కోట్లాది మంది అభిమానులు ఆస్వాదిస్తూనే ఉన్నారు. అంతటి లెజెండ్ ప్రస్థానాన్ని ప్రముఖ దర్శకుడు ఆంటోనీ ఫుక్వా 'మైఖేల్' పేరుతో సినిమాగా తెరకెక్కిస్తున్నారు. లయన్స్ గేట్, జీకే ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఇందులో మైఖేల్ జాక్సన్ పాత్రను ఆయన మేనల్లుడు జాఫర్ జాక్సన్ పోషిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటిస్తూ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. మైఖేల్ జాక్సన్ సాధించిన విజయాలతో పాటు ఆయన వ్యక్తిగత జీవితంలోని పోరాటాలను కూడా ట్రైలర్‌లో చూపించారు. ఒక సామాన్య బాలుడు గ్లోబల్ ఐకాన్‌గా ఎలా ఎదిగాడన్నది ఈ చిత్రంలో ప్రధాన కథాంశం. ప్రస్తుతం ఈ ట్రైలర్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. దీంతో సినిమాపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో గ్లోబల్ బాక్సాఫీసు వద్ద పది వేల కోట్ల రూపాయలు రాబట్టవచ్చని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



పీఆర్ వ్యవస్థ దారి తప్పింది

బాలీవుడ్‌లోని పబ్లిసిటీ సంస్కృతి ఒకప్పటితో పోలిస్తే చాలా మారిపోయిందని రకుల్ ప్రీత్ సింగ్ అన్నారు. ఒకరిని తరచూ వార్తల్లో ఉంచడం కోసం మరొకరిని తక్కువ చేసి చూపే ఆ ధోరణి మంచిది కాదని ఇటీవలే ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 'ప్రచారం అందరికీ అవసరమే. తరచూ హెడ్‌లైన్స్‌లో ఉండాలని నటీనటులపై ఒత్తిడి ఉంటుంది. మనం చేసే పనే మనమేంటో చెప్పాలి అని నేను నమ్ముతాను. కానీ చేసే పని కంటే ప్రచారంతోనే అందరి దృష్టిని ఆకర్షించాలి అని అక్కడి పీఆర్ వ్యవస్థ ప్రయత్నిస్తోంది. ప్రచారం కోసం హద్దులెందుకు దాటాలి? అయినా ఒకరిని హైలైట్ చేయడానికి ఇతరులపై వ్యతిరేకతను ఎందుకు ప్రచారం చేయాలి. ఇలా చేసే వారికి నిద్ర ఎలా పడుతుంది అని ఆలోచిస్తుంటాను. మనం చేసే మంచి పనులే మనకు అవకాశాలు తెచ్చిపెడుతుంటాయని నేను భావిస్తాను. దేవుడు అంతా చూస్తుంటాడు. అలాగే నటీనటులు బయటకు వచ్చినప్పుడల్లా వారి అనుమతి లేకుండా ఫొటోగ్రాఫర్లు క్లిక్‌మనిపించడం ఇబ్బందిగా ఉంటుంది' అని రకుల్ చెప్పారు. ప్రస్తుతం 'పతీ పత్నీ ఔర్ ఓ దో' చిత్రంలో నటిస్తున్నారు రకుల్.

అలాంటి వారికి ధైర్యాన్నిచ్చే కథ




"నిన్ను నువ్వు ప్రేమించుకో అనేదే మా చిత్ర కథాంశం. ప్రస్తుతం సమాజంలో చాలా మంది తాము ఎలా ఉన్నామనే దానిపై ఆత్మన్యూనతా భావంతో కుంగిపోతున్నారు. అలాంటి వారికి ధైర్యాన్నిచ్చే కథతో తెరకెక్కిన చిత్రమే 'శ్రీ చిదంబరం గారు" అని దర్శకుడు వినయ్ రత్నం అన్నారు. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ జంటగా ఆయన తెరకెక్కించిన చిత్రమిది. చింతా వినీషరెడ్డి, చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మించారు. ఈనెల 6న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వినయ్ రత్నం మీడియాతో మాట్లాడుతూ 'ఒక మనిషిని మనం ప్రేమించగలగాలి అంటే మొదట మనల్ని మనం ప్రేమించుకోవాలి అనేదే ఈ సినిమా సారాంశం. సినిమాలో సహజత్వం కోసం తూర్పు గోదావరిలో ఆడిషన్స్ నిర్వహించి స్థానికులనే నటులుగా ఎంపిక చేసి, వర్క్‌షాప్స్ నిర్వహించాం. అక్కడి మారుమూల ప్రాంతాల్లో షూట్ చేశాం. 32 రోజుల్లో షూటింగ్ పూర్తి చేశాం. విజువల్స్ అద్భుతంగా వచ్చాయి. ఏపీలో కూడా గొప్ప లోకేషన్లు ఉన్నాయని ఈ సినిమా నిరూపిస్తుంది. హీరోకు మెల్లకన్ను ఉండడం వల్ల వంశీ ఈ పాత్ర కోసం చాలా సాధన చేశారు ' అని చెప్పారు.

అప్‌డేట్స్

అమరదీప్ చౌదరి, శైలి చౌదరి ప్రధాన పాత్రధారులుగా ఎం.ఎం. నాయుడు దర్శకత్వంలో రూపొందిన కుటుంబ కథా చిత్రం 'సుమతీ శతకం'. విజన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై సాయి సుధాకర్ కొమ్మాలపాటి నిర్మించారు. ఈనెల 6న విడుదల కానుంది. ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో మైత్రీ మూవీ మేకర్స్ రిలీజ్ చేస్తోంది. కాగా, ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. తాజాగా టీజర్, ట్రైలర్‌ని చూసిన హీరో రవితేజ ప్రశంసించారు. సినిమా గొప్ప విజయం సాధించాలని కోరారు.

రవితేజ ప్రశంసలు



కుటుంబ ప్రేక్షకులను మెప్పిస్తుంది



యథార్థ సంఘటన ఆధారంగా రాసుకున్న కథతో 'ఎర్రచీర' చిత్రాన్ని తెరకెక్కించాను. మాది చిన్న సినిమా అయినప్పటికీ కంటెంట్ విషయంలో రాజీ పడలేదు. ఇది రెగ్యులర్ హారర్ సినిమాలా కాకుండా, కుటుంబమంతా కలిసి చూసేలా ఉంటుంది' అని దర్శకుడు సుమన్ అన్నారు. శ్రీరామ్, కమల్‌కామరాజు, కారుణ్య చౌదరి ప్రధాన తారాగణంగా సుమన్ తెరకెక్కించారు. ఈనెల 6న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'సెంటిమెంట్, హారర్, యాక్షన్ అంశాల కలయికగా ఈ చిత్రాన్ని రూపొందించాం. బీ, సీ సెంటర్లలో మా సినిమా చూసే ప్రేక్షకులకు లక్కీడ్రా నిర్వహించి విజేతలకు చీరలను బహుమతిగా ఇవ్వనున్నాం' అని తెలిపారు.

ఇరవై ఏళ్లు గుర్తుండేలా



"ఈసారి నేను నటించే సినిమా ప్రేక్షకులకు 20 ఏళ్ల పాటు గుర్తుండిపోయేలా ఉండాలని చేసిన ప్రయత్నమే 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రం" అని సంతోశ్ శోభన్ అన్నారు. ఆయన హీరోగా మానస వారణాసి హీరోయిన్‌గా నటించిన చిత్రమిది. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో యూవీ కాన్సెప్ట్స్ నిర్మించింది. ఈనెల 14న విడుదలవుతోంది. ఇటీవల చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. 'ఇది కొత్త తరహా ప్రేమకథా చిత్రం, నిజాయితీగా చేసిన ప్రయత్నం, ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తుంది' అని అశ్విన్ చంద్రశేఖర్ అన్నారు. ఈ సినిమాతో సంతోష్ స్టార్ అవుతాడు అని నిర్మాత ధీరజ్ మొగిలినేని చెప్పారు.

కొత్త భారత్ వచ్చేస్తోంది



రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా ఆదిత్య ధర్ తెరకెక్కించిన 'ధురంధర్' గతేడాది డిసెంబరులో విడుదలై సంచలన విజయం సాధించింది. దీంతో దీని సీక్వెల్‌పై అంచనాలు తార స్థాయిలో ఉన్నాయి. తాజాగా 'ధురంధర్ 2: ద రివెంజ్' టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. మొదటి భాగం ఎక్కడైతే ముగిసిందో అక్కడ్నుంచే సినిమాను ప్రారంభించనున్నారు మేకర్స్. రణ్‌వీర్ సింగ్ పోషించిన హమ్‌జా అలీ పాత్ర పాకిస్థాన్‌లో చేయబోయే విధ్వంసంతో పాటు ఆయన తాలూకు గతాన్ని కూడా ఇందులో చూపబోతున్నట్లు తెలుస్తోంది. యాక్షన్ సన్నివేశాలు, నేపథ్య సంగీతం అదిరిపోయాయి. 'ఇది కొత్త భారత్. సరిహద్దులు దాటి చొరబడుతుంది. దెబ్బకొట్టి తీరుతుంది' అనే సంభాషణ రెండో భాగం ఎలా ఉండబోతోందో హింట్ ఇచ్చింది. ఆర్ మాధవన్, సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, అర్జున్ రామ్‌పాల్, సారా అర్జున్ పాత్రల పరిధి కూడా ఈ భాగంలో ఎక్కువగా ఉండనుంది. జ్యోతి దేశ్‌పాండే, లోకేశ్ ధర్ నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 19న పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది.

కాంట్రాక్టు ఉద్యోగుల వివరాలివ్వండి

» అన్ని శాఖలకు ఆర్థిక శాఖ నోట్

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల్లో రెగ్యులరైజేషన్‌కాని కాంట్రాక్టు ఉద్యోగుల వివరాలు ఇవ్వాలని ఆర్థిక శాఖ కోరింది. ఈ మేరకు ఆయా శాఖాధిపతులకు నోట్ జారీ చేసింది. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం తీసుకువచ్చిన జీవో 30/2023ను అనుసరించి ఇంకా రెగ్యులర్ కాకుండా పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగుల వివరాలను పంపాలని సూచించింది. ఈ క్రమంలో 7 అంశాలను ప్రధానంగా పేర్కొంది. ఆయా అంశాల ఆధారంగా వివరాలు పంపాలని తెలిపింది.

ఆర్టీవోల్లో డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ల ఆటోమేషన్

» మారుతీ సుజుకీతో రవాణా శాఖ ఒప్పందం

» రోడ్డు భద్రత బలోపేతానికే: కమిషనర్ ఎంకే సిన్హా

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ల ఆటోమేషన్‌తో డ్రైవింగ్ నైపుణ్యం కలిగిన వారికే లైసెన్స్‌లు జారీ అవుతాయని, రోడ్డు భద్రత మరింత బలోపేతం అవుతుందని రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా అన్నారు. లైసెన్స్‌ల పరీక్షల ప్రక్రియలో మానవ జోక్యాన్ని తగ్గించి.. సమర్థత, నిష్పాక్షికతను పెంచడమే ఆటోమేషన్ ఏర్పాటు లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నాలుగు ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో (ఆర్టీవో) డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లను ఆటోమేషన్ చేసేందుకు మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్)తో రవాణా శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతి సచివాలయంలో కమిషన్ సిన్హా, మారుతీ సుజుకీ సీఎస్ఆర్ విభాగ అధిపతి తరుణ్ అగర్వాల్ దీనిపై సంతకాలు చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా మారుతీ సుజుకీ ఈ ప్రాజెక్టులు అమలు చేయనున్నట్లు సిన్హా తెలిపారు. ఏలూరు, ఒంగోలు, విజయనగరం, అనకాపల్లి ఆర్టీవో ప్రాంగణాల్లో ఏర్పాటు చేయబోయే ట్రాక్‌లలో సాంకేతిక సహకారం, సిబ్బంది శిక్షణను ఎంఎస్ఐఎల్ మూడేళ్ల పాటు చేపడుతుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే విశాఖపట్నం, గన్నవరం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, ప్రొద్దుటూరు, అనంతపురం, చిత్తూరు, కర్నూలులో ఆటోమేషన్ డ్రైవింగ్ ట్రాక్‌లు ఉన్నాయని కమిషనర్ చెప్పారు.

క్రిమినల్ ఆలోచనలతో అలజడికి యత్నిస్తే కఠిన చర్యలు : హోం మంత్రి అనిత

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): క్రిమినల్ ఆలోచనలతో రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు వైసీపీ యత్నిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. తప్పు చేయాలనే ఆలోచన రావాలంటేనే భయపడేలా రాజకీయ రౌడీలకు పోలీస్ ట్రీట్‌మెంట్ ఇస్తామని హెచ్చరించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆమె మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. చంద్రబాబు పాలనకు, జగన్ పాలనకు పొంతనే లేదన్నారు. గత రెండు రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర శ్రేయస్సు కోసం టీడీపీ కార్యకర్తల కోపం అదుపు తప్పకుండా, సంయమనం పాటించేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకున్నారని తెలిపారు. పార్టీ నాయకులకు వాస్తవాలు వివరించి, రాష్ట్రాభివృద్ధి లక్ష్యాలు గుర్తు చేసి, వైసీపీ ఉచ్చులో పడకుండా నియంత్రించారన్నారు. వైసీపీ నేతలు అసభ్య పదజాలంతో దూషిస్తుంటే కూడా తమ అధినేత ఇప్పటికీ సంయమనం పాటించాలని సూచిస్తున్నారన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయండి: ఏపీటీఎఫ్

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీసు టీచర్ల టెట్ మినహాయింపునకు ఉపాధ్యాయ సంఘాల అఖిల భారత జేఏసీ (ఏఐజేఏసీటీవో) గురువారం నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి కోరారు. సుదీర్ఘ అనుభవం సంపాదించిన టీచర్లకు ఇప్పుడు టెట్ పెట్టడం అసంబద్ధమన్నారు. టీచర్లకు టెట్ మినహాయిస్తూ పార్లమెంటులో సవరణబిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

క్వాంటమ్ వ్యాలీ నిర్మాణంలో తొలి అడుగు

ఈ నెల 6 లేదా 7న శంకుస్థాపన

» హాజరు కానున్న సీఎం చంద్రబాబు

» ఉద్ధండ్రాయునిపాలెంలో ఏర్పాట్లు

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతూ రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి మరికొన్ని గంటల్లోనే తొలి అడుగు పడనుంది. ఇటీవలే అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఐకానిక్ భవనం నమూనా ఖరారు కాగా.. ఆ భవనానికి ఈ నెల 6 లేదా 7న ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారు. ఉద్ధండ్రాయునిపాలెంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించాలని భావించారు. అయితే నేలపాడులో గురువారం సాగునీటి వినియోగదారుల రాష్ట్ర స్థాయి సమావేశం జరగనుండటం.. వారం వ్యవధిలో ఆరు కార్యక్రమాల్లో సీఎం పాల్గొనాల్సి ఉండటంతో క్వాంటమ్ వ్యాలీ శంకుస్థాపన కార్యక్రమాన్ని శనివారానికి మార్చాలని భావిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఈ అంశంపై వీడియో కాన్ఫరెన్స్ కూడా జరిగింది. అయితే తుది నిర్ణయాన్ని బుధవారం తెలియజేస్తామని సీఎంవో అధికారులు వెల్లడించారు.



రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన క్వాంటమ్ వ్యాలీ నమూనా

మూడు దశల్లో అభివృద్ధి..

అమెరికాలో సిలికాన్ వ్యాలీ తరహాలో భారత్‌లోనూ అందునా ఏపీ రాజధాని అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు సంకల్పించారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ దీనిపై కేంద్రంతో చర్చలు జరిపి ఒక ఎంవోయూ కూడా కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో అంతర్జాతీయ ప్రమాణాలతో మొత్తం మూడు దశల్లో అమరావతి క్వాంటమ్ వ్యాలీని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. గతేడాది జూలైలోనే అమరావతి క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్‌ని ప్రభుత్వం ప్రకటించింది. దీనికి సంబంధించిన వర్క్‌షాప్ కూడా నిర్వహించింది. ఈ ఏడాది తొలి త్రైమాసికంలోనే ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్‌ని ఇన్‌స్టాల్ చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. అలాగే.. 2027 జనవరి 1 నాటికి మూడు క్వాంటమ్ కంప్యూటర్లను ఇన్‌స్టాల్ చేయాలని, 2028 జనవరి 1 నాటికి 1,000 నూతన క్వాంటమ్ ఆల్గారిథమ్స్‌ను టెస్టింగ్ చేసే సామర్థ్యానికి చేరుకోవాలని, 2029 జనవరి 1 నాటికి మొత్తం క్వాంటమ్ సామర్థ్యంలో వెయ్యి ప్రభావిత క్యూబిట్స్ లక్ష్యానికి చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుతో అమరావతి రాజధాని టెక్నాలజీ పరంగా ఉన్నత స్థానంలో నిలుస్తుందని సాంకేతిక నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

క్వాంటమ్ ప్రోగ్రామ్‌కు లక్ష మంది నమోదు

» ఉన్నత విద్యామండలి చైర్మన్

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్) నిర్వహిస్తున్న క్వాంటమ్ ప్రోగ్రామ్ కోసం రాష్ట్రంలోని 1,04,070 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారని ఉన్నత విద్యామండలి మంగళవారం రాత్రి తెలిపింది. దేశవ్యాప్తంగా విద్యారంగంలో ఇదొక రికార్డు అని పేర్కొంది. క్వాంటమ్ టెక్నాలజీని విద్యార్థులకు చేరువ చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి తెలిపారు. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్ రంగాలు రాబోయే కాలంలో ప్రపంచాన్ని ప్రభావితం చేస్తాయని చెప్పారు.

జనసేన కమిటీ ముందుకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్

» లైంగిక ఆరోపణలపై 2 విడతలుగా విచారణ

» చట్టపరంగా పోరాడతా : ఎమ్మెల్యే

తిరుపతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళా ఉద్యోగి చేసిన లైంగిక ఆరోపణలకు సంబంధించి.. జనసేన నియమించిన విచారణ కమిటీ తమ పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను మంగళవారం తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో విచారించింది. 45 మంది పార్టీ కార్యకర్తలను కూడా పిలిపించి వివరాలు సేకరించింది. రైల్వే కోడూరు గ్రామ పంచాయతీ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఇసకపట్ల హర్షవీణ ఇటీవల ఎమ్మెల్యే శ్రీధర్‌పై ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఆయన జనసేన ఎమ్మెల్యే కావడంతో తక్షణమే స్పందించిన ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని నియమించారు. ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్, తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన నేత సొక్కం రమాదేవి, అనంతపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ టీసీ వరుణ్‌తో కూడిన కమిటీ మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు రైల్వేకోడూరు చేరుకుంది. తొలుత ఎమ్మెల్యేను విచారించింది. తర్వాత జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్రను, 45 మంది కార్యకర్తలను విచారించింది. మెజారిటీ కార్యకర్తలు ఎమ్మెల్యేపై ఆరోపణల సంగతి పక్కనపెట్టి.. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి బాగాలేదని తెలిపినట్టు సమాచారం. సాయంత్రం 5.30 గంటల సమయంలో కమిటీ సభ్యులు మరో విడత ఎమ్మెల్యే శ్రీధర్‌ను పిలిచి విచారించారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని..దానిపై నివేదిక రూపొందించి అధిష్ఠానానికి అందజేస్తామని టీసీ వరుణ్ మీడియాకు చెప్పారు. మహిళా ఉద్యోగి ఆరోపణలు తన వ్యక్తిగత సమస్య అని, పార్టీకి ఎలాంటి సంబంధం లేదని శ్రీధర్ మీడియాకు తెలిపారు. చట్టపరంగా పోరాడతానని తెలిపారు. కాగా, అరవ శ్రీధర్‌పై రైల్వేకోడూరు పోలీసులు కేసు నమోదుచేశారు.


జనసేన కమిటీ విచారణకు వెళ్తున్న శ్రీధర్

బొలిశెట్టి రాజీనామా

జనసేన నేత బొలిశెట్టి సత్యనారాయణ పార్టీ నుంచి తాత్కాలికంగా వైదొలుగుతున్నట్లు వెల్లడించారు. జల బిరాదరి జాతీయ కన్వీనర్‌గా ఉన్న తాను.. ఉత్తరాంధ్రలోని కాలుష్య సమస్యలపై 2020లో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశానని.. ఇప్పుడు అదే పర్యావరణ శాఖకు పవన్ కల్యాణ్ మంత్రిగా ఉండడం వల్ల నైతిక ఇబ్బందులు కలగకూడదనే ఆలోచనతో రాజీనామా చేశానని చెప్పారు.

'షాదీ డాట్ కామ్'తో మోసాలకు మార్గం సుగమం!

» అందుకే మీ సంస్థపై కేసు నమోదైంది: సుప్రీంకోర్టు

» షాదీ డాట్ కామ్ కేసును పునఃసమీక్షించండి

» టీ హైకోర్టుకు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పెళ్లి సంబంధాల వెబ్‌సైట్ 'షాదీ డాట్ కామ్'తో మోసాలకు మార్గం సుగమం అవుతోందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పెళ్లి పేరుతో జరుగుతున్న మోసాలపై సర్వోన్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. షాదీ డాట్ కామ్ వ్యవహారానికి సంబంధించిన పిటిషన్‌పై పునఃసమీక్షించాలని తెలంగాణ హైకోర్టుకు సూచించింది. షాదీ డాట్ కామ్‌లో యానాం ఎమ్మెల్యే ఫొటోతో రాజమహేంద్రవరానికి చెందిన చెరుకూరి హర్ష అలియాస్ జోగడ వంశీకృష్ణ ప్రొఫైల్ అప్‌లోడ్ చేశాడు. అది చూసి, జూబ్లీహిల్స్‌కు చెందిన ఓ వైద్యురాలు అతన్ని సంప్రదించారు. హర్ష తన తల్లి డాక్టర్ అని, అమెరికాలో ఉందని నమ్మబలికాడు. పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పాడు. ఐటీ శాఖ తన బ్యాంకు ఖాతాలను సీజ్ చేసిందని, తిరిగి ఇస్తానంటూ ఆమె నుంచి పలు దఫాలుగా రూ.11 లక్షల వరకూ తీసుకున్నాడు. ఆ సొమ్ము తిరిగి అడగ్గా హర్ష తన నిజస్వరూపాన్ని బయటపెట్టాడు. యువతి ఫొటోలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరింపులకు దిగాడు. మరో రూ.10 లక్షలు ఇవ్వాలని, లేదంటే ఆమెతోపాటు కుటుంబ సభ్యులను చంపేస్తానని బెదిరించాడు. చివరికి, మోసపోయానని గ్రహించిన యువతి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు ఇలాగే మాయమాటలు చెప్పి, బెంగళూరులో ఒకరి నుంచి రూ.27 లక్షలు తీసుకున్నాడని, ముంబైలో మరొకరిని మోసం చేశాడని గుర్తించారు. హర్షతోపాటు షాదీ డాట్ కామ్ డైరెక్టర్ అనుపమ్ మిట్టల్, టీం లీడర్ విఘ్నేష్, మేనేజర్ సతీశ్‌లను నిందితులుగా పేర్కొంటూ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ నిందితులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు నిరాకరించింది. హైకోర్టు నిర్ణయాన్ని 23 జూన్ 2025న అనుపమ్ మిట్టల్ సహా ఇతరులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్‌ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్.వి.అంజారియాల ధర్మాసనం విచారించింది. కేవలం తాము మధ్యవర్తులం మాత్రమేనని మిట్టల్ తరపు న్యాయవాది వాదించారు. స్పందించిన ధర్మాసనం.. "మీరు ఆ మోసానికి మార్గం సుగమం చేస్తున్నారు కాబట్టే కేసు నమోదైంది" అని వ్యాఖ్యానించింది.

టీ గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను నియమించుకోవచ్చు : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యులను నియమించుకోవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ కోటా కింద తదుపరి ఎమ్మెల్సీల నియామకానికి గత ఆదేశాలు అడ్డంకి కాబోవని స్పష్టం చేసింది. అలాగే, కొత్త ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి మంత్రివర్గం సిఫారసు చేసిన పేర్లపై స్వేచ్ఛగా నిర్ణయం తీసుకునే అధికారం గవర్నర్‌కు ఉంటుందని తేల్చిచెప్పింది. గత ప్రభుత్వంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, సత్యనారాయణల నియామకాన్ని రద్దు చేయడంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం ఈ విషయం స్పష్టం చేసింది.


అన్నాలెజినోవాకు ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

భద్రకాళి సన్నిధిలో పవన్ సతీమణి

» అమ్మవారికి అన్నాలెజినోవా ప్రత్యేక పూజలు

వరంగల్ కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని చారిత్రక ప్రసిద్ధి పొందిన భద్రకాళి అమ్మవారిని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా ఆమె వల్లభ గణపతిని, ఆ తర్వాత భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు నాగరాజు శర్మ ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ధర్మకర్త తొనుపునూరి వీరన్న డిప్యూటీ సీఎం సతీమణికి అమ్మవారి శేషవస్త్రాలు అందజేశారు.

బంగారు నాణేలు ఇస్తామని 20.5 లక్షలతో పరారు!

» కారులో వచ్చి.. సినీ ఫక్కీలో దోచుకెళ్లిన వైనం

పెనమలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తమ వద్ద బిల్లులు లేని బంగారు నాణేలు ఉన్నాయని, వాటిని తక్కువ ధరకు విక్రయిస్తామని మభ్యపెట్టి.. 20.5 లక్షల నగదు దోచుకుని పరారైన ఇద్దరు దుండగుల ఉదంతమిది. దీనిపై కృష్ణా జిల్లా పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నరసరావుపేటకు చెందిన రెక్కల తిరుపతిరెడ్డి విజయవాడలో డ్రైవరుగా పని చేస్తున్నాడు. తనకు తెలిసిన శ్రీనివాసరెడ్డికి పరిచయం ఉన్న చంద్రశేఖర్ అనే వ్యక్తి వద్ద బిల్లులు లేని బంగారు నాణేలు ఉన్నాయని, వాటిని తక్కువ ధరకే ఇస్తాడంటూ.. కొద్దిరోజుల క్రితం తిరుపతిరావు తన చిన్నతాత గానుగపంట నరసింహారెడ్డి చెప్పాడు. కావాలంటే బేరమాడుకోవాలంటూ చంద్రశేఖర్ ఫోన్ నంబరును తిరుపతిరెడ్డికి ఇచ్చాడు. తిరుపతిరెడ్డి వీడియో కాల్ చేయడంతో అవతలి వ్యక్తి బంగారు నాణేలను వీడియో కాల్‌లో ప్రదర్శించాడు. దీంతో తిరుపతిరెడ్డి నమ్మి.. తన మామ మల్లారెడ్డి, తాత నరసింహారెడ్డి వాటిని కొనుగోలు చేస్తారని తెలిపి వారిద్దరినీ చంద్రశేఖర్‌తో మాట్లాడించాడు. ఆ సంభాషణలో చంద్రశేఖర్ తన వద్ద 20 గ్రాముల బరువైన 37.4 లక్షల విలువైన 17 బంగారు నాణేలు ఉన్నాయని చెప్పడంతో అతడి మాటలు నమ్మి 20.5 లక్షల డబ్బున్న బ్యాగుతో గంగూరు డీమార్టు వద్దకు ముగ్గురూ వెళ్లారు. బందరు రోడ్డుకు అవతల ఉన్న కారు నుంచి ఒక వ్యక్తి ఇవతలికి వచ్చి, బాధితుల వద్ద ఉన్న బ్యాగులో ఉన్న డబ్బును చెక్ చేసుకొని బ్యాగులో డబ్బు ఉందని.. అవతల ఉన్నవారికి సైగల ద్వారా తెలిపాడు. బంగారు నాణేలు కారులో ఉన్నాయని, అక్కడికి రండి అంటూ.. డబ్బు ఉన్న బ్యాగుతో బాధితులను కారు వద్దకు తీసుకెళ్లి బ్యాగుతో సహా కారులో ఎక్కాడు. బాధితులు కారు ఎక్కేలోపే దుండగులు కారును వేగంగా నడిపి పరారయ్యారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గెలుపు కోసం 'డేటా' చౌర్యం!

ఏపీఎంసీ ఎన్నికల పోటీలో ఉన్న వైద్యురాలి దుస్సాహసం

» పీఎంయూ యూనిట్ నుంచే లీక్

» పూర్తిగా సహకరించిన ఐటీ విభాగం

» సాఫ్ట్‌వేర్ కంపెనీకి డేటా వివరాలు

» తనను గెలిపించాలంటూ వైద్యులకు రెండు దఫాలుగా 40 వేల మెసేజ్‌లు

» వైద్యురాలిని కాపాడే యత్నంలో అధికారులు

» ఎన్నికల రద్దు కోరుతూ హైకోర్టుకు వైద్యులు

» సంచలనం సృష్టించిన 'ఆంధ్రజ్యోతి' కథనం

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): 'ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్'లో డేటా చోరీ వ్యవహారం తీవ్ర సంచలనం రేపింది. వైద్యులకు సంబంధించిన రహస్య డేటా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. డేటా చోరీపై రాష్ట్ర వ్యాప్తంగా వైద్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ట్రస్ట్ ఉన్నతాధికారులకు కూడా తెలియకుండా డేటా దొంగతనం చేయడం, అక్కడ నుంచి సాఫ్ట్‌వేర్ కంపెనీకి అందించడంతో సదరు కంపెనీ నుంచి వైద్యులకు వ్యక్తిగత మేసేజ్‌లు వెళ్లాయి. ఈ వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి' మంగళవారం 'వైద్య సేవ ట్రస్ట్‌లో డేటా చోరీ' శీర్షికతో ప్రచురించిన కథనం సంచలనం రేపింది. దీంతో ట్రస్టు అధికారులు ఉలిక్కిపడ్డారు. మంగళవారం ఉదయం నుంచే అంతర్గత విచారణ చేపట్టారు. ట్రస్ట్‌లోని పీఎంయూ(ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్) విభాగంలో పనిచేసే కొంత మంది ఉద్యోగులు ఉద్దేశపూర్వకంగా డేటాను లీక్ చేశారని గుర్తించారు. ఈ డేటాను ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేసే ఒక ప్యానెల్‌కు అప్పగించారని తెలుసుకున్నారు. సదరు ప్యానల్‌లోని వైద్యులు సాఫ్ట్‌వేర్ కంపెనీకి డేటాను అందించారు. ఈ కంపెనీ డేటా ఆధారంగా వైద్యుల ఫోన్ నెంబర్లు, మెయిల్స్ తీసుకుని ఒక ప్యానెల్‌లో పోటీ చేసే వారికి ఓటు వేసి.. గెలిపించాలని విజ్ఞప్తి చేస్తూ వైద్యులకు సందేశాలు పంపింది. అసలు విషయం ఏమిటంటే ట్రస్ట్‌లో విధులు నిర్వహించే వైద్యురాలే ఈ ప్యానెల్‌లో ఏపీఎంసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ట్రస్ట్ చేపట్టిన విచారణలో జనవరి 19నే డేటా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. అప్పటి నుంచి 20 వేల మంది వైద్యులకు రెండుసార్లు మేసేజ్‌లు వెళ్లినట్లు తేలింది. మొత్తంగా 40 వేల మేసేజ్‌లు వైద్యుల ఫోన్ నెంబర్లు, మెయిల్స్‌కు చేరాయి.

అత్యంత గోప్యంగా..

ట్రస్ట్‌లోని పీఎంయూలో విధులు నిర్వహించే ఉద్యోగులందరినీ అధికారులు విచారించారు. డేటా.. ఎవరి నుంచి ఎప్పుడు.. ఎలా.. బయటకు వెళ్లిందన్న దానిపై కూపీలాగారు. పీఎంయూలో కీలకంగా వ్యవహరించే మహిళా వైద్యురాలి ఆదేశాల మేరకే వైద్యుల డేటాను బయటకు తీసినట్లు ట్రస్ట్‌లోని ఐటీ విభాగం వెల్లడించింది. జనవరి 19న సదరు డేటాను ఆమెకే పంపించినట్లు తెలిపింది. ఆ వైద్యురాలి ద్వారానే డేటా చౌర్యం జరిగినట్లు వెల్లడించింది.

ఎన్నికలు నిలిపివేయాలి!

» నేడు హైకోర్టులో పిటిషన్

డేటా చోరీ వ్యవహారం ఏపీఎంసీ ఎన్నికల్లో చిచ్చురేపింది. వైద్యుల డేటాను దొంగిలించి ఎన్నికల్లో ప్రచారం చేయడం పట్ల ఇతర ప్యానెళ్ల నుంచి పోటీ చేస్తున్న వైద్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏపీఎంసీ ఎన్నికలను తక్షణమే నిలిపివేయాలని ఎన్నికల అధికారి చక్రధరబాబుకు విన్నవించారు. మరోవైపు ఈ వ్యవహారం హైకోర్టుకు చేరనుంది. ఎన్నికలు వాయిదా వేయాలని కోరుతూ బుధవారం హైకోర్టులో పిటిషన్ వేసేందుకు కొంత మంది వైద్యులు సిద్ధమయ్యారు.

చర్యలు అంతంతే..

వాస్తవానికి వైద్యుల డేటా చోరీని తీవ్రనేరంగా పరిగణించాలి. సైబర్ క్రైమ్ లేదా, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. కానీ, ట్రస్టు అధికారులు డేటా చోరీని అంత సీరియస్‌గా తీసుకోవడం లేదు. మొక్కుబడిగా.. పీఎంయూలో విధులు నిర్వహించే ఒక ఉద్యోగిని తొలగించారు. డేటా చోరీకి కారణమైన వైద్యురాలిపై కనీసం చర్యలు తీసుకునేందుకు కూడా సాహసించలేదు. పైగా, ట్రస్టులోని ఉన్నతాధికారులు ఆమెను కాపాడే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు.. ఆరోగ్య శాఖ మంత్రి కార్యాలయం ఈ వ్యవహారంపై స్పందించింది. డేటా చౌర్యానికి బాధ్యులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

అతిపెద్ద 'ప్రకృతి వ్యవసాయ' క్షేత్రంగా ఏపీ

» ఐదేళ్లలో 50లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం: సీఎం

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా మార్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 18 లక్షల మంది రైతులు 20లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేసేందుకు ముందుకొచ్చారని, దీనిని సమర్థవంతంగా అమలుచేస్తూ.. 2030-31 నాటికి 40లక్షల మంది రైతులు.. 50లక్షల ఎకరాల్లో ప్రకృతి సాగు చేపట్టేలా చూడాలన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 'ప్రకృతి సాగుతో వచ్చే ఫలితాలను వ్యవసాయ విద్యార్థులు స్వయంగా తెలుసుకునేలా చేయాలి. ప్రకృతి సాగు ఉత్పత్తుల నాణ్యత తెలిసేలా సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సదుపాయం కల్పించాలి. సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ వంటివి ఏప్రిల్‌కల్లా వచ్చేలా చూడాలి. జూన్ నాటికి రాష్ట్రమంతా పూర్తి కావాలి. సుభాష్ పాలేకర్‌తో రాష్ట్రమంతా ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు నిర్వహించాలి. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ఏపీ వ్యవసాయ ఉత్పత్తుల వాటా అధికంగా ఉండేలా చూడాలి. రసాయన ఎరువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలి. దీనివల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గి, పంట ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుంది. వర్షాభావ పరిస్థితులు నెలకొనే ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళికలు రూపొందించాలి. రాయలసీమలో ఒకప్పుడు నీటి సమస్య ఉండేది. సమర్థ నీటి నిర్వహణతో ఈ ఏడాది ఆ సమస్యను తీర్చాం. అన్ని రిజర్వాయర్లు నింపడంతో పాటు సాగునీటికి లోటు లేకుండా చేశాం' అని చెప్పారు. ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కల్టివేషన్, ప్రొసెసింగ్, మార్కెటింగ్.. ఇలా అన్ని అంశాలు అంతర్జాతీయ స్థాయిలో కోకో సిటీలో ఉండాలని స్పష్టంచేశారు. గిరిజనుల భాగస్వామ్యంతో పీపీపీ విధానంలో లంబసింగిలో కుంకుమపువ్వు సాగుకు ముందుకొచ్చే సంస్థలకు అనుమతి ఇవ్వాలన్నారు. పౌల్ట్రీ రంగాన్ని బలోపేతం చేసేందుకు పాఠశాలలు, అంగన్వాడీలకు కోడిగుడ్లు సరఫరా కాంట్రాక్టు రైతులకే ఇవ్వాలని నిర్దేశించారు.

విజయవాడలో ఫ్లవర్ మార్కెట్

విజయవాడలో పీపీపీ విధానంలో ఫ్లవర్ మార్కెట్ నిర్మాణానికి సీఎం అంగీకారం తెలిపారు. కుప్పంలో ఫ్లవర్ ఫెస్టివల్ నిర్వహించినట్టే.. మన పంటలకు సంబంధించి, వివిధ ప్రాంతాల్లో ఫెస్టివల్స్ నిర్వహణకు ఆలోచన చేయాలని, దీంతో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. లాజిస్టిక్ ఖర్చు తగ్గించడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ విస్తృతం అవుతుందన్నారు. ఫ్రూట్ కవర్లతో మామిడికి మంచి నాణ్యత, ధర వచ్చిందని, జామ, దానిమ్మ వంటి పండ్ల తోటలకు ఈ విధానాన్ని అనుసరించేలా చూడాలని సూచించారు. మార్కెట్ యార్డులున్నచోటే రైతుబజార్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైనచోట రైతుబజార్లను ఆధునీకరించాలని సీఎం సూచించారు. డిజి రైతుబజార్ యాప్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా కూరగాయలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసుకునే అవకాశం కలుగుతుంది. ఫార్మ్ మిషనరీ కోసం ఏపీఏఐఎంఎస్ యాప్‌ను, కిసాన్ డ్రోన్ ప్రారంభించారు. రైతులు తమకు అవసరమైన ట్రాక్టర్లు, డ్రోన్లు, గడ్డికోత మిషన్లు, పవర్ టిల్లర్లు బుక్ చేసుకుని, సేవలను పొందవచ్చు. రాష్ట్రంలో 9,512 యంత్ర పరికరాలు సిద్ధంగా ఉంచారు. మంత్రి అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

లాభాల బాటలోకి విశాఖ ఉక్కు

» గత ఏడాది సెప్టెంబరులో 486 కోట్ల నష్టం...

» ఈ జనవరిలో 54 కోట్ల లాభం

» సీఎంకి వివరించిన స్టీల్ అధికారులు

» కార్మికులు, యాజమాన్యం కలిసి పనిచేయాలని సీఎం సూచన

» ప్లాంటుకు పూర్తి సహకారం ఉంటుందని హామీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): 'విశాఖపట్నం ఉక్కు కర్మాగారం నష్టాల నుంచి లాభాల బాటలోకి వచ్చింది. కార్మికులు, యాజమాన్యం కలిసి పనిచేస్తే మరిన్ని మెరుగైన ఫలితాలు వస్తాయి' అని సీఎం చంద్రబాబు అన్నారు. అమరావతిలో ఆయన మంగళవారం విశాఖ ఉక్కుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఢిల్లీ నుంచి కేంద్ర ఉక్కు కార్యదర్శి సందీప్ పౌండ్రిక్, ప్లాంటు సీఎండీ మనీశ్ రాజ్ గుప్తా, సీఎస్ విజయానంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎండీ మనీశ్‌రాజ్ గుప్తా ప్లాంటు సాధించిన ప్రగతిని సీఎంకు వివరించారు. 'గత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో క్వార్టర్‌లో రోజుకు 9,215 టన్నుల హాట్ మెటల్ మాత్రమే ఉత్పత్తి చేశాం. ఇప్పుడు 19,401 టన్నులు వస్తోంది. ప్లాంటు యుటిలైజేషన్ కెపాసిటీ 94 శాతానికి చేరింది. 2024 సెప్టెంబరులో రూ.486 కోట్ల నష్టాల్లో ఉన్న స్టీల్‌ప్లాంటు ఈ జనవరిలో రూ.54 కోట్ల లాభం ఆర్జించింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సాయం రూ.11,440 కోట్లతోనే ఇది సాధ్యమైంది. ప్రస్తుతం ప్లాంటుకు క్రెడిట్ రేటింగ్ కూడా పెరిగింది' అని సందీప్ పౌండ్రిక్ తెలిపారు. 'అన్ని విభాగాల్లోను నూతన విధానాలు అమలు చేయండి. ప్లాంటును మరింత బలోపేతం చేయాలి. కార్మికులు, ఉద్యోగుల సమర్థ వినియోగంతో మంచి ఫలితాలు వస్తాయని మరోసారి నిరూపితమైంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విశాఖ ఉక్కు కర్మాగారానికి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయి' అని సీఎం హామీ ఇచ్చారు.

బండరాయితో బాది.. తల నరికి!

» ఎకరం పొలం కోసం జంట హత్యలు

» పిన్ని, తమ్ముడిని దారుణంగా చంపిన సోదరులు

» తెగిన తలను చేతబట్టుకొని 'రప్పా రప్పా' కేకలు

» అనంతపురం జిల్లా తరిమెలలో అర్ధరాత్రి ఉన్మాదం

శింగనమల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎకరం పొలం కోసం తమ్ముడి తలపై బండరాయితో మోదడంతో పాటు పిన్ని తలను నరికేసి దారుణంగా హత్య చేశారు. ఆ తర్వాత తెగిన తలను చేతబట్టుకుని వీధుల్లో తిరుగుతూ భయోత్పాతం సృష్టించారు. తమ జోలికి వస్తే ఎవరికైనా ఇదే గతి పడుతుంది.. 'రప్పా.. రప్పా' అంటూ గంజాయి మత్తులో వీరంగం చేశారు. ఈ జంట హత్యల ఘటన అనంతపురం జిల్లా శింగనమల మండలం తరిమెల గ్రామం ఎస్సీ కాలనీలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తరిమెలకు చెందిన దండోరా నల్లప్పకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య లక్ష్మీదేవికి ఇద్దరు కుమారులు ఓంకార్, జగజ్జీవన్. రెండో భార్య యల్లమ్మ (43)కు ప్రేమసాయి, అంబేడ్కర్ (22) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. తరిమెలలోనే వేర్వేరు ఇళ్లలో కాపురాలు ఉండేవారు. యల్లమ్మ అంగన్‌వాడీ కార్యకర్త. రెండేళ్ల క్రితం నల్లప్ప మృతిచెందాడు. బతికున్నప్పుడే లక్ష్మీదేవికి 3 ఎకరాల మెట్ట పొలం, యల్లమ్మకు ఎకరం వరి మడి రాసిచ్చాడు. ఐదేళ్ల క్రితం ప్రేమసాయి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అయితే నల్లప్ప మృతి తర్వాత యల్లమ్మకు రాసిచ్చిన ఎకరం పొలం తమకే ఇవ్వాలని ఆయన మొదటి భార్య కుమారులు ఓంకార్, జగజ్జీవన్ గొడవ పడేవారు. ఈ క్రమంలో ఓంకార్, జగజ్జీవన్, బెంగళూరుకు చెందిన మరో యువకుడు సోమవారం రాత్రి యల్లమ్మ ఇంటి వద్దకు వెళ్లి గొడవకు దిగారు. యల్లమ్మ, అంబేడ్కర్‌లను వేట కొడవళ్లతో వెంటపడి నరికారు. అంబేడ్కర్‌ను బండరాయితో తలపై కొట్టి చంపేశారు. యల్లమ్మ తలను నరికి వేరుచేశారు. తెగిన తలను తమ చేతిలోకి తీసుకొని కాలనీలో తిరుగుతూ హల్‌చల్ చేశారు.


అంబేడ్కర్, యల్లమ్మ (ఫైల్)



తెనాలిలో ప్రభుత్వ పాఠశాల చిన్నారులకు ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభ సభలో మాట్లాడుతున్న మంత్రులు సత్యకుమార్, మనోహర్

కల్తీ నెయ్యి కాదు... అది విషం

▸▸ ఇంత దారుణానికి వైసీపీ పాల్పడింది: సత్యకుమార్, మనోహర్

తెనాలి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): 'టీటీడీ తయారు చేసిన లడ్డూల్లో వైసీపీ ప్రభుత్వం కలిపింది కల్తీ నెయ్యి అని ఇప్పటివరకు పొరపాటు పడ్డాం. కీలక నివేదికలు వచ్చాక దానిని కల్తీ అనే కంటే విషం అనడం సముచితమని అనిపిస్తుంది' అని మంత్రి సత్యకుమార్ అన్నారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్నారులకు ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం గుంటూరు జిల్లా తెనాలిలో మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ, 'లడ్డూలో కలిపింది రసాయనాలతో కూడిన విష పదార్థమని తేలడంతో మేము కూడా అవాక్కయ్యాం. వైసీపీవాళ్లు మహా పాపానికి ఒడిగట్టారు. కోట్లాది మంది వెంకన్న స్వామి భక్తులను, హిందువుల మనోభావాలను దెబ్బ తీశారు. ఇంకా నిస్సిగ్గుగా కల్తీనే లేదంటూ సీబీఐ కితాబు ఇచ్చిందని బొంకడం క్షమించరాని నేరమే అవుతుంది' అని మండిపడ్డారు. లడ్డూ ప్రసాదంలో కల్తీ జరగలేదంటూ వైసీపీ నేతలు రోడ్డెక్కుతుంటే జనం దుమ్మెత్తి పోస్తున్న విషయాన్ని పట్టించుకోలేనంత అబద్ధ ప్రచారంలో వైసీపీ నేతలు మునిగిపోయారని మరో మంత్రి మనోహర్ విమర్శించారు. ఒక్కొక్క నివేదిక బయటకు వస్తుంటే నిశ్చేష్టులమవుతున్నామని, ఇంత దారుణానికి వైసీపీ ప్రభుత్వం పాల్పడుతుందని ఊహించనే లేదన్నారు.

జంతు కళేబరాలతో వంట నూనెల తయారీ


మూకుడిలో కొవ్వు వేసి తయారు చేస్తున్న నూనె

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో జంతు కళేబరాలతో నూనెలు తయారు చేస్తున్న కేంద్రాలపై విజిలెన్సు అధికారులు మంగళవారం దాడులు చేశారు. రెండు కేంద్రాల్లో తనిఖీలు చేసి 350 కేజీల నూనె స్వాధీనం చేసుకున్నారు. జంతువుల కొవ్వు, కళేబరాలను ఎండబెట్టి, ఆపై వాటిని కరిగించి డబ్బాల్లో పోసి.. దీనినే పామాయిల్ అంటూ వీధి వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీనిని ఏలూరుతోపాటు జంగారెడ్డిగూడెం, రాజమహేంద్రవరంలకు చెందిన నూడిల్స్, ఫ్రైడ్ రైస్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్టు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి ఏలూరు లంకపేటకు చెందిన బయ్యాపు వీరకాంతం అనే పశుమాంసం వ్యాపారిని, ఏలూరు ఆదివారపుపేట చిన మార్కెట్ ప్రాంతానికి చెందిన తోళ్ళ వ్యాపారి షేక్ సౌకర్‌లను అరెస్టు చేశారు.


రామాయపట్నం పోర్టుకు రోడ్డు, రైలు కనెక్టివిటీని మ్యాప్ ద్వారా సింగపూర్ ప్రతినిధులకు వివరిస్తున్న పోర్టు అధికారులు

రామాయపట్నం పోర్టుకు సింగపూర్ ప్రతినిధులు

కందుకూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా రామాయపట్నం పోర్టును మంగళవారం సింగపూర్ ప్రతినిధుల బృందం సందర్శించింది. సింగపూర్ ట్రేడ్ ఇండస్ట్రీస్ ఉన్నతాధికారి ఫ్రాన్సిస్ చూవా, సింగపూర్ ఎకనామికల్ డెవలప్‌మెంటు బోర్డు కన్సల్టెంట్ చూవా నాయకత్వంలో నలుగురు ప్రతినిధులు పోర్టును సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించి, పోర్టులో కార్యకలాపాలు ఎప్పటి నుంచి ప్రారంభమవుతాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు జరుగుతున్న తీరుపై సింగపూర్ ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు.

దుగరాజపట్నం పోర్టుకు 2170.70 ఎకరాలు

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో స్థాపించే దుగరాజపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టు- షిప్ బిల్డింగ్ క్లస్టర్ కోసం 1932.06 ఎకరాల పట్టా, 238.64 ఎకరాల ప్రభుత్వ భూమిని రూ.544.30 కోట్లతో సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు రాష్ట్ర మారిటైమ్ బోర్డుకు పాలనానుమతి ఇచ్చింది. మంగళవారం మౌలిక సదుపాయాల కల్పనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఈమేరకు ఉత్తర్వు జారీ చేశారు. తిరుపతి జిల్లాలోని పాతేటిపాలెంలో 251.16 ఎకరాలు, వగ్రరులో 529 ఎకరాలు, వలమేడులో 724 ఎకరాలు, పామంజీలో 489.41 ఎకరాలు మొత్తంగా 1995.04 ఎకరాల పట్టా భూమి, నెల్లూరు జిల్లాలో కోట మండలంలో కొత్తపట్నంలో 46.47 ఎకరాలు, పుచ్చలపల్లిలో 129.19 ఎకరాలు మొత్తంగా 175.66 ఎకరాల ప్రభుత్వ భూమిని మారిటైమ్ బోర్డు సేకరించనుంది. ఇందుకోసం రూ.544.30 కోట్లు వ్యయం చేయనున్నది. ప్రభుత్వ నిర్ణయంతో త్వరలోనే దుగరాజపట్నం పోర్టు పనులు ప్రారంభించే వీలుందని అధికారులు చెబుతున్నారు.

'గీతంకు భూముల'పై హైకోర్టు విచారణ

▸▸ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం, రుషికొండ పరిధిలో 54.79 ఎకరాలను గీతం యూనివర్సిటీ పేరు మీద క్రమబద్ధీకరించేందుకు రెవెన్యూ అధికారులు చేసిన ప్రతిపాదనను అడ్డుకోవాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్, విశాఖ గ్రామీణ తహసీల్దార్, గీతం యూనివర్సిటీ ప్రెసిడెంట్ మతుకుమిల్లి శ్రీభరత్‌కు నోటీసులు జారీ చేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. విశాఖకు చెందిన న్యాయవాది నిమ్మి గ్రేస్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. 'భూములు చాలాకాలం నుండి యూనివర్సిటీ అధీనంలో ఉన్నాయి. వాటిని వర్సిటీ పేరుమీద క్రమబద్ధీకరించేందుకు తహసీల్దార్ ప్రతిపాదనలు చేశారు. క్రమబద్ధీకరణకు వర్సిటీ యాజమాన్యం దరఖాస్తు చేయలేదు. ప్రతిపాదించిన భూమిని రెవెన్యూ రికార్డుల్లో రాస్తా, కొండ, కాలువగా నిర్వచించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 30 ప్రకారం ఆ భూములను క్రమబద్దీకరించడానికి వీల్లేదు' అని వాదించారు. రెవెన్యూ తరపున ప్రభుత్వ న్యాయవాది కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ... 'పిటిషన్‌కు విచారణార్హత లేదు. ప్రస్తుత వ్యవహారంతో పిటిషనర్‌కు సంబంధం లేదు. న్యాయ విచారణ ప్రక్రియను పిటిషనర్ దుర్వినియోగం చేస్తున్నారు. పిటిషనర్ చేస్తున్న ఆరోపణలకు, కోర్టు ముందు ఉంచిన ప్రభుత్వ జీవోకు సంబంధం లేదు. కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారు. భూకేటాయింపునకు, భూక్రమబద్ధీకరణకు మధ్య వ్యత్యాసం ఉంది. విశాఖలో ఏ సంస్థకు భూములు కేటాయించినా ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషనర్ కోర్టులో వ్యాజ్యాలు వేస్తున్నారు. ప్రభుత్వ అధికారులను బ్లాక్ మెయిల్ చేయడం కోసమే ఇలాంటి వ్యాజ్యాలు వేస్తున్నారు' అని వివరించారు. గీతం వర్సిటీ ప్రెసిడెంట్ ఎం.శ్రీభరత్ తరపున న్యాయవాది రుద్ర ప్రసాద్ వాదనలు వినిపిస్తూ... 'భూముల కేటాయింపునకు సంబంధించి నివర్సిటీ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని గతంలో హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఆ ఉత్తర్వులకు అనుగుణంగానే ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తాం' అని పేర్కొన్నారు.

బుర్ర పెట్టలేదు!

▸▸ ప్రతి దశలో అంతులేని నిర్లక్ష్యం
▸▸ 'కల్తీ నెయ్యి'కి అదే కారణం
▸▸ ధర్మారెడ్డి, సింఘాల్, బాలాజీపై చర్యలకు 'సిట్' అధిపతి సిఫారసు

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

'తిలా పాపం తలా పిడికెడు' అన్నట్లు... అనేకుల నిర్లక్ష్యం, అలసత్వం, కుట్రలే కల్తీ నెయ్యికి కారణమయ్యాయి. ఎవరికి వారు వదిలేయడంతో... రసాయన మిశ్రమమే నెయ్యి పేరుతో తిరుమలకు చేరుకుంది. అరకొర జ్ఞానంతో కమిటీ ఇచ్చిన సిఫారసులు మొదలుకుని... ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోని నాటి ఈవో ధర్మారెడ్డి వరకు అనేకమంది ఇందులో భాగస్వాములయ్యారని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పడిన 'సిట్' స్పష్టం చేసింది. 'సిట్' అధిపతి, సీబీఐ జాయింట్ డైరెక్టర్ వీరేశ్ ప్రభు రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో ఈ విషయం తెలిపారు. "నెయ్యి నాణ్యతను గాలికి వదిలేశారు. కల్తీకి ఆస్కారం కల్పించారు. ప్రమాణాలకు తూట్లు పొడిచారు టీటీడీ ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే కల్తీ నెయ్యికి కారణం" అని తెలిపారు. అప్పటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో ధర్మారెడ్డి, టీటీడీ ఆర్థిక సలహాదారు ఓ.బాలాజీలతోపాటు టెండరు నిబంధనలను సడలించేందుకు టీటీడీ నియమించిన కమిటీ సభ్యులు కూడా కల్తీకి బాధ్యులని తేల్చారు. నిబంధనల సడలింపు వల్లే కల్తీ నెయ్యి సరఫరాకు రాజమార్గం ఏర్పడిందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేశారు. నివేదికలోని ముఖ్యమైన అంశాలు ఇవి...

ప్రమాణాలు తెలియని కమిటీ...

నెయ్యి కొనుగోలు టెండర్ల నిబంధనలపై పలుమార్లు కమిటీలను వేశారు. 2014, 18, 19లో (టీడీపీ హయాంలో) నిబంధనలు కఠినంగా ఉండాలని స్పష్టం చేసిన కమిటీ... 2020లో (వైవీ సుబ్బారెడ్డి ఛైర్మన్ అయ్యాక) వాటిని సడలిస్తూ అనేక సిఫారసులు చేసింది. సమగ్ర విశ్లేషణ, క్షేత్రస్థాయి తనిఖీలు, సాంకేతిక ప్రమాణాల పరిశీలన లేకుండానే... నివేదికను టీటీడీకి సమర్పించింది. గతంలో ఇదే కమిటీలోని సభ్యులు తమ సిఫారసుల్లోని హేతుబద్ధతతో కూడిన వివరణతో నివేదిక ఇచ్చారు. 2020లో నిబంధనలను సడలించినప్పుడు మాత్రం కేవలం ఎలాంటి వివరణలు, కారణాలు చెప్పకుండానే 'నిబంధనల సడలింపు' సిఫారసులు చేశారు. అసలు విషయం ఏమిటంటే... ఈ కమిటీ సభ్యులకు నెయ్యి ప్రమాణాలు, వాటి సేకరణ పద్ధతులపై కనీసం అవగాహన లేదు. ఇలాంటి కమిటీ చేసిన సిఫారసులను టీటీడీ ఉన్నతాధికారులు నిశితంగా పరిశీలించకుండా గుడ్డిగా వ్యవహరించారు. కనీసం బుర్ర పెట్టకుండా (మైండ్ అప్లై చేయకుండా) ఆ నివేదికను టీటీడీ పాలకమండలి ముందుకు తీసుకువచ్చారు. దానిని పాలకమండలి ఆమోదించింది. టెండరు నిబంధనల విషయంలో రాజీపడడం వల్లనే అర్హత లేని డెయిరీలు రంగంలోకి దిగాయి. తగిన అధ్యయనం, శాస్త్రీయత లేకుండా టెండరు నిబంధనలను మార్చడంవల్లే అర్హత లేని కంపెనీలు తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేశాయి.

ధర్మారెడ్డి నిర్లక్ష్యం... లడ్డూ ప్రసాదంలో నాణ్యత లోపం, కల్తీ నెయ్యిపై 2022లో అప్పటి అదనపు ఈవోగా ఉన్న ధర్మారెడ్డికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఆయన నెయ్యి సరఫరా చేస్తున్న కంపెనీల దగ్గర నుంచి శాంపిల్స్ సేకరించి... 2022 మే 25న మైసూరులోని సెంట్రల్ ఫుడ్ టెక్నాలజికల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ (సీఎఫ్‌టీఆర్‌ఐ)కు పంపారు. వైష్ణవి డెయిరీ, భోలేబాబా డెయిరీ నుంచి వచ్చే నెయ్యి కల్తీ అవుతోందని సదరు సంస్థ నివేదిక ఇచ్చింది. ఈ నివేదిక టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగానికి అందింది. కానీ... ఆ అధికారులు దీనిని ధర్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లలేదు. కీలకమైన ఈ నివేదిక గురించి ధర్మారెడ్డి కూడా పట్టించుకోలేదు. ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించడం, నెయ్యి కల్తీ జరిగిందన్న విషయాన్ని టీటీడీ అధికారులు పట్టించుకోకపోవడంతో యథేచ్ఛగా 'రసాయన మిశ్రమాలు' సరఫరా అయ్యాయి. ఆహార భద్రతా ప్రమాణాలు (ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్) నిబంధనలను కూడా ధర్మారెడ్డి పట్టించుకోకుండా డెయిరీలతో ఒప్పందాలు చేసుకున్నారు.

> ఎలాంటి సాంకేతిక విశ్లేషణ చేయకుండా, డెయిరీలను పరిశీలించకుండా, హేతుబద్ధత లేకుండానే 'నెయ్యి టెండర్ల' నిబంధనలను సరళీకరిస్తూ చేసిన సిఫారసులను... అప్పటి అదనపు ఈవో ధర్మారెడ్డి, ఆర్థిక సలహాదారు బాలాజీ, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఏమాత్రం బుర్ర పెట్టకుండా ఆమోదించారు. దీని కారణంగానే కల్తీ నెయ్యి సరఫరాకు ఆస్కారం కలిగింది.

> 2020లో టీటీడీ నియమించిన కమిటీలో టీటీడీ ఉన్నతాధికారులు ఐఐఎం-లఖ్‌నవూకు చెందిన ఎస్.వెంకట రమణయ్యను 'నిపుణుల కమిటీ'లో నియమించారు. ఆయనకు... పాల ఉత్పత్తుల గురించి ఏమీ తెలియదు. విజయ భాస్కర్ రెడ్డి అనే మరో 'నిపుణుడు'... 2019లో ఏర్పాటు చేసిన కమిటీలోనూ సభ్యుడు. అప్పుడు 'టెండరు నిబంధనలు కఠినంగా ఉండాలి' అని సిఫారసు చేసిన ఆయన... 2020లో మాత్రం సడలింపులకు సరే అన్నారు.

ప్రక్షాళన అవశ్యం!

▸▸ టీటీడీలో వ్యవస్థీకృత లోపాలు
▸▸ కల్తీ నెయ్యికి కారణమైన టెండర్ల లోపాలు
▸▸ ప్రభుత్వానికి సీబీఐ జాయింట్ డైరెక్టర్ నివేదిక

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

టీటీడీ పరిపాలనలో సమూల మార్పులు తీసుకురావాలని సీబీఐ 'సిట్' స్పష్టం చేసింది. సమూలంగా ప్రక్షాళన చేయాలని, కీలకమైన రంగాల్లో మారిన పరిస్థితులకు అనుగుణంగా సంస్కరణలు తీసుకురావాని సిఫారసు చేసింది. వీటిపై సీబీఐ జాయింట్ డైరెక్టర్ ఎస్.వీరేశ్ ప్రభు గత నెల 27న రాష్ట్రప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. వివరాలివీ...

- టీటీడీ పాలనా వ్యవస్థలో పాతుకుపోయిన విధానపరమైన లోపాలు, టెండరు ప్రక్రియలో తప్పిదాలు, పర్యవేక్షణ, తనిఖీ పునఃపరిశీలన లేకపోవడంవల్లే కల్తీ నెయ్యి కొనుగోలుకు దారితీశాయి.
- టీటీడీలో ప్రాథమిక ధర లేకుండానే నెయ్యి కొనుగోళ్లకు రివర్స్ టెండర్ నిర్వహించారు. దీంతో పోటీదారులు తక్కువ ధరను కోట్‌చేశారు. రివర్స్ టెండర్‌ను ఎత్తేయాలి. దానిస్థానంలో కఠినమైన నిబంధనలు, ప్రమాణాలు, ఇంకా బెంచ్‌మార్క్ ధరలతో ప్రత్యామ్నాయ కొనుగోలు విధానం తీసుకురావాలి.
- నెయ్యి కొనుగోలు టెండర్ నిబంధనలను 2019 ఆగస్టులో బలోపేతం చేశారు. కానీ 2020 ఫిబ్రవరిలో సరైన హేతుబద్ధత, నిర్దిష్టమైన కారణాలు లేకుండానే సడలించేశారు. అలా ఎందుకు చేశారో తెలిపే డాక్యుమెంట్లు కూడా లేవు. నిపుణుల అధ్యయనాలు, సిఫారసుల ఆధారంగా, హేతుబద్ధమైన కారణాలు, వాటిని నిర్దేశించే డాక్యుమెంట్లను పరిశీలించాకే నిబంధనలు మార్చాలి.
- కల్తీనెయ్యి సరఫరాచేసిన కంపెనీలు తప్పుడు పత్రాలు సమర్పించినా నిర్ధారించుకోకుండా ఆమోదించారు. కంపెనీలు ఇచ్చిన డాక్యుమెంట్లు సరైనవో, కాదో నిర్ధారించే వ్యవస్థ టీటీడీలో ఉండాలి.
- టీటీడీలో ప్రస్తుతం డెయిరీ, నెయ్యి నాణ్యతను నిర్ధారించే నిపుణులు సిఫారసు (రిఫరెన్స్)లపై, తాత్కాలిక ప్రతిపాదికన వచ్చినవారే. వారి విధులేమిటి? పాత్ర ఏమిటో నిర్దేశించడంలేదు. వారినే కొనసాగిస్తుండటం వల్ల కంపెనీలతో కుమ్మక్కయ్యే అవకాశం ఏర్పడుతోంది.
- సాంకేతిక కమిటీలో ఉన్న సభ్యులే, ప్లాంట్‌ల తనిఖీ కమిటీలో ఉంటున్నారు. ఇది సరైనది కాదు. ఒక కమిటీలో ఉన్న సభ్యులు మరో కమిటీలో ఉండకూడదు. ఆయా కంపెనీల వాస్తవిక పరిస్థితిపై టీటీడీ విజిలెన్స్ నుంచి నివేదిక తెప్పించుకున్నాకే తుది నిర్ణయం తీసుకోవాలి.
- టీటీడీకి నెయ్యి సరఫరా చేసే ట్యాంకర్ల కదిలికలను ట్రాక్ చేసే ప్రత్యేక వ్యవస్థను తీసుకురావాలి. ఇది లేకపోవడం వల్లే అనేక తప్పులు జరిగాయి.
- టీటీడీలో నెయ్యి పరీక్షా కేంద్రం పరిమిత వనరులతో ఉంది. మరింత ఆధునిక హంగులతో పరిశోధనా ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలి. శాంపిల్స్‌ను తారుమారు చేయడానికి వీలులేని శాంపిల్ కోడింగ్ విధానం తీసుకురావాలి.
- ఒక్కసారి కల్తీ జరిగిందని నిర్ధారణ అయితే, సంబంధిత కంపెనీల ట్యాంకర్లను సీజ్ చేయడంతోపాటు సరఫరాదారుపై చర్యలు తీసుకోవాలి. క్రిమినల్ ఫిర్యాదు నమోదుతోపాటు, టెండర్ దక్కించుకున్న సంస్థను బ్లాక్‌లిస్టులో చేర్చాలి.
- నెయ్యి నాణ్యతపై పోటు సిబ్బందితో నిరంతరం సంప్రదిస్తూ... సమాచారం తీసుకోవాలి.
- టీటీడీ ప్రసాదాలకోసం కొనుగోలు చేసే నెయ్యి, ఇతర పదార్థాల నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేసేందుకు థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఉండాలి.
- టీటీడీలో నెయ్యి నిల్వ గోడౌన్లను ఆధునికీకరించి.. వాటి పరిమితి, పరిధిని విస్తరించాలి.
- టీటీడీలో ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వ్యవస్థ బలంగా ఉండేలా చర్యలు చేపట్టాలి. ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార విభాగం ఏర్పాటు చేయాలి.

పాలనలో తీసుకురావాల్సిన మార్పులు

- టీటీడీలో ఈ-నోట్ ప్రతిపాదనల అంశంపై సీరియస్‌గా దృష్టిపెట్టాలి. కీలకమైన అంశాల్లో జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌లతోనే ఈ -నోట్ ప్రతిపాదనలు పెట్టిస్తున్నారు. కనీసం బుర్రపెట్టి ఆలోచించే పరిస్థితి ఉండటం లేదు. ప్రతీస్థాయిలో అధికారి విధులు, పాత్ర, జవాబుదారీ ఏమిటో స్పష్టంగా నిర్దేశించాలి. కొనుగోలు విభాగంలో సిబ్బంది తక్కువగా ఉన్నారు. కొనుగోలు విభాగం జనరల్ మేనేజర్ పోస్టును ఇంజనీరింగ్ అధికారి నిర్వహిస్తుండటం గమనించాం. బాగా నిపుణులైన వారిని డిప్యుటేషన్ పద్ధతిలో ఈ పోస్టులో నియమించాలి.
- టీటీడీలో ఆహార భద్రతను పరీక్షించే అధికారి లేరు. కొనుగోలు ప్రక్రియ, ప్లాంటు తనిఖీలు, శాంపిల్స్ పరీక్ష, ఆహార భద్రతా ప్రమాణాల తనిఖీలకు ఒక అధికారిని నియమించాలి.
- టీటీడీలో ప్రస్తుత ఆర్థిక సలహాదారు-చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ (ఏఫ్ఏ-సీఏఓ) పోస్టును కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల్లో ఆర్థిక వ్యవహారాల్లో బాగా నిపుణులుగా ఉన్న అధికారులను డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి భర్తీ చేయాలి.


మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు కేశవ్, మనోహర్, పార్థసారథి, సత్యకుమార్

సిట్ నివేదికపై

విచారణ కమిటీ

రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం

▸▸ చార్జిషీటును కోర్టు పరిగణనలోకి తీసుకున్నాక ఈ వ్యవహారంపై తేలుస్తాం
▸▸ మంత్రులు పయ్యావుల, నాదెండ్ల, సత్యకుమార్, పార్థసారథి వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీనెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో 'ఆంధ్రజ్యోతి' కథనాలపై రాష్ట్రప్రభుత్వం స్పందించింది. సుప్రీంకోర్టు సీబీఐ నేతృత్వంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రభుత్వానికి అందజేసిన నివేదికపై ప్రత్యేక విచారణ కమిటీని నియమించాలని మంత్రివర్గం నిర్ణయించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమైన క్యాబినెట్.. సిట్ నివేదికపై మూడున్నర గంటలపాటు సుదీర్ఘంగా చర్చించింది. అనంతరం కూటమి పార్టీలకు చెందిన మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, కొలుసు పార్థసారథి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిట్ ఇటీవల దాఖలుచేసిన చార్జిషీటును నెల్లూరు ఏసీబీ కోర్టు పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఈ కేసుపై స్పందిస్తామన్నారు. నిజమైన దోషులను తప్పించుకోవడానికి వీల్లేకుండా అవసరాన్ని బట్టి ప్రభుత్వం గానీ, టీటీడీ గానీ, భక్తులు గానీ.. ఆ కేసులో కలుస్తారని ప్రకటించారు. తొలుత పయ్యావుల మాట్లాడారు. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుమల పవిత్రతను కాపాడడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమన్నారు. లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని.. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఈ అంశాన్ని సమగ్రంగా సమీక్షించి సత్వరమే తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించేందుకు ప్రత్యేక విచారణ కమిటీని నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు. సిట్ నుంచి ప్రభుత్వానికి రెండు పత్రాలు అందాయన్నారు. కోర్టు చార్జిషీటును అధికారికంగా పరిగణనలోకి తీసుకున్న తర్వాతే అది ప్రభుత్వానికి, సంబంధిత కక్షిదారులకు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. 'సిట్ నివేదికలో పేర్కొన్న ప్రధాన అంశాలు, తేలిన లోపాలపై విస్తృత స్థాయిలో చర్చించాం. 2019 తర్వాత టీటీడీ నెయ్యి కొనుగోలు విధానంలో అనవసరమైన సడలింపులు చేసి.. నాణ్యతకు విరుద్ధమైన సరఫరాలు జరగడానికి అవకాశం కల్పించారు. టెండర్ నిబంధనల్లో రూ.250 కోట్ల టర్నోవర్ షరతును రూ.150 కోట్లకు తగ్గించడం, పాల సేకరణలో కనీస అనుభవం లేకున్నా అర్హత కల్పించడం వంటి చర్యలను ఉద్దేశపూర్వకంగా చేపట్టారని నివేదిక స్పష్టం చేసింది. నెయ్యి నమూనాలను పరిశీలించిన ఎన్‌డీడీబీ-కాఫ్ ల్యాబ్ నివేదికలో పలు అనుమానిత కల్తీ పదార్థాలు సోయాబీన్, సన్‌ఫ్లవర్, రేప్‌సీడ్, కాటన్‌సీడ్, ఫిష్ ఆయిల్, బీఫ్‌టాలో, లార్డ్ మొదలైనవి ఉన్నట్లు తేలింది. ఈ నివేదిక ఆధారంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ రోజు ప్రజావేదికపై ఈ అంశాన్ని ప్రస్తావించారు. 2022లో సీఎఫ్‌టీఆర్‌ఐ ల్యాబ్ చేసిన హెచ్చరికలనూ గత పాలకులు పట్టించుకోలేదు. సుమారు 58 లక్షల లీటర్ల వరకు కల్తీ నెయ్యి సరఫరా జరిగినట్లు నివేదికలో వెల్లడించారు. నివేదికలో ఏఈవో ధర్మారెడ్డి, అప్పటి టీటీడీ ఈవో అనిల్ సింఘాల్, సీఏవో బాలాజీ వంటి సీనియర్ అధికారుల పేర్లు ప్రస్తావించారు. టెండర్ నిబంధనల సడలింపు, నాణ్యత వైఫల్యంలో వీరు బాధ్యత వహించాలని నివేదిక పేర్కొంది' అని వివరించారు.

వక్రీకరణ యత్నాలకు చెక్: నాదెండ్ల

కల్తీ నెయ్యి వ్యవహారంపై విస్తృతంగా క్యాబినెట్ సమావేశంలో చర్చించామని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా మంత్రులందరూ భక్తుల మనోభావాలను కాపాడే దిశగా స్పష్టమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారని తెలిపారు. ఈ అంశాన్ని రాజకీయ కోణంలో వక్రీకరించే ప్రయత్నాలను నిరసిస్తూ.. ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా గత ప్రభుత్వ పాలకులు వ్యవహరించారని, కల్తీ నెయ్యి విషయంలో రూ.250 కోట్ల అవినీతి కుంభకోణంతోపాటు పవిత్రతను నాశనం చేశారని మంత్రి సత్యకుమార్ ఆక్షేపించారు. మంత్రి పార్థసారథి తొలుత మాట్లాడుతూ.. అప్పట్లో తాను టీటీడీ కొనుగోలు కమిటీలో ఉన్నప్పటికీ.. అప్పటి ప్రభుత్వం భూమన కరుణాకర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించి.. తమ ప్రమేయం లేకుండానే విచ్చలవిడిగా చేశారని తెలిపారు.

సూత్రధారులను వదలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సిఫారసు చేయడం, సూత్రధారుల పాత్ర ఏమిటనేది స్పష్టం చేయకపోవడంపై క్యాబినెట్‌లో సుదీర్ఘంగానే చర్చ జరిగింది. ఈ క్రమంలో అసాధారణ రీతిలో అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌ను క్యాబినెట్ భేటీకి పిలిపించి సమాలోచనలు జరిపారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడకం ద్వారా కోట్లాది మంది భక్తుల మనోభావాలను వైసీపీ దెబ్బతీసిందని క్యాబినెట్ అభిప్రాయపడింది. సెంటిమెంట్‌తో కూడిన సున్నితమైన అంశం కావడంతో దీనిపై ఎలా ముందుకు వెళ్లాలన్న అంశంతోపాటు ప్రభుత్వానికి సిట్ రాసిన 11 పేజీల లేఖపైనా సుదీర్ఘ చర్చ జరిగింది. సిట్ రాసిన లేఖలోని ప్రతి అంశంపైనా లోతుగా చర్చించారు. ఈ వ్యవహారంలో అసలు సూత్రధారులు తప్పించుకోకుండా చూడాలని పలువురు మంత్రులు సీఎంకు సూచించారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో జరిగిన కీలక పరిణామలను సిట్ లేఖలో నామమాత్రంగా ప్రస్తావించారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తోపాటు పలువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. వాటిపై మరింత దృష్టి సారిస్తే అసలు దోషులు ఎవరో తేలే అవకాశం ఉందన్నారు. '2022 మేలో లడ్డూ నాణ్యత, కల్తీ నెయ్యి వాడకంపై ఫిర్యాదులు రాగా, అప్పటి అదనపు ఈవో ధర్మారెడ్డి నెయ్యి శాంపిల్స్‌ను మైసూరులోని సెంట్రల్ ఫుడ్ టెక్నాలజికల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌కు (సీఎఫ్‌టీఆర్‌ఐ) జూన్‌లో పంపారు. ఆగస్టులో నెయ్యిలో కల్తీ జరిగిందని నివేదిక వచ్చింది. ఈ నివేదికను ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టడంలో ఎవరి పాత్ర ఏమిటనే దానిపై మరింత లోతుగా విచారణ జరగాలి' అని పవన్, మంత్రులు కోరారు. 'సీఎఫ్‌టీఆర్‌ఐ నివేదికను ఎఫ్ఏ అండ్ సీఏవోగా ఉన్న బాలాజీ, మరో ఉద్యోగి సుబ్రమణ్యం కలిసి ధర్మారెడ్డికి అందజేసేందుకు వెళ్లారు. సుబ్రమణ్యంను బయటే ఉండమని చెప్పి బాలాజీ ఒక్కరే ధర్మారెడ్డి చాంబర్‌లోకి వెళ్లి నివేదిక విషయం తెలియజేశారు. ఆ తర్వాత బయటకు వచ్చి సీఎఫ్‌టీఆర్‌ఐ నివేదికను ప్రస్తుతానికి పక్కన పెట్టేయాలని చెబుతున్నారని బాలాజీ.. సుబ్రమణ్యంతో అన్నారు. అయితే, సిట్ నివేదికలో ధర్మారెడ్డికి అసలు సీఎఫ్‌టీఆర్‌ఐ నివేదిక అంశమే తెలియదన్నట్లు పేర్కొన్నారు. అదే సమయంలో అప్పటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి ఈ నివేదిక విషయం తెలిసినా, ఎందుకు చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉండిపోయారన్న దానిపైనా సిట్‌లో ఎలాంటి ప్రస్తావన లేదు. ఈ అంశాలపై మరింత లోతుగా విచారణ జరిగితే బాగుండేది. వైవీ సుబ్బారెడ్డి పాత్రపై సిట్ మరింత స్పష్టత ఇస్తే బాగుండేది' అని అభిప్రాయపడ్డారు. అలాగే... 'టీటీడీ బోర్డు సభ్యుల్లో కొంతమందిని ఎంపిక చేసి పర్చేజింగ్ కమిటీని నియమిస్తారు. 2019లో ఏర్పాటయిన పర్చేజింగ్ కమిటీ నెయ్యి సేకరణ నిబంధనల సడలింపులో కీలకంగా వ్యవహరించింది. అయితే సడలింపు నిర్ణయం తీసుకునే సమయంలో ఈ కమిటీలో సభ్యులుగా ఉన్న కొలుసు పార్థసారథి, వేమిరెడ్డి ప్రశాంతిని పిలవకుండా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి (ప్రత్యేక ఆహ్వానితుడి హోదాలో) మాత్రమే సమావేశమై నిబంధనలను సడలింపునకు ఆమోదం తెలిపారు. దీని వెనుక అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పాత్ర ఏమిటనే దానిపైనా మరింత లోతుగా విచారణ జరగాల్సి ఉంది" అని మంత్రులు అభిప్రాయపడ్డారు.

క్యాబినెట్‌కు ఏజీ..

సిట్ లేఖలోని అంశాలను చర్చించి, న్యాయపరంగా ఎలా ముందుకు వెళ్లాలనేది చర్చించేందుకు ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్‌ను క్యాబినెట్‌కు పిలిపించారు. ఈ సందర్భంగా పవన్, మంత్రులు తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు. నెయ్యి కొనుగోలు నిబంధనలను మార్చడంలో కీలకంగా వ్యవహరించిన టీటీడీ పర్చేజింగ్ కమిటీలో భాగస్వాములుగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డిపై చర్యలు తీసుకునేందుకు న్యాయపరంగా ఎలా ముందుకు వెళ్లాలన్న అంశం ప్రస్తావనకు వచ్చింది. సిట్ రాసిన లేఖలో కేవలం అధికారులపై చర్యలకు మాత్రమే సిఫారసు చేసిందని మంత్రులు తెలిపారు. అయితే, మొత్తం వ్యవహారంలో కీలకంగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి పాత్రను నిగ్గు తేల్చేలా ఎలా ముందుకు వెళ్లాలని ఏజీని అడిగారు. సిట్ దాఖలు చేసిన చార్జిషీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఏం చేయాలనే దానిపై ఏజీతో చర్చించారు. ఈ కేసులో ప్రభుత్వం తరపున ఇంప్లీడ్ అయ్యే అవకాశం ఉందా అనే అంశంపైనా ఆరా తీశారు. చార్జిషీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందా లేదా అన్న అంశంపైనా చర్చ జరిగింది. చార్జిషీట్‌లో సూత్రధారుల పాత్ర సరిగ్గా ఎస్టాబ్లిష్ కాలేదని న్యాయమూర్తి భావిస్తే, దాన్ని తిప్పి పంపవచ్చని ఏజీ తెలిపారు. కోర్టు నిర్ణయం తీసుకున్న తర్వాత ప్రభుత్వపరంగా ఏం చేయాలన్న దానిపై ఓ నిర్ణయానికి వస్తే బాగుటుందని ఆయన సూచించారు.

అవన్నీ చార్జిషీట్‌లో ఉన్నాయా?

కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ చాలా సమగ్రంగా విచారణ జరిపిందని, అయితే చార్జిషీట్‌లో వాటన్నింటినీ పొందుపరిచారో లేదోనంటూ పలువురు మంత్రులు అనుమానాన్ని వ్యక్తం చేశారు. సిట్ ప్రభుత్వానికి రాసిన లేఖను పరిశీలిస్తే ఈ అనుమానం వ్యక్తమవుతోందని వారు వ్యాఖ్యానించారు. పాలు లేని కంపెనీలకు నెయ్యి సరఫరా టెండర్లు కట్టబెట్టేందుకు నిబంధనలు సడలించడమే కాకుండా ఆ సడలించిన నిబంధనలను కూడా ఆ కంపెనీలు చేరుకోలేక ఫేక్ డాక్యుమెంట్లు పెట్టి మరీ టెండర్లు దక్కించుకున్నాయన్నారు. అయినా టీటీడీ ఛైర్మన్, పాలకమండలి చూస్తూ ఉరుకుండిపోయిందని తెలిపారు.

కల్తీ నెయ్యి వ్యవహారంలో రాజకీయం లేదు!

అది మన ఎజెండా కూడా కాదు

▸▸ తిరుమల పవిత్రతను కాపాడటమే లక్ష్యం
▸▸ సూత్రధారులకు శిక్ష పడటమే ముఖ్యం
▸▸ దీనికోసం కమిటీ ఏమైనా వేయగలమా?
▸▸ ఎన్డీయే మంత్రుల సలహా కోరిన ముఖ్యమంత్రి

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): క్యాబినెట్ సమావేశానికి ముందు జరిగిన ఎన్డీయే కూటమి మంత్రుల భేటీలో ఆసక్తికర చర్చ జరిగింది. సుమారు గంటపాటు జరిగిన ఈ భేటీ ప్రారంభంలోనే తిరుమల కల్తీ లడ్డూ విషయంలో ప్రభుత్వం రాజకీయ కోణం చూడటం లేదని, అది మన ఎజెండా కూడా కాదని సహచర మంత్రులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. తిరుమల పవిత్రత, భక్తుల మనోభావాలు కాపాడి తీరాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని, ఆ దిశగానే అడుగులు వేస్తున్నామని సీఎం తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంలో సూత్రధారులు ఎవరనేది తేల్చేందుకు, వారికి సరైన శిక్ష పడేందుకు ప్రయత్నించాల్సిన బాధ్యత ఉందన్న ఆయన, దానికి గాను కమిటీ వేస్తే ఎలా ఉంటుందని సహచర మంత్రుల అభిప్రాయాలను కోరారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేయడాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నామని, సూత్రధారులను శిక్షించేందుకు ప్రభుత్వం తీసుకునే ఎలాంటి చర్యలకైనా జనసేన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ నుంచి తామూ అదే అభిప్రాయంతో ఉన్నామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. తిరుమలకు కొన్ని వేల సంవత్సరాల చరిత్ర ఉందని, ఎంతో పవిత్రమైన తిరుమల శ్రీవారి ఆలయ పవిత్రత.. ప్రాభవం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీఎం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్ తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ ఎంపీలతో మంత్రి లోకేశ్ భేటీ

హస్తినలో లోకేశ్... నేడు కేంద్ర మంత్రులతో భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ ఢిల్లీ చేరుకున్నారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీ విమానాశ్రయం చేరుకున్న ఆయనకు కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, దగ్గుమళ్ల ప్రసాదరావు, కలిశెట్టి అప్పలనాయుడు, సానా సతీశ్, మాగుంట శ్రీనివాసులురెడ్డి, జీఎం హరీశ్, తెన్నేటీ కృష్ణప్రసాద్, కేశినేని చిన్ని, శ్రీభరత్, బీకే పార్థసారథి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బైరెడ్డి శబరి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారితో లోకేశ్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు వారి మధ్య చర్చకు వచ్చాయి. బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులపై కొద్దిసేపు చర్చించారు. కాగా, లోకేశ్ నేడు పార్లమెంటులో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

టీడీపీ ఎంపీలకు లోక్‌సభ స్పీకర్ తేనీటి విందు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): లోకసభ స్పీకర్ ఓం బిర్లా పార్లమెంట్‌లోని తన కార్యాలయంలో మంగళవారం టీడీపీ ఎంపీలకు తేనీటి విందును ఇచ్చారు. ఈ విందుకు ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, బైరెడ్డి శబరి, కేశినేని చిన్ని, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తెన్నేటి కృష్ణప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం బిర్లాను ఎంపీలు శాలువాతో ఘనంగా సత్కరించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు ఎంపీల నుంచి స్పీకర్ సలహాలు, సూచనలు తీసుకున్నారు. తొలిసారి లోక్‌సభకు వచ్చినవారికి ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని తామంతా చేసిన విజ్ఞప్తికి స్పీకర్ సానుకూలంగా స్పందించారని ఎంపీ చిన్ని తెలిపారు.

వాణిజ్య ఒప్పందంతో 25 కోట్ల మందికి లబ్ధి

- ఆక్వా రంగానికి కొత్త మార్కెట్లకు అవకాశం: పీవీఎన్ మాధవ్



విశాఖపట్నం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వాణిజ్య ఒప్పందంతో దేశంలో 25కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. రాష్ట్రంలోని ఆక్వా రైతులు ఎగుమతుల కోసం కొత్త మార్కెట్లు వెతుక్కోవడానికి అవకాశం కలిగిందన్నారు. మంగళవారం ఆయన విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడారు. దేశ ప్రయోజనాలే లక్ష్యంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారని, దాని ఫలితంగానే ట్రంప్ సుంకాలను 18 శాతానికి తగ్గించారన్నారు. ఎగుమతిదారులకు ఇది ఎంతో ఊరట కలిగిస్తుందన్నారు. అరుదైన ఖనిజాలను వెలికి తీసేందుకు నిధులు కేటాయించారని, దీనివల్ల రాష్ట్రానికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుందన్నారు. అమరావతి నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించారన్నారు. జీడిమామిడి, కోకో పండించే రైతులకు ఈ బడ్జెట్‌తో లబ్ధి కలుగుతుందన్నారు. అరకు-పాడేరు మధ్య ఏర్పాటుచేసే ట్రెక్కింగ్ ట్రాక్ వల్ల పర్యాటకం పెద్దఎత్తున అభివృద్ధి చెందుతుందన్నారు. 2047 వరకు పన్నుల మినహాయింపు ఇవ్వడం వల్ల ఏపీలో పెద్దసంఖ్యలో డేటా సెంటర్లు ఏర్పాటవుతాయన్నారు. సీప్లేన్లు అందుబాటులోకి వస్తే విజయవాడ నుంచి శ్రీశైలానికి 45నిమిషాల్లో చేరుకోవచ్చన్నారు. కేంద్ర బడ్జెట్‌పై వైసీపీ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, అది వారి దిగుజారుడుతనానికి, అజ్ఞానానికి నిదర్శనమన్నారు.

టారిఫ్ తగ్గింపుతో రాష్ట్రానికి ఉపశమనం: అచ్చెన్న

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): భారతీయ సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా విధించిన టారిఫ్‌ను 25 నుంచి 18శాతానికి తగ్గించడాన్ని స్వాగతిస్తున్నట్లు మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. టారిఫ్ తగ్గింపు వల్ల రాష్ట్రం నుంచి సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతిదారులకు, ముఖ్యంగా ఆక్వా రంగానికి పెద్ద ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. టారిఫ్ తగ్గించడంతో అమెరికా మార్కెట్‌లో భారతీయ సముద్ర ఆహార ఉత్పత్తుల పోటీ గణనీయంగా మెరుగుపడుతుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో పోటీ పెరిగి, ఏపీ మత్స్య, ఆక్వా రంగం స్థిరమైన అభివృద్ధి సాధిస్తుందని మంత్రి అచ్చెన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలుగు రాష్ట్రాల్లోనే కేజీబీవీ విద్యార్థినులు అత్యధికం: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): దేశంలోని మిగతా రాష్ట్రాల కంటే రెండు తెలుగు రాష్ట్రాల్లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో(కేజీబీవీ)అత్యధికంగా బాలికలు విద్యనభ్యసిస్తున్నారని కేంద్రం స్పష్టం చేసింది. సోమవారం, లోక్‌సభలో సభ్యుడు ఒకరు అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్రప్రధాన్ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. తెలంగాణలోని కేజీబీవీల్లో 1,41,771మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారని, బాలికల ఎన్‌రోల్‌మెంట్‌తో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. రెండోస్థానంలో ఉన్న ఏపీలో 1,03,733 మంది బాలికలు కేజీబీవీల్లో విద్యను అభ్యసిస్తున్నట్లు చెప్పారు. అన్ని రాష్ట్రాలలోని 5,316 కేజీబీవీల్లో 7.58 లక్షల మంది బాలికలు చదువుకుంటున్నారని మంత్రి తెలిపారు.

హెచ్‌ఐవీతో ఐదేళ్లలో 44 వేల మంది మృతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో 2020-24 మధ్య ఐదేళ్లలో 44,140మంది హెచ్‌ఐవీ బాధితులు మరణించారని కేంద్రం తెలపింది. మంగళవారం, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రి అనుప్రియ పటేల్ రాజ్యసభలో సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఏపీలో 32,642 మంది, తెలంగాణలో 11,498 మంది హెచ్‌ఐవీ బాధితులు మరణించారని, ఇదే కాలంలో దేశవ్యాప్తంగా 1.81 లక్షల మంది హెచ్‌ఐవీ బాధితులు మరణించారని తెలిపారు.

సూక్ష్మ ఖనిజాల పాలసీకి కీలక సవరణలు

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థలు, వాటి పరిధిలోని కంపెనీలకు నామినేషన్ ప్రతిపాదికన సూక్ష్మ ఖనిజాలు లీజుకు ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది. ఈమేరకు సూక్ష్మ ఖనిజాల విధానం(మైనరల్ మినరల్ పాలసీ)-2025లో సవరణలు తీసుకొచ్చింది. అలాగే, సూక్ష్మ ఖనిజాల రాయితీ నిబంధనలు-1966లో సవరణలు చేసింది. రానున్న రోజుల్లో ఏపీఎండీసీ చేపట్టే మైనింగ్ లీజులకు ఈ నియమాలే వర్తించనున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీఎండీసీ వచ్చే మూడేళ్లలో చెల్లించే సీనరేజీ, రాయలిటీ ఫీజులను అడ్వాన్స్‌గా గనుల శాఖ వసూలు చేయనుంది.

అమరావతి భూ సమీకరణ రాష్ట్రానిదే: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రాంతంలో భూ సమీకరణను ఏపీ ప్రభుత్వం, రాష్ట్ర అధికారులు అమలు చేస్తున్నారని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. భూ సమీకరణ ఫలితాలపై కానీ, రైతుల ఫిర్యాదులపై కానీ కేంద్రం ఎలాంటి సమీక్ష లేదా అంచనా నిర్వహించలేదని స్పష్టం చేశారు. మంగళవారం వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

కువైత్ వీసాల పేరుతో మోసాలు.. రంగంలోకి సీబీఐ

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కువైత్ ఈ-వీసా, ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగావకాశాల పేరుతో తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని నిరుద్యోగులను మోసగిస్తున్న సైబర్ నేరస్థుల ముఠా ఆటకట్టించేందుకు సీబీఐ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. ఈ ముఠా కువైత్ ప్రభుత్వం పేరిట ఒక నకిలీ వెబ్‌సైట్ నిర్వహిస్తూ అమాయకులకు వల వేస్తోంది. ఈ ముఠా వివిధ రాష్ట్రాల్లో సభ్యులను నియమించుకుని వీసాల పేర దండుకున్న సొమ్మును విదేశాలకు తరలిస్తోందని అధికారులు గుర్తించారు. అమెరికా, బ్రిటన్, ఐర్లాండ్, సింగపూర్ దేశాల్లో కూడా ఆన్‌లైన్ ఆర్థిక మోసాలకు పాల్పడుతోందని గుర్తించి.. ఇంటర్‌పోల్ సాయంతో ఆయా దేశాల పోలీసుల సమన్వయంతో 'ఆపరేషన్ స్ట్రయిక్' పేరుతో దాడులు నిర్వహించినట్లు సీబీఐ తెలిపింది.

పర్యాటక ప్రాంతంగా విశాఖ పోర్టు

16 కోట్లతో పనులు... తుది దశకు

విశాఖపట్నం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టులో రూ.16 కోట్లతో విహార ప్రదేశం(ప్రొమెనేడ్) సిద్ధం చేస్తున్నారు. సాధారణ ప్రజలు సముద్రం పక్కన నడుస్తూ పోర్టులోకి వచ్చే నౌకలను చూసేందుకు వీలుగా దీనిని డిజైన్ చేశారు. గత ఏడాది జూలైలో కేంద్ర జల రవాణా మంత్రి శర్బానంద సోనోవాల్ దీనికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఈ పనులన్నీ తుది దశకు చేరుకున్నాయి. ఈ నెలలోనే దీనిని ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. ప్రవేశ రుసుము పెట్టి సందర్శకులను అనుమతించాలని పోర్టు అధికారులు భావిస్తున్నారు.


పోర్టులో జరుగుతున్న ప్రొమెనేడ్ పనుల నమూనా చిత్రం

అనుమతి లేకుండా మళ్లీ జగన్ యాత్ర

- నేడు అంబటి కుటుంబ సభ్యుల పరామర్శ కోసం గుంటూరుకు
- నాడు మందీమార్బలంతో రెంటపాళ్లకు
- ఆయన కారు కిందపడి ఒకరు మృతి
- గుండెపోటుతో మరొకరు, అంబులెన్సుకు దారి ఇవ్వక ఇంకొకరు మృత్యువాత
- ఇప్పుడు మరో పరామర్శకు సిద్ధం
- భయాందోళనలో ప్రజానీకం
- జగన్ పర్యటనకు అనుమతి లేదన్న ఎస్పీ

గుంటూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పోలీసులు అనుమతి ఇవ్వకపోయినప్పటికీ.. వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి మరోసారి పరామర్శ యాత్రకు బయల్దేరుతున్నారు. సీఎం చంద్రబాబును, తెలుగు మహిళలను అసభ్యకరమైన పదజాలంతో దూషించిన కేసులో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు బుధవారం ఆయన గుంటూరు పర్యటనకు సిద్ధమయ్యారు. గతంలో పల్నాడు జిల్లా రెంటపాళ్లలో ఆయన పటాటోపంతో పరామర్శకు వెళ్లినప్పుడు ముగ్గురు బలైన నేపథ్యంలో ఈసారి ఆయన మళ్లీ మందీమార్బలంతో రోడ్డెక్కితే ఏం జరుగుతుందోనని సామాన్య ప్రజలతో పాటు పోలీసులూ ఆందోళన చెందుతున్నారు. 2024 ఎన్నికల సమయంలో బెట్టింగులు కట్టి.. భారీగా డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకున్న వైసీపీ నేత కొర్లగుంట నాగమల్లేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు 2025 జూన్ 18న పల్నాడు జిల్లా రెంటపాళ్లకు వెళ్తున్నట్లు జగన్ ప్రకటించారు. అయితే శాంతి భద్రతల దృష్ట్యా ఆయన పర్యటనకు అనుమతి లేదని.. సభలు, సమావేశాలు, ర్యాలీలు నిషేధం విధిస్తున్నట్లు పోలీసు శాఖ ప్రకటించింది. కానీ నిషేధాజ్ఞలు ఉల్లంఘించి జగన్ భారీ సంఖ్యలో వాహనాలు, కార్యకర్తలతో దండయాత్రకు బయల్దేరారు. ఆ సందర్భంగా గుంటూరు నగర శివారులోని జాతీయ రహదారిపై వెంగళాయపాలెం గ్రామానికి చెందిన చీలి సింగయ్య (50)ను జగన్ కారు తొక్కుకుంటూ వెళ్లింది. సింగయ్య తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో ఉండగా కనీసం కనికరం చూపకుండా జగన్ కారు ఆపకుండా ముందుకు వెళ్లిపోయారు. చివరకు పోలీసులు సింగయ్యను అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తన కారు కింది సింగయ్యపడి మృతి చెందాడని తెలిసినప్పటికీ జగన్ కారు దిగకపోగా ఆ తర్వాత కూడా సంబంధం లేదన్నట్లు వ్యవహరించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి జగన్ కారును సీజ్ చేశారు. ఆ తర్వాత సత్తెనపల్లిలో ప్రధాన రహదారిలో జగన్ ర్యాలీ నిర్వహించడంతో అంబులెన్సు కదిలే దారిలేక.. అందులో గుండెపోటుతో బయల్దేరిన ముప్పాళ్ళ మండలం మాదల గ్రామానికి చెందిన తెల్లజర్ల మధు (25) మృతి చెందారు. అలాగే నాడు జగన్ పర్యటనకు వచ్చిన మరో వైసీపీ కార్యకర్త కూడా రోడ్డుపై కుప్పకూలి మృతి చెందారు. పోలీసు హెచ్చరికలను లెక్కచేయకుండా విగ్రహావిష్కరణ పేరుతో జగన్ చేసిన దండయాత్ర ముగ్గురు అమాయకుల ప్రాణాలను బలితీసుకుంది. అక్కడే మొదటిసారి వైసీపీ కార్యకర్తలు, రప్పారప్పా.. పొట్టేళ్లను నరికినట్లు నరుకుతామంటూ ఫ్లెక్సీలు పెట్టారు. అది మొదలు జగన్ ఎక్కడకు వెళ్లినా వైసీపీ కార్యకర్తలు వీటినే పెద్దపెద్దగా ఏర్పాటు చేస్తున్నారు.



హెచ్చరికలు బేఖాతర్ చేస్తే చర్యలు: ఎస్పీ

కాగా.. జగన్ బుధవారం గుంటూరులో తలపెట్టిన అంబటి కుటుంబ సభ్యుల పరామర్శ యాత్రకు అనుమతి ఇవ్వాలని వైసీపీ నాయకులు పోలీసు అధికారులను కోరగా.. వారు నిరాకరించారు. గుంటూరు నగరంలో 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉందని.. ఈ నేపథ్యంలో సమావేశాలు, ర్యాలీలకు ఎటువంటి అనుమతి లేదని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రకటించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా, సాధారణ జనజీవనానికి ఇబ్బందులు కలిగించినా చర్యలు తప్పవని.. తమ హెచ్చరికలను బేఖాతరు చేసి యాత్ర చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినా జగన్ గుంటూరు యాత్రకు సిద్ధం కావడంతో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఆయన పర్యటన ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు కారణం అవుతుందోనని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. వైసీపీ కార్యకర్తల ముసుగులో రౌడీషీటర్లు, గూండాలు రెచ్చిపోయే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో పోలీసు శాఖ కూడా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. అంబటి ఇల్లు, కార్యాలయం ఉన్న సిద్ధార్థ నగర్ సమీప ప్రాంతాల్లోని టీడీపీ నాయకుల ఇళ్లు, కార్యాలయాలు, అతిథి గృహాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. పెద్ద సంఖ్యలో పోలీసులు, సాయుధ బలగాలను కూడా రంగంలోకి దించుతోంది.

మేం తెగిస్తే ఎందాకైనా వెళతాం!


- తేల్చుకుందాం రమ్మంటూ పోలీసులకు పేర్ని, అనిల్ సవాళ్లు

విజయవాడ(ఇబ్రహీంపట్నం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): "పోలీసింగ్‌ను పక్కన పెట్టి రండి చూసుకుందాం. మేం తెగిస్తే ఎందాకైనా వెళతాం. మా ఫేస్‌బుక్‌లు దొంగతనంగా చూస్తారా?" అంటూ వైసీపీ నేతలు, మాజీ మంత్రులు పేర్ని నాని, అనిల్‌కుమార్ యాదవ్‌లు పోలీసులపై విరుచుకుపడ్డారు. 'తేల్చుకుందాం రండి..' అంటూ సవాళ్లురువ్వారు. మంగళవారం విజయవాడ శివారు ఇబ్రహీంపట్నంలోని వైసీపీ నేత జోగి రమేశ్ ఇంటికి వెళ్లి.. ఆయనను పరామర్శించారు. అనంతరం ఇరువురు మీడియాతో మాట్లాడుతూ.. పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. . ఘటన సమయంలో ఎందుకు ఫైరింగ్ ఆర్డర్ ఇవ్వలేదు. లాఠీచార్జి ఎందుకు చేయలేదు. 2029.. టీడీపీ ఎక్స్‌పైరీ డేట్. అప్పట్లోగా ఎన్ని దాడులు చేస్తారో, ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోండి. ఆ తర్వాత అంతకన్నా బలమైన దాడులు ఖాయం" అని అన్నారు.

ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి

దోహదం

- భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందంపై సీఎం



అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి భారత్ - అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం దోహదం చేస్తుందని, ఇది చారిత్రాత్మక ఘట్టమని సీఎం చంద్రబాబు అన్నారు. ఈమేరకు మంగళవారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ ఒప్పందం ప్రపంచంలోని రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. ఈ ఒప్పందం ఏపీతోసహా దేశ యువత, రైతులకు అపారమైన అవకాశాలను సృష్టిస్తుందని అన్నారు

ఉపాధి హామీ నిర్వీర్యంపై మౌనమెందుకు జగన్?

- పేదల కడుపు కొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర
- మండిపడ్డ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల


అనంతపురం జిల్లా ఐదుకల్లు గ్రామంలో రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నా జగన్ మౌనం వహించడంలో ఆంతర్యమేమిటని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర రెండో రోజైన మంగళవారం అనంతపురం జిల్లాలో కొనసాగింది. శెట్టూరు మండలం ఐదుకల్లు గ్రామంలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ఆమె కూలీలు, గ్రామస్థులతో మాట్లాడారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని జగన్ కోరడం లేదన్నారు. కేంద్రం కొత్త చట్టంతో ఉపాధి హామీ పథకాన్ని చంపేయాలని చూస్తోందని మండిపడ్డారు. ప్రధాని మోదీ తెచ్చిన వీబీజీ రామ్‌జీ చట్టంలో పనులను నిర్ణయించే అధికారం ఢిల్లీ స్థాయిలో ఉంటుందని, గ్రామాల్లో సమస్యలు ఢిల్లీ స్థాయిలో ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని దిగజార్చేసిందని విమర్శించారు. కొత్త చట్టంతో రాష్ట్రంపై ఏడాదికి రూ.5 వేల కోట్ల భారం పడుతుందన్నారు. రాష్ట్రం ఇప్పటికే అప్పుల్లో ఉందని, ఇలాంటి సమయంలో 40శాతం నిధులు ఇవ్వడం కష్టతరమన్నారు. ఉపాధి పథకం నిధుల్లో రాష్ట్రాలను భాగస్వామ్యం చేయడం కుట్రేనని, ఈ కుట్రలో చంద్రబాబు, పవన్, జగన్ భాగమయ్యారని ఆరోపించారు. ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించేవరకు ప్రజలు ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు.

మీరు దుశ్శాసనులేమో... ఇక్కడ ద్రౌపదులెవరూ లేరు

- జుట్టుపట్టుకొని లాగడానికి అధికారంలోకి వచ్చేవరకూ ఎందుకు?
- 11 మందితో సభకు రండి తేల్చుకుందాం
- నేను రెచ్చగొట్టాననడానికి ఆధారాలేవి?
- మేం పట్టుకొచ్చింది చీపుళ్లు.. రాడ్లు కాదు
- మహిళలపై ముందు దాడి చేసింది వైసీపీవాళ్లే: ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): 'జుట్టు పట్టుకుని ఈడ్చడానికి మీరు దుశ్శాసనులు కావచ్చేమో... ఇక్కడ ద్రౌపదులెవరూ లేరు' అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. సీఎం చంద్రబాబుపై అంబటి రాంబాబు వ్యాఖ్యల నేపథ్యంలో వైసీపీ శ్రేణుల హెచ్చరికలకు మంగళవారం ఆమె ప్రతిస్పందించారు. పార్టీ గుంటూరు జిల్లా కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'సీఎం చంద్రబాబును అంబటి దుర్భాషలాడడం వెనుక వైసీపీ కుట్ర ఉంది. పథకం ప్రకారం శాంతి భద్రతలకు విఘాతం కలిగించి, రివర్స్ డ్రామాలకు పాల్పడుతోంది. తిరుపతి లడ్డు కల్తీ వ్యవహారం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వారం రోజుల్లో అన్ని విషయాలు స్పష్టంగా బయటకు వస్తాయి. సీఎం చంద్రబాబును దూషించి, ఆ తరువాత నేను అనలేదు అంటూ అంబటి మాట మార్చడం సిగ్గుచేటు. కార్యకర్తలను నేను రెచ్చగొట్టానని చెప్పడానికి ఆధారాలు ఎక్కడ ఉన్నాయి? నేను దాడి చేయాలనుకుంటే మీరు టీడీపీ కార్యాలయంపై చేసినట్టు చేయించలేనా? కేంద్ర మంత్రి పెమ్మసాని భార్యను రాజకీయాల్లోకి లాగడం ఎందుకు? ఈ ఘటనకు ఆమెకు ఏం సంబంధం? ఆమె ఎందుకు సమాధానం చెప్పాలి?' అని ఎమ్మెల్యే నిలదీశారు. అంబటి కుమార్తెను ఉద్దేశించి మాట్లాడుతూ... 'మహిళలపై దాడి గురించి మాట్లాడుతున్న మీరు... టీడీపీ మహిళా కార్యకర్తపై మీ నాన్న కార్యాలయం వద్ద దాడి జరిగినప్పుడు మీ తండ్రిని ఎందుకు ప్రశ్నించలేదు? మీ నాన్న పవన్ కల్యాణ్ గురించి అవమానకరంగా మాట్లాడినప్పుడు కులం గుర్తుకు రాలేదా? ఇప్పుడు మాత్రం కులాన్ని ఎందుకు వాడుకుంటున్నారు? మేము మాట్లాడితే రెచ్చగొట్టినట్టా? మీరు మాట్లాడితే ప్రశ్నించడమా?' అంటూ ఆగ్రహంగా నిలదీశారు.



జక్కంపూడి వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ...

'అధికారంలోకి వచ్చాక జుట్టు పట్టుకుని బయటకు లాగుతాం... అంటూ జక్కంపూడి రాజా మాట్లాడుతున్నారు. ఇది వారి రాజకీయ వైఖరికి నిదర్శనం. అప్పటిదాకా ఎందుకు? ఇప్పుడే అసెంబ్లీకి వచ్చి తేల్చుకోండి. వైసీపీ ఎమ్మెల్యేలకు దమ్ముంటే ఈ నెల 11న 11 మందీ కలిసి అసెంబ్లీకి రావాలి. అక్కడే అన్ని అంశాలు తేల్చుకుందాం. 2029 వరకు వేచిచూడడం ఎందుకు?' అని గల్లా సవాల్ విసిరారు.

వైసీపీది రివర్స్ డ్రామా రాజకీయాలు

'గత రెండు రోజుల పరిణామాలన్నీ వైసీపీ ఆడుతున్న రివర్స్ డ్రామా రాజకీయాలే. ఒకవైపు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ, మరోవైపు బాధితులమని నటించడం వైసీపీకి అలవాటే. మీరు 11 సీట్లకే ఎందుకు పరిమితమయ్యారో ప్రజలకు తెలుసు. మేము చీపుర్లు తీసుకుని వచ్చాం... రాడ్లు కాదు. మా ఇంటి ఆడవాళ్లను తిడితే కోపం రాదా? మా మహిళా కార్యకర్తలపై దాడి మొదలుపెట్టింది వైసీపీనే. మేం చేసింది కేవలం నిరసన మాత్రమే' అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

మమ్మల్ని అంటే భరించాం... సీఎంని అంటే ఊరుకోం

'మమ్మల్ని డమ్మీలు అన్నా స్పందించలేదు. మాపై ఎన్ని విమర్శలు చేసినా భరించాం. కానీ ముఖ్యమంత్రి స్థాయిని తాకితే మాత్రం చూస్తూ ఊరుకోం. గంజాయి, డ్రగ్స్‌కు బానిసలైనవాళ్లతో వైసీపీ సోషల్ మీడియా నడుస్తోంది. కొందరు నేతలు నన్ను జుట్టు పట్టుకుని తీసుకొస్తామని మాట్లాడుతున్నారు. ఇలాంటి వ్యాఖ్యలను అంబటి కుమార్తె సమర్థిస్తారా? ముందు సానుభూతిని, తర్వాత కులాన్ని, ఆ తర్వాత మతాన్ని ఆయుధాలుగా వాడడం జగన్ రాజకీయ నైజం' అని మాధవి విమర్శించారు.

అంబటి కార్యాలయంపై దాడి.. గల్లా మాధవిపై కేసు

- ఆమె భర్త, మరికొందరిపైనా నమోదు చేసిన పోలీసులు
- సీఎం ఆదేశాలతో దర్యాప్తు వేగవంతం
- కార్పొరేటర్లు, వివిధ సంస్థల చైర్మన్లు సహా మొత్తం 31 మందిపై అంబటి ఫిర్యాదు

గుంటూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును అసభ్య పదజాలంతో దూషించిన మాజీమంత్రి అంబటి రాంబాబు కార్యాలయంపై దాడిచేసిన ఘటనలో గుంటూరు పశ్చిమ టీడీపీ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఆమె భర్త రామచంద్రరావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాంప్రసాద్ అలియాస్ ఇసుక బుజ్జితో పాటు మరికొందరిని నిందితులుగా పేర్కొన్నారు. గత నెల 31న పట్టాభిపురం పోలీసుస్టేషన్ పరిధిలోని సిద్ధార్థనగర్‌లో అంబటి కార్యాలయంపై టీడీపీ శ్రేణులు దాడిచేసి ఫర్నిచర్, కార్యాలయ అద్దాలు ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడాన్ని ముఖ్యమంత్రి తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి దాడికి పాల్పడిన వారెవరైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. మంగళవారం పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు బృందాలు అంబటి ఇల్లు, కార్యాలయాన్ని సందర్శించి దర్యాప్తు చేపట్టాయి. మరోవైపు క్లూస్ టీం రంగంలోకి దిగి ఆధారాలు సేకరించింది. పట్టాభిపురం పోలీసులు అంబటి భార్య విజయలక్ష్మి, ఆయన కుమార్తెలు మౌనిక, మనోజ్ఞతో పాటు ఆయన పీఏలు ఏలూరి అనిల్ రెడ్డి, మద్దూరి రామకృష్ణ, తాళ్లూరి వెంకటరాయుడులను విచారించి వాంగ్మూలాలు రికార్డు చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు తమ ఇంటిపై దాడిచేసి, అద్దాలు ధ్వంసం చేశారని, దీంతో తాము భయంతో బాత్రూంలో తలదాచుకున్నామని వారు పోలీసులకు వివరించినట్లు తెలిసింది. కాగా.. తన కార్యాలయంపై దాడిలో 31 మంది టీడీపీ నేతలు పాల్గొన్నారని అంబటి రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరిలో ఎమ్మెల్యేతోపాటు వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు, కార్పొరేటర్లు, నేతలు ఉన్నారు. తన ఇల్లు, కార్యాలయంలో ఫర్నిచర్ అద్దాలు, కంప్యూటర్లు, కార్లు ధ్వంసం చేశారని ఆరోపించారు.

సాయిరెడ్డి లండన్ పర్యటనకు అనుమతి

హైదరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ వి.విజయసాయి రెడ్డి లండన్ పర్యటనకు వెళ్లేందుకు నాంపల్లిలోని సీబీఐ న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. లండన్ పర్యటనకు వెళ్లేందుకు అనుమతి కోరుతూ ఆయన పిటిషన్ దాఖలు చేయగా, విచారించిన న్యాయస్థానం అనుమతి ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. కాగా, మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ5గా ఉన్న డి.శివశంకర్ రెడ్డి కుటుంబంతో కలిసి శ్రీశైలం వెళ్లేందుకు సీబీఐ కోర్టు అనుమతించింది. ఈ మేరకు సీబీఐ కోర్టులో అనుమతి కోరుతూ ఆయన పిటిషన్ వేయగా 7 నుంచి 9 వరకు... మూడు రోజుల పాటు శ్రీశైలం వెళ్లేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలి: వైసీపీ ఎంపీలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని కోరుతూ పార్లమెంట్ ఆవరణలో వైసీపీ ఎంపీలు నిరసన తెలిపారు. మంగళవారం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు ఆపార్టీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోశ్, మిథున్‌రెడ్డి, గొల్ల బాబూరావు, వైఎస్ అవినాశ్‌రెడ్డి, తనూజా రాణి, మద్దిల గురుమూర్తి ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని, కూటమి ప్రభుత్వం వైసీపీ నేతలు, శ్రేణులపై దాడులకు దిగుతోందని ఆరోపించారు. రాజ్యసభలో ఎంపీ నిరంజన్ రెడ్డి ఇదే అంశాన్ని లేవనెత్తారు.

అద్దేపల్లి సోదరులకు బెయిల్

- నకిలీ మద్యం కేసులో మరో నలుగురికి కూడా.. నేడు విడుదల

ములకలచెరువు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో ఆరుగురు నిందితులకు బెయిల్ మంజూరైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు (ఏ1), సయ్యద్ హాజీ (ఏ3), మిథున్‌దాస్ (ఏ10), అంతా దాస్ (ఏ11), అద్దేపల్లి జగన్‌మోహన్ రావు (ఏ26), సయ్యద్ హాజీ (ఏ29)లకు తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. కాగా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం కేసులోనూ ప్రధాన నిందితుడైన అద్దేపల్లి జనార్దన రావు, అతని సోదరుడు జగన్మోహన్‌రావుకు గతనెల 20న విజయవాడ ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అలాగే సయ్యద్ హాజీ, మిథున్‌దాస్, అంతాదాస్, సయ్యద్ అల్లాబక్షులకు కూడా ఈ నెల 2న విజయవాడ కోర్టు బెయిల్ ఇచ్చింది. ఈ ఆరుగురుకీ రెండు కేసుల్లోనూ బెయిలు రావడంతో బుధవారం మదనపల్లె సబ్‌జైలు నుంచి విడుదల కానున్నారు. కాగా, ములకలచెరువు నకిలీ మద్యం కేసులో అరెస్టయి మదనపల్లె సబ్‌జైలులో ఉన్న కోయంబత్తూరుకు చెందిన నిందితుడు సెంథిల్(ఏ30)ను పీటీ వారెంట్‌పై హాజరుపరిచేందుకు విజయవాడ కోర్టు అనుమతి ఇచ్చింది. ఇబ్రహీంపట్నం కేసులోనూ సెంథిల్ నిందితుడిగా ఉండటంతో ఈ నెల 12లోగా మదనపల్లె సబ్‌జైలు నుంచి తీసుకొచ్చి కోర్టులో హాజరుపరచాలని ఉత్తర్వులు ఇచ్చింది.

జోగి బ్రదర్స్ బెయిల్ రద్దు విచారణ 5కి వాయిదా

విజయవాడ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాముల బెయిల్ రద్దు చేయాలని ఎక్సైజ్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను విజయవాడ ఎనిమిదో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు 5కి వాయిదా వేసింది.

నెల్లూరులో అంబటిపై 2 కేసులు

- మాజీ మంత్రి కాకాణిపై కూడా..

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలపై నెల్లూరు జిల్లాలో రెండు కేసులు నమోదయ్యాయి. మనుబోలు పోలీస్ స్టేషన్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, దుత్తలూరు పోలీస్‌స్టేషన్‌లో నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చీదర్ల మల్లిఖార్జున చేసిన ఫిర్యాదుల మేరకు ఈ కేసులు నమోదయ్యాయి. వీటిపై త్వరలోనే పీటీ వారెంట్ వేయనున్నారు. అలాగే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కూడా నెల్లూరు జిల్లా పొదలకూరు స్టేషన్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లోనూ టీడీపీ నాయకుడు పచ్చిపాల రామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాకాణిపై కేసులు నమోదయ్యాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.